
శ్రీ విభవ

సెట్టి లక్ష్మీనరసింహము గారు

శ్రీ విభు వరకరుణను శ్రీ
దేవి భవనములను సమ్మతిఁ మెలఁగంగా,
నీవిభవాబ్దంబున నా
నా విభవము లొదవుతఁ జనంబుల కెల్లన్.

ప్రభవానంతర మందుఁ
విభవాభ్యుదయంబు కలిగె విశ్వంభరకున్
శుభకరమిది యగుటను సౌ [బుల్
ఖ్యాభరితులయి భువి మనుదురుగాక జనం

కాలమాత గర్భంబునఁ గలిగినట్టి
సంతతికి లెక్కలేదు: వత్సరమునకొక
బిడ్డ; పెట్టిన పేరులే పెట్టవలసె:
ఈవిభవ మెన్నియవదియో యెవరి కెఱుక?



విరియఁ బూచిన వేఁపమిరియలు హసించి కాయ
ముక్కలతోఁ గ్రొత్తపొత్తు కలిసె;
భవనాంతరంబుల బ్రాహ్మణోత్తములు పం
చాంగ శ్రవణము సల్పం గడఁగిరి;
వసరమామాధవోద్వాహంబునందు సో
నాయిమేళము చేసె కోయిలగమి;
సంరంభమున భక్తజనులు శ్రీరామ లీ
లా సమారంభాభిలాషులైరి;
“వచ్చె మరలఁ గ్రొత్తవత్సరం, బిది మహో
త్సవదినం”,బటంచుఁ దమ హృదంత
రముల సంతసించి ప్రజలు చెలంగిరి:
ముదముల పెనుగాద గద యుగాది?



చెన్నపట్టణము, ఏప్రిల్ ౧౯౨౮ 1928

సంపుటము ౫ విభవ సంవత్సరము చైత్రమాసము సంఖ్య ౪

దక్షిణానిలము

పెమ్మరాజు లక్ష్మీపతి గారు

వసుమతి జుట్టు నపారపారావారలీలాతరంగడోలికల నూగి
పరచిన పచ్చకంబళములు దాళువా వరిచేల నటునిటు దొరలిదొరలి
నిర్మలంబగు నేటినీటిపై నూనూగు కెరటముల్ మొలవంగ బరువులెత్తి
పువ్వునవ్వుల మవ్వమొలయు పూగొమ్మ లేగొమ్మలతో గుసగుసలువోయి
యట్టె నన్నెత్తికొనిపోయి యరయరాని - యొకమహానందవార్ధితీరోజ్జ్వలప్ర
దేశమున బారవైతు విదేటికోయి, - లాలితాపూర్వకేళీవిలాసమూర్తి!

తరళోత్ఫుల్లవిచిత్రవర్ణయుతసంధ్యాకాలశోభల్ దిగం
తరరంగంబున రంగవల్లికలు దిద్దన్ నాట్యకేళీకళా
భరణంబై రసరాజ్య మెల్లదిశలన్ బాలించుచున్నాడు సుం
దరమందానిలరాజనందను డమందానంద సంధాయియై.

అల్లన నుండియుండి తగ బ్రాణము లేదెనకో చనంగ జల్
జల్లన జల్దరించెదవు చాగురె! మేన గులాబినీరముల్

చల్లినలీల పూలు వెదచల్లినయట్లు సుధాతరంగసం
ఫుల్లవిలాసముల్ భువనమోహనలీలల బ్రాకునట్లుగన్.

దిరిసెనపూలతెప్పలను దేల్చెదవో, విరజాజివీవనల్
సురభిళశైత్యసారపరిశోభితసాంద్రపటీరసీరశీ
కరములు నల్దెసల్ గలయ గ్రమ్మగ వీచెదొ! యో యదృశ్యసుం
దరమృదుదేహ, యోహృదయతస్కర, యోజగదేకమోహనా!

సలలితదేవతావసనజాలమునాజను నింద్రజాలపున్
వలువలపై నలల్‌దొలుక బైపయి నారగగప్పెదేమొ, యీ
యిలకలమేరయంతయు నదృశ్యమనోజ్ఞతరంగమాలికా
విలసిత మయ్యె జిప్పిలు నవీనసరోజమధుద్రవార్ద్రమై.

అంటనియార్ద్రచందన మొయారముగాగ నలందెదార మే
నంటినమాత్ర స్వర్గమున కల్లన నెత్తెదవా కడాని నీ
రంటిన సంజక్రొంబసిడిరంగుమిసల్ దొలుకాడ నద్దిరా
పంటవలంతి నందములె పండెనుగా కనువిందొనర్చుచున్.

ఏయానందసుధాబ్ధివీచికలపై నేత్రీలు నర్తించువా
రోయీ! యీమెయి వొంగి వాయులహరీ రూపంబునన్ భూమిపై
హాయింబార్చుచు వీచుచుంటి వహహా! యానంద మేమందు నో
రా! యొయ్యారము! హాయిరే సొగసు! సౌరభ్యంబు సేబాసహో!

భూమిసమస్త మీయెడ సముజ్జ్వలమైన సుధాసముద్రవీ
చీమయలాస్యరంగమున జిందులు ద్రొక్కుచునున్నదోయి, ది
వ్యామలకోమలాబ్జదళమట్టులు నోయమృతార్ద్రమంజుల
శ్రీమహిళామణీరసికశేఖర, స్వైరవిహారభాసురా!

చరదురుభూజశాఖల రసాలశలాటువు లూగుచుండె, సుం
దరలలనాజనాలకవితానములీల జలించుపత్రముల్
సరుగుడు చెట్లజాలు సరసధ్వనులీనెడు తావకీనభా
స్వరరసవద్విహారము సెబాసనుచున్ దలలూచి మెచ్చుచున్.

లలితకళావిలాసము లిలాతలమెల్ల నలంకరింప బు
వ్వులు వికసిల్లె చిత్రములువోలె శకుంతసతీవితాన కో
మలకలగాన మొప్పు సుకుమారసమీరుడు గొండ్లిసల్పు, నీ
యిలపయిగాక స్వర్గమది యెచ్చట నున్నది శూన్యసీమలోన్.

ఉ. పూరజమాచు నిఁ గలిసిపోదునో? యీ మృదులాచ్ఛమల్లికా
సౌరభమౌదునో, యదిగో! శ్రావ్యతరధ్వను లీనుచున్న వం
శీరవమై కరంగుదునో? చెప్పు మికే తెర గాచరించి యో
స్వైరవిహార, నిస్గలియువాడనో యీ సుముహూర్తమందునన్.

శా. ఊహాపోహల నస్తి నాస్తి యనుచు న్నూహించు సందేహసం
దోహంబుల్ చెదరంగ వీచెడు 'నథాతో బ్రహ్మజిజ్ఞాస' నా
'సోహ' మ్మంచును దాటు నొక్కబిగి నీసోపానముల్ తత్త్వస
న్నీహారోన్నత శైలరత్నశిఖరానీకప్రదేశంబుపై.

చ. అనృతము దుఃఖమున్ జడమునంచు విసం బుమియుంగనౌనె? మో
హనమృదులార్ద్రమందమధురానిలమున్ బ్రకృతీకపోలచుం (?)
బనసుఖపారవశ్య మది స్వర్గము కాదె, ముహూర్తమాత్రమే
యనుకొనియుంటినేని యిక నవ్వల నేనెవరో యదెవ్వరో?

మ. అనుమానింపకు మాలసింపకుము లభ్యంబైనసౌఖ్యంబు జే
కొనుమంచున్ వచియించు నీప్రకృతిపై కోయంచు దీర్మానమా
నని యామోదము దెల్పె నాసికము, విశ్వాంగీకృతంబయ్యె బో
యినవెన్కన్ విలపింతునేమొ ఫలమున్నే యప్పు డావంతయున్!

ఉ. ముందున కేగుచో వెనుకబోవు జగం బిటులుండునంతకున్
ముందని వెన్కయంచు దలపోయుట తప్పనా, నిల్చి, యీమహా
నందసుధారసంబు చవినందినవారికి లేదు మృత్యు వీ
ముందును వెన్కకౌ గమనముల్ దమయంతన నాగిపోయెడిన్.

ఉ. ప్రాకృతయోగసాధనల బ్రాణములన్ బిగబట్టి జీవి న
జ్ఞాకల బెట్టి యెట్టి శుభమందగనౌ, లహరీప్రమోద కే
ళీకమనీయమైన నునులేతసమీరము సోకునంత వ
ల్మీకమునుండి కుండలియు లేచెడు దా ఫణమెత్తియాడుచున్.

చ. ఘనమగు దేహవాసనలు గాలికి దూలిచనంగ వెన్కని
ల్చినమదియెల్ల నొక్కట సజీవలయాచ్ఛగభీరవారిధిన్
మునుగ, శరీరమే మరచి పోవుటకంటెను మోక్షమేది? యిం
కను మది శంక యేల, నునుగాలియలల్ పయినాడ నాడెదన్.

భవభూతిగ్రసము-కాళిదాసుని పాత్రౌచిత్యము

అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

శ్రీ

సీతను గూర్చిన వాత్సల్యమును జనకుని యందు సమృద్ధిగ సాధింపఁదలఁచిన భవభూతి కవిబ్రహ్మ శ్రీరామునివలన సీతకుఁగలిగిన ఘోరాపదను స్మరించుచు శోకవిహ్వలుఁ డగు జనకుని, నుత్తరరామచరిత్ర నాటకమున మనకుఁ జూపుచున్నాఁడు. సీతకుఁ గలిగిన ఘోరాపదను విని జనకమహారాజు గార్హస్థ్యమునుండి విరక్తుఁడై వానప్రస్థాశ్రమమునఁ బ్రవేశించి చంద్రద్వీప తపోవనమునఁ దపస్సు చేసికొనుచున్నాఁడు; మాంసాహారము మానినాఁడు. ఎల్లప్పుడును హృదయమును బాయకున్న సీతాశోక మాయనను ఎండఁబాఱిన చెట్టును తొఱ్ఱలోఁ జేరిన నిప్పువలెఁ గాల్చివేయుచున్నది. కూఁతునకుఁగల్గిన దురితము హృదయమునఁ బుండుచేసి నాటుకొని ధారావాహియైనశోకమును బుట్టించుచున్నది. అది యాయువుఁబట్టులను అంపమువలెఁ గోసివేయుచున్నది. విరమించునట్లులేదు.

ఈ ముసలితనమునకుఁదోడు దుఃఖము; దానికిఁ దోడు తపస్సులు. వీనిచే మిగులనెండుచుండియు నా యీపాడుదేహము పడిపోకున్నదనుకొనుచు విషాదమందుచున్నాఁడు. నరకముల పాలగుదునను భయ మాత్మహత్యాప్రయత్నమునుండి జనకుని మఱల్చుచున్నది. ఎన్నియేండ్లు గడచినను బ్రాఁతపడక సుస్పష్టముగఁ గన్పట్టుచు దుఃఖసంవేగము శమింపదయ్యె. నిశ్శంకగా నేడ్చుటకైన వీలులేకపోయె. నీ నిర్మాణభాగ మిట్టిది యనుకొనుచు లజ్జాశోక పరవశుఁ డగుచున్నాఁడు జనకుఁడు. సీతయొక్క పవిత్రత ననుసంధానము సేయు కొలఁది జనకుని కొకప్పుడు పుత్రిక యనుభావముపోయి యామెయెడ భక్తికలుగుచు వచ్చెడిదట. అట్టిసీతయోగ్యత జనకుని శోకసమృద్ధికిప్పు డుద్దీపన విభావమగుచున్నది.

“ఆసన్నప్రసవవేదన యగు సీత నొంటిగ నడవిలో వదలి లక్ష్మణుఁ డింటికిఁ బోయెను.” అనువాక్యము లవుని సరసవాక్కునుండి వినునప్పటికి జనకునికి దేహము తెలియలేదు. శోకనిమగ్నుఁ డయ్యె. సీతా! ఏకాకినివైన నీశరీరకుసుమమున కెట్టి దైవదుర్విలాస పరిణామము కల్గెను? పరాభవమును, ఘోరారణ్యవాసమును, ప్రసూతిబాధయు, దాపరించి యుండఁ, గ్రూరమృగములు చుట్టుకొనుచుండ, నన్నుఁ బలుమాఱు స్మరించి యుందువు. అక్కటా! పౌరులెంత నిర్దయులు? రాముం డెంతటి యవిమృశ్యకారి!

పిడుగుకంటె యీఘోరహింసను, ఆతె తలపోయఁగా శాపముచేఁ గాని, చాపముచేఁ

గాని గోపమును బ్రజ్వరిల్లఁజేయవలసిన యవసరముగ నేకన్పట్టుచున్నది. అని యాజ్ఞ్యవల్క్య శిష్యుఁడు శాపమునకో యుద్ధమునకో సిద్ధమగుచున్నాఁడు. చూడుఁడు. "కర్మణైవహి సంసిద్ధి మాస్థితాజనకాదయః" అని భగవద్గీతలలోఁ గూడ మహాజ్ఞానిగాఁ జేర్కొనఁబడిన జనకు నంతటివాఁ డిట్లు శోక మోహములకు వశుఁడయ్యెననుట పాత్రౌచిత్యమునకు లోపము వాటిల్లఁజేయునో యనుశంక గల్గుచుండ లేదా?

కాని దీనిచే రసమున కత్యంత సమృద్ధి సమకూరకపోలేదు. ఇట్టివి రసపరిపాక వశులగు కవుల స్వారసరచనలు. అభిజ్ఞాన శాకుంతల నాటకమున శకుంతల పతిగృహమున కేగునప్పుడు కణ్వుఁడునైత మిక్కిలి దుఃఖితుఁడగుచున్నాఁడు. సీత మృతినొంది యుండునని జనకుఁడు దుఃఖించుచున్నాఁడు. శకుంతల తన యాశ్రమమును బాసిపోవుచున్నదని కణ్వుఁడు శోకించుచున్నాఁడు. కాఁబట్టి జనకుని శోకము కన్న కణ్వునిశోకము నీయముగనే కన్పట్టుచున్నది. ఐనను గవులీసందర్భములలోఁ గణ్వ జనకులయందు సాధింపఁదలఁచుకొనినది కరుణ రసమే. కాని సమానమైన రచనా పథమందే కాళిదాస భవభూతు లిచ్చటనడచుచున్నారు. ఇట్టిచోఁ దారతమ్యము వీరి శైలిభేదమునే సూచించును.

యాస్యత్యద్య శకుంతలేతి హృదయం
సంస్పృష్ట ముత్కంఠయా
కణ్ఠస్తంభిత బాష్పవృత్తికలుష
శ్చింతాజడం దర్శనమ్;

వైక్లబ్యం మమ తావ దీదృశ మహో!
స్నేహాదరణ్యౌకసః
పీడ్యన్తే గృహిణః కథంను తనయా
విశ్లేషదుఃఖైర్నవైః.

శకుంతలా ప్రయాణమును దలఁచుకొను కణ్వుని హృదయ ముత్కంఠచింత మున్నగు వ్యభిచారిభావములకు వశమైనది. బాష్పము, ప్రళయము మున్నగు సాత్త్వికభావములు పొడముచున్నవి. జనకునియందైన నింతకన్న శోక సమృద్ధి భవభూతిచే నెక్కుడు సాధింపఁబడలేదు. శోకసూచకమైన వాగ్వినియోగము మాత్రమే యెక్కువగఁ గూర్పఁబడినది. శ్రోతలకు గర్భభేదమగు మాటలచే రసప్రవాహమును వెల్లిగొల్పు చుంటయును, అన్యపాత్రల చేష్టలు మున్నగువానిచేతను, దేశకాలపరిస్థితుల సమర్పుటచేతను రససంప్రాప్తిని నిర్వహించుటయును ఆయాకవులపోకడలలోని భేదములు.

కాని యిచట నొక భేదము గన్పట్టుచున్నది. కణ్వుఁడు 'వైక్లబ్యం మమ తావదీదృశ మహో!' అనుకొనుచున్నాఁడు. తన కట్టి శోకమును, అట్టి యుత్కంఠయు, అట్టి చింతయుఁ గల్గుటనుగూర్చి యమ్మునియాశ్చర్య మందుచున్నట్లు "అహో" అనునవ్యయము సూచించుచున్నది. విస్మయ మారీతిగ నప్పుడు గల్గుటకు నిర్వికార చిత్తతయును శమము స్థాయిగనుండవలెను. అట్టి శాంతరసస్థాయిభావమగు శమము నెలకొనియుండుట చేతనే వికారహేతువు శకుంతలా స్నేహమునఁ గల్గుచున్నను

మనస్సును విశ్రృతినందనీయనిర్భరత కణ్వునిలో భాసిల్లుచున్నది. తరంగముల వలెఁ బైకొనుచున్న శోకవికారములను కణ్వుఁడను శాంతిసముద్రము మ్రింగివేయుచున్నది. అట్టి పరిస్థితిలోఁ దన సహజశాంతి ప్రవాహమున కెదురు నడుచుచున్న శోకవికార తరంగముల యుత్పత్తిలయములను జూచి కణ్వమహర్షి విస్మేర చిత్తుఁడగుట యుక్తముగ నున్నది.

లేక శోకమోహ పరవశుఁ డగువానికి, "వృత్తిసారూప్య మితరత్ర" అనినట్లును, "యో యచ్ఛ్రద్ధ స్సఏవ సః" అనినట్లును, ఆ సూశో కాదివికారముల నైక్యమంది తల్లకిందులగుచు తాదాత్మిక వాంఛాపూర్త్యన్వేషణవ్యగ్రుఁ డగుచుండుటయే కాని వానినిగూర్చి యాశ్చర్య మందునంతటి విశ్రాంతి యుండదు. "అద్భుత శ్చతథా వీరాత్" అనుటచే వీరరసమువలన నద్భుతము గల్గవచ్చును. వైరాగ్యవీరత శత్రువులయిన వికారములను బరిమార్చుచుండుటం గూర్చియైన విస్మయము కల్గుటొప్పు.

మఱియు నిటఁ గరుణరసము ప్రధానమైనచో, దాని యంగములైన యుత్కంఠా చింతలు వాచ్యములు కాఁగూడదు.

శాంతరసము ప్రధానమైనచో, దానిని ప్రబలము సేయుటకుఁ గైకొనఁబడిన కరుణరస సంచారిభావములు వ్యంగములైన సూచ్యమైన శాంతికి వ్యవధాన మేర్పడుఁగాన రసికజనరంజనము తొందరగాఁగాదు. వాచ్యములగుటయే మంచిది. కావున వాచ్యములైన యుత్కంఠాదు లిచ్చటఁ గణ్వునియందు నోలకొనిన శాంత రసము సూచించుటయందే పర్యవసాన మందుచున్నవి.

ఇట్లు రసములు సాధించుటచే మహాకవిగారి సముచిత సరససంధాన చాతురి వెల్లడి యగుచున్నది. స్థిరమైన శాంతరససిద్ధి కణ్వుని యౌచిత్యమును బోఁగొట్టక నిల్పుకొనుచున్నది. కరుణరస ప్రతిఘటన ప్రబలముగ సూచితమై యప్పుడు కావలసిన కరుణ రస సమృద్ధిని దక్కువగాకుండఁ జేయుచు వాత్సల్య పోషణ మొనర్చుచున్నది. మైత్రీకరుణా ముదితోపేక్షలభావన ఋషి కనుచితముకాదు.

అప్రసంగమునకుఁ గావలసిన కరుణరసమును అంగముగఁ జేసియు, మహర్షి యౌచిత్యమును నెలకొల్పఁ గలిగిన శాంతరసము నంగిఁగఁ జేసియు ధ్వని ప్రస్థానమునఁ దాండవమాడించిన మహాకవి కాళిదాసుని యౌచిత్యపతాకము నిరర్గళ ప్రతీతి వహించుచు "అనౌచిత్యా దృతే నాన్య ద్రసభంగస్య కారణమ్" అనెడి లాక్షణిక గ్రామణులకు మార్గదర్శి యగుచున్నాడు.

ప్రణయలేఖ

కొమాండూరు కృష్ణమాచార్యులు గారు

స్వస్తి రాణాప్రతాపాన్వవాయజలధి-చంద్ర, రాజేంద్ర, భవదీయ చరణయుగము
ఫాలతలమునఁ జేర్చి యీ పద్మనయన-వ్రాయులేఖార్థములు దయాపరత వినుము.

మొగలుసామ్రాజ్య విషవృక్ష మూలకంద-మార్యమత సౌధవార్ధి కౌర్వానలంబు
వైదికాచారఫలవృక్ష పరశుధార-మోహినీమానధనపశ్యతోహరుండు
క్రూరుఁడగు పాదుషా యలంఘీరుఁ డిపుడు-సకల సైన్యసమేతుఁడై సంగరమున
రూపనగరపుకోటను రూపుమాపి-నన్నుఁ గొనిపోవ నిదె వచ్చియున్నవాఁడు

వీరభటతుంగభంగవిభీషణంబు - భయదకుంజరమకరవిభ్రాజితంబు
ఉత్తమాశ్వకరఘుంఘుమానిలోద్ధతంబు-నైన మ్లేచ్ఛబలాంభోధి యల్పమైన
ద్వీపమునుబోలె ముంచు మదీయదుర్గ-మార్య, యనుమాన మావంతయైన వలదు.

ఉత్తమక్షత్ర్రవంశమం దుద్భవించి-మానవతినైన యొకకాంత మనుజనాథ,
హవ్యవాహనశిఖలకు నాత్మదేహ-మర్పణము సేయుఁగాని మ్లేచ్ఛాధమునకుఁ
దరుణినై రాజపుత్రు లౌదలలు వంప-నుభయలోకవిదూరనై యుందునెట్లు.

లలితకీరాంగనకు బిడాలంబుఁదగునె-కలరవాంగన కాకయులూకంబు దగునె
కమలవల్లికి కంటకద్రుమము సనునె-భ్రమరతరుణికి పిచుమందసుమము సనునె
హరిణకన్యక వృకమున కర్హయగునె-రాజసింహుని కర్హయౌ రాజవదన
గోవుమాంసంబు దినుతురుష్కునకుఁదగునె.

భానుకులదీప! నీరాణివాసమందు-లలిత లభిజాత లఖిలకలాప్రవీణ
లెందఱో యుందు రైన నుపేక్షవలదు-ఆడుకూయిని జెవియొగ్గి యాలకింపు
మార్త ననహాయ నబల ననన్యశరణ-నాత్మనాథునిగా నిన్నె యహరహంబుఁ
దలఁచుచుండినదాన నుదారచరిత!

మానసింహుఁడు మున్నుగా మనుజపతులు-దుష్టమ్లేచ్ఛాధములపాదధూళిఁ గ్రుంగి
మౌళిమాణిక్యమకుటముల్ మైలపడఁగ-చంద్రసూర్యాన్వవాయసంజాతలైన
విమల రాజన్యకన్యల వినుతమతుల-నల తురుష్కులయిండ్ల భోగాంగనలుగ

నిలిపి క్షత్త్రియ తేజంబు నీటఁ గలిపి-సంతతముఁ దాము ఖుష్‌రోజు సంతలందు
నాత్మవనితల మానంబు నమ్ముకొనుచు-పసుపుకూడు భుజించిరి పాపమతులు.

నిర్గమనమార్గశూన్యంబు దుర్గమంబు-నైన యక్బరు పాదుషా యాలయమున
చక్రవర్తియె యేకాంతసమయమందు-రతిసుఖము వేఁడ నిజకఠారంబు వెలికి
సార్వభౌమ విశాలవక్షఃకవాట-పాటనోద్యోగమున నున్న పరమసాధ్వి
దివ్యసుందరి పృథ్విరాడ్దేవి యొకతె-క్షత్త్రకులభూషణంబగు క్షత్త్రియాణి.

రఘు దిలీప భగీరథ రామచంద్ర-భూమిపాలురనుండియుఁ బూజ్యమైన
ఉత్తమక్షత్త్రియాన్వయం బర్వ నిపుడు-మ్లేచ్ఛసంపర్కమునఁ జేసి తుచ్ఛమయ్యె.
బాప్పరావలువంశాబ్జభానుఁడైన-యొక్క రాణాప్రతాపసింహుం డఖర్వ
శౌర్యమందీకృతారినిశాతఖడ్గ-ఖండితాచ్ఛిద్ర కర్ణరక్తప్రవాహ
వాహినులలోన దుర్యశఃపంకమెల్ల-క్షాళన మొనర్చి యార్జితక్షాత్రతేజ
మవని వెలిఁగించె రాజమార్తాండుఁ డతఁడు.

అట్టి మహనీయవంశాబ్ధి నవతరించి-కవచ ఖడ్గాది యుద్ధోపకరణచయముఁ
దాల్చియున్నట్టి క్షత్త్రియోత్తముఁడ వీవు-రాజసింహమ, రణరంగరామచంద్ర,
ఒక్కయబలావనము నీకు వెక్కసంబె?

యవనులందఱు జయము నిక్కువ మటంచు-మధుర మైరేయ పాన విమత్తులగుచుఁ
గామినీగోష్ఠిఁ గన్నులు గాన రిపుడు-పర్వతాకీర్ణమైన యీపత్తనమున
భవదసీకాస్త్ర దావపావకశిఖాలి-కింధనప్రాయమగుఁ గాక యీబలంబు
హల్దిఘాటున యువరాజహస్తిపైకి-శీఘ్రమతి శిశోదియా వంశసింహ మొకటి
శాతకుంభనఖాంకురోపేత మగుచు-విక్రమించుట విందుము వీరపురుష!
భవ్యచారణసుకుమార భణితులందు-అట్టి వంశక్రమాగతంబైన శౌర్య
మహిమ, నీలోన నవ్యక్తమగుచు నిలిచె-దాని వెలిపుచ్చుటకు నిదె తరుణమబ్బె
బాప్పరావలుఖడ్గోగ్రభానుఁ డిపుడు-మరల భువనైకపూజ్యుఁడై వరలుఁగాత!

ఖడ్గమాత్రద్వితీయుఁడౌ క్షత్త్రియునకు-మూఁడులోకంబులయినను నీడుగావు
అల జనస్థానమునఁ బిశితాశనులను-ఖలుల ఖరదూషణాది రాక్షసుల నొకఁడె
చాపమాత్రద్వితీయుఁడై సమరభూమి-ఖండితులఁ జేసె రాఘవాఖండలుండు
ఆహవంబున రిపులఁ జెండాడి యాడి-ధాతునిర్ఝరసహిత భూధరముభంగిఁ

బుష్పితోన్నతకింశుకభూజమట్లు-చాపకోటిని ధరనూఁది క్రాంతుఁ డగుచు
రణరసాఖండమునను్న రాఘవునకు-జానకీగాఢకుచపరిష్వంగ మపుడు
ఖరశరవ్రణసంధానకరణి యయ్యె-యాదవాన్వయజలధిసుధాకరుండు
రాధికావల్లభుఁడు భోజరాజసుతను-రుక్మి మున్నగు రాజుల రూపుమాపి
బాలఁ బరిణయమాడఁడే బాహుశాలి

నరకదనుజాస్త్రఘాతవినష్టచేష్టి-తాత్ముఁడగు వల్లభునకు సత్యాకుచోత్త
రీయవాయువు పీయూషపేయ మయ్యె-అబలలైనను సుక్షత్రియాభిజాత
లరుల నిర్జించి పురుషుల నరయఁగలరు.

యాదవానీకవారాశి నాక్రమించి-దైవతాధిపసూనుఁ డుద్దండవృత్తి
వాసుదేవుని చెలియలి వనరుహాక్షిఁ-దాను గొంపోవఁడే సుభద్రాకుమారి.

వీర, యష్టవిధోద్వాహవిధులయందు-రాజులకు నొప్పు గాంధర్వరాక్షసములు
మధురతమములు వీరసమ్మతము లగును-తగుదునని వ్రాయుటయుఁగాదు ధరణినాథ!
పంకమగ్నద్విపేంద్రంబుపగిది నున్న-జనకు ససహాయతయు మానధనము వోక
భావి దుస్థితియును నీదుపైని వలపు-తుచ్ఛమ్లేచ్ఛాధమునిపొందు సచ్ఛకీర్తి
క్షాత్రధర్మంబుఁ గామినీచాపలంబు-వంశగౌరవమును రాజవంశతిలక!
ఇన్నియునుగూడి చిత్తంబు నెరియఁజేయ-నిది యకార్యము కార్యమం చెఱుఁగలేక
స్త్రైణజనులకు (?) భూషణప్రాయమైన-సహజశాలీనతనువీడి శంకదక్కి-
ఇట్లు వాచాటనైతి మహీతలేంద్ర!

రణమహాయజ్ఞదీక్షావిరామమందు-యవసరక్తౌఘనిర్ఝరాంబువులలోన
నవభృథార్ద్రశరీరుండవైన నిన్ను-గాఢకూర్పాసఖండనక్షమకఠోర
పీవరస్తనయుగ్మనిష్పీడ్యమాన-వక్షునిగఁ జేసి ధన్యనై వరలుదాన

ఈ వుపేక్షవహించితివేని నాథ, వినుము దెల్పెద హవ్యవాహనుఁడు దక్క-
అన్యుఁ డొకమర్త్యుఁ డీదేహ మంటు నెట్లు-ఆజ్యధారావివర్ధమానాంగుఁ డగుచు
జ్వాలమాలాకులాభీల జటిలుఁడగుచు-సప్తజిహ్వాంచలోల్లిఖత్సప్తసప్తి
యగుచు వైహాయసంబెల్ల నాక్రమించి-దక్షిణావర్తశిఖల సదభ్రమూర్తి
వెలుఁగు వైశ్వానరోగ్రకీలల మదీయ-దేహకుసుమంబు వ్రేల్చి సతీత్వ మంది

యవనవీరులగుండియ లవియుచుండ-సద్గతికి నేగుదాన నిశ్శంకవృత్తి
కజ్జలాశ్రుల నీ పత్త్రకంబుమాసె-కన్నుగవ బాష్పపూర్ణమై కానరాదు.
హస్తకంపంబుచే వ్రాయ నలవిగాదు-జడతహృదయంబు పాషాణసదృశ మయ్యె
శరణ మన్యమెఱుంగ దీచరణదాసి-నీటనైనను బాలమున్నీటనైన
ముంచినను దేల్చినను నీవె పుణ్యమూర్తి-ప్రార్థనాంజలి ఘటియించి పరమభక్తి
వేఁడుచుంటిని భువనైకవీర, నిన్నుఁ-జిత్తమెటు లటు సేయుము జీవితేశ,
ఏకలింగవిభుండైన యిందుధరుఁడు-జన్యమున నిన్ను నెపుడు రాజన్యతిలక,
మనుచుఁగావుత విజయసంపద లొసంగి.

ఆర్తుఁడు

మక్కపాటి వేంకటరత్నకవి గారు

హర్షాశ్రుధారఁ బాద్యం బొసంగెద నీకు-దయచేయుమయ్య బృందావిహారి,
విమలభక్తిరసాయనము నర్ఘ్యమిచ్చెద-స్వీకరింపుము రుక్మిణీకళత్ర,
అకలుషచిత్తసింహాసనంబు ఘటింతు-వేంచేయు మో శిఖిపింఛచూళి,
పరిపక్వ మగు నాత్మఫలరాజ మర్పింతు-నారగింపుము దుర్భరార్తిహరణ,
నాకు నీకంటె నాప్తులు నీకు నన్ను-వంటి దయనీయు లింక నెవ్వారు గలరు?
సత్వరంబుగ నన్ను గటాక్షంబు సేయఁ-బోలదే నీకుఁ గరుణాప్రపూర్ణహృదయ?
దారుణార్తి నైదాఘవాతముల సుడిసి-తావకీనదయారసధార నానఁ
జిత్త మెప్పుడును బ్రతీక్షించుఁ గృష్ణ-జలదధారకు వానకోయిలవిధాన.
శరణన్న ద్రౌపదీసతినిఁ గావఁగలేదె-మితిలేని వస్త్రసంతతు లొసంగి
కరిరాజు భూరిదుఃఖమును బాపగలేదె-కడపి నక్రమును జక్రంబుచేత
గోపికాజనముల గో డడంపఁగలేదె-గోవర్ధనముఁ గొనగోట నిల్పి
మునిజనంబుల తాపమును దొలంపఁగలేదె-విసుమాపు దుష్టరాక్షులఁ గూల్చి
భక్తిసేయనో మొఱలిడు పటిమలేదో-సక్తి పొనఁగదో నీపదాబ్జములు చిత్త
సరసి నిల్పనో కర్మపాశములు ద్రెంపి-యేల ననుఁ గావరావు గోపాలదేవ?

సంస్కృతప్రాకృతభాషలు

శ్రీ సరవస్తు వెంకటరామానుజస్వామి గారు, యం.,ఏ.

మన హిందూదేశమునందలి సంస్కృతప్రాకృతాది భాషలకును 'యూరప్' ఖండమునందలి 'గ్రీక్, లాటిన్ ఇంగ్లీష్, ఫ్రెంచ్' మొదలగు భాషలకును ధాతువులలోను, ప్రత్యయములలోను వ్యాకరణవిషయములలోను విశేషసంబంధ మగపడుటచే నివి యన్నియు నేకభాషాజన్యములనియుఁ, గాఁబట్టి వీని నన్నిటిని ఒకభాషా కుటుంబమని వ్యవహరింపవచ్చుననియు భాషాశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ఈకుటుంబమునకు 'ఇండో-యూరపియన్' భాషాకుటుంబమని నామకరణముచేసిరి. ఈకుటుంబములోని భాషలలో నెల్ల సంస్కృత భాష ప్రాచీనతమ మైనదగుటచేఁ బూర్వము భాషాశాస్త్రజ్ఞులు దానినే మూలభూతమగు భాష యని తలంచుచుండిరి కాని క్రమముగాఁ బ్రబలకారణము లగపడుటచే నీయభిప్రాయమును వారు మార్చుకొని సంస్కృతము, 'గ్రీకు, లాటిన్' మొదలగు భాషలన్నియును మూలభూతమగు మఱియొక భాషనుండి జన్మించినవని తలంచి యట్టిదానిని 'ఇండో-యూరపియన్' మాతృభాష యని వ్యవహరింప సాగిరి. ఆకాలమునందే హిందూదేశములోని ప్రాకృతాది భాషలకు సంస్కృతము మూలమని తలంచుచుండిరి. ఇట్లు వారు తలంచుటకు మనవారిచే రచియింపఁబడిన ప్రాకృత వ్యాకరణములే ముఖ్యములగు నాధారములు.

ప్రాకృతవ్యాకరణములలో నెల్లఁ బ్రాచీనతమ మైనదగు వరరుచియొక్క ప్రాకృతప్రకాశమునందుఁ బ్రాకృతభాషలన్నియు సాక్షాత్తుగాఁగాని, పరంపరగాఁగాని సంస్కృతమునుండి జనించినవని చెప్పఁబడి యున్నది. ఈగ్రంథమున వరరుచి మహారాష్ట్రి, శౌరసేనీ, మాగధీ, పైశాచీయను నాలుగు భాషలకు వ్యాకరణమును వ్రాసెను. మహారాష్ట్రి భాషానుశాసనము చివరను "శేషః సంస్కృతాత్" (౯-౧౮) అను సూత్రమును వ్రాసియున్నాఁడు. దీనికి భామహుఁడు క్రిందివిధముగా వ్యాఖ్యానము చేసియున్నాఁడు. "ఉక్తాదన్యః శేషః ప్రత్యయసమాస తద్ధితలిఙ్గవర్ణకాదివిధిః శేషః సంస్కృతాదవగన్తవ్యః." శౌరసేనీ పరిచ్ఛేదప్రారంభమున "శౌరసేనీ॥ప్రకృతిః సంస్కృతమ్" (౧౨-౧-౨) అని చెప్పియున్నాఁడు. మాగధీ, పైశాచీ భాషలను వర్ణించు పరిచ్ఛేదములను "ప్రకృతిః శౌరసేనీ" (౧౧-౨; ౧౦-౨) అను సూత్రముతోఁ బ్రారంభించియున్నాఁడు. ప్రాకృతవ్యాకరణకర్తలలో నెల్ల ముఖ్యుఁడగు హేమచంద్రుఁడు కూడ నిట్టి యభిప్రాయమునే కలిగియున్నాఁడు. అతని ప్రాకృతవ్యాకరణప్రారంభమున "ప్రకృతిః సంస్కృతమ్ తత్ర భవం తత ఆగతం వా ప్రాకృతమ్" (౮-౧-౧) అని వ్రాసియున్నాఁడు. ఇట్లే మిగిలిన ప్రాకృతవ్యాకరణకర్తలు కూడఁ బ్రాకృతభాషలన్నియు సంస్కృతజన్యములని చెప్పియున్నారు. వీరందఱును వర్ణాదేశవర్ణలోప వర్ణాగమాది సాధనములచేఁ బ్రాకృతభాషాపదములను సంస్కృతపదములనుండి సిద్ధింపఁజేసియున్నారు. కాని విమర్శింపఁగా వీరి యభిప్రాయము సరిగానున్నట్లు తోఁచుటలేదు. సంస్కృతప్రాకృతభాషల తత్త్వములను బరిశీలించి ప్రాకృతభాషలు సంస్కృతభాషాజన్యము లనుట సమంజసము కాదనియు, వంతకంటె సంస్కృతము ప్రాకృతభాషాజన్యమనుట న్యాయమనియు భాషాశాస్త్రజ్ఞు లభిప్రాయపడియున్నారు. వారట్లు తలంచుటకుఁ గారణములను గొన్నిటిని క్రిందఁ బొందుపరచుచున్నాను. కాళిదాసాది మహాకవులచే గ్రంథములలో వ్యవహరింపఁబడినట్టిదియుఁ బాణినిచే ననుశాసింపఁబడినట్టిదియు నగు భాషను సంస్కృతమనియుఁ గ్రీస్తుశకమునకుఁ బూర్వము మనదేశమునందు వ్యవహారములో నుండినట్టివియు, నాటకాదివాఙ్మయమునఁ బ్రయోగింపఁబడినట్టివియుఁ, బ్రాకృతవ్యాకరణములలో వర్ణింపఁబడినట్టివి యునగు భాషలను బ్రాకృతభాషలనియు భాషాశాస్త్రజ్ఞులు వ్యవహరించుచున్నారు.

వ్యవహారములో నుండు భాష యేదియైనను విశేషకాలము స్థిరముగా నుండక కాలక్రమమున మార్పులను బొంది భాషాంతరములుగాఁ బరిణమించునను విషయమును భాషాశాస్త్రజ్ఞులందఱు నంగీకరించియున్నారు. గ్రాంథిక భాష మాత్రము స్థిరపడియుండుటచే వికారములను బొంద నేరదనికూడ వారిసిద్ధాంతము. అందుచే సంస్కృతభాషనుండి ప్రాకృతభాషలు జన్మించినవని- అనగా సంస్కృతభాష మారి క్రమముగాఁ బ్రాకృతభాషలలోనికి బరిణమించినదని - యంగీకరించుటకు సంస్కృతము వ్యావహారిక భాషగా నుండెనని ఋజువు చేయవలసి యుండును. సంస్కృతము వ్యావహారిక భాషగానుండెనని తెలంచుటకు నవకాశమున్నదా లేదా యని విమర్శింపవలసి యున్నది. పతంజలి తన మహాభాష్యమున సంస్కృతము సర్వజనవ్యవహారములో లేనట్లును, శిష్టులుమాత్రమే దానిని వ్యవహరించుచున్నట్లును మిగిలినవారుసంస్కృతేతర భాషను వ్యవహరించుచున్నట్లునుచెప్పియున్నాఁడు. "కే పునరుపదిష్టాః। శిష్టాః" (౬-౩-౧౦౯ సూత్రముపై భాష్యము) "శిష్ట ప్రయోగా గాదాణపయత్యాదీనాం నివృత్తి ర్భవిష్యతి" "లోకేపి కృష్యర్థేకసిం ప్రయుజ్యతే దృశ్యర్థేచ దిశిమ్" (౧-౩-౨ సూత్రముపై భాష్యము) "గావీ, గోణీ" (భా.౧-౧-౧) "ఆణపయతి, కసి, వట్టతి, వడ్ఢతి" (భా. ౧-౩-౨) అను పదములు సామాన్యజనులు వ్యవహరించు భాష నుండి యుదాహరింపఁబడినవి. ఇవి యన్నియుఁ బాళీ భాషాపదములు. అందుచే నా కా ల మున (ప్రాకృత) భాష సా మా న్య జ ను ల చే వ్యవహరింపఁబడుచుండినట్లు స్పష్టపడుచున్నది. శిష్టులు మాత్రము సంస్కృతమును మాటలాడఁ గలిగియుండిరి. శిష్టులనఁగా నెవరు? వైయాకరణులు; అనగా వ్యాకరణ శాస్త్రము నభ్యసించినవారని పతంజలియే చెప్పియున్నాఁడు. "కే పునః శిష్టాః। వైయాకరణాః" (౬-౩-౧౦౯ సూత్రముపై భాష్యము) వారైనను వ్యాకరణము నభ్యసించుటచేతనే సంస్కృతము మా ట లా డఁ గ లి గి యుం డి రి. వ్యాకరణము న భ్య సిం ప ని ది సం స్కృ త మున మాటలాడుటకు రాదని పతంజలి చెప్పియున్నాఁడు. "శిష్టజ్ఞానార్థాష్టాధ్యాయీ... నానవమస్య దైవానుగ్రహస్వభావో వా యోఽయం నచాష్టాధ్యాయీమధీతే యే చాత్రవిహితాః శబ్దాస్తాంశ్చ ప్రయుంక్తే" (౬-౩-౧౦౯ సూత్రముపై భాష్యము) వ్యాకరణసహాయమున సంస్కృతమును నేర్చినవారు (శిష్టులు)కూడ నన్ని సమయములయందును సంస్కృతము నుపయోగించుట లేదట. యజ్ఞకర్మలయందే సంస్కృతమున వ్యవహరించుచుండిరి. "యర్వాణస్తర్వాణో నామర్షయో... యజ్ఞే పునః కర్మణి నాపభాషన్తే" (భా. ౧-౧-౧-) సామాన్య వ్యవహారమునకు పాళీ(ప్రాకృత) భాషనే యుపయోగించుచుండిరి. మఱియు సంస్కృతము వ్యవహారములో నుండినయెడల వ్యాకరణము నభ్యసింపనివారు వ్యాకరణవిరుద్ధములగు సంస్కృత (నప) శబ్దములను ప్రయోగింతురుగాని భాషాంతర శబ్దములను బ్రయోగింపరు. పతంజలి వ్యాకరణశాస్త్రప్రయోజనములలో నపశబ్దములను బ్రయోగింపకుండుట యొకటియని చెప్పి ("బ్రాహ్మణేన నమ్లేచ్ఛితవై నాపభాషితవై। మ్లేచ్ఛా మా భూమేత్యధ్యేయం వ్యాకరణమ్." భా. ౧-౧-౧) యా యపశబ్దములకు "హేలయ, గావీ, గోణీ" మొదలగు ప్రాకృతరూపముల నుదాహరించియున్నాఁడు. తెలుఁగుభాషయందు "వస్తాడు, పోతాడు,నుయ్యిలు, నాలికె" మొదలగునవి యపశబ్దము లగును. గాని "బరుత్తాను, పోగుత్తాను, బావికళు, నాలిగె" మొదలగు భాషాంతరశబ్దము లపశబ్దములు కానేరవుకదా! ఇంగ్లీషు భాషలో comed, goed అను మొదలగునవి యపశబ్దములగును గాని "వచ్చెను, వెళ్లెను" అను మొదలగునవి కానేరవుగదా! అట్లే సంస్కృతమున "గచ్ఛతే, ఏధతి, హారిస్య" అను మొదలగునవి యపశబ్దములగునుకాని "గావీ, అణపయతి వట్టతి" అను మొదలగు భాషాంతరశబ్దము లెట్లగును? పతంజలి సంస్కృతశబ్దములను పాళీశబ్దములను నెఱుఁగును గాని సంస్కృతములోనే వ్యవహారవశమువలన గలిగిన యపశబ్దముల నెఱుఁగఁడు. పతంజలికి నపశబ్దమనగా పాళీ (ప్రాకృతము)యని తాత్పర్యము. సంస్కృతము సామాన్య వ్యవహారములోనే యుండినయెడల నపశబ్దములు పతంజలికిఁ దెలిసియుండును.

పతంజలిమహాభాష్యమునుబట్టి యీ క్రిందివిషయములూహింపఁదగియున్నవి. (౧) పూర్వము మనహిందూదేశమున సామాన్యజనులు పాళీభాష నుపయోగించుచుండిరి. (౨) శిష్టులుకూడ లోకవ్యవహారమున కాభాషనే యుపయోగించుచుండిరి! మతసంబంధమగు కర్మలలో మాత్రము సంస్కృతము నుపయోగించుచుండిరి. (౩) శిష్టులుకూడ వ్యాకరణశాస్త్రసహాయముననే సంస్కృతమును నేర్చుకొనుచుండిరి. కాబట్టి వేదమునుండి భేదమును జూపు నుద్దేశముతో యాస్క-పాణినులు సంస్కృతమును భాషయని వ్యవహరించిరికాని లోకములో వ్యవహరింపఁబడుచున్నదని చెప్పుటకై కాదు.

సంస్కృతము వ్యవహారములో నుండలేదనుటకు దేశాంతరీయుల గ్రంథములుకూడ నిదర్శనములగుచున్నవి. క్రీస్తు జన్మించుటకు నాలుగైదు వందల సంవత్సరములకుఁ బూర్వము 'గ్రీక్' దేశస్థులు మనదేశమునకు వచ్చియుండిరి. వారి యాకాలపు గ్రంథములలో మనదేశములోని పట్టణనామములును, పురుషనామములును గనఁబడుచున్నవి. వానిని వారు సామాన్యజనవ్యవహారమునుండి గ్రహించి యుండవలయును. అవి యన్నియు ను ప్రాకృత భాషారూపములకు స రి ప డు చు న్న వి. కా ని సం స్కృ త రూ ప ము ల కు స రి ప డు ట లేదు. ఉ. "సంద్రకొత్తుస్" ప్రా. చంద్రగోత్త, చంద్రకొత్త; సం. చంద్రగుప్త), "సోఅనెస్" (ప్రా. సుఅణ్ణ; సం. సువర్ణ) "పాలిబోత్ర" (ప్రా. పాడలిపుత్త, పాడలిబొత్త, సం. పాటలీపుత్ర("ఏరణ్ణోబోఅస్" (ప్రా. హిరణ్ణబాహ, సం. హిరణ్యవాహ;)"పుక్కలాఒతిస్" (ప్రా. పుక్కలావతి, సం. పుష్కరావతి) ('రాయల్ ఏష్యాటిక్ సొసైటివారి ౧౯౧౪ సం.రపు పత్రిక ౮౭౧ పుట). ఇందుచే 'గ్రీక్' దేశస్థులు మనదేశమునకు వచ్చిన కాలమున ప్రాకృతభాషలు వ్యవహారములో నుండినవి కాని సంస్కృతము వ్యవహరింపఁబడు చుండలేదని తెలియుచున్నది. పాణినికాత్యాయనుల కాలముననే 'గ్రీక్' దేశస్థులు మనదేశమునకు వచ్చియుండిరి. వారికాలముననే కాక యెన్నఁడును సంస్కృతము వ్యవహారములో లేదని యీ భాషయొక్క స్వరూపమే తెలుపుచున్నది.

వ్యావహారిక భాషయందు పదములు విడిగానుండును గాని వానికి సంధిచేయఁబడి యుండదు. దీర్ఘ సమాసములు వ్యవహారమునకుఁ బ్రతిబంధకములు ఇట్టి కారణములచే సంస్కృతభాష యెన్నఁడును వ్యవహారములో నుండలేదనియు, వైదికభాషను సంస్కరించి వైదికకర్మల నాచరించు కాలమున నుపయోగించుటకు మన యార్యులు యేర్పరచిన భాషయనియుఁ జెప్పవచ్చును. వ్యావహారికభాష కానప్పుడది వికారములను బొందుట కవకాశము లేదు. ప్రాకృతభాషలు కాని, తదితరభాష లేవియును గాని దానినుండి జన్మించినవని చెప్పుటకు వీలు లేదు.


సంస్కృతభవములు కాకపోవుటయే కాక ప్రాకృత భాషలు సంస్కృతమునకంటె ప్రాచీనములనుటకు గూడఁ గొన్ని నిదర్శనములు గలవు. ప్రాకృతభాషలకు సహజములగు వర్ణవికారములతోఁ గూడిన పదములు సంస్కృతమునఁ గొన్ని కలవు. అవి సంస్కృతభాషలోనికిఁ బ్రాకృతభాషలనుండి ప్రవేశించినవని యంగీకరింపవలసియున్నది. వట్ట, క్రోష్ట, గోవింద, నారిమ, విచ్ఛిత్తి, దురుత్తర, దుక్ష, మసృణ మొదలగు పదములు ప్రా కృ త భా షా ప ద ము లైనట్లు వాని స్వరూపములే చెప్పుచున్నవి. మరియు పాణినీయధాతుపాఠములో ప్రాకృతధాతువులు విశేషముగా నున్నవి. వైదికభాషయందే ప్రాకృత భాషా సంప్రదాయముల న వ లం బిం చి న పదములు కొన్ని కలవు. ఉదా: గృహ, కుట: కృత, నిఘంటు: నిర్గ్రంథ, గుగ్గులు: గుంగులు, పడ్భిః: పద్భిః, గభస్తి: గ్రభస్తి, భుజ్: భ్రుజ్ మొదలగు పదములు వేదమున పైనుదాహరించినట్లు ద్వివిధముగా బ్రయోగింపఁబడి యున్నవి. వీనిలో మొదటి రూపములు రెండవవానినుండి ప్రాకృతవర్ణవికారముల ననుసరించి కలిగినవని స్పష్టముగాఁ జెప్పవచ్చును. మరియు, త్వమ్ వరేణ్యమ్, తుర్యమ్, మర్త్యాయ, స్వధ్వరమ్ మొదలగు పదములు వేదమున నప్పుడప్పుడు 'తుఅమ్, వరేణియమ్, తురియమ్, మర్తిఆయ, సుఅధ్వరమ్' అను రీతిగా వర్ణాగమములతో నుచ్చరింపవలసి యుండును. ఇది కూడఁ బ్రాకృతభాషోచ్చారణ రీతులలో నొకటియని మన మెరుగు

దుము. అందుచే వేదకాలమునకే ప్రాకృతభాషలు ప్రారంభమైనవని చెప్పవచ్చును.

ఋగ్వేదాది వైదికగ్రంథములలో మనకగపడు భాష గ్రాంథికభాషకాని వ్యావహారికభాష కాదు. వైదికయుగమునందు వైదిక్ భిన్నమగు మరికొన్ని భాషలు వ్యవహారములో నుండినవి. వానికిని, వైదికభాషకును విశేష భేదము లేకపోవచ్చును. కాని ప్రాకృతభాషలలో నగపడునట్టి వికారములు కొన్ని వైదికయుగమునందే ప్రారంభమై యాకాలపు వ్యావహారికభాషలలో నగపడుచుండెను. కొంతకాలమున కావ్యావహారికభాష వికారములను బొంది పాళీభాషగా నేర్పడెను. అప్పుడీ భాషకును, వైదికభాషకును విశేష భేద మగపడుటచే మన పూర్వుల ప్రాకృతజనులచే వ్యవహరింపబడుచున్న యీ భాష వైదికకర్మలలో నుపయోగింప యోగ్యము కాదని తలంచిరి. దీనికి బౌద్ధమత ప్రచారముకూడఁ గొంతకారణము కావచ్చును. బుద్ధుఁడు తనమతమును ప్రాకృతభాషలో జనులకు బోధించెను. బౌద్ధమతగ్రంథములు కూడ పాళీ(ప్రాకృత) భాషలో వ్రాయఁబడినవి. అందుచే మనవారు వైదికభాషను సంస్కరించి మతసంబంధమగు కర్మలలో నుపయోగించుటకు సంస్కృతభాష నేర్పరచిరి. ఈసంస్కారము వైదికయుగమునందలి గ్రాంథికభాషకంటె వ్యావహారికభాషకు జరిగినదనుట న్యాయ్యము. వ్యవహారములోనున్న భాషను ప్రాకృతభాషయని వ్యవహరించుటలో నసమంజస మేమియును లేకపోవుటచే వైదికయుగమునందలి యీసంస్కరింపఁబడిన భాషనుగూడఁ బ్రాకృతమని(మూలప్రాకృతమని) వ్యవహరింప వచ్చును. ఆ(మూల) ప్రాకృతమును సంస్కరింపఁగా సంస్కృతభాష యేర్పడినది. అది స్వాభావిక మగు పరిణామములను బొంది పాళీ(ప్రాకృత) భాషలోనికి మారినది. అనగా సహజముగా వైదికయుగములోని(మూల) ప్రాకృతభాషనుండి పాళీ (ప్రాకృత)భాష జన్మించినదనియు, కృత్రిమముగా సంస్కృతభాష యేర్పరుపఁబడినదనియుఁ దాత్పర్యము. పాళీ (ప్రాకృత) భాష సంస్కృతభవము కాదనియు, వైదిక యుగములోని (వ్యావహారిక) భాషతో సంబంధించి యున్నదనియుఁ జెప్పుటకుఁ గొన్ని నిదర్శనములు కలవు. పదములకు సంధి వైదికభాషయందువలెఁ బ్రాకృతభాషయందుఁగూడ వైకల్పికము. డకారము ఋగ్వేదమునందువలె ప్రాకృతభాషలలోఁగూడఁ దరచుగా ల (ళ)కారములోనికి మారుచుండును. కొన్ని ప్రాకృత పదములకుఁ దత్సమానార్థకములగు సంస్కృతపదములకంటె వైదికపదములతో అధికసంబంధ మున్నట్లు స్పష్టముగా నగపడుచున్నది. ఉ. ఖంభ; (వై. స్కంభ; సం. స్తంభ;) ఎత్థ (వై. ఇత్థా; సం. అత్ర) మరియు సంస్కృతమునఁ బ్రయోగింపఁబడనట్టియు వేదమునందగపడునట్టియుఁ గొన్ని ప్రత్యయములు ప్రాకృతమున సర్వసామాన్యముగాఁ బ్రయోగింపఁబడు చున్నవి. ఉ. పుత్తాసో (వై. పుత్రాసః; సం. పుత్రాః). పుత్తేహి (వై. పుత్రేభిః; సం. పుత్రైః) మరియు ప్రాకృతములోని "తవే, తఏ" అను తుమున్నర్థకప్రత్యయములును "తూణ, ఊణ" అను క్త్వార్థకప్రత్యయములును వైదికభాషలోని యేతదర్థకప్రత్యయములతో సంబంధించి యున్నవి. కృణోతువు వేదమునందువలెఁ బ్రాకృతభాషలో 'కుణ' అను రూపమును బొందుచున్నది. ఇట్టి సామ్యములున్నను ప్రాకృతభాషలు వైదికభాషనుండి జన్మించినవని చెప్పుటకు వీలు లేదు. వైదికభాషయందు గూడ నగపడని రూపములు కొన్ని ప్రాకృతభాషలలో (గలవు). ప్రాకృతవ్యాకరణములలో బోధింపఁబడిన పదాదేశములలో ననేకములు వైదికవాఙ్మయమునం దగపడుటలేదు. ధాత్వాదేశములు కూడ నట్లేయున్నవి. మరియుఁ గొన్ని ప్రాకృతభాషలలో క్త్వాప్రత్యయము 'దాణి'యను రూపమును బొందుచున్నది. ప్రథమైకవచన మేకారాంతముగా నున్నది. ఈ పదములను, ప్రత్యయములను వైదికయుగములోని వ్యావహారికభాష (మూలప్రాకృతము)లో నుపయోగింపఁబడినవని తలంపవలయును. పై యాధారములచేఁ బాళీ(ప్రాకృత)భాష వైదికయుగమునఁ బ్రాకృతజనులచే వ్యవహరింపఁబడుచుండిన భాషనుండి జన్మించినదని నిశ్చయింపఁ బడినది. ఈ భాష పాణిన్యాది వైయాకరణుల కాలమునకు వైదికభాషనుండి విశేషముగా మారి పాళీభాషగా నేర్పడుటచే

శిష్టులు దీనిని వైదికకర్మలలో నుపయోగించుట కిష్టపడక వైదికకర్మలు ప్రారంభమైన వైదిక యుగములోని భాష(ల)ను సంస్కరించి సంస్కృతభాష నేర్పరచిరి. అందుచే సంస్కృతము పాళీ(ప్రాకృత)భాషయొక్క పూర్వావస్థయగు (మూల) ప్రాకృతభాషనుండి యేర్పడినదని చెప్పవలయును.

కాబట్టి సంస్కృతవైదిక ప్రాకృతభాషలకుండు సంబంధము నీక్రిందివిధమున చూపవచ్చును.



వైదికయుగమునందు వేదములలో నగపడు భాషనుండి కొంచెము భేదించియుండిన (మూల) ప్రాకృతభాషయొకటి వ్యవహారములో నుండినది. అది కాలక్రమమున సహజమైన మార్పులను బొంది మొదట పాళీ (ప్రాకృత) భాషలలోనికిని, దరువాత నుత్తరహిందూదేశమున వ్యవహరింపఁబడుచున్న 'హిందీ, బెంగాలీ' మొదలగు భాషలలోనికిని మారినది. హిందువు లీభాషలను గర్మలయందుపయోగించుట కిష్టపడక వైదికమూలప్రాకృతభాషలనుండి సంస్కృతము నేర్పరచిరి. ఇదివ్యావహారికభాష కాకపోవుటచే నెంతకాలమైనను మార్పును బొందక యట్లే నిలిచియున్నది. శిష్టులుమాత్రము దీని నుపయోగింపగలిగియుండిరి. ఇప్పటికిని నియ్యది యిట్లు వ్యవహరింపఁబడుచునే యున్నది అంతియేకాని సంస్కృత మెన్నఁడును సర్వజనవ్యవహృతభాషగా నుండలేదు. యాస్కపాణినులు బోధించిన స్వరాదినియమములన్నియును గర్మానరణసమయమునం దుచ్చారణమునకేకాని సామాన్యవ్యవహారమునకుకాదు. అట్లే యైనచో వైదికప్రాకృతభాషలకు సంస్కృతము మధ్యావస్థ యగు నలసియుండును. అట్లు తలంచుటకు పైనివర్ణింపబడిన వేకాక కాలవిషయికముగ మరియొక యనుపపత్తియుఁ గలదు. వైదికవాఙ్మయమునందలి ప్రాచీనభాగము(ఋగ్వేదసంహిత) క్రీ. పూ. 14వ శతాబ్ద ప్రాంతమున రచియింపబడినది. యాస్కపాణినులు క్రీ. పూ. 5వ శతాబ్దమునను, 4వ శతాబ్దమునను జీవించియుండిరి. క్రీ.పూ. 3వ శతాబ్దమున నశోకుని శిలాశాసనములు స్థాపింపఁబడినవి. ఇవియన్నియును సామాన్యజనులకుఁ దెలియుటకుఁగాను పాళీభాషలో వ్రాయఁబడియున్నవి. కావున నాకాలమున పాళీభాషవ్యవహారములో నుండినదను విషయము నిశ్చయము. పైని ప్రవర్తింపబడిన నిర్ణీతకాలములు సామాన్యముగా నందఱిచేతను నంగీకరింపఁబడినవి. భాషలయందు విపరిణామము లన్ని కాలములయందును సమానముగానుండునుగాని యొకకాలమున శీఘ్రముగాను, మరియొక కాలమున నాలస్యముగాను కలుగుచుండవు. వైదికసంస్కృతప్రాకృతములు మనభాషయొక్క యవస్థాభేదము లైనయెడలనవిమూఁడును సమానకాలవ్యవధానముగలవిగా నుండవలయును. వైదికభాష సంస్కృతములోనికి మారుటకుఁ బైనుదాహరింపఁబడిన కాలములననుసరించి 8, 9 వందల సంవత్సరములు పట్టినట్లు తెలియుచున్నది. అంతవిశేషకాలమునఁ గలిగినమార్పు చాలస్వల్పముగానున్నది. వైదికసంస్కృతభాషలకు విశేషభేదము లేదు. తరువాతను నూఱు నూటయేఁబది సంవత్సరములలో సంస్కృతము పాళీభాషలోనికి మారినట్లు కనఁబడుచున్నది. సంస్కృత పాళీభాషలకు విశేషభేదముకలదు. ఇదివరలో 800 సంవత్సరములలో స్వల్పముగా మారినభాష 150 సంవత్సరములలో నింతయధికముగా మారుట యసంగతము. కాబట్టి వైదికపాళీ భాషలకు సంస్కృతము మధ్యావస్థ కానేరదు. యాస్కపాణినుల కాలమున సంస్కృతము సర్వజన వ్యవహారములో నుండినదని యంగీకరించుటకును వీలులేదు.

ఇంకను ప్రాకృతవ్యాకరణకర్తలు ప్రాకృతము సంస్కృత జన్యమని చెప్పుటకుఁ గారణము విచారింపవలసి యున్నది. ప్రాకృతభాషలలోని యనేకపదములకు

సంస్కృతభాషాపదములతో సామ్యముకలదు. సంస్కృతభాష ప్రాకృతభాషకు మూలమగు (మూల) ప్రాకృతభాషనుండియే యేర్పరుపఁబడినది. ఆ(మూల) ప్రాకృతములోని ముప్పాతికపదములు సంస్కృతమునఁ గలవని చెప్పవచ్చును. వైదికభాషకూడ వైదికయుగములోని గ్రాంథికభాష యగుటచే నా(మూల)ప్రాకృతముతో విశేషముగా సంబంధించియుండును. సంస్కృతభాషవలె వైదికభాషనుగూడఁ బ్రాకృతము పోలియున్నది. కాని ప్రాకృతవైయాకరణులు ప్రాకృతభాషలను బవిత్రమగు వైదికభాషతో సంబంధింపఁజేయుట కంగీకరింపకపోవచ్చును. ప్రాకృతజనులచే వ్యవహరింపఁబడుటయేకాక బౌద్ధులచే నాదరింపఁబడు ప్రాకృతభాషలను వైదికభాషతో సంబంధింపఁజేయుట యధర్మముకాదా! అందుచే వారు ప్రాకృతము సంస్కృతజన్యమని చెప్పసాగిరి. వ్యవహారికేతరభాషనుండి భాషాంతరావిర్భావ మసంభవమను విషయమును వారు గమనింపలేరు. మూలప్రాకృతభాష నశించియుండుటచేతను నందలి విశేషభాగము సంస్కృతమునఁ జేరియుండుటచేతను బ్రాకృతము సంస్కృతజన్యమని చెప్పుటకు వారికవకాశము కలిగెను. కాని కొన్ని పదములకు సంస్కృతసంబంధ మగపడకపోవుటచే వానిని సంస్కృతపదముల కాదేశములుగా విధించిరి. ఈయాదేశములే ప్రాకృత వ్యాకరణకర్తల మార్గము సరియైనది కాదని సూచించుచున్నవి. ఘరశబ్దము గృహశబ్దమునకును[1] హెట్ఠశబ్దము అధస్‌శబ్దమునకును,[2] హిత్థశబ్దము త్రస్తశబ్దమునకును,[3] మారశబ్దము ఈషచ్ఛబ్దమునకును[4] ఆదేశములట! లట్ఠిశబ్దము యష్టిశబ్దభవమట![5] మృక్ ధాతువు మల,[6] మఢ, మడ్డ[7] మొదలగు రూపములను బొందవచ్చునుగాని పన్నాడ, పరిహట్ట[8] మొదలగు రూపముల నెట్లు పొందునో! ఉగ్ఘుస, లుంఛ, ఫుంఛ, పుంస (ఫుస, పుస,) లుహ(హాల)[8] యనునవి మృజ్ ధాతువున కాదేశములట! ఇట్టి పరస్పరవిరుద్ధశబ్దములకు సంబంధమును గల్పించుటకుఁ బూనిన ప్రాకృతవైయాకరణుల సిద్ధాంతము నిజమగునా! ప్రాకృతభాషకు మూలమగు భాషకు సంస్కృతముకంటె దగ్గరగానుండుభాష యగపడకపోవుటచే నదియే ప్రాకృతభాషకుఁ దల్లియని చెప్పిరిగాని తత్త్వమది కాదని యెఱుంగవలయును. సంస్కృతభాషయే పాళీ(ప్రాకృత)భాషకు పూర్వావస్థయగు మూల ప్రాకృతమునుండి జన్మించినదని చెప్పవలయును.

---

1. ప్రాకృతప్రకాశ. ౪-౩౨, హైమవ్యాకరణము. ౮-౨-౧౪౪.
2. హైమవ్యాకరణము. ౮-౨-౧౪౧.
3. హైమవ్యా. ౮-౨-౧౩౬.
4. హైమవ్యా. ౮-౨-౧౨౬.
5. ప్రాకృతప్రకాశ. ౨-౩౨. హైమవ్యా. ౮-౧-౨౪౯.
6. ప్రాకృతప్రకాశ. ౮-౭౦.
7. హైమవ్యా. ౮-౪-౧౨౬.
8. హైమవ్యా. ౮-౪-౧౦౫.

శూన్యభవనము

పి. అన్నాజీశర్మ గారు

హృదయమోహనమైన యాగృహమునందె - శోకవాసనయేని పై సోకకుండ
జరిపితిమి జీవితవసంతస్వప్నకేళి - ప్రేమసంతృప్తికోర్కెల వెంబడింప.

ప్రేయసీపాదధూళి పవిత్రమైన - యాగృహమె నామనశ్శాంతి కాకరంబు
భూతలస్వర్గమై దీప్తిఁ బొదలునదియె - మప్పినదినాకు మొదటి ప్రేమంపుఁదీపి.

నాయెదను, నన్ను నాజీవనమునుగూడ - స్మరణమాత్రాన దివ్యహర్షమ్మునంగి
యమలమొనరించు నాసౌధ మరసినపుడు - నాముదమ్మున కావలిసీమలేదు.

సురుచిరానందచంద్రికా స్ఫురితమగుచు - నాదుకనులకు పండువొనర్చునట్టి
యాగృహస్మృతి నాహృదయమ్మునందె - దాచుకొందును మరణమ్ముదాకగూడ.

రాగరంజితప్రేమ సూత్రమ్ము తోడ - నాయెదను ప్రేయసీ పాదనళినములకు
గట్టిగాఁగట్టుకొన నెన్నిగతులనేను - ఆనిలయమందు శ్రమజెందినానొ! యకట!

ఆమనోహరవృత్తాంతమంత యిపుడు - నామదినిదోచనేని నిస్సీమమైన
బాధచే నిలువెల్లను భగ్గుమనును-కూలిపడిక్రుంగిపోదు బాతాళమునకు.

ఆగృహముశూన్య మిపుడు నాయాశవలెనె!-అకట! యామాటతలచుకొన్నంతమాత్ర
వెడలుఁ గన్నీరు, గుండె గుభిల్లుమనును- శోషిలును మేను, ప్రాణా లుసూరు మనును.

ఏనెరుంగుదు నావలెనేగృహంబు - గూడశోభావిహీనమై పాడువడియె
కాని, యేజన్మజన్మాంతరానుమేయ - బాంధవమొ! దాని నేనెడఁబాయలేను.

ప్రణయగంభీరవృత్తిఁ బూర్వంబురీతి - దినదినముపోదు నాగృహమ్మునకు నేను
మేనెరుంగకయే నిర్నిమేషదృష్టిఁ - గాంచుదునుగాని చెలిజాడగానరాదు.

నిత్యనూతనసమ్మోద నియతినోసఁగు - నాసుఖస్మృతిమరవలే నకట, నేను
ఫాగిలిఫాగిలి ప్రాణమ్ములుపోవుదాక - తప్పనాశూన్యభవన ప్రదక్షిణముల.

దివ్యభక్తిని వినయవిధేయతలను - బ్రత్యుషస్సుల నాగృహద్వారమందు
సురభిళములైన హృదయప్రసూనదళము - లొక్కటొక్కటిగా జేర్చుచుందు నేనె.

దేవి నటియించినట్టి యాదివ్యగృహమె - యిపుడుగూడ జీవితశాంతి నిచ్చునీవి
శాలజగతీతలంపు టందాలజూపి-సఫలమొనరించు నాప్రేమసంశ్రయమును.

చేమకూరవాని సారంగధర చరిత్రము

ఆంధ్రవిశారద తాపీ ధర్మారావు గారు, బి.ఏ.

చేమకూర వేంకటకవి ప్రణీత విజయవిలాస కావ్యంబునకు వ్యాఖ్యానంబు వ్రాయుచుండిన యప్పు డక్కవిపుంగవుని కవితాగుణంబుం గూర్చి విశేషంబుల నారయు తలంపున నాతని సారంగధర చరిత్రమును గూడఁ జక్కఁగఁ బఠింపవలసివచ్చుటం జేసి యట్లొనర్చుచుంటిని. సారంగధరచరిత్ర పఠనమునకు నాకుఁ జిక్కిన పుస్తకములలో సవ్యాఖ్యానముగ నున్న దొక్క-బ్ర. శ్రీ. మహోపాధ్యాయ వేదము వేంకటరాయ శాస్త్రి (ఇప్పుడు కళాప్రపూర్ణులు) గారిదియే. ఆసవ్యాఖ్యాన గ్రంథమును స్థాలీపులాక న్యాయముగఁ జూచినంత నాకవిధీరుని కవితాచమత్కారమును, శిల్పవిధానమును, కళాప్రాగల్భ్యమును దెలియఁబఱచు నొండొక వ్యాఖ్యాన మత్యవసరమనునూహ నాకుఁ బొడమెను. నావిజయవిలాసవ్యాఖ్యానము పూర్తియయిన యనంతర మీసారంగధరచరిత్రమును వ్యాఖ్యాతృదృష్టిని జదువ నారంభించితిని. గ్రంథమునందలి భావాతిశయము, 'క్షితిలో నీమార్గ మెవరికిఁ రాదు సుమీ' యను వర్ణ్యపు రచనానైపుణియు ప్రస్తుతమున్న వ్యాఖ్యానమందుఁ బ్రకటితము గాకుండుటయే కాక కొన్ని చక్కని ముద్దుపద్యముల కర్థములుగూడ, నెంతయు నసంతృప్తికరముగ నుండుటయుఁ గాంచితిని.

> ఉప్పనై వట్టి చక్కెర లప్పలీఁడె?
> చేదువగ గల యమృతంపుఁ జెలమ లెవరొ!
> పుల్లనుండెడి తేనె కరుళ్లు సరియె?
> వనిత, కనుఁడయ్యనా నీదు వాతెఱకును. ॥ 204.

అను పద్యమునకు శ్రీ వేంకటరాయశాస్త్రిగారు వ్రాసిన టీక.

“వాతెఱకుఁ=అధరమునకు, ఉప్పనై వట్టి=కొప్ప; చేదువగ=ముంచుకొనుక్రమము, పుల్లఁ=పుడకయందు, కరుళ్లు=తెట్టెలు. చిత్రాంగి మోవిముందఱ చక్కెర భక్ష్యము లప్పనివనియు, అమృతపుఁ జెలమ చేదు అనియు, తేనె తెట్టెలు పులుపుగా నుండుననియు భావము” అని యున్నది.


ఇందుఁ గవికిఁ గలయూహ వాతెఱకు సాధారణముగ నుపమానములుగ నుండు చక్కెరభక్ష్యములను, అమృతపుఁ జెలమను, తేనెతెట్టెలను సకారణముగ నిరసించుట. అందుల కాయుపమానముల స్వభావగుణముల నెత్తికొని, యాగుణములయందు శ్లేషవలనఁ జెడ్డరుచిని దోఁపింపఁజేసి, వానిని (ఆయుపమానములను) నృణీకరించుచున్నాఁడు. తేనెతెట్టెలు సాధారణముగఁ బుల్లను (పుడకను) ఆశ్రయించుకొనియుండుటచేఁ బుల్లనుండుట సహజము. ఆ 'పుల్లనుండుట' యందు పులుపురుచి శ్లేష వలనఁ గానవచ్చుచున్నది. కావున దీయనగు వాతెఱకు సరికాదు. అట్లనే 'యమృతపుఁజెలమ' చెలమ (చిన్న ఊటబావి) యనుటచేత ముంచుకొనుట (చేదుట) దానికిఁ గలదు. ఆ 'చేదువగ' యందుఁ జేదురుచి కానవచ్చుటచేత నిరాకరణీయము. ఇట్లీ రెండుదాహరణములను గానవచ్చు కవిభావము 'ఉప్పనై వట్టి చక్కెర లప్పలీఁడె' యను చరణంబునఁ గూడఁ జెప్పవలయుఁ గదా! అందునను బ్రక్రమమే ప్రధానముగ నెంచు నీచేమకూరవాని కవిత్వమునందిట్టులు చెప్ప యత్నింపకున్న దోషము గూడ నగుననిన నన్ను మన్నింతురుగాక! కాని శ్రీశాస్త్రిగారు “ఉప్పనై వట్టి=కొప్ప” అని మాత్రము వ్రాసిరి. అది యెట్టులు చక్కెరలప్పలకు స్వభావసిద్ధమో తెలుపరైరి. ఎట్టులు 'కొప్ప' యను నర్థము లభించునో యూహింపవలయును.

నాయూహము చక్కెరలప్పలనిన చక్కెరవేసి చేసిన యప్పములు, అతిరసములఁ బోలు భక్ష్యవిశేష



శ్రీ జయపురం మహారాజుగారు

ఆంధ్ర విశ్వవిద్యాలయమునకు రెండు లక్షలరూపాయలను, ఇర్విన్ ప్రభువుగారి పేరట సా. యస్. ఆర్. దాసుగారి పేరట స్థాపింపనున్న పాఠశాలకు లక్షరూపాయలను విరాళ మొసగిరి. ఆంధ్ర విశ్వవిద్యాలయమునకు ప్రోఛాన్సలరుగా నియమింపబడిరి.



శ్రీ వెలగపూడీ రామకృష్ణచౌదరిగారు, ఐ. సి. యస్.

జయపుర సంస్థాన మంత్రి.

ములు. ఇయ్యవి ఉప్పర్ ఐనవి; ఉప్పుటవలన నయినవి. ఉప్పుటయన అవిని ఉడికించుట లేక ఉడికించుట అను నర్థము. ఈ ఉప్పుధాతువునుండియే మనకు ఉప్పుడు బియ్యము, ఉప్పుపిండి లోనగుపదములు వాడుకకు వచ్చినవి. కావున ఉప్పుటచేత (ఉడికించుటచేత) నగు ఉక్కెర లప్పలు ఉప్పనివని కవి తూలనాడెను.

బ్రౌనుదొరగారు తమ ఆధిపత్యమునందుండు పండితులచేత నీ సారంగధరచరిత్రమున కొకవ్యాఖ్యానమును వ్రాయించిరి. (1830లో) అందేమియుండునో యని ప్రాచ్యలిఖితగ్రంథాలయమునఁజూడ, నచ్చటంగూడ శ్రీశాస్త్రి గారువ్రాసినయట్టులనే 'గొప్ప'యను నర్థమున్నది. ఆపండితులు టీకమువ్రాయ నుద్యమించిరే కాని విపులమగు వ్యాఖ్యానమును దలపెట్టలేదని రెంచితి. శ్రీశాస్త్రి గారు తామెంత "స్వరచితవ్యాఖ్య" యనియు, 'విపుల వ్యాఖ్య' యనియుఁ జెప్పుకొనినను తాము వ్రాసిన సారంగధరచరిత్ర వ్యాఖ్య సాధారణమగు లఘుటీకయే కాని వేఱుకాదని సాహసించి, నేనిద్దానికి వ్యాఖ్యానము వ్రాసినాఁడను.

అట్లు వ్రాయుటకుఁ దగుసౌకర్యముగ నుండునని ముద్రితాముద్రితగ్రంథములకై వెదుకవలసివచ్చినది. ప్రాచ్యలిఖితగ్రంథాలయమునయున్న గ్రంథములంజూచి పాఠభేదములతో నా చేర్చిన యట్టులు వ్యాఖ్య వ్రాసితిని. ఇట్టులుండ నామిత్రులు, భాషాభిమానులు నగు డాక్టరు బుఱ్ఱా శేషగిరిరావు పంతులుగారొకనాఁడు తమకడనుండు తాళపత్ర సారంగధరచరిత్ర మొక్కటి నాలుగాశ్వాసముల గ్రంథము కలదనియు, నావ్యాఖ్యాన సమన్వయమున కద్దియొక్కటంగ నుపకరింపవచ్చుననియుఁ జెప్పి, నలయు నన్ను నా తాళగ్రంథము నిచ్చెదమని నాయందపరిమితాదరంబున నుడివిరి. పెన్నిధిఁగన్నచందమున నత్యంతోత్సాహపూరితుండనయి, వారితోఁగూడఁ బోయి నేను 'భారతీతీర్థ'యందలి తాటియాకుకట్టల నెమకఁ జొచ్చితి. అదృష్టవశంబునఁ దెలిసియుఁ దెలియని యక్షరములతో 'సారంగధర చరిత్రము' అని వ్రాసియున్న యొక్క కట్ట మాకు లభించెను. అద్ది చెదలుతినియుండుటచేత నత్యంతశిథిలావస్థయం దుండుటయే కాక యనాదరణ కారణమున పత్రములన్నియు నొకదాని కొకటియంటి కలచుకొని గ్రంథమంతయు నొక్క గట్టిశిలవలె నుండెను. ఎట్టులయిన దానిని సాధింపవలయునను నభిలాషతో నా గ్రంథమును దీసికొని యట్టి యమూల్యగ్రంథము నిట్టియవస్థకుఁ దెచ్చిన శ్రీ భారతీతీర్థవారి తుంటవృత్తులు గాంచాలరని డాక్టరు శేషగిరిరావుగారితోఁ జెప్పి నాకృతజ్ఞతను దెలిపితిని. అటనుండి నేను, మామిత్రులగు కవిరాజ మల్లాది విశ్వనాథశర్మగారితోఁ బ్రహ్మశ్రీ. ఆదంట వేంకటరాయ సాంఖ్యాయనశర్మగారిని దర్శింపఁబోయితిమి. సాంఖ్యాయనశర్మగారును గ్రంథముం జూచి 'పెట్రోలుతో' పత్రముల విడఁదీయ ప్రయత్నము చేయ సహాయముఁ జెప్పి నాయుద్యమమును బ్రోత్సహించిరి.

నేను మాదిపయంత్రాస్త ముద్రితములలోఁగాని, యముద్రితములలోఁగాని, ప్రాచ్యలిఖిత పుస్తకాలయమునగాని, పలుచలును గాని యున్ని సారంగధరచరిత్రములను మూఁడాశ్వాసములుగనే యున్నవి. విజయవిలాస ప్రకృతింబట్టిచూచినను సారంగధర మూఁడాశ్వాసములుగనే యుండ నొప్పునని తోఁచును. కావున ఇది మోసమగునేమో యను సందేహముతో మెల్లన నా గ్రంథము నందలి తుది తాటియాకును వెలుగించిచూడ సంకీర్తి మున్నది.

* * * * *

గద్య. ఇతి శ్రీ సూర్యనారాయణ వరప్రసాద లబ్ధ సారస్వతసుధారస సంజనిత యశోలతాంకుర చామకూర లక్ష్మణామాత్యతనూజ సమారాధిత బుధజనసమాజ, వేంకటరాజ ప్రణీతంబయిన సారంగధర చరిత్రంబునందు సర్వంబును జతుర్థాశ్వాసము. ప్రభవ సంవత్సరాశ్వయుజ కృష్ణపంచమీ శుక్రవారమునకు నిష్ఠల లక్ష్మీపతి సారంగధరచరిత్ర నాలుగాశ్వాసములు వ్రాసి సందపాటి లక్ష్మినరసయ్యకు చెప్పెను."

చతుర్థాశ్వాసంబనుట ప్రమాదమేమో యని సందేహించిన, నీ నిష్ఠల లక్ష్మీపతి వ్రాత చక్కనిదయి నిర్దష్టముగ నున్నదనుటయు, చతుర్థాశ్వాసము అనుట మాత్రమే కాక తెలుఁగుభాషఁగూడఁ 'సారంగధరచరిత్ర నాలుగా

శ్వాసములు' అని వ్రాయుటయు నాసందేహమును నిర్మూల మొనర్చుచున్నది. కావున నా ప్రథమలో వ్రాసిన గ్రంథము నాలుగాశ్వాసములు గలదనియే యూహించవలయును.

మిక్కిలి శ్రద్ధతో ననేకవిధముల మహాప్రయత్నమును జేసి యెంత యప్రమత్తుఁడనయియున్నను, శైథిల్యాతిశయంబు కారణమున నా కీనాలుగాశ్వాసములును జక్కఁగఁ జదువఁదగు సదృష్టము లభించునట్టులు దోఁచకున్నయది. ఎద్దియేని యొక్క పత్రభాగమున నక్కరంబులు పొడచూపినను, ఆపత్రమును దీసి త్రిప్పునప్పుడవి పొడిపొడియయి రెండుప్రక్కలనుండు నక్కరములు జదువవల నొసఁగకున్నది. ఎందఱు శాస్త్రవేత్తలనడిగిన నుపాయాంతరము నెఱిఁగింపఁ జాలకున్నారు.

ఇప్పటికి నేను గ్రంథాదిని జూడఁగలిగిన యంతవఱ కీతాళసంపుట సారంగధరచరిత్ర

“శ్రీలెల్ల ప్పుడొసంగ............” అనుపద్యముతో నారంభమయి, ప్రస్తుతము విజయవిలాసమునఁ జూడఁదగు నవతారిక పద్యములను గలిగియున్నట్లు తోఁచుచున్నది. ఏలయనిన,

“తమ్ములు విప్పునప్పుడు.........”
“మతముల్ పాటించి ....”
“శ్రీగౌరుల్ ....”
“ఆమూర్తమాంబ ....”
“రించె నేరాజు మేలు లేజి......”
“నఁగిరీటి యంతవా..........”
“టలనేర్పులా ....”
“దయజ మనుపురీశుల్ ....”
“యొద్ద నిథరాణుమ్మఖో ......”
“ఘోరారిగళరక్త ....”
“సింహాసనము మాట ....”
“కీర్త్యుదార్యధరితా ....”

అను పద్యభాగాత్మరము లటనట గానవచ్చుచున్నవి. ఇయ్యవి యెల్ల విజయవిలాసావతారిక పద్యములే యని చదువరు లెఱుంగుదురు. ఇంక, మధ్యంతమున భాగమునకాను లీతాళగ్రంథమున నొక్క నూతనపద్య భాగముఁ గానవయ్యెను.

“శ్రీకంఠున్ మునివంద్యునిన్ నిగమసం
సేవ్యునిన్ హరున్ శంకరున్
లోకాధీశుని భక్తవత్సలు దయా
శున్ రాజచూడామణిన్
భూకాంతాను......విమధరున్
భోగీంద్ర భూషాంచితున్
నాకేశప్రముఖామరార్చితును మా
నాథున్............

అభ్యుదయ పరంపరాభివృద్ధిగా వారచియింపం బూనిన
.........”

ఇందొక్క సందేహము. విజయవిలాసకావ్యముం బట్టి చూచిన రఘునాథరాజానకును గలికిని నిష్టదైవము శ్రీరాముఁడని తెలియును. అట్టులయ్యె ననవసరముగ నీమధ్యంతానంతరమున నీశివస్తుతికిఁ గారణమేమగును? ఇయ్యది చేమకూరవానిదా! కాక లేఖకుఁడగు నిష్ఠల లక్ష్మీపతి దయియుండువా? లేఖకునిదే యయినయెడల నీతఁడు తనపద్యరచనాసామర్థ్యముతో మఱియొక్క యాశ్వాసమును వ్రాసి యుండిమెచ్చియుండువా? అట్టుల యినఁ గథనెట్లు సాఁగించియుండును? ఈసందేహములను నివృత్తి చేసికొనుటకు మహావిఘ్నమును గల్గించునట్టులు నాకడనుండు గ్రంథమునందలి యీభాగము శిథిలాతిశిథిలముగ నున్నది. ముట్టినయంతఁ బొడియగునట్టి యవస్థనుండుటచే నట్టి సాహసమునకుఁ బూనఁజాలకున్నవాఁడను.

కావున నాంధ్రభాషాభిమానులకు నేను గరముల జోడించి యిట్టులు విజ్ఞాపన మొనర్చుచున్నాఁడను. “భాషాభిమానులారా! తమయొద్ద సారంగధర చరిత్రము చేమకూర వేంకటకవి కృతము నాలుగాశ్వాసములు గలదిగా నుండినఁ దత్క్షణము నాయం దనుగ్రహించి యావార్త నాకెఱుంగఁ జేయుఁడు. నాకట్టి గ్రంథము పరిశోధనార్థ మల్పకాలం బెరవొసంగు నభిప్రాయముండినఁ గృతజ్ఞతతో నందికొనెదను. అట్టులు నాయమూల్యగ్రం

థము నొసఁగఁ దలఁచనిపట్టున, నాకర్థానిరయునికి నీభారతీపత్రికావతంస ముఖంబున నెఱింగించిన నీనే తమచోటికివచ్చి గ్రంథమును జూచికొను నేర్పాటులఁ జేసికొనెదను. ఇట్టి సాహాయ్యము నాకొనర్చినందులకుఁ దామెవ్వరేని ప్రతిలాభమునుం బొందఁ నెంచిన నట్టి దానికినేను సంసిద్ధుఁడనయి యున్నాఁడను. నాయందనుకంపవహించి దీని కతి శీఘ్రకాలమునఁ బ్రత్యుత్తర మొసఁగిన, నాకడ సిద్ధముగనున్న మూఁడాశ్వాసముల సారంగధరవ్యాఖ్యానమునయినను ముద్రించు నేర్పాటుఁ జేసికొనెదను. కరుణింపఁ బ్రార్థింతురు."

ప్ర కృ తి మూ ర్తి

హా రి త కృ త ము

"సరసిజోద్గత మాధుకరయుగిఁ జేరంట మామతించెడు చలాపాంగదృష్టి
రక్తిఁ బల్లవ నికరమ్ము రమ్మనిజీరు నధరమ్ముపై మందహాసరుచులు
స్వర్ణదీవీచికాజాలమ్ము లాలించు నార్తలోకశరణ్య మమృతకరము
తీర్థయాత్రాఫలాప్తికి మూలకందమా నఖిలవిశ్వైకసింహాసనంబు
దేవి, నాకొక్కపరిఁ జూపి తెలివిఁ దెలిపి - పారలౌకికపథము నద్వైతసిద్ధి
నందఁజేయు" మటంచు నహర్నిశంబుఁ - బ్రకృతిమూర్తిని భాగ్యదేవత భజింతు.

*   *   *   *

జలధిఁ గ్రుంకిడి దులిపి కాషాయ మాలఁ - గట్టి, ప్రాతర్విధేయాహ్నికము ముగించి
ప్రకృతిశాస్త్రమ్ము సాధింపఁ బయనమయ్యెఁ - బ్రాచి విడి బాల భాస్కరబ్రహ్మచారి.

*   *   *   *

అర్థులకు నాదృతిఁజూపు నలమహీజ - రాజి విమలగృహస్థధర్మమ్ము నేర్పు
సర్వభూతస్వభావ సుస్వైరవిహృతి - నఖిలజీవాళి నేర్పు నభ్యాగతులకు
దివ్యశాంతిభావముఁ బ్రసాదించు నౌర! ప్రేమమహిమస్వరూపిణి విశ్వజనని.

*   *   *   *

సెలయేటియలల నుయ్యేలలూఁగి వీతెంచు నాలిపయ్యెరగాలి మేలితేట
కడుపాఱ నమ్మపా ల్గుడిచి, పచ్చికబీళ్లఁ దమి లేటిపిల్లల దుముకులాట
తలిరుజొంపముల సందిళులలో నరవిరి మొగ్గల దాగురుమూతలాట
చివురులమెసవి కచ్చెకుఁ దెచ్చికొనరు కోయిల మొనగాండ్ర మేల్కొలుపుబాట
పెండ్లినడకలరాయంచ పేరటాండ్రు - నరసి నీఁదునయ్యాట ముచ్చటలమూట
భోగ్య మాశ్రమసీమ సౌభాగ్యమిచట - వాస మొనరించుఁ బ్రకృతివిలాసలక్ష్మి.

లక్ష్మి

పారనంది జగన్నాథస్వామి గారు

(వెనుకటి సంచిక తరువాయి)

నాల్గో అంకము

రామస్వామి ఇల్లు

(1)

గవరమ్మ

(తలుపుతీసి) దద్దా, వచ్చా. అయ్యా నీకోసం గంటాయి చూస్తూ ఉన్నాడు.

గోపాలుడు

బాగా ఉన్నాడటే.

గవరమ్మ

ఏమి ఉండడము. లేచి తిరగలేడు గదా.

గోపాలుడు

ఏమి అన్యాయం. పశుచువాళ్ల లాగు ఆడడం, తిరగడం అంటే వాడికిఎంతో సరదా. పాపం మంచంమీద పరుండి ఉండడమంటే ఎంత బాధగా ఉందోగదా.

గవరమ్మ

ఏదో మెల్లిగా ఇంట్లో కర్ర పట్టుకొని ఇటూ అటూ తిరుగుతాడు.

గోపాలుడు

పద, చూదాము పద.

గవరమ్మ

తన బాధమాట ఎత్తడు. ఎప్పుడూ ఏదో ఒక ఆలోచనే.

గోపాలుడు

పశుచుపెళ్లాం సంగతి ఏలాగుంది.

గవరమ్మ

దివ్యంగా వెలుగుతూఉంది. అది ముద్దులు ఆడుతూ కబుర్లుచెప్పతూ ఉంటే అయ్య పరవశం అవుతూఉంటాడు.

గోపాలుడు

వాడికి కష్టంలోకూడా అదిఆలాగుసుఖపెట్టితే మనం సంతోషించ వలసిందే గదా.

గవరమ్మ

ఆఁ!

గోపాలుడు

అదంతా వేషమా ఏమిటి.

గవరమ్మ

అదంతా చెప్పితే—

గోపాలుడు

పోనీలే. పద. ఎందుకు రమ్మనమన్నాడో ఏమైనా తెలుసునా?

గవరమ్మ

స్పష్టంగా తెలియదు. బహుశా ఏదోఏర్పాటు చేస్తాడు కాబోలు.

[రామస్వామి గదిలోకి వెళ్లేరు. గోడవైపు ముఖంపెట్టి పడుకొన్నాడు. చప్పుడు విన్నా తిరగలేదు.]

గవరమ్మ

అయ్యా, దద్ద వచ్చాడు.

రామస్వామి

(తిరగకుండా) ఎవరూ?

గవరమ్మ

దద్ద. గోపాలుడు దద్ద.

[రామస్వామి తిరిగేడు. గోపాలుడు చూస్తూ ఆశ్చర్యపోయేడు. ఈ ఆరునెలల్లో అంత ముసలివాడై పోయాడు.]

రామస్వామి

వచ్చావ్; దా.

గోపాలుడు

నీరసంగా ఉందా.

రామస్వామి

నీరసమే ఏమిటి?

గోపాలుడు

తిరగగలుగుతున్నావు కదూ.

రామస్వామి

ఏం తిరగడం.

గవరమ్మ

అయ్యో, దద్ద ఉంటాడు. నేను తవిటమ్మయింటికి వెళ్లి ఇప్పుడే వస్తా.

(అని వెళ్లిపోయింది)

రామస్వామి

నాకు బాగాజ్ఞప్తి ఉన్నప్పుడే వ్యవహారం అంతా చక్కబెట్టి ఉంచుట మంచిదిగదా అని నీకు కబురు పంపేను.

గోపాలుడు

మక్క జారినంత మాత్రాన ఇంత తొందర ఎందుకు?

రామస్వామి

నీకు తెలియదు. ఇది మక్కజారడమే కాదు. గుండె జారిపోయింది.

గోపాలుడు

ఆ!

రామస్వామి

అవునా. కాబట్టే వీల్లువ్రాసి ఉంచుతా.

గోపాలుడు

ఎందుకు? వెంకటయ్య ఉన్నాడు కాడు.

రామస్వామి

నేను లక్ష్మిసంగతి చూస్తున్నా. దానిని పెళ్లాడి తెచ్చేను; ఏం సుఖపెట్టేను. నా తరువాత అన్నం బట్టకి దానికేమీ వెల్తిలేకుండా చేయడం నావిధికాదూ. దాని మాట తలచుకొంటే——

గోపాలుడు

సరే.

రామస్వామి

అందుకోసం భూమిలో సగం నావంతు దానికి వ్రాసిఇస్తా.

గోపాలుడు

పిల్లలకో. గవరమ్మగతి ఏమిటి?

రామస్వామి

వెంకటి బలమైనవాడు, మంచిపనివాడు. వాడి వంతువాడు బాగుచేసుకోగలడు. అది వాడికి చాలును. నాచరంలో సగం గవరమ్మకు ఇస్తా.

గోపాలుడు

మిగతాసగం.

రామస్వామి

చెప్తా.

గోపాలుడు

లక్ష్మి మారుమనువుకు వె ళ్తే.

రామస్వామి

అదేమిటి. అలాగు వెళ్లదు.

గోపాలుడు

చూడూ. అది చిన్నది. మంచికాలంలో ఉం ది. దానికితోడు ఆస్తా ఇస్తున్నాము. నీతరు వాత నీలాంటి చక్కనివాడు నీకంటె చాలా చిన్నవాడు ఒకడు దానిమీద కన్ను వెయ్యొ డా. అప్పుడు ఎవరు కాదనేది?

రామస్వామి

అలాగు చెయ్యదు నాలక్ష్మి. నేనంటే దాని కెంతో ప్రేమ.

గోపాలుడు

మరొక సంగతి నీవు ఆలోచించాలి. అందరూ కలిసి ఒక్కఇంట్లో ఉండడము జరగదు; జరి గినా మంచిదికాదు.

రామస్వామి

గారూ, వెంకటీ ఇద్దరికీ ఎప్పుడూ అన్యోన్యమే. లక్ష్మితో నేను చెప్తా మనస్సు నొవ్వకుండా ఉండేటట్లు వర్తించమని. లక్ష్మికీ వెంకటికీ పొత్తుకదా.

గోపాలుడు

వాళ్లిద్దరూ కనబడరు ఏరీ?

రామస్వామి

ఇంటి వ్యవహారం వాళ్లేకదా చూచేది. అందు కోసం పోతుల జోడా కొనమని ఆదివారం సంతకు పంపేను.

గోపాలుడు

పడుచువాళ్ల నిద్దరిని పెట్టి పంపేవా?

రామస్వామి

చూ సేవూ. వాళ్లిద్దరికీ ఎంత పొత్తు కుదురుతే అంత బాగుగా ఉంటుంది నాసంసారం. అంతే కాకుండా ఎల్లప్పుడూ నా మంచం దగ్గిరే కూర్చొని దాని సుఖమంతా నాకోసం ధార పోసేస్తూ ఉంది. ఒక్కమారు తిరిగివస్తే దానికి ప్రాణం వచ్చినట్లు అవుతుంది. దాని ఆనందం కూడా నాసుఖమేకదా.

గోపాలుడు

కాని వయస్సు మంచిది కాదు.

రామస్వామి

(లేవబోతూ) ఏమిటీ!

గోపాలుడు

వయస్సువల్ల వచ్చే ప్రమాదాలు ఆబుషులకే తప్పేవు కావు.

రామస్వామి

నీవు చెడ్డే ఆలోచిస్తావే.

గోపాలుడు

చెడ్డా! నీగురించిగాని, నీపెళ్లాంగురించి గాని నే నేమీ చెడ్డ అనలేదు.

రామస్వామి

అనలేదూ! నాపెళ్లాం సంగతి ఎరగవ్వూ, నా కొడుకు సంగతి ఎరగవ్వూ.

గోపాలుడు

ఎరుగుదును.

రామస్వామి

ఏమిటి ఎరుగుదువు. ఎరిగే అన్నావా? ఎరిగితే అదేదో చెప్పు. చెప్పవూ. ఎందుకు ఆపావు?.

గోపాలుడు

ఎందుకు ఆలాగవుతావు. ఎవ్వళ్ల గురించీ నే నేమీ చెడ్డగా తలంచలేదంటూ ఉంటే.

రామస్వామి

వాళ్ల మీద నాకు చాలానమ్మకము. తెలుసునా.

గోపాలుడు

తెలుసునోయి.

రామస్వామి

సంతకే కాదు; పోతులజోడా కొనడానికే కాదు; నిర్జనంగా ఉండే అడివిలోకి అయినా పంపుతాను. తెలుసునా.

గోపాలుడు

అబ్బా, నేరకపోయి అన్నాను.

రామస్వామి

వాళ్లంటే నీకు తెలియదు. ఏలాగు తెలుస్తుంది? నేను మళ్లా వెళ్లాడితే మీ కందరికీ హాస్యంకదూ. (తలఊపుస్తూ ఆదే కళ్లువిప్పి చూస్తూఉంటాడు.) నావంట్లో బాగాలేదు... వాళ్లింకా రాలేదేమి? వేళఅయిందే...తల తిరుగుతున్నాదే...వయస్సు మంచిది కాదని అన్నావు. ఏమన్నావు...

గోపాలుడు

నేను వెళ్తా. నేరకపోయి నోరు జారవచ్చాను.

రామస్వామి

(మంచముక్రిందనున్న కర్రతీసి పట్టుకొని) ఇంకా రాలేదురా! ఆ. (అని ఆ కర్రతో నేల మీద గట్టిగా కొట్టి) అబ్బా! (అని మంచం మీద పడిపోయేడు.)

[నిశ్శబ్దం]

గోపాలుడు

కొంచెం పడుకో. [అని వంటిమీద చేయి వేస్తే ఆ చెయ్యి తోసివేసి గోడవేపున్న కిటికీలోనుంచి అదే చూస్తూ ఉంటాడు. గోపాలుడు మెల్లిగా వెళ్లిపోతాడు.]

(2)

[రామస్వామి లేచి, కర్రమీద ఆనుకొంటూ మెల్లిగా గదిలోంచి నడవలోకి వస్తాడు. గవరమ్మ మిఠాయిపొట్లం తీసుకొని లోపలికి వస్తుంది. తూలిపోతున్న తండ్రిని రెక్కపట్టుకొని అక్కడున్న బల్లమంచంమీద కూర్చోపెట్టింది. ముఖముపై స్పష్టముగా కనబడుతున్న మనోవికారము చూస్తూ]

గవరమ్మ

అయ్యో, అయ్యో.

రామస్వామి

ఇంకా వేళ ఉందా.

గవరమ్మ

ఈలాగు లేచిపోతూఉంటే, గుండె నిలిచి ఏలాగుంటుంది. డాక్టరు కోపంబడడూ.

రామస్వామి

ఇంకా రాలేదేం?

గవరమ్మ

పద, గదిలోకి పద.

రామస్వామి

(వణుకుతో) ఇంకా ఏమిచేస్తూ ఉంటారు.

గవరమ్మ

నామాట వినవూ.

రామస్వామి

ప్రొద్దు ఉండగానే రమ్మనమన్నానే. ఆలాగే అన్నారు కారూ.

గవరమ్మ

అన్నప్రకారం చెయ్యాలనే అంటారా అన్ని మాటలూ అందరూ?

రామస్వామి

లక్ష్మి అలాంటిది కాదు. నీవూ అగోపాలుడూ నన్ను పిచ్చి ఎత్తించాలని కుట్ర చేశారా ఏమిటి?

గవరమ్మ

వస్తారు. పద; గదిలోకి పద.

రామస్వామి

(గుమ్మములోంచి చూస్తూ) ఏదీ, వస్తున్న జాడ కానరాదేమి?

గవరమ్మ

సంతలో ఏదో చూస్తూ,...

రామస్వామి

రాత్రి అయితేనే కాని రారంటావా.

గవరమ్మ

మబ్బులు వేస్తూ చల్లగా ఉంది; మెల్లగా నడుస్తూ, పోతులు తోలుకొంటూ వస్తూ ఉంటారు.

రామస్వామి

నీవు అబద్ధం ఆడుతున్నావు.

గవరమ్మ

సరేనులే పద.

[నిశ్శబ్దం]

రామస్వామి

మళ్లా చూడు, నాకళ్లు మసకగా ఉంది...ఏం, చూడవూ.

గవరమ్మ

చూస్తూ ఉన్నాను......పద. గదిలోకిపద.

రామస్వామి

తలుపువేసే. వాళ్లువచ్చినా తీయకు. తెలుసునా.

గవరమ్మ

నీవు ఈలాగు రావడం తప్పు.

రామస్వామి

నేను చేసినదంతా తప్పే.

గవరమ్మ

తప్పు ఎవరం చేయము? తప్పుచేయడం తప్పు గాదు. అది పట్టుకొని పదం పాడినట్లు ఊగులాడడం తప్పు. ప్రతీకప్పువల్ల ఒప్పు ఎక్కువ అవుతూ ఉంటుంది. పద.

రామస్వామి

మళ్లీ చూసి చెప్పు. వస్తున్నారేమో చూడు.

గవరమ్మ

ఆ. అదిగో వస్తున్నారు.

రామస్వామి

నాకు అగుపడలేదే.

గవరమ్మ

వాళ్ల నవ్వుతాలు నాకు వినబడుతున్నాయి.

రామస్వామి

నాకు వినబడవేమి?

గవరమ్మ

లేవనెత్తుదనా? లే

[రామస్వామి లేచి నిలబడలేక వణుకుతూ చతికిలబడ్డాడు]

ఇంతనీరసమైనావు ఏమి? నాడి ఎందుకు ఆలాగు కొట్టుకుంటున్నాది.

రామస్వామి

(అదేచూస్తూ) ఈమా రెప్పుడైనా ఎక్కడికైనా వెళ్లవలసివస్తే వాళ్లిద్దరూ కలిసి వెళ్ల కూడదు తెలిసిందా. ఏమంటావు?

గవరమ్మ

సరే. ఆలాగే.

రామస్వామి

ఏమంటావు. కావాలంటే నీవూ వెంకటీ కలిసి వెళ్లండి.

గవరమ్మ

నడవగలవా? లేకపోతే ఈమంచంమీద పక్క తెచ్చి వేతునా?

రామస్వామి

ఏమంటావు.

గవరమ్మ

ఎందుకు ఆలాగు వణుకుతున్నావు. ఈస్థితిలో వాళ్లు నిన్నుచూస్తే...నాకది ఇష్టములేదు

రామస్వామి

గారూ, వయస్సు మంచిదికాదట. నిజమే!... అబ్బా, చాలా ఆయాసంగా ఉంది. పరుండబెట్టే పద గదిలోకి కర్ర ఏది...అంతా అబద్ధంసుమా...నేనిక్కడికి వచ్చానని, వాళ్లకోసం చూస్తూ ఉంటినని వాళ్లకు తెలియకూడదు సుమా! తెలిసిందా. పద.

గవరమ్మ

బండీ చప్పుడు అదిగో. పద.

రామస్వామి

అయ్యో; నాకు కళ్లు చెవులు ఉన్నాయే. నేను గుడ్డివాడనుకానే. నాకు చెవుడూ లేదే. నేను ఉండగానే ఛా. నమ్మను. అంతా అబద్ధం. కుట్ర. ఒట్టి అసూయ; ఒట్టి ఓర్వలేనితనం. అంతే...కాదూ.

[గదిలో మంచంమీద పరుంటాడు. గవరమ్మ పైకి వచ్చివేస్తుంది. ఆమెమనస్సు పరిపరివిధాల కొట్టుకోపోతూ ఉంటుంది. ఆలాగే ఇంట్లోపనులు చూసుకొంటూ ఉంటుంది.]

(3)

[లక్ష్మిచేతిలో ఒక ఈత కాడలరంగులబుట్ట, ఆ బుట్టలో పొట్లాలు, ఎండబడ్డముఖం, పరధ్యానంగా ఉంటూ ప్రవేశిస్తుంది.]

లక్ష్మి

[తిన్నగా వెనక ఇంట్లోకి వచ్చి] గారూ... ఆలస్యమైందా.

గవరమ్మ

ఎందుకని?

లక్ష్మి

ఏదో అదీ ఇదీ చేస్తూ ఉంటే వేళ అయిపోయింది.

గవరమ్మ

ఊఁ!

లక్ష్మి

తోవలో వంతెన దిగుడులో బండీ ఇరుసుసీల పడిపోయిందని, దానికోసం వెతికి వెతికి, ఆఖరికి కొత్తదొకటి చెక్కి పెట్టి వచ్చాము.

గవరమ్మ

ఏమిటి కొన్నారు.

లక్ష్మి

మామకోసం ప్రత్యేకంగా లంక పొగాకు చుట్టలు కట్టించి తెచ్చాను. భద్రాద్రి రామదాసు పాటల చరిత్ర వచ్చింది; అదొకటి కొన్నాను.

గవరమ్మ

అవును, అయ్యకి ఇప్పుడు పదాలే కావాలి.

లక్ష్మి

చూదుగాని, నేనొక్క పదంపాడితే. నేనూ వెంకటీ పాడుకొంటూ వచ్చాము గదా. వెంకటి ఎంత బాగాపాడతాడు గదా, గారూ, నీవు పాడుదూ, అన్నీ మరచిపోతావు.

[అవి అన్నీ పట్టుకొని రామస్వామి గదిలోకి వెళ్లింది. బండీ, ఎడ్లు నౌఖరీవాడికి అప్పచెప్పి వెంకటి వచ్చాడు.]

వెంకటి

అక్కయ్యా, ఆలస్యమైందే.

గవరమ్మ

మీా ఇద్దరికీ ఆలస్యం ఏమిటి? ఏమి, బండీకి ఏమైనా అయిందా ఏమిటి?

వెంకటి

ఏమిటయింది?

గవరమ్మ

లక్ష్మి అందికదా.

వెంకటి

ఆ, ఏమంది.

గవరమ్మ

ఇరుసుసీల పడిపోయిందని చెప్పింది.

వెంకటి

అదా; సీలపడిపోతే వెతికేము; దొరికిందిగదా; తెచ్చిపెట్టేము.

గవరమ్మ

పాతదిపోతే కొత్తది చేయించామని లక్ష్మి చెప్పిందిగదా.

వెంకటి

లక్ష్మి ఏది?

గవరమ్మ

అయ్యదగ్గిరికి వెళ్లింది.

వెంకటి

ఏంతసేపైంది వెళ్లి? అయ్య కులాసాగా ఉన్నాడా?

లక్ష్మి

(ప్రవేశించి) గారూ, మధ్యాహ్నం ఏమైనా అయిందా ఏమిటీ.

గవరమ్మ

ఏమి?

లక్ష్మి

మునుపు ఎప్పుడూ ఈలాగు లేదే. ఎప్పుడు గది లోకి వెళ్లినా పక్కమీద కూర్చోమని, చేతులు, వీపు అన్నీ నిమిరి, నవ్వుతూ ఏవేవో కబుర్లు అడిగేవాడు...ఇప్పుడు ఒక్కమాటైనా లేదు; అడగలేదు సరేకదా, చుట్టలు ఇస్తే పుచ్చుకోలేదు; పుస్తకం చింపేశాడు. నావేపు ముఖమైనా తిప్పేడు కాడు. ఎందుచేతే ... చెప్పవూ.

గవరమ్మ

నేను ఏమిచెప్పేది...ఒకవేళ ఆలస్యమైందని...

లక్ష్మి

ఎంత ఆలస్యమైంది. దీనికా ఇంత గొడబ. కాదు; ఏదో ఉంది; చెప్పవూ.

వెంకటి

ఎంత ఆలస్యమైంది? సంతేమి దగ్గిరా. పని పూర్తికావద్దూ.

గవరమ్మ

మన కోగంట రోగికి ఒక యుగం కాదూ.

లక్ష్మి

అది కాదు. నేను సొమ్ము చేతికిస్తే పుచ్చుకో లేదు. నావైపు చూడనైనా చూడలేదు. చెయ్యివేస్తే విసిరేసేడు;ఏదోజరిగింది చెప్పవూ.

వెంకటి

ఎవరైనా వచ్చి వెళ్లేరా.

లక్ష్మి

నావల్ల తప్పు ఏదో చెప్పి, మరిన్నీ...

వెంకటి

పోనిత్తూ లక్ష్మి; రోగి, పిచ్చివాడు, ముసలి వాడు ఒకటి.

లక్ష్మి

మునుపు ఎప్పుడూ లేనిది ఇప్పు డెందుకు రావాలి.

వెంకటి

ఇన్నాళ్లు దాకా దాగి ఉందికాని లేదని కాదు.

లక్ష్మి

కాదు. వెంకటీ కాదు. ఏదో ఉంది.

వెంకటి

నేను వెళ్లి చూసివస్తా.

గవరమ్మ

లేపకుమీా. చాలా ఆయాసపడి ఉన్నాడు. వద్దు సుమా!

వెంకటి

నిద్రా. చూసివస్తా.

గవరమ్మ

మీారు రాలేదు గదా అని ఆగిఉన్నాను. కొన్నారి వాళ్ల ఇంటికి వెళ్లి రావాలి. ఇప్పుడే వస్తా. కొంచెం వంటపని చూస్తూ ఉండుమీా.
[గవరమ్మ వెళ్లింది. లక్ష్మి గోడను చేరబడి కూర్చొంది. వెంకటి చప్పున వచ్చేడు.]

వెంకటి

లక్ష్మి...

లక్ష్మి

చాలా బాధగా ఉంది. అయ్యకి అనుమానం వేసింది.

వెంకటి

ఎందుకని.

లక్ష్మి

నీతో తిరుగుతూఉన్నంత సేపూ ఆసుఖాన్ని ఏదో కదులుస్తూ ఉన్నట్లు గుండెలో అయేది. చెప్పాలని అనుకొన్నాను కాని నీసరదాకూడా తగ్గిపోతుందని ఊరుకొన్నాను.

వెంకటి

(ఆతురతతో) అదేమిటి లక్ష్మీ!

[నిశ్శబ్దం]

లక్ష్మి

నీవు ఇక్కడనుంచి వెళ్లిపోవాలి.

వెంకటి

ఆ! అదేమిటి?

లక్ష్మి

నాకూ, నీకూ, అయ్యకూ అందరికీ క్షేమం. నీవు వెళ్లకపోతే—మరొకమార్గం లేదు.

వెంకటి

(లక్ష్మి చేతులుపట్టుకొని) ముత్యాలపేరు తెంపివేసినట్లు సుఖమూలను తెంపేస్తున్నావా.

లక్ష్మి

(నిట్టూర్పువిడిచి) సుఖం అందరికీ ఉండాలంటే, కొందరం బాధపడక తప్పదు. ఈరోజు సుఖం పోగొట్టుకొంటే, ఆ తరువాత అంతా సుఖం ఉంటుంది.

వెంకటి

నాకు అర్థంకాలేదు.

లక్ష్మి

(ఉస్సుమంటూ) అర్థమూ కాలేదు. అబద్ధం. అర్థంకావడానికి ఏముంది. నీ మనస్సుకూ నా మనస్సుకూ తెలుసును. ఏలాగోకాని అయ్య మనస్సుకుకూడా తెలిసింది. గారు పోల్చింది. నీవు వెళ్లిపోవాలి. లేదా నేను—

వెంకటి

ఆగు. (రెండుచేతులతో లేవనెత్తి)

లక్ష్మి

మనస్సులో ఉన్న బాధ పొర్లిపొర్లి వస్తూ ఉంది. కాని చెప్తామంటే గొంతుకదాటి రాకుంది. మాటలకు ధైర్యంలేదుకాని చెవులలో స్పష్టంగా వినబడుతూ ఉంది. ఎప్పుడు చెప్పదామని మొండికెత్తినా, నీమూపులు జ్ఞప్తికి వచ్చి మొండికెత్తినగుండె కరిగి మెత్తనై పోయేది.

వెంకటి

లక్ష్మీ, ఏదీ ఒక్కముద్దు. మనము చేసిన దానిలో తప్పు ఏమీలేదే. సామెతలోని సవతితల్లి లోకంలో ప్రతీచోటా ఉండదు కదా.

లక్ష్మి

మన మిద్దరం సామెతలోలాగే ఉంటే, ఈ ఇంట్లో కలిసే ఉందుము కాబోలు. చూశావా; కొన్నిచోట్ల అనురాగంకంటె విరోధమే మేలు.

వెంకటి

వద్దు లక్ష్మీ; అబ్బ.

లక్ష్మి

(చెయ్యితీసుకొంటూ) నామాట వినవూ.

వెంకటి

నామనస్సు బాంకలేదు.

లక్ష్మి

నామనస్సా బాంకింది.

వెంకటి

ఏలాగు పొమ్మనగలిగేవే, లక్ష్మీ.

లక్ష్మి

ష్...ష్...ష్...

[నిశ్శబ్దం]

ఆవేళ గున్నమామిడిక్రింద నీకిచ్చిన ముద్దే ఈ ముప్పుకు ఆరంభం. మరిచెప్పలేను వెళ్లు. నీవు ఎక్కడున్నా నిన్ను...

వెంకటి

నేను పోలేను.

లక్ష్మి

(వెంకటి కాళ్లమీదపడి) నామాట వినవు.

వెంకటి

(లేవనెత్తుతూ) ఏదిముంచో చెప్పలేకున్నాను.

లక్ష్మి

(వెంకటిగడ్డంమీద చెయ్యివేసి) వెళ్లవూ.

వెంకటి

సరే. ఇదే ఆఖరిముద్దు. మరొకటి.

లక్ష్మి

వద్దు. (వెనుకకు తగ్గింది)

[వెంకటి చేతులు పట్టుకోబోతూఉంటే లక్ష్మి ఎదురుగుండా చూసింది. ముందరి నడవ వెనక గుమ్మంలో రామస్వామి కర్రమీద ఆనుకొని వణుకుతూ కనపడ్డాడు. అదేచూస్తూ ఉన్నాడు. నిశ్శబ్దం. ఒకరిముఖం ఒకరు అదే. చూసుకొన్నారు.]

వెంకటి

లక్ష్మీ, వెళ్తున్నా.

రామస్వామి

నేను వచ్చిందాకా అయినా ఆగలేరూ.

వెంకటి

అయ్యా,

రామస్వామి

నేను చావడానికి సిద్ధంగా ఉంటే—ఛీ, పాపీ! నాచెవులు, నాకళ్లు ఇంకాఎందుకుఉన్నాయో!

వెంకటి

చెప్పేది అంతా వింటే—

రామస్వామి

నాకే శక్తిఉంటే—(అని కర్రఎత్తబోయి, గజగజ వణికి, గోడమీద చేరబడి)

[నిశ్శబ్దం]

వెంకటి

నీవు చూసింది అబద్ధం. మాకుకూడా చేతనై ఉంటే, ఈసుడిలో పడకపోయి యుందుము. ప్రవాహంలోపడ్డ గడ్డిపరకవలె......

లక్ష్మి

అదే నిజం మామ.

వెంకటి

నీవు చూసింది మేము చేసింది పాపమేఅయితే ఇదేమొదటిది ఆఖరిదికూడా. లక్ష్మికోరిందినేను ఒప్పుకొన్నాను; ఇప్పుడే, నీవు రాకుండా ఉంటే

ఈపాటికే, నేను ఇల్లువిడిచి పోతున్నాను. మరి ప్రమాదంలేదు. ఇకలక్ష్మిని, నాలక్ష్మి నీవేఎరుగుదువుఆమాట, మరి చూడను గదా అనిబలవంతంగా ఒక్కముద్దు శాశ్వతముగా అదినిలిచి ఉంటుందని...

రామస్వామి

వెధవా. సిగ్గుమాలినపాపీ. ఫో.

వెంకటి

వెళ్తున్నాను. ఒక్కటే మాట. లక్ష్మివల్ల ఏమీా తప్పులేదు. ఇదివరకే దాని సుఖాన్ని నాశనం చేశావు. ఇకనైనా దాన్ని సుఖపెట్టు. లక్ష్మి!

[లక్ష్మి బుర్ర ఎత్తలేదు. లక్ష్మివేపే చూస్తూ వెళ్లిపోయేడు. నిశ్శబ్దం. వాడిపోయిన తీగవలె నిలుచుంది లక్ష్మి. నిలబడ్డ శవమువలె గోడను అంటిపెట్టుకొని నిలబడ్డాడు రామస్వామి.]

రామస్వామి

(లక్ష్మి ఎందుకో బుర్రఎత్తింది.) నిన్ను ఎప్పుడైనా ఒక్కమాటైనా ఆడి నొప్పించానా. నీకు కావలసినది లేదన్నానా?

లక్ష్మి

లేదు.

రామస్వామి

అయితే ఎందుకు ఆలాగు మారేవు.

[జవాబులేదు]

రామస్వామి

ఎందుకు...ఆలాగు...మారేవు...

[జవాబులేదు]

రామస్వామి

ఎందుకూ...ఆలాగూ...మారేవూ...

లక్ష్మి

నేనూ మారలేదు.

రామస్వామి

అబద్ధం.

లక్ష్మి

నీయందు ఉండేభావం మారలేదు. నమ్ము, మాను, నాకు తెలుసును.

రామస్వామి

ఆ!

లక్ష్మి

కలలో పడ్డాను. వలలో కొట్టుకొన్నాను. కల అయిపోయింది. వలలోంచి ఎగిరిపోయేను. ఆ సింహాద్రి అప్పన్నే సాక్ష్యం.

రామస్వామి

ఊః!

లక్ష్మి

నన్నేమి చేయకుమీా.

రామస్వామి

పొమ్మంటే వాడివెనకాతలే పోదామనా?

లక్ష్మి

వెళ్లేమాటే ఉంటే, నీవా, అడ్డేది?

రామస్వామి

ఇదా వయస్సు!

లక్ష్మి

అలాంటి చెడ్డదానిని కాను.

రామస్వామి

గదిలోకి పో.

లక్ష్మి

(నడుస్తూ) నిండురక్తం; చంపకుమీ.

రామస్వామి

ఇటుచూడు.

[లక్ష్మి తిరిగింది. అలాగేచూస్తూ నిలబడ్డాది] నీలాంటి సొగసైన గుండెలో అలాంటికుటిలం ఏలాగు ఇమిడి ఉందో అని ఆశ్చర్యపో తున్నాను.

లక్ష్మి

నీదయ. ఏమన్నాసరి. (అని కొంగుపట్టింది).

రామస్వామి

నడువు. నీచర్యవల్ల నాకు నా కుటుంబానికి ఈగ్రామంలోను, ఈలోకంలోను వెక్కిరింత గా ఉండకుండా ఉండేటట్లు నీవుతిరగాలి. నీవు ఈ ఇంట్లోనే ఉండాలి. విన్నావా. ఈగది లోనే...

లక్ష్మి

ఇన్నాళ్లూ ఇంత దయచూపిన నీకు చేతులు వస్తాయా?

రామస్వామి

అందుకేకదూ ఈబహుమతి.

లక్ష్మి

(కాళ్లమీదపడి) నావల్ల నిజంగా తప్పులేదు.

రామస్వామి

ఆహా! నిజం. తప్పు అంతా నాదే.

[లక్ష్మి వెళ్లిపోయి తలుపులు వేసుకొంది. రామస్వామి అక్కడనే చతికిలపడి, రెండు చేతుల్లో బుర్రపెట్టుకొని కూర్చొన్నాడు. గవరమ్మ వచ్చింది].

గవరమ్మ

ఏదో అయింది. కొంపమునిగింది. అయ్యా, అయ్యా, తమ్ముడేటు అలాగు వెళ్లిపో తున్నాడు. నీ వేమిటి ఇక్కడ ఈలాగు ఉన్నావు.

రామస్వామి

వాడు మనవాడు కాడు.

గవరమ్మ

అయ్యా. ఒక్కతమ్ముడు అయ్య!

రామస్వామి

నీవల్లే.

గవరమ్మ

నావల్లా!

రామస్వామి

ఊహూ! తెలిసి చెప్పేవు కావు.

గవరమ్మ

ఆహా! మొదటేచెప్పేను. అయ్య! లక్ష్మి!

రామస్వామి

గది చూపించాడు.

గవరమ్మ

దీపం తెస్తాను.

రామస్వామి

చీకటేఅంతటా. చీకటిలోనే ఉంటా. మేఘాలు వర్షంలేకుండా, నల్లగా ఆకాశమంతా కారు కమ్మి ఉన్నాయి.

హార్మొజాను

మద్దిపట్ల వేంకటరమణయ్య గారు

పారశీకరాజ్య భద్రాసనంబుకై-మూఁడవసరి రేఁగుపోరు ముఁగిసె;
సాటిలేని కడిమి శత్రుల నుఱుమాడి-విజయ మొందె యవను భీకరాసి—
తమ్ము నెదిరించి కడు విక్రమమ్ము సూపి-ఓడిపోయి పట్టువడిన వాఁడి మగనిఁ
బారశీకుని హార్మొజాన్ పేరివాని-శిరము నఱకంగఁ దెచ్చిరి తురక భటులు—

"ఊరకే చచ్చిపోవుచు నుంటి దప్పి-గ్రుక్కెఁడుదకంబు నాకుఁ ద్రాగుటకు నిచ్చి
అవల మీ యిచ్చ వచ్చినయట్లు చేయుఁ"-డనుచు హార్మొజా నెల్గెత్తి యడిగె వారి—.

కేలనూనియుఁ దెలిసీటిగిండి తాను-నోటి కెత్తక నిల్చె నవ్వాట ఖైది
విచ్చుకత్తులతోఁ దన వెనుక ముందు-నిలుచు భటపాళిఁగాంచి సందేహమంది—

"పెదవి తడుపకుంటి వెఱపేదియో చెప్పు-పొడుతు రనియె దొంగపోటు నిన్ను?
పిఱికికండ లేనివీరుఁ డెన్నఁడు నట్టి-పాడుపనికిఁ బాలుపడఁడు చూవె.

ఆఁపినాము శిక్ష నాగిండిలో నీరు-త్రావుదనుక నీకుఁ జావులేదు;
పాపుకొనుము దప్పి భయ మేమియును లేక"-యనుచు తేఁడు ఖైది కభయ మిచ్చె—

ఆక్షణంబ గిండి యవనిపై దొరలంగ-జాఱ విడిచి హార్మొజాను పల్కె—
"దీనిలోని నీర మానువెన్కను గదా-నాకుఁ జావనిత్తిరి నయముమీఱ—.

పంపువెట్టుఁ డిపుడు భటసికాయంబున-కిలను నోలుకుసలిల మెత్త"నంచు;
చిటికసేపు విభుఁడు చేష్టలుడిగియుండె-ఊయలట్లు డెందమూఁగులాడె—

పిదప నుడివె సాహేబు గంభీరముగను-"కాను సాహసికుండ! నీవనినయట్లు
ఆడి తిరుగ రెన్నఁడుగాని యవనిపతులు-పాలనము సేయఁబడుఁగాక ప్రభువు మాట—

త్రాగి చావు మంటినిఁ మున్ను దానినీరు,-త్రాగియిప్పుడు స్వేచ్ఛగా బ్రదుకు మింక"
ననుచు వే ఱొక్కగిండితోఁ డను జలమ్ము- ఖైది కిప్పించెఁ గారుణ్య కలితుఁ డగుచు—

(అనువాదము)

[హిందీ మాధురీ పత్రికనుండి]

౧

సుమారు రెండుశతాబ్దములు గడచిపోయినను చింతాదేవి పేరు మాయలేదు. బుందేలఖండమునం దొక గతుకునేల నిక్షేపించి మంగళవారమునాఁడు వేలవేలు స్త్రీపురుషులు చింతాదేవిని బూజింప వచ్చుచుందురు. నాఁడా ప్రదేశము గ్రామ్యగీతముల మారుమ్రోగుచుండును. గట్టులు, గుట్టలు రమణీమణుల రంగురంగుల వస్త్రములచే రంజిల్లుచుండును. దేవియాలయ మొక యెత్తైన గుట్టపై నున్నది. దానికలశముపై కాషాయపు జెండా చాలదూరమున కగపడుచుండును. గుడి చాల చిన్నది. ఇద్దఱు ముగ్గురు మాత్రమే పట్టుదురు. లోపల విగ్రహ మేమియు లేదు. ఒక చిన్న వేదికమాత్ర మున్నది. క్రిందనుండి యాలయమునకు రాతిమెట్లున్నవి. సమ్మర్దమున జనులు క్రిందఁ బడకుండుటకై యిరుప్రక్కల రాతిగోడ కలదు. ఇక్కడనే చింతాదేవి సతియయ్యెను. లోకాచారము ననుసరించి యామె తనభర్త కళేబరముతోఁ జితి యెక్కలేదు. తనభర్త చేతులు జోడించుకొని యెదుట నిలిచియుండెను. ఆమె యతనివంకఁ గన్నెత్తి చూడనైన లేదు. ఆమె తనపతి శరీరముతోఁగాక ఆతని యాత్మతో సతియయ్యెను.

౨

యమునాతీరమున 'కాలపి' ఒక చిన్ననగరము. చింతాదేవి ఆనగరమందలి యొక బుందేలవీరుని కూఁతురు. చిన్నతనముననే తల్లి స్వర్గస్థురాలగుటచే తండ్రియే యామెను పెంచవలసివచ్చెను. అది యుద్ధసమయము. యోధులకు నిద్రాహారములుకూడ సులభములవి కావనే. చింతాదేవి బాల్యమును దండుతో సమరక్షేత్రముననే గడచెను. తండ్రి యామె నొకగుహాయందో చెట్టుచాటుననో దాఁచి, యుద్ధరంగమున కేఁగుచుండును. చింతాదేవి నిశ్శంకముగఁ గూరుచుండి మట్టితో దుర్గములు నిర్మించుచు, చెడఁగొట్టుచుండును. బొమ్మరిండ్లే యాకోటలు. ఆమెబొమ్మలాటకు వస్త్రము లక్కఱలేదు. సైనికులను వేషధారులఁజేసి యామె యుద్ధరంగమున నిల్పుచుండెను. ఒక్కొకప్పు డామెతండ్రి సంధ్యాసమయమైనను తిరిగి రాఁడు. కాని భయము చింతయేమి చెంతఁజేరదు. ఆమె విజనస్థలమున అన్నపానములు లేక రాత్రియంతయు నట్లే కూరుచుండును. యుంగెరులయు, నక్కలయుఁ గేకలామె చెవిసోఁకుచున్న భయముండలేదు. వీరవరుల ఆత్మార్పణకథనములు, అదియును యోధాగ్రేసరుల ముఖముననే వినిన యామె యాదర్శవాదిని యాయెను. ఒకసారి మూఁడుదినములవఱకు చింతాదేవికి దనతండ్రి వార్త తెలియలేదు. ఆమె యొకకొండగుహాయందుఁ గూరుచుండి మనముననే యొవ్విధమునను శత్రుభేద్యముగాని దుర్గమొండు నిర్మించుకొనుచుండెను. పగలెల్ల నామె యాదుర్గస్వరూపమును ధ్యానించును; రాత్రి యాదుర్గమునే కలఁగాంచును. మూఁడవనాఁటి సాయంతనము ఆమె జనకుని సహచరులు కొందఱు వచ్చి యామెయెదుట నిలుచుకొనిరి. "నాన్నగారేరీ? మీరందఱేడ్చుచున్నారేమి?" యని చింతాదేవి యాశ్చర్యముతో నడిగెను.

ఎవ్వరును సమాధానము చెప్పరైరి. అందఱు గుండె బాదుకొని యేడ్చుచుండిరి. చింతాదేవి తనతండ్రి వీరస్వర్గ మలంకరించెనని తెలిసికొనెను. ఆపదుమూఁడేండ్ల బాలిక కండ్లనుండి ఒక్కనీటిబొట్టయిన రాలలేదు. ముఖ మేమాత్రము వికలత గాంచలేదు. ఒక్కనిట్టూర్పైన వెలువడలేదు. ఆమె నవ్వి యిట్లనెను:— "వారు వీరగతి నొందిన మీరు విలపింతురేల? వీరవరుల కింతకంటె గొప్ప మరణ మేముండును? వారివీరత్వమున కింతకన్న గొప్ప బహుమాన మేమి లభింపఁగలదు? ఈసమయము, విచారింపఁదగినది కాదు. సంతోషింపఁదగినది.

ఒకయోధుఁడు చింతిల్లుచు నిట్లు పలికెను:— "నీవిప్పు డెక్కడ నుందువు? ఇదియే మాచింత." అని.

చింతాదేవి గంభీరముగ నిట్లనెను:—"దీనికై మీరు చింతింపవలదు. నేను నా తండ్రికిఁ దగిన కూఁతురను! వారు గావించినదే నేనును గావించెదను. మాతృదేశమును బగవారిచేతినుండి విడిపించుకార్యమున వారు ప్రాణములర్పించిరి. నా యెదుట నున్న దిక్కూడ నదియే యాచరణము. పోయి మీభటులను సన్నద్ధులఁ గావించుకొనుఁడు. వారికై యొకగుర్రమును, ఆయుధములను సిద్ధపఱుపుఁడు. ఈశ్వరకటాక్షమున్నచో, నెల్లరకు నేనగ్రగామినినై యుండఁగలను. నేనొకవేళ వెనుకంజవేయుట మీకన్నులఁబడినచో నొక్కకత్తిప్రేటుతో బరిమార్పుఁడు. ఇదియే మీకు నావిన్నపము. చనుఁడిఁక నాలస్యము వలదు."

చింతాదేవి వీరవచనముల విని 'యీ సుకుమారకుమారి తనసంకల్పమున దృఢచిత్తురాలై యుండఁగలదా' యని యోధులు సందియ మందిరి.

3

ఐదువత్సరములు గడచెను. చింతాదేవి కీర్తి దశదిశల వ్యాపించిపోయెను. పగతుర పదపాటవము పెల్లగిలిపోయెను. ఆమె [illegible]గు విజయమూర్తిగ నుండెను. గుండ్లకును, తూపులకును నెదుట నామె నిర్భయముగ నిలుచుండుటఁ జూచి యుద్ధభటు లుత్తేజితు లగుచుండిరి. ఆమె చూచుచుండ వారెట్లు వెనుకంజవేయఁగలరు? కోమలాంగియగు జవ్వని ముందునకు సాగుచుండ నేపురుషుని పాదములు వెనుకాడఁజూచును? సుందరీమణుల సమక్షమున యోధుల విక్రమ మజేయమగును. కాంతామణివచనములు వీరుల కాత్మోత్సర్జన గుప్తసందేశములు. ఆమె ముఖచర్య యొండు భీరువులందైనఁ బౌరుషమును బ్రవహింపఁజేయును. చింతాదేవి యశస్సు జనులు నల్గడలనుండి విక్రమశాలులగు వీరుల నాకర్షించి సేనను గైసేసెను. ప్రాణముల లెక్కగొనని యోధపుంగవులు నలుదెసలనుండి యేతెంచి యీ కుసుమమున విహరింపఁ దొడఁగెను.

ఈవీరులలో రత్నసింహుఁ డనురాజపుత్రయువకుఁ డొకఁడు.

చింతాదేవికై సైనికు లెల్లరు కృపాణధనులు; మాటకై ప్రాణము లర్పించువారు; ఆమె సంకేతమాత్రమున నగ్గిలో దుముకువారు; ఆమె యానతి యైనచో నాకసమందలి చుక్కలకైన నొక్కమారుగ నేలఁ గూల్ప సిద్ధపడువారు. అందు రత్నసింహుఁ డందఱిని మించియుండెను. చింతాదేవియు లోలోన నతనిఁ బ్రేమించుచుండెను. రత్నసింహుఁడు తక్కినయోధులవలె శూరుఁడు, వాచాటుఁడు, గర్వితుఁడును గాఁడు. తక్కినవారు తమతమ ఘనతలను నిరర్గళముగ నుగ్గడించుకొనువారు; వారియాత్మస్తుతి కద్దులేదు. వా రేమొనర్చినను చింతాదేవికిఁ బ్రదర్శించుటకే. వారిలక్ష్యము కర్తవ్యము గాదు, చింతాదేవి. కాని రత్నసింహుని వర్తనమాత్రము ప్రశాంతముగ నుండెను. ఆత్మస్తుతి లేదు సరికదా, తాను యథార్థముగ నొకసింహమును దునిమివచ్చినను, దానిప్రసంగమైన నెత్తఁడు. అతని వినయశీలత సంకోచసీమ నతిక్రమించిపోయెను. ఇతరుల ప్రేమయంతయు విలాసముండెను. రత్నసింహుని ప్రేమ తపస్త్యాగముల విలసిల్లుచుండెను; తక్కినవారు హాయిగ నిదురించుచుండ, రత్నసింహుఁడు చుక్కల లెక్కపెట్టుచు, రాత్రి పుచ్చుచుండును. ప్రతియోధుఁడును 'చింతాదేవి నాకే లభించును; రత్నసింహుని కాశ యడుగంటినది; కావుననే యతని కెవ్వరితోడను రాగద్వేషములు లేవు,' అని భావించుచుండును. చింతాదేవియెదుట వారెల్లరుఁ బలుకు చిలుకపలుకులఁ జూచి వారివాక్చాతుర్యమునకు రత్నసింహుఁ డచ్చెరువందుచుండును. అతని నిరాశాంధకార మంతకంతకు పేరుకొనిపోవుచుండెను. ఒక్కొకపుడతఁడు స్త్రీమనోరంజకములగు గుణముల నీశ్వరుఁడు తనకేల ప్రసాదింప లేదని వగచుచుండును. అతని మనోవ్యథ యెవ్వరి కెఱుక? అతఁడు లోలోననే వేసారి యూరకుండును. ఆడంబర మాతనిచేతఁ గాదాయె.

సగము రాత్రి దాఁటిపోయెను చింతాదేవి తనశిబిరమున నిదురించుచుండెను. దుర్లభమగు జయముఁబడసిన వెనుక నింత భుజించి సైనికులు మైమఱచి పడియుండిరి. ఎదుట నొక దట్టమగు నరణ్యముండెను. అరణ్యమున కవ్వలి తట్టున శత్రుదళ మొకటి విడిసియుండెను. చింతాదేవి వారి రాక నెఱిఁగి పరుగుపరుగున నచ్చటికి వచ్చి, యుదయ

మున వారిపై దండెత్త నిశ్చయించుకొని యుండెను. తన రాక శత్రువులకుఁ దెలియదని యామె నమ్మిక. కాని పొరపడినది. ఆమె సైన్యములో నొకఁడు శత్రువులతోఁ జేరి, యిక్కడివార్త లక్కడ కెప్పటికప్పు డందించుచుండెను. ఇఁకఁ జింతాదేవిచింత బాపుకొందమని వారొకకుట్రఁ బన్నిరి. ఆమెను జాటుగ హత్యసేయుటకై ముగ్గురు భటులు బయలుదేఱిరి. ముగ్గురును ఘాతుకమృగములవలె నడుగునప్పుడు గాకుండ నరణ్యము దాఁటి వచ్చి, చెట్లమాటున నక్కి చింతాదేవిశిబిర మేదియాయని యోజించుచు నిల్చిరి. సైన్యమంతయు గాఢనిద్రాపరవశమై యుండెను. వారికిఁ దమకార్యసిద్ధియందు సుంతయు శంక లేకపోయెను. చెట్లమాటు వెలువడి వారు ముగ్వురును మొసళ్లవలెఁ బ్రాఁకుచు చింతాదేవిశిబిరముదెసకు సాగిరి

సేనయంతయు నొడలెఱుఁగక నిద్రించుచుండెను; పహరా సిపాయిలు మిక్కిలి డస్సియుండుటచే నిదుర కొఱగిరి. ఒక్కవ్యక్తిమాత్రము శిబిరమువెనుక చలిచే ముడిఁగి కూర్చుండియుండెను. అతఁడు రత్నసింహుఁడు. అతనికి నేఁడిది క్రొత్త గాదు. దాదులయం దాతనిరాత్రు లిట్లే, చింతాదేవి శిబిరమువెనుకఁ గూరుచుండుటయందే కడచిపోవుచుండును. దుర్మార్గులయలికిడి విని యతఁడు చటాలునఁ గత్తి దీసి నిలిచెను. చూచుసరికి ముగ్గురుమనుష్యులు వంగివంగి నడచుచు వచ్చుచుండిరి. ఇపు డేమి చేయఁదగును? అఱచినచో సైన్యమున నలజడిపుట్టి అంధకారమున నొకరినొకరు నఱుకుకొని చత్తురు. ఒంటరిగ ముగ్వురితోఁ బోరుటకా ప్రాణభయము. ఆలోచించుటకు వ్యవధి లేదు. శీఘ్రకాలమున నెదిరిగఱువ పడంపఁ గల సామర్థ్య మాతనికిఁ గలదు; కావున వెంటనే కత్తి దూసి యతఁ డామువ్వురపైఁ బడెను. కొన్నినిముసములు ఖడ్గములు తాండవించెను. పిదప నంతయు సద్దణఁగెను. అటు వారు మువ్వురు నిహతులై పడిపోయిరి; ఇటు రత్నసింహుఁడును గాయములు తిని స్మృతి తప్పి పడి యుండెను.

ఉదయమున చింతాదేవి ఆ నలుగురియవస్థల నాస్థితియందుఁ గాంచెను. గుండె గుభేలుమనెను. చెంతకుఁబోయి చూడ ముగ్గురుఘాతుకులును మరణించియుండిరి; రత్నసింహునకుమాత్ర మూపిరి యాడుచుండెను. జరిగినదంతయు గోచరించెను. నారీత్వము వీరత్వముపై విజయము నొందెను. తండ్రి మరణించినపు డొక్క బొట్టుబిందువైన రాలని యామెకండ్లనుండి యశ్రువుల జడివాన గురిసెను. రత్నసింహునిశిరము తనతొడపై నిడికొని, హృదయమందిరమున రచించిన స్వయంవర మండపమున నామె యాతనికంఠమున జయమాల వైచెను.

౪

ఒక్కనెలపాటు రత్నసింహునికండ్లు విడలేదు; చింతాదేవికండ్లు మూఁతపడలేదు. చింతాదేవి ఒకక్షణమైన నతని విడిచిపోవుటలేదు. తన వ్యాపారముపై దృష్టిలేదు; శత్రువులు పైఁ బడుదురేమో యను చింత లేదు. తన సకలైశ్వర్యములు నామె రత్నసింహునికై బలిదాన మొసంగెను. నెల గడచినపిదప రత్నసింహుని కన్ను విడెను. చూచుసరికిఁ దాను మంచముపైఁ బడి యుండుటయు, నెదుట చింతాదేవి విసనకఱ్ఱఁ జేకొని నిలిచియుండుటయు నతనికిఁ గానవచ్చెను. నీరసమగు కంఠస్వరముతో నతఁ డిట్లనెను —

"చింతా, విసనకఱ్ఱ యిటు లే; నీకు శ్రమ—"

చింతాదేవి హృదయ మిపుడు అఖండస్వర్గసుఖము ననుభవింపసాగెను. ఒకనెల క్రిందట నెవనివిశీర్ణశరీరమునకుఁ దలపై పువుఁ గూరుచుండి యామె నైరాశ్యమున విలపించుచుండెనో, ఆతఁడు నేఁడు మాటాడుటఁజూడ నామె సంతోషమునకు మేరలేకపోయెను. ఆమె స్నేహార్ద్రస్వరమున నిట్లనెను:—

"ప్రాణనాథా! ఇది శ్రమయైనచో నిఁక సుఖమేది?"

'ప్రాణనాథా' యనుసంబోధనమున విలక్షణమగు సమ్మోహనశక్తి యున్నది. రత్నసింహునికన్నులు తళుక్కు మనెను; జీర్ణముఖ ప్రదీప్తమైపోయెను; ఒక నూతనజీవనము రక్తనాళములఁ బ్రవహింపఁ జొచ్చెను. ఆజీవన మెంత యుజ్జ్వలము! అం దెంతయుత్సాహము, ఎంత మాధుర్యము, ఎంతకులుకు, ఎంతజాలి నిండియుం

డెను! రత్నసింహుని ప్రత్యంగము పదర జొచ్చెను. అపారపరాక్రమ మాతని భుజముల నావహించినట్లయ్యెను. జగన్నాయకత్వము దాల్చుటకును, ఎగసి వినువీథి నందుకొనుటకును, ఉద్దండపర్వతముల భేదించివైచుటకును అతనికి సామర్థ్య మొదవిన ట్లయ్యెను. తన కోర్కె లన్నియు నీడేరిన ట్లతనికిఁ బరమసంతృప్తి యొకక్షణకాలము గలిగెను. ఆక్షణమున పరమశివుఁడే వచ్చి యెట్టయెదుట నిలిచినను, నాతఁడు చూచి, వర మేమియుఁ గోరక, మొగముఁ ద్రిప్పి యూరకుండి యుండును. ఎట్టిసంపదయైనను, ఏవస్తువైనను ఇప్పు డతనికి గుంతయుఁ గాంక్ష లేదు. లోకమునఁ దన్ను మించిన సుఖియు, భాగ్యశాలియు నుండఁడని యతనికి గర్వ మొదవసాగెను.

చింతాదేవి యింకను దనమాట ముగింప లేదు; ఆ ప్రసంగమునందే యిట్లనెను:—"కాని, నిక్కముగ నావలన మీ కెంతయో బాధపడవలసివచ్చినది!"

రత్నసింహుఁడు లేవ యత్నించుచు నిట్లనెను:— "తపము లేనిదే సిద్ధి చేకూరదు."

చింతాదేవి యతనిని దన కృశహస్తములతోఁ బరుండఁబెట్టుచు నిట్లనెను:—"ఈసిద్ధికై మీరు తపము సేయలేదు; అసత్య మేల యాడెదరు? మీరు కేవల మొకయబలను గాపాడితిరి. నాస్థానమున వేఱొకస్త్రీ యుండినను మీ రిట్లే ప్రాణమొడ్డి రక్షించియుందురు; నా కానమ్మిక యున్నది.—మీతో నిజము చెప్పుచున్నాను. నేనాజన్మాంతము బ్రహ్మచారిణినై యుండెదనని ప్రతిన గైకొనియుంటిని; కాని మీయాలోకమే త్వర్గము నాప్రతిజ్ఞను విఱిచివైచినది. నేను వీరులకొలువులలోఁ జెరిగినదానను; ఏపురుషపుంగవుఁడు తనప్రాణములతోఁ జోరఁగల్గునో యాతనిచరణములనే నాహృదయకుసుమ మర్పింతును. రసికుల హాసవిలాసములకును, లంపటుల రూపరేఖలకును, మల్లుల కుస్తీపేచీలకును నా దృష్టియం దింతయు విలువ లేదు. వారియభినయవిద్య నొకవినోదముగాఁ గాంచుచుందును. మీహృదయమునందే నేను సత్యమగు నాత్మార్పణము గాంచి, దాని నయి పోతిని,—నేటినుండియే కాదు, చాలదినములనుండి."

౫

మొట్టమొదటి ప్రణయరాత్రి. నిటఁ జూచిన నిశ్శబ్దము. ప్రేమికుల లితవురిహృదయములందును గోర్కెలు తరఁగలు వేయుచుండెను. నలుదెసలఁ జెలిమికలుముల వెన్నెల చిమ్మికొనిచుండెను. దాని నగువెలుంగుల యందు వధూవరులు ప్రణయాలాపము లాడుకొను చుండిరి.

అప్పుడే వార్త వచ్చెను శత్రుదళ మొకటి దుర్గము దెసకు విజృంభించి వచ్చుచున్నదని. చింతాదేవి ఉలికిపడెను; రత్నసింహుఁడు నిశ్చేష్టుఁడై నిలిచిపోయెను. పిదప నతఁడు మేకున వ్రేలాడుచున్న ఖడ్గము నందుకొనెను.

చింతాదేవి కాతరదృష్టితో నతనివంకఁ జూచి "కొంచలు మనుష్యులఁ బంపుఁడు డనటికి;మీరు పోనేల?" యనెను.

రత్నసింహుఁడు తుపాకి బుజానఁ బెట్టికొనుచు నిట్లనెను:—

"ఈసారి పెక్కుమంది వత్తురేమో యని శంకించుచున్నాను."

చింతా:—అట్లయిన నేనుగూడ వచ్చెదను."

రత్న:—"వలదు. వారు నిలువఁజాలరని నాకు స్థైర్యమున్నది. ఒక్కఘాటితో వారి నెత్తిపాఱద్రైచెదను. మనప్రణయరాత్రివిజయరాత్రియగుట పరమేశ్వరుని యిచ్ఛ."

చింతా:—"ఏమోకాని, మనసు కలతఁజెందుచున్నది. పోనిచ్చుటకు ప్రాణ మొప్పుట లేదు."

రత్నసింహుఁ డీకోమల మగు ప్రేమానురోధమునఁ గరగిపోయి, చింతాదేవిని గౌఁగిలించుకొని "ఉదయమునకుసరికి మఱలివచ్చెదను ప్రియా!" అనెను.

చింతాదేవి మగని కంఠమున బాహువు లిడి, కన్నుల నీరు నిండ, నిట్లనెను:—"మీరు చాలదినములకుఁగాని రారని భయమగుచున్నది. నామనస్సంతయు

మీమీఁద నుండును—నుండు—అనుదినము వార్తమాత్ర మంపుచుండవలయును సుండీ!— ఒకటి: మిమ్ము బతిమాలెదను, అవసరము కనిపట్టియె దాడి సలుపుచుండుఁడు. శత్రువులఁ జూచుటతోడనే మైనుబడి మీఁదఁబడుట మీకలవాటు. అవసర మెఱిఁగి వర్తింపుఁడని మాత్రమే నే వేఁడునది దయసేయుఁడు; ఎల్లెగుచున్నారో అల్లే తిరిగిరండు!"

చింతాదేవిహృదయము భయవిహ్వల మగుచుండెను. అందుఁ దొల్లి విజయకాంక్షమాత్రమే యధివసించుచుండెడిది; నేఁ డందు భోగలాలస ప్రధానత వహించెను. సింగమువలె గర్జించి శత్రుహృదయముల గడగడ వడఁకించినట్టి యా వీరబాల నేఁ డెంత దుర్బల యయ్యెను. రత్నసింహుఁడు గుఱ్ఱ మెక్కునరికి ఆమె యతని క్షేమమునకై లోలోన దేవికి మ్రొక్కుకొనఁదొడఁగెను. దూరమున చెట్లయం దతఁడు మఱుఁగుపడువఱకు నామె యతనిఁ జూచుచుండి, పిదప దుర్గమండలి బురుజులన్నిటిలోఁ బెద్దదాని నెక్కి— గంటలకొలఁది అల్లే ఆదెసనుఁ దేఱిచూచుచు నుండిపోయెను. అక్కడ నేమియు లేదు; పర్వతము లప్పుడే రత్నసింహుని దాచినట్టి వవి. చింతాదేవికి మాత్ర మాతఁ డెదురుగాఁ బోవుచున్నట్లే తోఁచుచుండెను.

ఉషఃకాలపు టరుణకాంతి చెట్లలోనుండి తొంగి చూడ మొదలిడెను: ఇప్పటికి చింతాదేవి మోహవిస్మృతి వదలెను; అంతయు శూన్యమని తెలిసెను. ఏడ్చుచు బురుజు దిగి సెజ్జపై మొగము కప్పుకొని యామె రోదనము మొదలిడెను.

౬

రత్నసింహునితో వచ్చుచుండినవారు నుండిరో, లేకో కాని ఉన్నవారందఱు నుత్సాహభరితులు; ఎట్టిసమయమైన, ఎంత యెదుర్కొనిన సరకు సేయనివారు; తమప్రాణములకు శత్రువులు. ఉల్లాసభరితులై వారొక వీరరసపూరితమగు గీతమును బాడుకొనుచు స్వారిచేయుచుండిరి.

వీరవేషము వేసినారలు
గౌరవము నిలుపుఁడు సిపాయిలు!
వైరమును మదిఁ బదనుపెట్టుఁడు
వ్యర్థములు శస్త్రాస్త్రముల్.

ఈవీరనాదములతోఁ బర్వతములు ప్రతిధ్వనించిపోయెను. అశ్వముల పదఘట్టనములు తాళము వేసెను. రాత్రిగడచిపోయెను. సూర్యుఁడు తనయరుణనేత్రములఁ దెఱచి యావీరులపైఁ దనస్వర్ణకాంతి వర్షింపఁదొడఁగెను.

సూర్యప్రకాశమున దగ్గఱనే యొకకొండపై శత్రుశిబిరము కానవచ్చెను.

రత్నసింహుఁడు తలవంచెను; విరహవ్యాకులమగు హృదయము నడచికొనెను; మందగతిని బోవుచుండెను. అశ్వము ముందునకు సాగుచుండెను. కాని మనసు వెనుకకు లాగుచుండెను. పుట్టిన యిన్నాళ్ళకు చెడుతలంపు లతనికి వెలుపుగొలుపసాగెను. యుద్ధమునఁ బర్యవసాన మేమగునో, యెవరు చెప్పఁగలరు? తాను విడిచివచ్చిన ఆ యమేయస్వర్గసౌఖ్యస్మృతులు ఉండియుండి యతని మనమును పిండివైచుచుండెను. చింతాదేవి సజలనయనములు జ్ఞప్తికి వచ్చి, గుఱ్ఱమును వెనుకకు మరల్తునా యనుకోర్కె పుట్టుచుండెను. సమరోత్సాహ మంతకంతకు తఱిఁగిపోవుచుండెను. అప్పు డొకసిపాయి సమీపించి యిట్లనెను:—

"ఆర్యా! చూడుఁ డాకొండపై శత్రువులు విడిసియున్నారు. ఇపుడు మీయభిప్రాయ మేమి? తత్క్షణము దండెత్తుటయే మాకోరిక. నిదురించుచున్నారు. కావున వెంటనే పాఱిపోవుదురు. జాగుచేసినచో వారును సన్నద్ధు లగుదురు; పనము చెడిపోవును. వేయిమందికి తక్కువ యుండరు."

రత్నసింహుఁడు చింతాక్రాంతుఁడై శత్రుశిబిరము వంక చూచి, "సరే, బాగున్నది." అనెను.

సిపాయి:— "దండెత్తుటయే యందురా?"

రత్న:— "మీ యిష్టము. పోలమంది యున్నారు; ఇది యాలోచింపుఁడు."

సిపాయి:— "భయము లేదు. ఇంతకంటె గొప్ప సేనల గెలిచినవారము."

రత్న:— "నిజమే; కాని—తొందరపడి అగ్నిలో దుముకుట మంచిదికాదు."

సిపాయి:— "ఏమంటిరి! యోధులజీవనమే అగ్నిలో దుముకుటకు. మీయాజ్ఞ ఇడవు; ఆపై మామగఁటిమి చూతురుగాని!"

రత్న:— "చాల బడలియున్నాము. కొంచెము సేపు విశ్రమించిన బాగుండును."

సిపాయి:— "వలదు; మనజాడ తెలిసినచో వారింక దారిఁ బట్టుదురు."

రత్న:— "అట్లయిన దాడియే సలుపుఁడు."

ఒక్కక్షణములో యోధులు గుఱ్ఱముల దౌడాయించి, ఈఁటెల సవరించికొని, శత్రువశముపైఁ బడఁ జేఁగిరి. కాని కొండ యెక్కుసరికి శత్రుసేన అప్రమత్తమై యున్నదని వీరికి విదితమయ్యెను. వీరితలంచే ప్రమాదము శత్రువులు మేల్కని యుండుటే కాక దుర్గముపై దాడివెడలుటకు సన్నద్ధు లగుచుండిరి. వారెదురుగ వచ్చుచుండుట గాంచుసరికి తప్పు తెలిసినది; కాని యిఁక నప్పు డెదుర్కొనక వేఱుపాయము లేకుండెను. రత్నసింహుని విషయమున నెవ్వరికిని సంశయము లేకుండెను. ఇంతకన్న విషమతరతరుణములందు సయితము తనపరాక్రమాతిశయముచే జయలక్ష్మిని జూఱకొన్న రత్నసింహుఁడు నేఁడు తనలక్షణము చూపకుండునా? నేత్రములన్నియు రత్నసింహుని వెదకసాగెను; కాని యెక్కడ నతనిజాడ లేదు. ఎక్కడఁ బోయెనో యెవ్వరికిని దెలియదు.

'అతఁ డెచ్చటికిఁ బోఁగలఁడు? తనసహచరుల నీయవస్థయందు విడిచి యతఁ డెచ్చటికిఁ బోఁగలఁడు? అసంభవము. తప్పక యిచ్చటనే యున్నాఁడు. జయోపాయము లాలోచించుచున్నాఁడు.'

క్షణములో శత్రువు లెదురుపడిరి. అంతసేన యెదుట ఈకొలఁదిమంది యేమి చేయఁగలరు? అందఱును రత్నసింహునిఁ బిలుచుటయే: 'ఎక్కడ కేఁగితివి? నా కేమియానతి? వారప్పుడే వచ్చిపడిరి; నీ వింక నూరకుండు వేల? మాకు మార్గముఁ జూపుము! మాయుత్సాహము పెంపొందింపుము;' అని

ఇప్పటికిని రత్నసింహుఁ డగపడలేదు. తుదకు శత్రువులు మీఁదను వచ్చిరి. యుద్ధ మారంభమాయెను. బుందేలులు ప్రాణము లఱచేతఁ బట్టికొని పోర మొదలిడిరి. ఒక్కని కొక్కఁడే భారమైయుండ, నొక్కఁడు పదిమందితోఁ బోరు టెక్కడ? అది యుద్ధము గాదు, ప్రాణముల జూదము. బుందేలులకు నిరాశ ప్రబలిపోయెను; వారు కసిగా పోరాడిరి; వెనుకంజ వేయలేదు. వారిలో నిఁక కుంతిర్గైనను సమ్మేళనము లేకపోయెను. ఎవ్వరిమట్టునకువారు సాధ్యమయినంత ముందునకుఁ బోవుచుండిరి. పర్యవసాన మేమగునని యెవ్వరికిని చింతలేదు. ఒకఁడు శత్రుపఙ్క్తులఁ జీల్చుకొనుచు సేనాపతి వంక కరిగెను. వేఱొకఁ డతని యేనుఁగుపై నెక్కఁబోవుచు వ్రేటుదిని కూలెను. వారి యసాధారణ సాహసమునకు శత్రువులుగూడ 'ఔరా' యనుచుండిరి.

ఆవీరులు కీర్తి గడించిరికాని జయము గడింపలేదు. ఒక్క గంటలో రంగస్థలమున తెర జారెను. విషాదము సమాప్తమయ్యెను. పెద్దతుపాను వచ్చినది, వృక్షములను శకలించుకొనుచుఁ బోయినది. సమ్మేళన ముండినచో ఈకొలఁదిమందియే శత్రువుల నురుమాడుటకు చాలియుందురు. కాని సమ్మేళన సూత్రధారుఁడు జాడలేఁడయ్యెను.

జయించిన మఱాఠులు ప్రతిశవమును శ్రద్ధతోఁ జూచిరి. రత్నసింహుఁడనిన, వారికి గన్నెఱ్ఱ. వారిగుఱి యంతయును వానిమీఁదనే యుండెను. రత్నసింహుఁడు బ్రదికియుండ, వారికి నిద్రపట్టదు. వారు సర్వలోపలము లన్నియు గాలించిచూచిరి. కాని రత్న ప్రాప్తి కాలేదు. జయము చిక్కినది. కాని యసమగ్రము.

౨

చింతాదేవి హృదయమున నేఁ, డేమో కాని, విశేషసంచలనము లుప్పతిల్లసాగెను. ఆమె యెన్నఁడు

నింత దుర్బల కాలేదు. బుందేలుల కపజయమేల కలుగునో యామె కారణము చెప్పఁజాలదు కాని, ఆభావము మాత్ర మామె వికల మానసమును పీడదారెను. ప్రేమానుభవమున కామెకు లేశ యుండినచో, చిన్నతనముననే తల్లి మరణించునా! తండ్రితో నడవులన్నియుఁ దిరుగవలసి వచ్చునా! గుహాలయందును లోయలయందును వసింప వలసివచ్చునా! ఆశైశవము మాత్ర మెంత కాలము:— తండ్రియు నామెను దిగవిడిచి పోయెను. అప్పటి నుండియు నొక్కదినమైన నామె సుఖముగఁ గూర్చుండలేదు.

ఆమె దుర్బల హృదయమున నిపు డొక విచిత్ర భావ ముప్పతిల్లెను. పరమేశ్వరుఁ డామె మనోహరుని సురక్షితముగ నిలు చేర్చినచో, నాతనిఁ గొంపోయి యే దేశోక దూరగ్రామమున బసచేసి, పతిదేవుని యారాధనమున జీవనము సార్థక మొనరించుకొన నెంచెను; ఈ యుద్ధమునకు స్వస్తి చెప్పనెంచెను. నారీభావ మామె యందు నేఁడే జాగృత మయ్యెను.

సంధ్యాకాల మాయెను. సూర్యుఁ డొక పరాజిత యోధునివలెఁ దలవంచి యే దేశోక మాటుకొనుటకు వెడలుచుండెను. రిక్త హస్తములతోడను, శూన్య పాదములతోడను నిరాయుధుండగు యోధుఁ డొకఁ డామె యెదుటికి వచ్చి నిలిచెను. చింతాదేవికి పిడుగు పడినట్లయ్యెను. ఒక క్షణమట్లే కూర్చుండెను. పిదప లేచి, వ్యగ్రుఁడగు సిపాయి యొద్దకు వచ్చి ఆత్రముతో:

"ఎవరెవరు మిగిలిరి?" అని యడిగెను.

"ఎవ్వరును మిగుల లేదు." అని సిపాయి చెప్పెను.

"ఎవ్వరును మిగుల లేదు! ఎవ్వరును మిగుల లేదు!!"

చింత తలపట్టుకొని నేలపైఁ గూలఁబడెను. సైనికుఁడు మరల నిట్లనెను:— "మరాఠులు సమీపించినారు."

"సమీపించినారా!!"

"మిక్కిలి సమీపించినారు!"

"అయిన త్వరగా చితి పేర్పుఁడు! వ్యవధి లేదు"

"ఇంకను మేమున్నాము గదా, వారి ప్రాణములఁ దీయుటకు!"

"అది మీ యిష్టము. నా కర్తవ్యమునకు కిదే సమాప్తి."

"దుర్గము మూసి తెలుతరబడి పోరాడఁ గలము మేము!"

"అట్లయిన పోయి పోరాడుఁడు. నేనెవ్వరితోడను పోరాడ నక్కర లేదు.

ఒక దెసనుండి యంధకారము వెలుఁగును ద్రొక్కుకొనుచు వచ్చుచుండెను. వేరొక దెసనుండి మరాఠులం తరంగాయితములగు చేలను ద్రొక్కుకొనుచు వచ్చుచుండిరి. దుర్గమున చితి సిద్ధమగుచుండెను. దీపములతోపాటు చితియు వెలిఁగెను. సమస్తాలంకారములు సింగారించుకొని చింతాసతి అసాధారణ శోభల వెదజల్లుచు ప్రసన్న వదనముతో, అగ్నిమార్గమున పతిలోక యాత్ర సలుపుటకై పోవుచుండెను.

౮

చితి చుట్టును స్త్రీపురుషు లెల్లరు కూడిరి. శత్రువులు దుర్గము చుట్టుముట్టినను, ఎవ్వరికి నాగోడవ లేదు. దుఃఖ పరితాపములచే నెల్లరి ముఖములు వ్యాకులతతో నవనతములై యుండెను. నిన్న నీ యంగణముననే కళ్యాణ మండపము నేయఁబడెను. ఇప్పుడు చితి పేర్చిన చోటనే నిన్నను హోమకుండ ముండెను. నిన్నమువలె నిట్లే యగ్ని శిఖ లెగయుచుండెను. ఇట్లే జనులు గుమిగూడి యుండిరి. కాని నేఁటి దృశ్యమునకును నిన్నటి దృశ్యమునకును నెంత యంతరమున్నది! ఔను, స్థూల నేత్రముల కంతరము గన్పడును; కాని వాస్తవమున నిది ఆ యజ్ఞమునకే పూర్ణాహుతి; ఆ ప్రతిజ్ఞకే నిర్వహణము.

గుఱ్ఱపు డెక్కల చప్పుడు వినవచ్చెను; దాన నెవ్వఁడో యొక సిపాయి వేగముగ స్వారిచేయుచు వచ్చుచుండుట తెలియ వచ్చెను. క్షణములో ధ్వని విరమించెను. ఒక సైనికుఁడు పరుగు పరుగున నంగణము

లోనికి వచ్చెను. అందఱు నాశ్చర్యమునఁ జూచిరి.— అతఁడు రత్నసింహుఁడు!

రత్న సింహుఁడు చితి కడకుఁ బోయి నవ్వు కొనుచు నిట్లనెను.

"ప్రియా! నేనింకను బ్రదికియే యున్నాను! ఇదేమి పని!"

చితి యప్పుడే మెండుగ మండెను! చింతాదేవి చెలువారు ఫాల్గునసమ జ్వాల వెడలుచుండెను. రత్నసింహుఁ డుత్కృష్టుని వలెఁ జితిలోనికిఁ జొరఁబోయెను; చింతాదేవి చేయిపట్టుకొని లేవఁ దీయఁ బోయెను. అందఱు నన్ని వైపులనుండి చితిలోని కాష్ఠములు లాగివేయ మొదలిడిరి. చింతాదేవి మాత్రము పతివైపు కన్నెత్తి చూడనైన లేదు. తప్పుకొమ్మని చేతితో సంజ్ఞ చేసెను.

రత్నసింహుఁడు నెత్తిమొత్తుకొని యిట్లనెను:— "హా ప్రియా! ఇది యేమి? నావైపు చూడవేమి? నేను జీవించి యున్నాను!"

"నీ పేరు రత్నసింహుఁడే. కాని నీవు నా రత్నసింహుఁడవు కావు" అని చితిలోనుండి ధ్వనివచ్చెను.

"నావైపు చూడుము; నీదాసుఁడను, నీయుపాసకుఁడను, నీపతిని నేనే సుమా!"

"నాపతిని వీరస్వర్గము నొందినాఁడు."

ఆహా? ఎట్లు నన్నుఁ జెప్పెను! ఓమహాజనులారా, ఇట్లయిన నగ్ని నార్పుఁడు. ప్రియా, నేనే రత్నసింహుఁడను! గుర్తించుట లేదా?"

అగ్ని జ్వాల చింతాదేవి ముఖమున కంట నెక్కి వచ్చెను. అగ్నియందుఁ గలువలు వికసించెను! చింతాదేవి స్పష్టముగ నిట్లు చెప్పెను:—

"బాగుగ గుర్తించుచున్నాను; నీవు నారత్నసింహుఁడవు కావు. నారత్నసింహుఁడు వాస్తవిక వీరుఁడు! తుచ్ఛదేహము రక్షించుకొనుటకై యిట్లు క్షత్రియ ధర్మమును బరిత్యజింపఁడు, ఏపురుషునికి నేను దరిఁజేరినదాన నైతినో యాతఁడు దేవలోకమున భాసిల్లుచున్నాఁడు! రత్నసింహుని యపకీర్తి పాలు సేయకుము. ఆతఁడు వీరరాజపుత్రుఁడు; రణక్షేత్రమునుండి పాఱిపోవు భీరుఁడు కాఁడు."

తుదిమాట ముగియుటతోడనే యగ్ని శిఖ చింతా శిఖ నధిష్ఠించెను. ఆ నిరుపమ సౌందర్యరాశి, ఆ ఆదర్శ వీరత్వము నుపాసించు సతీమణి క్షణములో నగ్నిరాశియందు లీనమై పోయెను.

హతబుద్ధియై రత్నసింహుఁ డీదుఃఖమయ దృశ్యము నీక్షించుచు నూరక నిలిచిపోయెను. పిదప, నొక పెద్ద నిట్టూర్పు పుచ్చి, హఠాత్తుగ నా చితి యందే దుమికెను.

[అనువాదకుఁడు: కొంపెల్ల జనార్దనరావు]

విభీషణుఁడు

కలువలపల్లి రంగనాథ శాస్త్రిగారు

వననిధి దాటి రాఘవుఁడు వానరసైన్యముతోడ లంకఁ జో-
చ్చినవిధ మానుపూర్విగను శీఘ్రము చారులు విన్నవింప నె
మ్మనము గలంగి రావణుఁడు మంత్రులఁ గన్గొని సంగరాంగణం
బున రిపుగెల్వ నోపువెరవు న్వచియింపుఁ డటంచుఁ బల్కినన్.

వెడఁగులగు మంత్రు లరినోర్వ వెరవులోలిఁ-దమకుఁదోఁచినగతి బహుధావచింప
వారివారించి పల్క నవ్వారిగాఁగ-విమలగుణభూషణుండు విభీషణుండు.
"ఓయీ, సోదర, దానవ-నాయక, రావణుఁడ, నమ్మినాఁడు హితోక్తుల్
న్యాయపథంబును విడువక-శ్రేయస్కా-ముండవగుచుఁ, జెవిఁజొన్పుతగన్.

కనకమృగంబుఁబట్టు తమకంబున రాముఁడు చాలదవ్వుగాఁ
జనుటయు నాగుణాకరుని జాడఁ గనంగ సుమిత్రపట్టియున్
వెనుకొనిపోవఁజూచి తఱివేచి, దశానన, మాయజోగివై
వనరెడుసీతఁ బల్మిఁ గొనివచ్చితి వియ్యది శూరధర్మమే.

నీతిఁ దొఱంగి యిట్లు రజనీచరనాయక, సాధ్వియైన యా
సీతను బ్రముచ్చిలించితి విసీ, రణభీముఁడు రాముఁ డల్లదే
కోఁతులఁ గొండ్రముచ్చు లెలుఁగుల్ బలుసేనగ సేకరించి నీ
చేతిబలంబుమాపి తనచేవను జూపఁగవచ్చెఁ జూడుమా!

చేవ యొసంగఁగన్ సమరసీమ నెదుర్పఁగలేక నెమ్మదిం
గేవలమర్త్యుఁగాఁ దలఁచి కీడులుపల్కుచు రామభద్రునిన్
రావణ, కండకావరమునన్ జనకాత్మజ దొంగవోలె, మా
యావిధిఁ దెచ్చియుం గటకటా! వగపొంద వికేమి చెప్పెదున్.

పావనియైన జానకిని బల్మిని బట్టఁగఁ జూచుపట్టునన్
లావరి పోటుకాఁడు నగు లక్ష్మణుఁడచ్చట నుండెనేని, నీ
చేవయు గీవయున్ సరకుసేయునె, ప్రాణముతోడ వత్తువే
రావణ, వేయునేటికిఁక రాముని మ్రోలను నిల్వనేర్తువే.

వీరమ్మన్యుఁడ, నిన్నుఁ బోనిసచివుల్ వేనోళ్లఁ గొండాడఁగన్
వీరాలాపము లాడెదేమిటికి నీబీరంబు తోరంబుగన్

ఘోరం బెద్దయుఁ జూపి శత్రువితతిం బోకార్చుకున్నన్ మహో
ధీరుల్ మెత్తురె, హాస్యభాజనముగాదే యిద్ది యూహింపఁగన్.

మానవమాత్రుఁ డీతఁడని మాటికి మాటికి నీసడించుచున్
వీని నెదిర్చి గెల్చుటొకవింతయె యంచుఁ దలంచి నైజ దు
ర్మానము పేర్మి, మూర్ఖులగు రక్కసులెల్ల నుతింపఁ జూపె దో
దానవనాథ, రావణ, హితంబగు పల్కు వినంగఁ జెల్లదే.

జడమతివౌచు నుద్ధతిని సత్యపరాక్రముఁడైన రాముని౦
బొడిచెదనంచు వెల్వడెదు పోరికి నాయితమౌచు, నయ్యయో,
పుడమిని దుష్టులం దునుమఁ బుట్టిన విష్ణుఁడు గాని వాసికై
పడఁగలపాట్ల కగ్గమగు పార్థివమాత్రుఁడుగాఁడు రావణా!

వానరుఁ డొక్కరుం డిటకువచ్చి, యశోకవనంబుఁ గూల్చి దు
ర్మాన బలాఢ్యులైన బలురక్కసులం బొరిమాల్చి, యంత లం
కానగరంబుఁ గాల్చి, జనకప్రభునందనతోఁ బ్రసంగమున్
జానుగ సల్పి పోయె రఘునాథుని గెల్వఁగ నీకు శక్యమే.

నలువకు మన్మఁడయ్యు నిజనాశన కాలము డగ్గఱం గడుం
జెలఁగి మదాన్వితుండగుచుఁ జేసిన చేఁతకు సానుతాపుఁడై
తలఁకు వహింపఁడంచు సతతంబును సజ్జను లేవగింపఁ గాఁ
దలఁగని నిందపాలయితి, తప్పనె, నీతలవ్రాఁతె రావణా!

వాయువు మేఘబృందములఁ బాఱఁగఁ దోలెడుమాడ్కి నీవు బ
ల్మాయల రూపుమాపి తన లావును బీరముఁ జూపుచున్ మహో
సాయక జాలముల్ వఱపి సర్వనిశాట సమన్వితంబుగన్
మాయలమారివైన నిను మార్కొని రాముఁడు గీటడంచెడున్.

తలఁపఁగ రాదు లాఁతివనితం గదియన్ మదినైన, వారలన్
బలిమినిబట్టు కూళలకుఁ బాటిలు నారకబాధ లెన్నఁగాఁ
దలమె, సమస్తధర్మముల దారులెఱింగిన నీకు నింతగాఁ
దెలుపఁగనేల నీ తెలివితేటలు మాసెనె దానవాధిపా!

బ్రదుకఁ దలంచితేని విను రావణ, రాఘవు నాశ్రయింపు మీ
పొదలును, సర్వభద్రములుఁ బొల్పెసలారును, రాజ్యలక్ష్మియున్
సుదతు లనుంగు బిడ్డలును సోదరు లాప్తులు మంత్రులుం బదిం
బదిగ సుఖంబుఁగాంచి కడువర్ధిలఁ జాలుదు రెల్లకాలమున్.

అనఘాత్ముం డగు రామభద్రునకు నిల్లాలైన వైదేహి న
ప్పనఁగావించి తదీయపాదకమలద్వంద్వంబుపై వ్రాలి, ప
మ్మిన దైన్యంబున వేఁడినన్ మనుచుఁ జుమ్మీ తప్పులన్ సైచిన
మ్మినవారిన్ విడనాడ కా విభుఁడు నెమ్మిం జేకొనున్ రావణా!

గాటపుటుక్కు మేటి విలుకాఁడగు రాముఁడు వాఁడిములుకులన్
సూటిగ నీదుమేనఁ గడుసోకఁగ నేసిన నొచ్చి కుందుచున్
సాటివచింపరాని బలుశౌర్యము నచ్చిననాఁడుగాక, నా
మాటలు నమ్మదే దురభిమానభరంబున, నేఁడురావణా!

నమ్మ, మదీయపథ్యవచనమ్ము, మహీసుత వెంటఁగొంచు రా
రమ్ము, రఘూద్వహుండయిన రామునిపాలికి, నిన్నుఁగాచు, లే
లెమ్ము, శ్రితాపరాధముల లెక్కగొనండు, దయాకరుండు శ్రే
యమ్ము, లభించుసుమ్ము, వినయమ్మును జూపెదవేని రావణా!"

తమ్ముఁ డనేకరీతుల హితమ్మువచింప భరింపరానికో
పమ్మున, రావణుండు సచివప్రకరంబువినంగ, సుంతయున్
సమ్మతిలేమిఁ దెల్పుచు మనంబుఁ గలంగ, నిరాకరించుచున్
నెమ్మిఁదొలంగి గర్వమున, నిక్కుచు నాతనిఁజూచి యిట్లనున్.

తమ్ముఁడవయ్యు దాయల ప్రతాపము లారక సన్నుతించి, భా
వమ్ముఁ గలంచి వారిఁగొలువం బురిగొల్పెదు, నన్ను నంతదై
న్యమ్ము వహింపనేమిటికి నా కరిషడ్వముఁ బూను నీదుచం
దమ్ము నెఱింగి, యింక నిను దగ్గఱఁజేర్పనఁ గీడుమూడదే.

ఇమ్ముగఁ దొంటిచందమున, నిచ్చట నీవు వసింపరాదు, పో
పొమ్ము, దురాత్ముఁడా యనుచు, బుద్ధిఁ దోచినభంగి, నల్క, రే
ద్రిమ్మరిఱేఁడు పల్క నలదీనశరణ్యుఁడు రాముఁగొల్వ మో
దమ్మున నేఁగె, మంత్రులును దాను విభీషణుఁ డాక్షణమ్మునన్

పలువతనమ్మునన్ సుపథవర్తనమున్ విడనాడి మంచిచె
డ్డలుదెలియంగఁ బ్రాజ్ఞనికటంబున కేఁగు తలంపు లేక వి
చ్చలవిడి నిచ్చలున్ మెలఁగఁ జాగుజడాశయులైన మోఘలకుల్
చలము దొలంగి నమ్రులయి సాధుహితోక్తుల నాలకింతురే.

లోకమున అన్నము లేకపోవుచో ఒక లోపమని ఒప్పుకొందును వస్త్రము లేకపోవుచో ఒకలోపమని అంగీకరింతును ధనము లేకపోవుచో ఒకలోపమని సమ్మతమే. మగఁడు లేకపోవుటకూడ ఒకలోపమని ఇయ్యకొందును గాని పిల్లలు లేకపోవుట ఒకలోపమా? మేనక పిల్లలు లేకపోవుట• ఒకలోపముగా భావించుకొనును. ఇంతియకాక పైఁగా గునుపు ఎవరిమీఁద ఈగునుపు?

ఇది నిక్కముగా లోపమేనా? అని ఎన్నాళ్లు ఆలోచించినను. నాకు తెగలేదు. పిల్లలులేకపోవుట ఒక లోపమా? అనియు పిల్లలు కలుగుట ఒకలోపపూరణమా? అనియు నేను తరిచి తరిచి అడుగుచో మేనక రెండు కనులతోను చూచి ఊరకుండెడిది. ఈ విషయమును 'ఇంకా' వారినీవీరినీ అడుగవలెనని నాకు ఉండెడిది

'బ్రహ్మానందం' నాకెంత స్నేహితుఁడో అతనిభార్య వెంకమ్మకూడ నాకు అంత స్నేహితురాలు. ఆమె చదువుకొన్నది. అందుచే ఆమెను 'వెంకయ్య' అని —ఁడువా రందఱు లోలోపల అనుకొందురు. ఆమెను 'వెంకయ్య' అని పిలుచువారిలోఁగల ఉత్తమగుణాలు వెంకమ్మకడ లేవు. పురుషులు రాఁగానే లేచి జనానాలోకి పరుగెత్తి తొంగితొంగి చూడదు.

ఆమె నిర్భయముగాచూచును. నిర్భయముగా మాటాడును. ఆమె లోపల లొటారము పైకి బొటారము కాదు. లోపల ఎంతో బయటికిని అంతే. బయటికి ఎంతో లోపలా అంతే.

ఒకనాఁడు నేను అడిగినాను—'వేం! పిల్లలులేకపోవుట కూడ ఒకలోప మని అనిపించునా? అనిపించె నేని అది యెటువంటి లోపము?' అని

వేం అన్నది—'ఈకూడ' స్త్రీజాతి-జాతికీ మానభంగము. నిజముగా నీమీఁద 'డిఫర్మేషన్' చార్జి తీసికొనిరావచ్చును.మగవాండ్రే జడ్జీలుగా ఉన్న ఈకోర్టులలో న్యాయము కలుగుట కష్టము కాఁబట్టి ఆమాట అటులుండనీ! నేను ఒకసంగతి అడిగెదను. దానికి సమాధానము చెప్పు. భార్య లేకపోవుట పురుషునికి లోపమేనా?'

'ఈసంగతి నాకు బొత్తుగా అనుచితము. నాకు పదవయేట పెండ్లిచేసిరి. నాకు పదియేనవయేటనే మేనకను పంపిరి. లోఁగడ నాకు అది లోపమని తెలియదు.' అని నేను లోలోపల తలపోయుచు రెండు గ్రుడ్లు అప్పగించి కూర్చున్నాను.

'ఏమిటీ మాటలాడవు? అవును. నీకు ఆలోపము తెలియదు. నీవు ఆఁడుదానవై ఉన్నపుడు నిన్ను మగవానిని చేసిరి. సరి కాని

మావారి నడుగుదో 'తూచా'లతో తెలియును. మావారికి ముప్పదియేండ్లు వచ్చినదనుక వివాహము కాలేదు. ఆయనకుఁ గల మూఁడువేల రుపాయల ఆస్తినిఁ అమ్మి తుదకు నన్ను చేసికొన్నారు. ఇది నేను చెప్పుచో లెస్స కాదు. వారిముఖమున వినవలయును. సరి. అప్పటినుండియే నన్ను తనయింటికి పంపమని మానాయనకు జాబులు. ఎందుల కా వ్రాఁత? ఇఁక నేను పెద్దదాన నైనతరువాతి సంగతి ఆయనయే చెప్పవలయును. 'ఇటులు వెంకమ్మ అనుచుండఁగా బ్రహ్మానందం ముసిముసినవ్వులతో గదిలోనుండి వీథిలోనికి ఒక కేఁక పెట్టినాఁడు. వెంకమ్మ వెంటనే—'మీాసంగతియే. ఇటు దయచేయుఁడు 'ఇటు దయచేయుఁడు' అని అనుచుండఁగనే అతఁడు అంతర్ధానము చేసెను. 'ఆయన ఆదారినే కోర్టుకు పోఁయి ఆఁడువారిమీాఁద డిఫమేషన్ తెచ్చునటులున్నారు. జడ్జీలు మీాపక్షీయులేగా' అన్నది వేం.

నాకును కష్టముగానే ఉన్నది. ఇపుడు బ్రహ్మానందంమీాఁద నాకు సానుభూతి కలిగినది. నేను బ్రహ్మానందమును తీసికొని వత్తునని మిషపెట్టి వెళ్లిపోవుదు ననుకొంటినిగాని వెంటనే వేం—'పర్వతాలూ! పిల్లలు లేకపోవుట లోపమా? అను ఈప్రశ్న—అది లోపమగుచో ఎటువంటి లోపము? అను ఈప్రశ్న—నన్నడుగుటకు వచ్చితివి! ఆఁగు ఆఁగు! అక్కడనే ఉండు!' అనుచు లోపలికివెళ్లి (అప్పుడే దొడ్డిదారిని అక్కడికి మేనక వచ్చినదేమో అనుకొన్నాను) మేనక చేయిపట్టుకొని నాయెదుటికి తీసికొనివచ్చి 'ఇదిగో ఈమె నడుగు!' అని అన్నది.

మేనక నాప్రశ్నకు కన్నులతోనిరీక్షించుచున్నది. దీనివలన ఇపుడే వచ్చినదనుట విస్పష్టమయినది. నాకు కొంచెము ధైర్యమువచ్చినది. పిల్లలు లేకపోవుట లోపమే కాబోలునని నేననుకొని లోఁగడనే తెలిసికొనకపోవుట, విశేషించి నాయంత నేను దెలిసికొనక పోవుట ఇవి యన్నియు నాలోపముగానే భావించి, వేం నామీాఁది ఉత్తరీయమును లాఁగికొనుచున్నను బయటఁబడి ఇంటికిఁజేరి ఎంత వేగముగా వచ్చితినో గుండియలవలన ఎఱిఁగికొంటిని. వేం తప్పక మేనకకు మాసంభాషణము చెప్పునని నిర్ధారించుకొంటిని. గది తలుపు బిగించుకొని ఆలోచించి ఇటులు రూఢిపఱచుకొంటిని—'పిల్లలఁగనువారికి - వారికే తెలియవలయునుగాని మగవారికి మా కెటులు తెలియఁగలదు?' అని. ఇటులు నిశ్చయించుకొని నా యీనిశ్చయమును మేనకకు ఎఱుఁగనటులు వినిపించుచో చాల ఓదార్పుగా ఉండుననుకొని ఒకటి రెండు సారులు నాలో నేనే లోపల అనుకొన్నటులూ, బయటికి అనుకొన్నటులూ అనుకొన్నాను. మేనక వెంటనే ప్రత్యుత్తరముగా (అంతయు సరిగా నావలెనే) ఇటులు అనుకొన్నది.—'భగవంతుఁడు గర్భధారణము మగవారిమెడకే కట్టినచో అపుడు వారికే లెస్సగా తెలిసి రాఁగలదు' అని. 'స్త్రీజాతికోపము శాపముగా మాఱునేమోరా, భగవంతుఁడా' అని అనుకొ

న్నాను. ఈమాటతో ఇఁక దత్తు చేసికొన నిర్ణయించుకొన్నాను. పిల్లవానిని దత్తుచేసి కొందమని నేను; పిల్లదానిని చేసుకొందమని మేనక.

కుఱ్ఱని పెంచుకొనుచో వార్ధకమున అక్కఱవచ్చుట ఒకటి; చచ్చిన పయి తద్దినములు పెట్టుట రెండు; ప్రకృతము సున్నను ఒకటి చేయుట మూఁడు. ఈ మొదలుగా పురుష దత్తతనుగుఱించి ఉపన్యసించుచుండువాఁడను.

వార్ధకమున వాకిటికి లాఁగుట ఒకటి; పిదప ఏబస్తికోపోయి కొన్నాళ్లకు తిరిగివచ్చి అక్కడ తద్దినము పెట్టితినని అపలపించుట రెండు; ఈరీతిగా ప్రకృత లోపమును ద్విగుణీకృతము చేయుట మూఁడు. అని దేనికికి దానిని ఖండించి, ధనాశచే అల్లుఁడు హమేషా 'అక్రీత దాసుఁడు' అను తన పేరును సార్థకపఱచికొనుట ఒకటి; కూఁతుతో అల్లుఁడు కలిసి ఒకరికిద్దఱు అక్కఱకువచ్చుట రెండు; కొడుకు గోడండ్రు ఎంతవిరోధింతురో అల్లుఁగూఁతులు అంత ప్రేమించుట మూఁడు, అని ఈ మొదలుగా స్త్రీదత్తతను గుఱించి మేనక ఉపన్యసించెడిది. ఇటులు ఎన్నాళ్లకును మా తగవు తెగలేదు.

నాకెపుడును వేదాంతములు చదివికొనుట, పత్రికలకు వేదాంతోపన్యాసములు వ్రాయుటయు పని. అష్ట దిగ్బంధనములతో, అంగరక్షతో సతతము నాగదిలో కూర్చుండువాఁడను. ఆయింటి నిశ్శబ్దతను ఎలుకలు మాత్రమే అపుడపుడు భగ్నము చేయుచుండెడివి. Rat-killer వల్ల వాటిపీడయు ఇపుడంతగా కానరాదు.

ఇటులు గుహాగంభీరమైన మాగృహము ఇపుడు క్రమక్రమముగా సహస్రకంఠములతో ముఖరితము కాఁజొచ్చినది. ఇంటఁగల ప్రతి పదార్థమును క్రిందనో మీఁదనో పడి ఆధ్వనితో శ్రుతి కలుపుచున్నది.

ఇదివఱ కెన్నఁడును లేని ఈవిషయము నాకు చోద్యముగా నున్నది. చాల కాలము నుండియు మాటాపలుకూ లేని ఆ శూన్యారణ్యము అంత రణగుణధ్వనిని వడ్డితోకూడ టకాయించి అప్పు తీర్చుకొనుచున్నటులున్నది.

మెల్లగా మెల్లగా నడిచి వెళ్లి నాగది తలుపు తీసి చూచితిని. మేనక ఒడిలో దుర్గ



“దుర్గా! భయము లేదు; అన్నము తిన్నావా!”

కుస్తీలు పట్టుచున్నది. నన్ను చూచి మెఱుపు తగిలినటులు ఒక్కసారి ముడుచుకొని పోయినది. మఱి మాటాడలేదు. అంత శాంతి మా యింట అదివఱ కెన్నఁడును అనుభూతము కాలేదు. దుర్గ బిడియపడుట కాదుకాని భయపడిన దనవలయును. శుష్కవేదాంతపఠనము వలన కలిగిన నాయుదాసీనత అంతయు అపుడాపసిపిల్లవల్ల మట్టిలో కలిసిపోయినది. 'దుర్గా! భయములేదు, అన్నము తిన్నావా?' అని నే ననఁగా దుర్గ మూసికొన్న చేతులవ్రేళ్లను ఎడముచేసి కాటుక కన్నులతో నన్ను చూచినది.

దుర్గ ఈనాఁడు ఈరీతిగా వ్రేళ్లసందుల నుండి దోబూచులాడినపిదప నేటి కిది ప్రథమ పాఠమనుకొని నేను మఱల తలుపు మూసికొంటిని. మూసికొనిన వెంటనె కందిరీఁగల పట్టు కదిలినది. 'పిన్నీ! ఆయన యెవరు? ఆయన నీకేమౌతాఁడు?' అని ప్రశ్నించి మేనక నవ్వఁగనే 'మా అమ్మకు మానాన్న ఏమౌతాఁడా?' అని ఈ మొదలుగా ప్రశ్న పరంపరను శరపరంపరగా పరఁగించినది.

నాకు పిల్లలనినచో ఇష్టము బహు—ఇష్టమే కాని నాకే పిల్ల లుండుట అనునది అనిష్టము మహా—అనిష్టము. ఒకవేళ నాకే ఉండుచో ఈచెప్పఁబోవు నియమములతో ఉండుచో వారిని ఉంచుకొనుటలో ఏమియు ఆతంకము లేదు. ఏడువఁగూడదు. లోలోపలఁగూడ ఏడ్వఁగూడదు. అట్లని ముసలి మోములతో కూర్చుండరాదు. కలకలలాడుచు నవ్వుచుండవలయును. ఎత్తుకొమ్మని యేడువఁ గూడదు. ఒకవేళ యెత్తుకొని వెంటనే దింపినచో దిగక చంకనంటుకొని లబలబలాడరాదు. వెంటనే హాసన్ముఖముతో దిగిపోవలయును. పప్పులు పెట్టుమని, బెల్లలుపెట్టుమని వేధింపరాదు. శరీరధారణకుమాత్రమే ఆహారమని తెలిసికొనవలెను. పెట్టినది గుటుక్కున మ్రింగి గప్‌చిప్‌మని నోరు మూసికొనవలెను. వారి ముక్కు నోరు మొదలగునవి నిత్య నిర్మలములుగా ఏ శుద్ధియు నక్కఱలేక యుండవలయును. నా కోరికి చొప్పున వారికి నిద్ర రావలయును. ఆఁకలి కావలయును. నా కాగితములు చింపరాదు. వానిమీఁద వ్రాయరాదు. సిరాపోయరాదు. విశేషించి మా యింటి నిశ్శబ్దతను బహుభద్రముగా కాపాడవలయును. ఇట్టి వింకను చెప్పకయే తెలిసికొనఁదగినవి చాల ఉన్నవి.

అన్నము తినువేళ పిల్లలు ఏడ్చునో అది నాకు జీర్ణము కాదు. నా సంగతి తెలిసిన తల్లులు వారిని చాటులకు తీసికొనివెళ్లి నోరు మూసి వినఁబడని దెబ్బలు కొట్టుచో తొడపాసెము పెట్టుచో, నేను మెలకువగా తెలిసికొని—'తల్లులు చక్కగా కంటారుకాని మళ్లీ వాళ్లే చంపేస్తారు' అని అనువాఁడను.

నాయుద్దేశమున పిల్లలు ఏడువకుండ ఉండవలయుననున దొకటి. వారికి మాటలు రావు కావున తమ ఆఁకలి దప్పులు తెలుపుకొనుటకు 'ఏడుపు కావలయును' అనుఅంశము

శుష్క వేదాంతపఠనము మానిన పిదప నిన్న మొన్ననే తెలిసినది. అల్లరిమానవలయునను నది ఇంకొకటి. "మనస్సు గాలివలె పట్టరానిది దానిని నిగ్రహింపవలెను. అని మాటి మాటికి చెప్పు గీతావాక్యములు పిల్లలనుగుఱించినవే" అని నాతలఁపు. కాని, నా మనస్సును నేను చూచుకొన్న తరువాత నేనే మిథ్యాచారుఁడ నని తెలిసికొంటిని. పెద్దలను గౌరవింపరనునది మఱియొకటి—ఎంతవారినైనను 'నీవు నీవు' అని వేయుదురు; విశేషించి పిల్లాపీచూ లేని నన్ను కూడాను. ఇప్పుడు దుర్గ నన్ను 'ఏమం డీ' అని పిలుచుచో 'ఏమిరా' అయిపోయినది.

ఇటీవల ప్రతిదినము ప్రక్కప్రక్కల పటహాధ్వనులలో మెలఁగుట నాకు అలవాటు కాఁజొచ్చినది. క్రమక్రమముగా నాయెదుటనే తప్పెటలూ తాళములూ. 'నిగ్రహఃకింకరిష్యతి?'

సమయమునకు దుర్గ రానిచో ఇపుడు నేనే పిలుచుచుంటిని.


ఒకనాఁడు తండ్రి చూచుచున్నాఁడని కాఁబోలు నాచేయి పట్టుకొని నాతో వచ్చుచున్న దుర్గ నాచేయి నలిగిన పూవువలె వదిలివైచి ప్రక్కసందులోనికి తప్పుకొన్నది. మరొకనాడు 'ఒకనాఁడు చూచినాఁడు కదా!' అని కాఁబోలును చేయిమాత్రము వదిలి నాతో వచ్చినది. ఇంకొకనాఁడు తండ్రి చూపులతోఁ గంటకిత యయినను నాచేయి వదలకయే నాతో వచ్చినది. నేను కాఫీ పుచ్చుకొనుటకు కూరుచుంటిని. దుర్గ దూరముగా నిలువఁబడి అదే పనిగా చూచుచున్నది. అల్లరిపిల్ల చేతిలో గిన్నెను ఎగురఁగొట్టునేమో యని భద్రముగా పట్టుకొని యుంటిని. దుర్గ 'అదేమిటి?' అని అడిగినది. 'కాఫీ' అంటిని 'కాఫీ రాసుకుంటారుగాని తాగుతారా?' అన్నది. ఇది 'తాగే కాఫీ' అని ఉదాహరణము చేసి చూపించుచుంటిని. దుర్గ మరికొంచెము దూరము జరిగి నిలువఁబడినది. అడుగునా? యని కనిపెట్టుకొని కూర్చుంటిని. ఊరక చూచును కాని అడుగదు.

'కొంచెము కాఫీ పుచ్చుకొందువా?' అని నేనే అడిగితిని. పిల్లల భాషలో 'అదేమిటి?' అనుదానికి 'అది కావలయును' అను అర్థము నాకపుడు గోచరించినది. గిన్నె చేతి కందించితిని. 'నాన్న కోపంచేస్తాఁడేమో'అన్నదిదుర్గ.

నాకు కొంచెము ఆలోచనకు అవకాశము. "పరాయివాళ్లము కాఁబట్టికదా ఈపిల్ల నమేతూ ఇటులు అనుచున్న"దని నాకు అపుడు విషాదము కలిగినది. నన్ను అర్థము చేసికొన్నది కాఁబోలు! మేనక నాకన్నులకేసి చూచినది. మేనక మనస్సు నాకు తెలిసినది నామనస్సు మేనకకు తెలిసినది. మన స్సంతయు ఒకటే జాతి. మేనక కన్నీళ్లతో పెరటిలోనికి వెళ్లినది.

దుర్గ చేతిలో గిన్నె ఆరీతినే ఉన్నది. 'ఇక్కడికి వచ్చావని మీ నాన్న కెట్లా తెలుస్తుంది లే!' అన్నాను నేను.' 'అల్లింటికి ఎందుకెళ్లావ్' అని నిన్న అడగ లా?' అన్నది దుర్గ.

నాకు కొంచెము ఆలోచన అంకురించినది కాని ఇట్టే తుంపివైచితిని.



"నన్ను అర్థముచేసికొన్నది కాఁబోలు! మేనక నాకన్నుల కేసిచూచినది"

'కాఫీ చల్లారితే బావుండదు. తరువాత ఆసంగతి ఆలోచిద్దాం. ముందర కాఫీ తాగు!' అన్నాను. నిజమే ననుకుంటూ కాఫీ గిన్నె ఒక్కసారే ఎత్తి నోటిలో పోసికొన్నది. కాఫీ ముక్కులలో నిండఁగా కన్నులలో కొంత, కన్నులు నిండఁగా చెవులలో కొంత సర్దుకొన్నది 'Economy' తెలిసినట్లు. దుర్గ ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరి అయినది. మేనక చరాలున వచ్చి దుర్గను ఎత్తుకొని దగ్గించి తుమ్మించి తానుగూడ కొంత గడబిడ ఆరోపించుకొన్నది. దగ్గులు తుమ్ములు అయినతరువాత దుర్గ—'నా కింక కాఫీ అక్కఱ లేదు. కాని నీకే యిత్తా మాయింటికి రా!' అన్నది.

ఆమఱునటినాఁడు దుర్గ రాకపోవఁగా చాలసే పెదురు చూచితిని. చూచి చూచి వారి యింటికే వెళ్లితిని. దుర్గ తండ్రి వాకిట కూర్చుండి యున్నాఁడు.

ఒక మనుష్యుడు మరియొక మనుష్యుని చూచినంతమాత్రమున మాటాడవలసిన విధి యెచటను లేదు కాని ఎదురుగా కూర్చుండి ముఖము కేసిచూచుచుండుచో అతఁడు వెనుజూపు పెట్టునేని ఇఁక మాటలాడుట యెట్లు? పాఱిపోవు కోయిలను వెంటాడి పలుకరింతుము; ఎదురుగా నున్నను అప్రసన్నునితో మాటలాడఁజాలము. సహస్రకంఠములతో శబ్దించు సాగరమును తీరమున నిలిచి పిలిచితి మేని 'ఓ' యనును. అక్కఱ లేనిదే అతి గభీరముగ కూర్చున్న మానవునితో మాటాడఁ గలుగుట అరిది.

నేనొక వాత్సల్యదైవమును అతని దేవాలయమున చూడఁదలఁచికొని వెళ్లితిని. కాని తలుపులు తాళాలు పెట్టఁబడెను.

నేనే మెల్లగా తలుపు తెఱచికొన ప్రయత్నించితిని. ఏనుఁగు బలముతోఁగాని ఆతలుపు కొంచెమేని కదలలేదు.

నా చెప్పిన దెల్లయు ఆలించి ఆయన అనెను—'మాఅమ్మాయి అసలే కొండకాటి గాఁడుపిట్ట! మీరు దానిని మరి కొంచెము వాగించుచున్నారు! ఇది అతి పరిచయ మను కొందును' అని

నాయంత నేను త్రోసిన తలుపు బట్టుమని నామీఁద నే పడినది. నావేదాంతమపుడు నాకు లెస్సగా ఉపయోగించినది. గతవిషయమఖిలము మేనకతో చెప్పికొంటిని. నా విషాదముకూడ అది అనుభవించినది.

ఇదివఱకు మాయింటికి అలంకారప్రాయముగా ఉన్న వసానము ఇపుడు భీకరముగా ఉన్నది. ఇపుడు మాయింట నందికేశ్వరుఁడు పటహాములు వాయింపఁడు. భృంగి హాస్యములు చెప్పఁడు. కౌమారి ముద్దుమాటలు అనదు. దుర్గ నర్తింపదు. ఇల్లిపుడు గొడ్డువోయినది.

మఱల ఎప్పటి ఆట. నావేదాంతములూ నేనూ. కొన్ని మాసములు కడచన్నవి. మేనక 'మాదుర్గ తపస్సు చేసికొనుచున్న' దని కలవరించెడిది.

మావీథిలో పేరంటము. ఇపుడు పొరుగింటికికూడ అడుగు పెట్టని మేనక పిలువని పేరంటమునకు వెళ్లినది. మంగళధ్వనులతో చెవులు చిల్లులు వోయినవి. నాకు దుర్గ గుఱుతు తగిలినది. వెంటనే వ్రాఁతకోఁతలు కట్టిపెట్టి దుర్గను తలపోసికొనుచుంటిని. 'పేరంటమునకు వెళ్లుచో దుర్గ కనఁబడునుగదా' అని అనుకొంటిని. నాకు స్త్రీలమీఁదఁ గొంచెము చులుకఁదనము. ఇపుడు పోయినది. ఇంట నే నొక్కఁడనే. నామనస్సున ఒక్క దుర్గయే. ఈదుర్గ వెనుకటి దుర్గ కాదు. ఒక కోరచూపు బెత్తముచే నా బాహుపంజరములోనికి వచ్చుటకు భయపడు దుర్గ.

కొంతసేపటికి నాగది తలుపులమీఁద ఒక మృదుస్పర్శ కలిగినది. నాహృదయపద్మము మీఁద ఒక ఆశాభృంగము వాలినది 'బాబాయ్' అని పిలుపు. నా ఒడలు గగురు పొడిచెను.

మఱల బాబా అని పిలుపు నేను మాటాడలేదు. దుర్గ బిగ్గఱగా అఱచినది వెఱ్ఱి కేకలు వేసినది. పేరంటమునకు వెళ్లక పొరుగున నెవరేని ఉన్నయెడల 'లోపల ఉన్న వాఁడు ఏకారణముననో ఈపాటికి అయిపోయి ఉండునని తలుపుల ఉతకలు ఎత్తి పాఱవైచి యుందురు దుర్గ పిల్ల యగుటచే లోపల నేను గట్టిగా బ్రదికి ఉన్నాననియే, తనను పరీక్షించుటకో నిషేధించుటకో తలుపు తీయలేదనియే.

నేను మాత్రము తలుపు తీయలేదు. పర్వతరాజ శాస్త్రుల్లుగారూ! అని ఋషభస్వరములో; పర్వత రాజుగారూ! అని గాంధారములో; పర్వతాలూ! అని మధ్యమములో; రాజూ! అని పంచమములో; పర్వతరాజూ! అని ధైవతములో; బాబా! అని నిషాదములో; ఈస్వరము లన్నియు నామనోద్వారమును తెఱచెనుగాని తలుపు తెఱవఁబడలేదు.

ఇఁక ఒకటే స్వరము మిగిలినది. అది ప్రేమస్వరమునకు అపరాంగ మయిన రోదన స్వరము ఆస్వరముతో 'కొంచెం తలుపు తెఱవవయ్యా! ఒక్కసారి చూచి పోతానయ్యా! ఎంతోసేపు కూచోనయ్యా!' అన్నది దుర్గ.

నాపరీక్ష కడ ముట్టినది. నూటికి నూఱు మార్కులు వేసితిని. ఇంతకు ముందే మేనక దొడ్డిదారిని లోనికి వచ్చి ఇదియంతయు ఆల కించుట నే నెఱుఁగను.

మెల్లగా గడియ తీసితిని. నేను ఏమా త్రము భద్రముగా నిలుచుండకపోయినను తలు పులు రెండూ నామీఁద విసురుగా పడునవే. దుర్గ ఎగిరి ఒక్కసారి నాకంఠము కౌఁగిలించు కొన్నది అది తనంతట తాను నాకు దత్తు అయినట్లు. ఆహా! సంతానవంతు లెంత భాగ్య వంతులో! నా కపుడు ఒకానొక ఆనందము కన్నులలో బాష్పధారలుగా పరివర్తిత మయి నది. కంఠమున వెక్కులుగా పరిణమించినది. నన్ను చూచి దుర్గ ఆవురు మన్నది.

మాకన్నీరు ఆఁపుటకు కాఁబోలును మాముందు దుర్గ తండ్రి నిలువఁబడి యుండెను.



దుర్గ ఒకతూరి వెనుదిరిగి చూచెను.

తొడిమె ఊడినపూవు. నాసందిటనుండి మధు బిందువువలె నేలకు జాఱెను.

నేను దుర్గతండ్రి కేసి కోరచూపులు చూచుచు నిలువఁబడితిని. దుర్గ శిక్షిత హారిణి వలె ముందులకు నడచెను; తండ్రి వెనుకముఖ రమయిన వీణ గవ్రసెనలో నడిచి పోయెను.

మేనకకు నాకును కొన్నాళ్లు వెన్నెల లేదు. మా కేదో తప్పుచేసినటు లుండెను. మఱచిపోయిన మృతమానవమును మా యిల్లు క్రమ్ముఱ అలవఱిచికొనెను.

పదినాళ్ల పదఁపడి మాయావేదాంతము మాని భక్తివేదాంతములు చదివితిని. అన్ని దేశములవారి భక్తిని తిరిచితిని. భక్తి భరత ఖండము సొమ్మే.

తొల్లి అన్నిటికంటె జ్ఞానమే ప్రధానమని నావాదము. ఇపుడు ఆస్థానమును భక్తి ఆక్ర మించినది. పండితులతో వాదించుటకుఁ గాదు- సాధనకు. వాదింపఁదలఁచినచో—తదేవ కర్మ జ్ఞాని యోగిభ్య ఆధిక్య శబ్దాత్ [౧ అధ్యా- ౨ ఆహ్నిక- ౨౨ సూత్ర] అను శాండిల్యుని భక్తిమీమాంసలో పండితులకు రంగస్థలము దొరకును.

భక్తిలో పడితిని. ప్రతిబిచ్చగానిపాటలో నూ కవిత్వమే. వ్యాకరణాది దోషములు పాప ములవలె మనస్సునకు తట్టుట లేదు. సంగీత సామగ్రితో పనిలేదు. భక్తిరసముకల ఆపాట సర్వాంగ సుందరము.

తెల్లవారుజామున మాయింటి ప్రక్క పూర్ణమ్మగారు మీరాబాయిపాట తెలుఁగున పాడుచున్నది—

కృష్ణమ్మా! గోపాలబాలా! కృష్ణమ్మా!
కాళ్లాకు గజ్జెలు గట్టి
వేళ్లా కుంగ్రాలు పెట్టి
గోళ్లాకు ఎఱుపులు తిరుగ—
గోరింతాకు పెట్టద రారకృష్ణమ్మా!

ఈపాట వినుటతోడనే శ్రీకృష్ణుని మీరాబాయి దత్తు చేసికొన్న దని తోఁచినది. ఆమఱునాఁడు వంగీయుల దుర్గాపూజ చదివితిని వారు దుర్గను కూతురుగా తమ పుట్టింటికి తెచ్చి పూజించికొందురు ఓ! ఎట్టి భావన!

నేను బంగారము కొనితెచ్చి మేనకకు ఇచ్చితిని. మేనక దుర్గా ప్రతిమ చేయించెను. నేను అలంకారములు చేయించితిని.

ఇపుడు అనునిమిషము మాద త్తకుమారి మమ్ము వదలినను మేము వదలము. ఇంకొక తమాషా. నానియమములన్నియు ఇపుడు తల క్రిందు లయినవి. ఇపుడు నేను మా దుర్గను 'ఏడువవేమి' అని అందును 'అది పెట్టు; ఇది పెట్టు' అని అడుగవేమి? అని యేడ్తును. నా కాకితములు చింపవేమి? ఇల్లంతయు మోఁగి పోవునటుల నృత్యము చేయవేమి? అని బతిమాలుకొందును. నీవు పలికినదాఁక అన్నము తిన నని పట్టువట్టి ముక్కుమూసికొని కూరుచుండుచుందును.



కృష్ణునితో–రారాజు

వెలగపూడి దానయ్య చౌదరి గారు

జ్ఞాతిని మోసగించి రభసంబునఁ గూల్చితివంచు నెంతయున్
జేతమునందు గుందిననుఁ జేరి యుధిష్ఠిరుఁ డూఱడింప నీ
ఖ్యాతిశయంబునం దగదటం చతని న్నదలించుచు న్ననుం
బాతకుఁడంచు దూఱెదవు పైపయి; సిగ్గిలఁబోక మాధవా!

న్యాయవిదుండు సీరి యిట నాలముఁ గాంచుచు నిల్చియుండ న
న్యాయము గల్గఁబోదని మనంబున నెంచుటఁ జేసి యక్కటా!
మాయలమారి! నీకపటమార్గము లేఁ గననైతి; నాయుధః
కాయముఁ గాచికో నయితిఁ, గయ్యమొనర్చితి; భంగ మొందితిన్.

మాయలమారివై దురభిమానము నాత్మవహించి యొంతయున్
జేయఁగరాని కృత్యములఁ జేయఁగ బోధ మొనర్చ వారలున్
రోయక యాలకించుచు నిరూఢమనస్కులఁ జేయుచుందు రో
న్యాయవిదూర! నీకరమునందలి బొమ్మలు గారె? పాండవుల్.

ఆలమునఁ బాండవులకు జయంబుఁగోరి-సిగ్గు విడినాడి పొనరింపఁ జేసినాఁడ
వక్కటక్కట! యెన్నియో యక్రమములు-మూఢగోవింద, నీముల్లె మునిఁగినట్లు.

ఆయుధమున్ ధరింప ననినంచు వచించి యరాతి భల్లముల్
గాయముఁ జీల్పఁ గ్రోధమున గంతులు వైచుచు నీతిమాలి గాం
గేయునిఁ గూల్పఁ జక్రమును గేల ధరించి చరించి తెల్లరున్.
రోయ నిసీ; నిన్నుఁ గనఁగ రోఁతకదా" యదువంశ పాంసనా!

తొడరి శిఖండి నెదుట నిల్పి భీష్ముని బీభత్సుచేతఁ జంపించినావు
కుంభజుఁ జంపింపఁగోరి ధర్మజుచేత మించి యనృతము లాడించినావు
అర్జునుచే నాలమందు భూరిశ్రవుఁ జేయి ఖండింపఁగాఁ జేసినావు
ప్రొద్దును దాచి యర్జునుచే జయద్రథు వంచించి శిరముఁ ద్రుంపించినావు
పూని రథమెత్తికొనియెడువానిఁ గూల్చ-దురితమని సంశయించెడు నరుని బ్రోత్స
హించి రాధేయుఁబట్టి కూల్పించినావు-బవరమునఁ జేరి ధూర్తగోపాల, నీవు.

సజ్జను లేవగింతురని జంకవు కొంకవు సుంతయేఁ; నిసీ
లజ్జ పరిత్యజించి సమరంబొనరింపఁ గడంగుచోఁ ద్రుటిఁ
ముజ్జగముల్ జయింప నగు; మూర్ఖత మమ్మిటు గూల్పఁజేసి నీ
విజ్జగతిం గడించు నదియెద్ది? యకీర్తియ కాక; కేశవా!

ఆలమున నన్నుఁగూల్చి మీ రనుభవించు భాగ్య,-మది, పరిజనమును బాంధవులును
నాశమందఁగఁ బాడ్వడినట్టి ధరయె; కల్లలకుఁబుట్టినిల్లగు గొల్లవాఁడ!

చెలఁగి సామంతులు సేవింప సామ్రాజ్య మేకచక్రంబుగా నేలినాఁడ
ననుజులు బాంధవు లాదిసర్వులతోడ నఖిలసౌఖ్యంబుల నందినాఁడ
ననుపమలీల మహానందమును బొంద ధనమిచ్చి యర్థులఁ దనిపినాఁడ
సర్వసుఖంబులు సమకూర్చి మిగులఁ బ్రేమించి పాలితుల మెప్పించినాఁడ
సాంగముగ నాల్గువేదముల్ చదివినాఁడ-సురలలరఁ బెక్కుజన్నముల్ నెఱపినాఁడ
నరుగ నున్నాఁడ దివికి యీయక్రమముల పాలఁబడి క్రుంగితుదకు గోపాలకృష్ణ!

నీతి దొలఁగి యకృత్యముల్ నెఱపి నెఱపి, కోర్కి- నెరవేర్చుకొంటి వకుంఠితముగ
రాణ సెడి పాడుగోరు నీరాష్ట్రమింకఁ బ్రీతి ధర్మజు నెత్తిని బెట్టుమయ్య!

ఓమర్ ఖయ్యాము

పెనుమర్తి వెంకటరత్నముగారు

ప్రత్యుషఃఫుల్ల కౌసుమ ప్రకరమునకు-సంజలోనలఁ బ్రళయలాస్యములు మ్రోఁగు
జీవితగభీరవార్ధి వీచీవితాన-వివిధవ్యంగ్యార్థ రాహస్యవేత్తవీవు!
ఆదినాంతసశీథిగహ్వారములోన-నేమికలదో! తొంగిన సామి యెవఁడు?
ఏమియుండెనో! గగనపురీమహీజ-పుష్పమాధ్వీపిపాసలఁ బొలియనేలొ?
ఆయ రేబియావ్యాప్తవనాంతరముల-సృష్టిపరమార్థములు పఠించిన, భవద్గ
భీర వేణూద్గమ శ్రుతిపార మదిర!-దిగ్దిగంతమందానిలో ద్రిక్తమగును!
గడచినదినమ్ము నేఁటిలోఁ గలసిపోవు-నీవు నిత్యుఁడవే! మహా దేవదూత!

(అడవిపూవులు)

అమృతరావు పేరు విననివా రెవ్వరూ బెజవాడలో లేరు. ఎందుచేతంటే సంఘసంస్కారులలో మొదటిపేరీయనది దానధర్మాలు—అంటే చందాలు మొదలగువాటిలో పెద్దమొత్తంగల పేర్లలో వుంటుంది అమృతరావు పేరు. వీటి అన్నిటికీ మించినది ఉద్యోగపు పలుకుబడి. డిప్టీకలెక్టరంటే సామాన్యమా? ఈయన ఇపుడు బెజవాడలో డిప్టీకలెక్టరు చేయుచున్నాడు. ఈవూరిలో ఆంధ్రవిశ్వవిద్యాలయం ఆదీ వుందనీ, నాలుగుకైర్యకీ మాడికయనీ ఇక్కడే స్థిరపడుటకు నిశ్చయించుకొని ఈయనగవర్నరుపేటలో పెద్దబంగాళా కట్టుకుని వున్నాడు. భార్యపేరు విమల. ఈమె మొదట భర్తగారితో ఏకీభవించకపోయినా, అతిబాల్యవివాహములవల్ల గలుగు అనర్థకములు, దినదినాభివృద్ధి పొందుచున్న బాలవితంతువుల సంఖ్యాభివృద్ధి మనస్సున నాటునట్లు భర్త బోధించగా ఏమైనా సరే యుక్తవయస్సు రాకుండా ప్రేమను పెండ్లి చేయరాదనుకునేది. మాణిక్యమ్మ పూర్వోత్తరపు మనిషి. ఆమె కీనవీనాచారాలూ, కొమారుని పూర్వాచారఖండనోపన్యాసాలూ అవీ అంటే అదోమోస్తరుగా వుండేది. పాపం! ఏంజేస్తుంది? ఒక్కడే కుమారుడూ, వృద్ధాప్యమూ, వినిపించుకోనట్లు వూరుకునేది. అమృతరావు కొమార్తెను అయిదవయేటనే అక్షరాభ్యాసము చేసి కాన్వెంటుస్కూలుకు పంపించాడు. ప్రేమకిప్పుడు పదియవఏడు. సెకండుఫారండర్డు చదువుచున్నది ఇంగ్లీషు చక్కగా మాట్లాడగలదు. పూలుకుట్టు మొదలగునవి బాగావచ్చును. కొద్దిగా తండ్రిపోలిక. వాళ్ల బామ్మ 'నాతల్లికి శాస్త్రాల్లో చెప్పినట్టు ఎక్కడవుండే అందం అక్కడవుంది. అదృష్టవంతురాలు. జమీందారుణ్ణి పెళ్లాడుతుం'దని ముద్దులాడేది. కొమారునిమాటలు జ్ఞాపకము వచ్చినప్పుడల్లా "ఏమే ప్రేమా, డాక్టరువు అవుతావుటే; మాకందరికీ మందు లిస్తావమ్మా; డాక్టరీ అయితే బాగా చేవుంటుంది. సుబ్బరంగా ఆడవాళ్లకి ఆపరేషన్లమందు పురుషుల సంపర్కం లేకుండా పురుడూ, పుణ్యమూ చూడొచ్చు. ఏమో నేను పెద్దదాన్నైనాను; ప్రేమ పెండ్లి కూతురౌతే చూడాలని వుంది." అనేది. 'అమృతరావుగారికి సంఘసంస్కారాలంటే చాలా అభిమాన' మనీ, 'అభిమానమే కాకుండా కూతురికి పెండ్లి చేయకుండా డాక్టరీ చదివించుతాడట. చాలామంది ఈలా చెప్పినవారే తీరా సమయం వస్తే పదేండ్లయినా నిండకుండా పెళ్లి చేస్తారు చూద్దాంగదా'అని వూళ్లోవారంతా అనుకునేవారు. ఏపదిమంది ఒకచోట కూడినా అమృతరావు ప్రస్తాపనే. ఆయన హోదా, సంఘసంస్కరణాభిమానమూ, దాతృత్వమూ, మొదలగునవి వర్ణించేవారూ రసించేవారూ, ఖండించేవారూ, అటుస్తంగా వూరుని కొనేవారూ ఈప్రకారంగా నాలుగు భాగాలయ్యేవారు. ఇది ఈలావుండగా ఒకరోజు మామూలు ప్రకారం అమృతరావు కాఫీపుచ్చుకొని, సొంతంగా క్షౌరంచేసుకొని చాకలి అచ్చన్న 'స్నానానికి నీళ్లు తోడానండి బాబూ' అని చెప్పగా, స్నానంచేసి కుర్చీలోకూర్చుని వార్తాపత్రికలు తిరుగవేయ మొదలిడెను. ఇంతలో డఫేదారు టపా తేగా పుచ్చుకొని ఒకటొకటే చింపిచూచెను. అందులో ఒకకవరు 'అమృతరావుగారు, డిప్టీకలెక్టరు, బెజవాడ.'అని యుండగా నిదానించిచూచి దానినికూడా విప్పి చదివెను. అందిట్లున్నది:


"బి. అమృతరావుగారికి,

నిన్ను కాకినాడకు ట్రెజరీ డిప్టీకలెక్టరుగా ట్రాన్సుఫరు చేయడమైనది; గనుక ఈనెలాఖరున కాకినాడలో రంగయ్యనాయుడుగారినుండి ఛార్జి పుచ్చుకోవలెను." అని కృష్ణజిల్లా కలెక్టరుగారగు హెచ్. జాన్సనుదొరగారిద్వారా వచ్చిన ఈబదిలీ ఆజ్ఞాపత్రము చూచుటతోనే అమృతరావు నానావిధమైన ఆశ్చర్యవిచారములకు లోనయ్యెను. ఆంధ్రవిశ్వవిద్యాలయము బెజవాడలో పెట్టెదరని విన్నప్పటినుండి ఆంధ్రుడౌటచే ఇక్కడ స్థిరనివాసమునకు వసతు లేర్పర్చుకోవలెనని విశ్వప్రయత్నములుచేసి ఇక్కడికి రాగలిగెను. వచ్చినట్టుగానే మంచిస్థలము


కొని పెద్దబంగాళాకట్టి అందులో గృహప్రవేశమయ్యెను. ఇంటిలో ఇంకనూ స్థిరపడనైనా లేదు. ఏవిశ్వవిద్యాలయపు ఆశపెట్టుకొని బెజవాడలో వుండ నిశ్చయించుకొని పాతికవేలు ఖర్చుపరిచి ఇల్లుకట్టినో ఆవిశ్వవిద్యాలయము బహునాయకత్వము వలననూ, ఏకమత్యము లేమిచేతనూ దానిమాత్రము పట్టుకుని నలుగురూ నాలుగుప్రక్కలకీ లాగగా అసూత్రము కాస్తా తెగి ఆలయ మనంతపురికి గాలిచే ఎగిరిపోనున్నది. ఈసంగతి తెలియగానే అమృతరావు మనస్సు నిరుత్సాహము పొందెను. శాసనసభలో ఏమైనా 'ఇక్కడనుండి కదుప రా'దందు రేమో అని ఆశించెను. ఆ ఆశ ఇంతవేగిరము తీరు నట్లు లేదు. కొందరు సభ్యులు నాలుగుప్రదేశములూ చూచి ఇక్కడ వుంచుటకో, లేక ఎక్కడికైనా మార్చుటకో అప్పుడు నిశ్చయించెదరట. 'రజ్జొచ్చె మొదలిడు' మనునట్లు మొదటికి వచ్చినది.

ఈసంగతి మొదటే తెలిస్తే ఇక్కడ స్థిరపడకే పోవుదుమని ఒకమాటూ, పోనీ విశ్వవిద్యాలయ మెట్లు శంకుస్థాపనచేసి ఇంకో వూరికి మోసికొనపోవుదురో నేమో అట్లే నాబంగాళా మొదలగువాటిని మార్తునా అంటే ఏరోపాలోవలె ఇండ్లను త్రివ్వెడియంత్రము ఇక్కడ లేదేమని ఒకమాటు ఈలా డోలాందోళిత మనస్కుడై యున్న సమయములో పులిమీదపుట్రవలె సంవత్సరమైనా క్రొత్తయింటిలో వుంచకుండా బదలీఅయిందనే విచారములో, ఇక్కడికివచ్చి ఏడాదైనా కాలేదే? అప్పుడేబదిలీయా? అనే ఆశ్చర్యముతో కొంతసే పూరకే కూర్చుని గడియారము పదకొండు కొట్టగా టపా దఫేదారుని సద్దుమని, బదిలీకాగితము పుచ్చుకుని లోపలికి వెళ్లి తల్లికీ భార్యకీ ఈసంగతి చెప్పేడు. వారున్నూ మతిపోయినట్లయి, 'ఎక్కడికాకినాడ? ఎక్కడి బెజవాడ? ఎక్కడికేవరి. ఇప్పుడేగా ఇక్కడికి మార్చారూ? ఇంతట్లోకే మళ్లీ మార్చా? ఎవరు కట్టగల రీప్రయాణపు సామానులు? ఏది లేకపోయినా జరగదాయె! అన్నీ పట్టుకువెళ్లాలి. క్రొత్తఇంటిలో ఎవరినైనా కాపురముంచుతే పాడుచేస్తారు. తాళం పెడితే జాగ్రత్తలేదు. మొక్కలన్నీ ఎండిపోతాయి. పశువులుకూడా కొంటిమి. వాటి నేమిచేయుట? అయ్యో! ఈపాడుబదిలీ ఇప్పుడే రావాలీ' అని ఏదో దేశాంతరపు బదిలీలాగ బెంగతో మాటలమీద మాటలు అత్తాకోడలూ చెప్పుతూంటే అమృతరావు కేమీ తోచక కొంతసే పాలోచించి 'కచేరీకి వేళవుతూం'దను కొనుచూ వీరిమాటలు వినుచూ పడకటింటిదగ్గఅనుంచున్న వంటబ్రాహ్మణునితో 'రామయ్యా వేళవుతోంది వడ్డించూ' అన్నాడు. వెంటనే అరిటాకులో వండినవన్నీ వడ్డించి వంటింటిగుమ్మంలో నుంచున్న రామయ్యను చూచి 'రామయ్యా, ఈవాళ వంటేమీ బాగుండ లేదోయి' అన్నాడు. 'చిత్తం, నేను రోజులాగే వండానండి, ఎందుకు బాగు లేదో బాబూ' అంటూ మజ్జిగ వడ్డించాడు. భోజనముచేసి అమృతరావు హాల్లోకివచ్చి భార్య ఇచ్చిన తాంబూలము పుచ్చుకొని కచేరీబట్టలు ధరించుచుండగా, మాణిక్యాంబ వచ్చి "అయితే అమృతూ, వెళ్లక తప్పదుట్రా; పోనీ సెలవు పెడుదూ; సుఖంగా ఇంట్లో వుందాం. కొంతకాలం" అం-. ఇంతలో కేకాన్వెంటునుండి పన్నెండు గంటలైనందున ప్రేమ ఇంటికి వచ్చి తల్లి, తండ్రి, బామ్మముఖములయందు మార్పున్ను వారిమాటలున్ను గ్రహించి "రామయ్యా, ఏం మాట్లాడుకుంటున్నా"రని అన్నం తినకుండా అడిగింది. "నాన్నగారికి కాకినాడ బదిలీ అయింది. ఇల్లావాకిలీ వదలి ఏలారా అని అనుకుంటున్నారు. నువ్వన్నం తిను ప్రేమమ్మ" అన్నాడు రామయ్య. "అబ్బా వుండు రామయ్యా" అని తండ్రిదగ్గరకి పరుగెత్తి "నాన్నగారూ మీకిష్టముంటే కాకినాడ వెళ్ళండి. నేమట్టుకు రాను, బాబూ. నాకు పరీక్షలొస్తున్నాయి. అక్కడ ఈలాంటి కాన్వెంటూ, ఇంతమంచి సిస్టర్లూ, మదరూ దొరకుతారా ఏమిటి?" అని మూతి ముడుచుకుంది. "నీకిక్కడే వుండాలని వుందా. అయితే నువ్విక్కడే వుండూ గానిలే అమ్మ, అన్నంతిన్నావా" అన్నాడుతండ్రి. "వెళ్లవే, మేం కూడా వస్తాంపద" అన్నారుతల్లి బామ్మ. "మీరింకా భోంచెయ్యలేదూ వెళ్లండి. రాత్రి ఆలోచిద్దాం నాకూ వేళవుతూం"దని తొందరగా అమృతరావాఫీసుకి వెళ్లిపోయాడు. విమలా, మాణిక్యమ్మ, ప్రేమా భోంచేస్తూ బదిలీనిగురించే మాట్లాడుకుంటూ అర్థాకలిగా లేచారు.


టూటను ఖమను సమాధి చిత్రములు - మఱికొన్ని




చిత్రము ౧. టూటను ఖమను హృదయ నిషేస్థలము



చిత్రము ౨



చిత్రము 3



చిత్రము ౪



చిత్రము ౫

సాయంకాలము అమృతరావింటికెప్పుడు వస్తాడా అని అత్తాకోడలూ కనుపెట్టుకుని వున్నారు. అయిదుగంటలకు రావలసిన అమృతరావు ఆరుగంటల కింటికి వచ్చి కచేరీబట్టలు మార్చుకొని అవశిష్టాలన్నీ తీర్చుకొని హాల్లోకివచ్చి కూర్చున్నాడు. ఇంతలో ప్రేమవచ్చి "నాన్నగారూ,ఇంగ్లీషులో నేనేఫస్టు పదింటికీపదిమార్కులండీ; నిట్టింగులో నే ఎక్సలెంటూ; అన్నిసబ్జక్టుల్లోనూ ఈవాళ నేనే ఫస్టు! నాన్నగారూ"అని చెప్పింది. "అన్ని సబ్జక్టుల్లోనూ నువ్వే ఫస్టుటే! మాబాగా వస్తున్నాయే, ప్రేమా, మార్కులూ!" అన్నాడు తండ్రి. ఆమాటలకు పొంగిపోతూ హాల్లో ఉత్తరపుమూలనున్న బొమ్మరింట్లో కూచుని ఆడుకుంటూంది ప్రేమ. గృహప్రవేశమునాటికే బొమ్మరిల్లు కట్టించుకుని తండ్రితోకూడా తాను బొమ్మరింట్లో గృహప్రవేశ మయింది. కూతు రెంతచెపితే అంతే అమృతరావుకు. ఎప్పు డేది కావాలంటే అది తప్పకుండా తెప్పించేవాడు. అందుచేతనే కచ్చేరీహాలిట్లో నే నాబొమ్మరిల్లుండాలంటే సరేనని కట్టించాడు. మాణిక్యమ్మ వచ్చి అయితే "అమృతూ, బదిలీనిగురించి ఏమాలోచించా"వంది."ఇంక ఆలోచించుట కేమీ లేదు.తప్పక వెళ్లవలెను. కలక్టరుగారిద్వారా పట్నమునకు జవాబుకు సొమ్ముకట్టి టెలిగ్రామిచ్చాము. వెళ్లితీరవలెనని బదులు వచ్చినది." "పోనీ అబ్బాయీ, సెలవు పెట్టకూడదుట్రా" అంది. "వీలులేదు. మొన్ననేగా నాకున్న సెలవంతా పుచ్చుకున్నానమ్మా! ఇంక హక్కులేదు. జీతం నష్టంమీద పుచ్చుకోవాలి. నాకు చార్జి వప్పగించి వెళ్లిన డిప్టీ కలెక్టరు ఆనందరావుకికూడా ఇక్కడ ఇల్లు కట్టుకున్నాడన్న నెపముమీదనే ట్రాన్సుఫరు చేసారు. ఇతనేకాదు; ఇంకా చాలామంది ఉద్యోగంలో వుండగా ఇల్లు కట్టుకుంటే వారికికూడా బదిలీ అయింది. అదేమోస్తరుగా నాకూ అయింది. సరే కాని, కాకినాడ నేనొక్కడినే వెళ్లనా, మీరందరూ వస్తారా?" అన్నాడమృతరావు. "నామాటకేమి? విమల నడుగు; అది ఏమంటుందో" అని తన ప్రక్కనున్న గుమ్మంలో నుంచుని తల్లికొడుకుల సంభాషణ వినుచున్న కోడలినిచూచి "పిల్లా, మన్నీ తీసుకువెళ్లడమా, లేక ఒక్కణ్ణే వెళ్లనా అంటున్నా డబ్బాయి; నీఅభిప్రాయ మేమిటే?"అంది. "ఏం జెప్ప నత్తయ్యా, ఈమాటు బసలాయింపు అయినప్పటినుంచీ నాకేమీ తోచటం లే"దంది విమల. "నాబొమ్మరిల్లూ అవీవిడిచి నేవట్టుకు రాను బాబూ"అంది ప్రేమ. "రేపు మొగుడొచ్చి రమ్మంటే ఈబొమ్మరిల్లూ, ఈనీస్టర్లూ, ముదరూ అక్కర్లేకుండా కాకినాడకేకాదు ఎక్కడికి రమ్మంటే అక్కడికి పరుగెత్తా"వందిబామ్మ. "ఏమిటి బామ్మా, ఏమిటి బామ్మా; అసలు నేవెళ్లాడి లేగా; పోదూ; ఈలాంటి మాటలు మాట్లాడకా" అని సంద్రకాంత పూలుకోసుకోడానికి పరుగెత్తింది ప్రేమ. "నీకష్టసుఖా లాలోచించుకుని ఏదో నీవే నిశ్చయించాలిగాని మేమేం జెప్పగల, మబ్బాయీ" అంది ముసలావిడ."ఈమాటుకి రామయ్యను తీసుకుని నేనొక్కణ్ణే వెళ్లి అక్కడ ఇల్లూ, వాకిలీ చూచి తర్వాత మిమ్మల్ని తీసుకడదామని అనుకుంటున్నాను. అప్పటికి పిల్ల పరీక్షలూ అయిపోతాయి. కొత్తయింట్లో కొంతకాలం మీరున్న వారూ అవుతా"రన్నాడు అమృతరావు. "సరే బాగానేవుం"దంది తల్లి.కొత్తఇంట్లో కొంతకాలంవుండొచ్చు గదా అన్న సంతోషంలో, భర్తనివిడిచి ఉండాలిగదా అన్న విచారంతో మాట్లాడలేకపోయింది విమల.వంటబ్రాహ్మణుడు 'వంటైం'దనేవరకూ ఏడుగంటలైనట్టే తెలియలేదు వీరికి. మడిగట్టుకుని అందరూ వడమటింటిలో భోజనమునకు కూచున్నారు. "ఏం రామయ్యా, నువ్వు నాతో కాకినాడకు వస్తావా" అన్నా డమృతరావు. "రాకేంచేస్తాడూ"అంది ముసలామె."ఏమో అతనిష్టము. మనలా గతను రెక్కలమ్ముకోలేదుగదా" అంది విమల. "తమ సెలవైతే అలాగే వస్తానండి బాబూ" అన్నాడురామయ్య. "అయితే రెండురోజుల్లో వెళ్ళాలి, సిద్ధంగా వుం"డన్నాడు యజమాని. రామయ్య మాట్లాడలేదు. "ఏం రామయ్యా, మాట్లాడ"వనగా'చిత్త'మంటాడుగాని చెప్పడు."జీతమెక్కువ గావాలనేమో? అందుకనే ఈనసు"కంది విమల."మొన్ననేగాదుటోయి,పది హేనుమండి ఇరవై చేసాను?" "చిత్తం,చాలామారం.పాతికేనా ఇస్తే నేకాని వీలులే"దని ఖచితముగా అన్నాడు వంటబ్రాహ్మణుడు."నీఅవసరమా నాఅవసరమా అని; ఇదినీకాలం.

ఇరువదిమూడిస్తాను. ప్రయాణమునకుసిద్ధపడు" అన్నాడు అమృతరావు.'తమచిత్తం',అన్నాడురామయ్య."ముక్కున్నవారి కందరికీ పడిసెమున్నదే. పంటమనిషి వున్నవారి కందరికీ వున్న అవస్థ ఇది" అంటూ అందరూ లేచారు. తనకు బదిలీగావచ్చిన డిప్టీకలెక్టరు శ్రీనివాసయ్యంగారికి చార్జి వప్పచెప్పి కచ్చేరీవారు చేసిన అంపకపువిందులో సన్మానమంది, సాంఘిక సభలలో ప్రశంసపొందెను. అమృతరావు ఇంటివద్ద సర్దినసామానం తయారా చూచి "ఎందు కింత సామా" ననగా "బాగుంది; ఏది కావాలంటే ఏమొస్తుంది" మనం పట్టుకెళ్లకపోతే అందిభార్య. ఈదిన మమృతరావుగారిల్లు సందడిగా మున్నది. అచ్చన్నపరుపు కట్టుచున్నాడు. రామయ్య సామానుబండిలో వేయించుచున్నాడు. గుమాస్తాలు మొదలగువారు స్టేషనుదాకా వచ్చెదమనుచున్నారు. అమృతరావు తల్లికి నమస్కరించి దీవెనలంది, భార్య అనుజ్ఞ పుచ్చుకొని తల్లివద్ద నుంచున్న ప్రేమను ముద్దుపెట్టుకుని "ఉత్తరంరాస్తావా ప్రేమా" అనేటప్పటికి ఏడ్వ మొదలుపెట్టింది. "ఏడవకమ్మా, ఇదిగో" ఈపదిరూపాయలూ పుచ్చుకుని మేనక్క షాపులో ఆవేళ చూసిన పెద్దసెలులాయడు బొమ్మకొనుక్కో, పిచ్చిపిల్లా; ఇందా,వుత్తరం రాయేం" అన్నాడుతండ్రి. తానుఇదివరలో అడిగిన పెద్దబొమ్మ కొనుక్కోమని ఇచ్చిన పదిరూపాయలు చూచుకుని సంతోషిస్తూ "మీఅడ్రసేమిటో" అంది కళ్లుతుడుచుకుంటూ. "రభాద్వాజుల అమృతరావుగారు,

ట్రెజరీ డిప్టీ కలెక్టరు,

కాకినాడ (గోదావరిజిల్లా).

అనివ్రాస్తే సరి" అంటూ బండెక్కాడు అమృతరావు. అందరూ స్టేషన్‌దాకా వెళ్లి బండి కదిలేవరకూ వుండి సెలవు పుచ్చుకుని ఎవరియిండ్లకు వారు వెళ్లారు. అమృతరావూ, రామయ్యా చామర్ల కోటలో దిగి కాకినాడ బండి ఎక్కి కాకినాడ స్టేషనులో దిగేటప్పటికి డవాలీ బంట్రౌతులూ, ముఖ్యమయిన కచ్చేరీ వుద్యోగులూ ఎదుర్కొని రామారావు పేటలో నున్న చింతలపూడి అచ్యుతరామయ్యగారింటికి తీసుకువెళ్లి వారిని వీరికీ, వీరిని వారికీ ఎరుకపఱచి కొంతసేపు ప్రయాణమునుగురించి, చార్జి పుచ్చుకోవడమునుగురించి మాట్లాడి కచ్చేరికి వెళ్లవలసినవారుగాన క్రొత్త డిప్టీకలెక్టరుగారి వద్దను, అచ్యుత రామయ్యగారి వద్దను సెలవు పుచ్చుకుని వారివారి గృహములకు వెళ్లిరి. అచ్యుతరామయ్యగారి వడ్డిమంగలి బాలాజీ "స్నానానికి నీళ్లు తోడానండి బాబూ" అని చెప్పగా అచ్యుతరామయ్యగారు దేశపరిస్థితులను మాటలాడుట చాలించి "తమరు స్నానం చెయ్యం డమృతరావుగారూ, ప్రయాణపు బడలిక తీర్చుకున్నాక సావకాశంగా మాట్లాడుదాం" మనగా అమృతరావు రామయ్య ఇచ్చినపంచె,తువ్వాలూ పుచ్చుకుని బాలాజీ దారి చూపగా స్నానాలగదిలోకి వెళ్లి స్నానాది అవశిష్టములు తీర్చుకుని వచ్చాడు. "మడికట్టుకోవచ్చు"నని పిలుపు రాగా పోయి వడమటింటిలో భోజనముచేస్తూ బెజవాడనుగురించి అచ్యుతరామయ్య, కాకినాడనుగురించి అమృతరావూ ఆంధ్రవిశ్వవిద్యాలయ కార్యస్థానము గురించి వుభయులూ మాట్లాడుకుంటూ భుజించి లేచారు. బాలాజీ తాంబూలము తయారుచేసి ఇచ్చి 'పక్కలు పరిచా'నని చెప్పగా "అయ్యా తమరు కాస్సేపు విశ్రమించండి. చాలాబడలివుంటా"రన్నా డచ్యుతరామయ్య "చిత్తం, దానికేమి లెం"డంటూ విశ్రమించా డమృతరావు. మధ్యాహ్నము కాఫీ ఫలహారం పుచ్చుకుని కాస్త తిరిగివద్దామా" అన్నాడు అమృతరావు. 'పదం'డంటూ అచ్యుతరామయ్యా అమృతరావూ కలిసి షికారువెళ్లి వచ్చారు. రాత్రిభోజనములవేళ అమృతరావు ఆరువేల నియోగియ నీ, ఇంటి పేరు భారద్వాజులవారనీ తెలుసుకుని తమ యిరువురకూగల దూరపు బంధుత్వము మూడుమాటల్లోదగ్గరకి తెచ్చాడచ్యుతరామయ్య."అవును; మాఅమ్మ చెప్తుతూ వుంటుంది. చింతలపూడివారు మనకు బంధువులని ఏం తెలుస్తుంది దూరానవుంటే" అన్నాడు అమృతరావు. మరునటిదినము గుమాస్తాకి కబురుపంపి "మన బంగాళాలో ఏదేనా ఖాళీవుందా క్రిష్ణయ్యా; క్రొత్తగా వచ్చిన డిప్టీకలెక్టరుగారికి కావాలీ" అనిఅచ్యుతరామయ్య అడుగగా గుమాస్తా చిత్తం మనదక్షిణపు వైపు బంగాళా ఖాళీగానే వుంచన్నాడు. అమృతరావా ఇంట్లోదిగె ట్రెజరీడిప్టీకలెక్టరు రంగయ్యనాయడుగారి

నుండి బార్జి పుచ్చుకుని క్రొత్తస్నేహితులతో, క్రొత్తబంధువులతో పాతకాపైనాడు.

చింతలపూడివారంటే లక్షాధికారులని ప్రసిద్ధి. గోదావరిజిల్లాలో వీరి నెరుగని వారే లేరు. రామారావుపేటలో నాలుగుకోట్లుకూడా ఉన్న పెద్దతోటయూ, నాలుగిళ్ళ భవంతీ, మేడా పూర్వోత్తరపు మోస్తరై నప్పటికీ తాతముత్తాతలయం దుండెడి భక్తిచే అచ్చొచ్చినఇల్లనీ ఆయింట్లోనే ఉన్నా డచ్యుతరామయ్య. సూర్యారావుపేట, రామారావుపేట, పాతకాకినాడ, ఎలివిన్ పేటలలో చాలాబంగాళాలు కలవు. గోదావరిజిల్లా అన్నిప్రాంతములలోనూ చింతలపూడివారి భూములే. తోటలు సరేసరి. తరాలనాటి భాగ్యము. అచ్యుతరామయ్య మహోదయుక్తిపరుడు. సొమ్ము అనవసరముగా పాడుచేయకతనకూ, తనకుటుంబమువారికీ గౌరవప్రఖ్యాతులకై ఎంతైనా పాటుపడువాడు; ఆవిషయంలో ఎంతైనా వ్యయంచేసేవాడు. మంచి మాటకారి. సాధారణంగా అందరూ అయ్యో చనకబియ్యే ప్యాసైనాడు. స్నేహపాత్రుడు. తెలున్నవాడు. ఎవరు క్రొత్తగావచ్చినా ముందు అచ్యుతరామయ్యగారి అతిథులౌటయూ, ఆయనచెలిమి కోరుటయూ, వెళ్లేటప్పు డాయనచేయువిందు లారగించి సన్మానము పొంది వెళ్లుటయూ వాడుక. అందుచేతనే మన అమృతరావుకూడా వీరింటి అతిథి అయ్యెను. ఇదిగాక బంధుత్వము కలిసినవాడౌటచేతను, స్నేహాభిలాషి గనుకను, ఒంటరిగా వుండుటచేతను పండుగపుణ్యములందే కాకశనివారాదివారములుకూడా అమృతరావచ్యుతరామయ్యగారింటనే భోంచేయుచూ కులాసాగా వుంటున్నాడు. అచ్యుతరామయ్యగారి భార్య విజయనగరపు దివాంజీగారగు కపింకోట భోగారావుగారి కొమార్తె. ఆమె అత్తవారింటికి వచ్చేటప్పుడు ఓవడ్డిపుంగలినౌకరునీ, ఓదాసీదాన్నీ, తలదువ్వుట మొదలగుపనుల కొక బ్రాహ్మణవితంతువునీ పుట్టింటివారు అరణమిచ్చారు. చిట్టెమ్మ అందమైనమనిషే. ఆమె ముస్తాబంతా తూర్పుపద్ధతి. మిక్కిలి భోగాభిలాషి. ఎప్పుడూ చేయనిశ్యంగారం మాయనివుడతాను. దాసీది నీళ్లుపోయుట, రమణమ్మ జడవేయుట, బాలాజీవేసినతివాశీపై తీవిగా

వంకైందనేసరకూ కూర్చుండుట ఇవియే ఆమె నిత్యకృత్యములు. చిట్టెమ్మ నాలుగుదేశపునగలూ గంగిరెద్దువలె అలంకరించుకొనును. ఆమె కాపసిమిలోహమూ, భార మెట్లులేదో? పనిపాటలు చేయ నక్కరలేదు సరికదా ఈవేటా ఆవేటా పిల్ల లేమో అంటే. వరప్రసాదిలాగ మోహను డొక్కడే కుమారుడు. ఆతనికిప్పుడు ఇరువయిఏండ్లు. యం. బి., బి. యస్. డాక్టరీకి చెన్నపట్నం విక్టోరియా హాస్టలులో వుండి చదువుచున్నాడు. 'వూళ్లో అమ్మలక్కలంతా చింతలపూడి చిట్టెమ్మగారికంతే షోకమ్మ, అనుకునేవారు. ఆమెకు షోకుకాకేమి!' కలిగినవుట్టిల్లా లక్షాధికారులు అత్తవారూనూ.

ఒకరోజున "పిల్లడిపెళ్లిమా టేమినిశ్చయించా" రందిచిట్టెమ్మ. "ఇంకనూ ఏమీ నిశ్చయించలేదు. మోహనుడు వస్తాడుగా వా డేమంటాడో చూదా"మన్నా డచ్యుతరామయ్య.

చి—వాడిమొహం వాడి కేమిటి తెలుస్తుంది. మనమే ఏదో స్థిరపరిచేసెయ్యాలిగాని. అ— చాలా సంబంధాలున్నాయి గాని మన అమృతరావుగారికొక కుమార్తె వుందిట; ఆపిల్లనిస్తే బాగుండును.

చి—ఆయనతనకూతుర్ని చేసుకోమంటున్నాడా ఏమిటి? పిల్ల నిమాడకుండా, ఎందరుపిల్లలో, ఏమిటో తెలియకుండా అమృతరావునిచూసి పిల్లను చేసుకోవాలంటారా ఏమిటి?

అ—కాదేఅతని కొక్కర్తెకూతురుట; పిల్లకి పదిసంవత్సరాలు. వీరితండ్రిగారి ఊరు గుడివాడ; తండ్రి యాస్తిదాయాదులు కలుపుకున్నారు. అమృతరావు తల్లివంక సాలుకు రెండువేలు వచ్చేభూములూ, వల్లూరులో ఇల్లూను. ఇదిగాక బెజవాడలో పాతిక ముప్పైవేలు చేసే ఇల్లు మొన్ననే కట్టేడుట. ఇతనేమో డిప్టీకలెక్టరు చేస్తున్నాడుగదా. ఇంకా సంపాదిస్తాడు. పిల్ల తండ్రిపోలిక. బాగానే ఉంటుందిట. ఈయావత్తు ఆస్తికీ ఆపిల్లే అధికారురా లవుతుంది. మన అబ్బాయికి చేసుకుంటే ఆ యాస్తి మనకు కలుస్తుంది.

చి—సరి బాగుంది; మీకు ఆస్తిలావుగా లేదు. వాళ్ల ఆస్తికి ఆ సి ం చ డా ని కి మన కే పదిమందు

న్నారుః. మోహను డొక్కడేగా నలుసు లాగ. వాడికీ లక్షరూపాయ లాస్తి ఎక్కితొక్కని.

అ—ఎన్ని ఏళ్లయినా నీలావు నీవుమాన లేదే.

చి—బాగుంది ఎప్పుడూ వేళాకోళమే కాని పిల్లడిపరీక్ష లెప్పుడూ? ఇక్కడికెప్పుడువస్తాడు.

అ—వచ్చేనెల్లో వస్తాడు.

"ఈసెలవులోపిల్లడిపెళ్లి చేసేయాలండి" చిట్టెమ్మ. "సంబంధం కుదిరితే నాఅడ్డులే" దన్నాడచ్యుతరామయ్య.

అమృతరావు కాకినాడకి వచ్చి ఆరుమాసము లైంది. ఇక్కడి పరిస్థితులూ, అచ్యుతరామయ్యగారి స్నేహమూ వారి ఆస్తీ, ఏకపుత్రత్వమూ, లెక్కింప శక్యముగాని వెండి బంగారములూ, దివాణములాగ పరిచారికాగణమూ చూచి అతనిలో కొంతమార్పు ఏర్పడి దినదినాభివృద్ధి అవుతూంది. పిల్ల పెండ్లిచేయుటయా లేక అవివాహితగా నుండుటయా అని ఆలోచించాడు. వివాహము చేసినట్లయితే తన ప్రతిజ్ఞకు భంగమని. లోకులకాకులవంటివారు పొడుచుకు తింటారు. ఊరివారికి భయపడి అన్ని విధాలా అనుకూలమైన సంబంధం వదులుకుంటే మళ్లీ ఇట్లాంటి సంబంధం దొరకదు. 'కాళ్లముందరిబేరం కాశీవెళ్లినా దొరక'దందురు. ఇదిగాక 'అమ్మ అస్తమానమూ, ప్రేమపెళ్లి చూడాలని వుందిరా' అంటూవుంటుంది. ఆమె పెద్దదైంది. ఏమైనా తీర్చగలంగాని మాతృఋణము తీర్పలేము. అమ్మకోరినట్లు ప్రేమపెండ్లి చేసి ఆమె ఋణమునుమాత్రము తీర్చుకుంటాను. ఎవరేనా అడిగితే 'ఎప్పటికయ్యది ప్రస్తుత మప్పటికా మాటలాడి' అని సుమతిచెప్పినట్లుగా అప్పటి కేదో తగినట్లు చెప్పేదను. ఒకవేళ ఏదేనా అబద్ధమాడినా "వారిజాక్షులందు వైవాహికములందు ప్రాణవిత్తమానభంగమందు రజితగోకులాగ్ర జన్మరక్షణమందు బొంకవచ్చు నఘముపొందదధిప!" అని శుక్రాచార్యుడు చెప్పనే చెప్పాడు గనుక ఏదేనా అబద్ధమాడినా వివాహవిషయం గనుక తప్పులేదు." అని ఈవిధంగా తర్కవితర్కాలు చేసి సమాధానపరుచుకుని పిల్లకు పెండ్లి చేయుటకు నిశ్చయించుకున్నాడు. అప్పటినుండీ చింతలపూడివారి సంబంధముకై ప్రయత్నించి అచ్యుతరామయ్యగారికి అయిదువేలువరకట్నం కావాలని తెలుసుకుని, ఆయన తనకు మిక్కిలి స్నేహితుడూ, బంధువూ గనుక పరస్పరంగా మాట్లాడితే ఏరెండువేలకో వప్పుకుంటా డనుకున్నాడు. కాని 'ఎక్కడేనా బావా అనుగాని వంగతోటలో మట్టుకు బావా' అన్నట్లు సొమ్ములో తనికెంతమాత్రమూ మొగమోటము లేదని అమృతరా వెరుగడు. మధ్యవర్తులద్వారా కొంతబేరము జరుపుతూనే వున్నాడు. దాసీది వచ్చి "అమ్మగోరూ, ఈయాల అబ్బాయిగోరొస్తారంటగా దండీ" అని పొంగి పోతూ అడిగింది. "అవు నే మైలుబండికి రావాలి." "సిట్టిబాబిప్పు డెంతపెద్దోరైనా నా సేతుల్లో పెరిగాడాబాబు. నాకత్తమానం సూడాలనుంటుంది. బేగల్లి పనిచేసుకొస్తా" నంటూ వెళ్లింది అప్పి. ఈలాగే అందరూవచ్చి అడుగుతూంటే, అవునని రోజూకంటే త్వరగా ముస్తాబై తివాసీమీద కూర్చుని కొమారునికై ఎదురు చూస్తూంది చిట్టెమ్మ.

మెయిలు సూర్యారావుపేటలో ఆగింది. సెకండుక్లాసుబండిలో నుండి కళ్లజోడూ క్రాపులా, సిల్కుసూటూ ధరించిన ఇరువదియేండ్ల యువకుడుదిగెను. "అడుగో అబ్బా" యంటూ అచ్యుతరామయ్యగారు ముందుకు నడువగా అమృతరావూ, కృష్ణయ్య మొదలగువారాయన నమస్కరించారు. మోహనుడు తండ్రికి నమస్కరించాడు. "ఈయన కొత్తగావచ్చిన డిస్ట్రిక్టుకలెక్టరుగారు. మనకు బంధువులుకూడా" నంటూ అమృతరావుని ఎరుకపర్చగా అమృతరావు మోహనులొండొరులు కరస్పర్శచేసి కుశలప్రశ్నలు వేసుకున్నాక అందరూ పట్నంలోని విశేషాలూ, మెడికలుకాలేజీనిగురించి, కొన్నిపేపర్లనుగురించి మాట్లాడుతూ ఇంటికి వచ్చారు. తను వ్రాసిన ఆన్సర్లనుబట్టి మొదటివాడుగా పేసౌతానని తోటివిద్యార్థు లన్నారుగాని రెండవవాడుగా కావచ్చునంటూ, తనకై ఎదురుచూచుచున్న తల్లివద్ద కతిచురుకుగానడిచాడు మోహనుడు. ఆనాడు మూడవవేళనివారమాటచే కాబోయే అల్లుని పంక్తిని భోంచేసి వారింటనే విశ్రమించా డమృతరావు.

చిట్టెమ్మ, అచ్యుతరామయ్య కొమారునితో మాటవరసని ఎండాకాలపు సెలవులలో వివాహము చేయదలచితిమనియూ, అమృతరావుగారి విషయములో తామెరిగిన సంగతులూ చెప్పి ఆయనకొమార్తెను స్థిరపరచేదమని చెప్పగా, తనమనస్సులో మంచి చదువుకున్న నాక్కనిపిల్లని పెండ్లాడాలని వున్నప్పటికీ ఆమాటచెప్పక "అప్పుడే ఏంతొందర నాన్నగారూ, చదువు పూర్తి అయ్యేదాకా పెండ్లిమాట తలపెట్టకం"డన్నాడు. "అదేమిటి బాబూ, అలాఅంటావు? నీచదువు కాపిల్ల అడ్డు తగులుతుం దనుకున్నావా ఏమిటి? నీచదువంతా అయ్యేదాకా కాపరానికిరాదులే. పదిపదకొండేండ్ల చిన్నపిల్ల"అంది చిట్టెమ్మ. ఆమాటకిసిగ్గుతో తలవంచుకున్నాడు మోహనుడు. అతనికి తల్లిదండ్రులయెడల మహాభక్తి. తన కుచదువుకున్న పెద్దపిల్లని వివాహమాడవలెనని వున్నప్పటికీ తల్లిదండ్రుల ప్రీతికై తన కయిష్టమైన బాల్యవివాహమున కిష్టపడదలంచుకున్నాడు. మౌనం అర్థాంగీకారమని తల్లిదండ్రులు సంతోషించారు.

మామూలుగా అమృతరావు అచ్యుతరామయ్యగారింట్లో వున్నప్పుడు టపాకూడా అక్కడికే వచ్చును. నేటి టపాలో వచ్చిన ప్రేమవ్రాసిన వుత్తరము తనలో చదువుకొని అచ్యుతరామయ్యగారి కివ్వగా ఆయన ఈప్రకారం గట్టిగా చదివాడు.

" ప్రియమయిన తండ్రిగారికి

మీవుత్తర మందినది. నాపరీక్షలు అయినవి. సెకండుస్టాండర్డునుండి థర్డుస్టాండర్డుకు మొదటిదాననుగా ప్యాసైనాను. నాకు మొదటితరగతి బహుమానము వచ్చినది. మంచి ప్రవర్తనకుగాను రివరెండు మదరు ఇంకొక బహుమానమిచ్చినది. మీరు ఎప్పుడు వచ్చెదరు? అమ్మ, బామ్మ బాగాయున్నారు.

మీ ప్రియపుత్రి

ప్రేమ."

"దస్తూరీ చూడూ ఎంతబాగా వ్రాసిందో"అంటూ తండ్రి ఇవ్వగా మోహను డందుకొని 'మైడియ్యరు పప్పా' మొదలు 'యువరులవింగుడాటరు' వరకూ చూచి చాలా బాగుందని అమృతరావుకి ఇచ్చాడు.

తను అనుకున్నమొత్తం రమారమీ వచ్చింది. ఇదియే అచ్యుతరామయ్యకు కావలసినది. చిట్టెమ్మకోరిక్పై పిల్ల ఫోటో తెప్పించి చూచారు. నాలుగువేలు వరకట్నమూ, ఆడుపడుచు లేదుగనుక అయిదురోజులూ అయిదువందలూ వియ్యపురాలికీ నిర్ణయించుకుని, వైశాఖమాసములో ముహూర్తంనిశ్చయముచేసుకుని నెలదినములు సెలవుతీసుకుని అమృతరావు బెజవాడ వచ్చాడు. చింతలపూడివారి ఆ స్త్రీ,అల్లుని తెలివితేటలూ, చక్కదనం వర్ణించి తల్లికీ, భార్యకీ చెప్పేడు. మనమరాలు పెళ్లి చూడడం గలిగిందిగదా అని మాణిక్యాంబ అపరిమితానందం పొందింది. కాని విమలకు మట్టుకు కోపం వచ్చింది. "ఇంతవరకూ అతిబాల్యవివాహాలు కూడదని మాకందరికీ నూరిపోసి, సభలలో ఉపన్యాసా లిచ్చి, ఇప్పు డీలా పదిఏళ్లైనా నిండని మనపిల్లకు పెళ్లి కుదుర్చుకువచ్చారు. లోకులే మనుకుంటారూ? అంత మనోనిశ్చయం లేనివారు మొదటనే మెదలకుండా వుంటే ఎవ్వరూ ఏమీ అనరూ లోకంలో పాటేను. అందరూ ఆడవాళ్లు కోరుతూంటే ఆపోరు పడలేక చేశా మంటూంటారు. ఇప్పుడు మిమ్మెవ్వరు పోరారని ఈలాచేశా"రంటూ పెద్దదండకం ప్రారంభించింది. "లోకులమాట కేమి వూరుకుందూ; ఈఅదును తప్పితే ఈలాటిసంబంధ మిక దొరకదు. ఎవ్వరేమనుకున్నా నాకేమీ లక్ష్యములేదు. గాలిదుమారంలాగ చెలరేగి వాళ్లేవూరుకుంటారు." "అయితే అబ్బాయీ, కట్నమేమాత్రము వప్పుకున్నావూ""నాలుగువేలు. అయిదువందలు వియ్యపురాలికీని," "అబ్బా కట్నం ఎక్కువ. కాని మహోన్నతసంబంధం. లక్షాధికారులు చింతలపూడి* వారు. నేచెప్పలే; వారు మనకు బంధువులనీ"అంది, "వరకట్నంకూడా వప్పుకున్నారుగద; ఏవేవి చేయనన్నారో అవన్నీ చేస్తూవున్నా"రంది విమల. అమృతరావుగారి కూతురికి పెళ్లని వూరంతా తెలిసింది. సంస్కారసభలు కూడాయి. అమృతరావు ప్రవర్తనని నిందించారు. సంఘానికి అమర్యాద తెచ్చాడన్నారు. ఈసంఘంలోంచి అతనిని తొలగించినట్లు తీర్మానాలు

చేసి పెద్దవుపన్యాసా లిచ్చి పేపర్లలో వ్యాసాలు వ్రాశారు. సంస్కారనాయకులు. "మనమనుకో లేదండీ, సమయమొస్తే కక్కుర్తిపడతాడనీ" అని జనసామాన్య మనుకున్నారు. ఇంకా కడుపుబ్బు తీరని ఒకరిద్దరు అచ్యుతరావుగారినే అడిగారు. "ఇదేమయ్యా"అని "ఏం జెయ్య మంటారురా ఆడవాళ్లు రాత్రీ పగళ్లు రాసుకుతింటూం టే ఎవరుపడగల రిపారు. స్త్రీలకు అయిష్టకార్యముచేసి వారితో మనం కాపురంచేసి నెగ్గగలమా." అని సమా ధానం జెప్పేడు. "అవునులేండి విశ్వామిత్రుడంతటివాడు మేనక మాయల్లో పడిపోయితపస్సే దగ్ధం జేసుకున్నా" డంటూ సమాధానపరుచుకున్నారు. మంచిదినం చూచి పెళ్లిపనులు ప్రారంభించి ముగించారు. బంధువులకీ, స్నేహితులకీ శుభలేఖలు పంపేరు.

పెట్టిదినము సాయంకాలము నుండియూ, అచ్యుతరావుగారిఇల్లు పచ్చని తోరణములతోనూ, గ్యాసులైట్లుతోనూ, బాజాభజంత్రీలతోనూ, పెక్కు వన్నెల చీరలూ, ఆభరణములూ ధరించిన స్త్రీలతోనూ క్రిక్కిరిసి అతి సందడిగా నున్నది. పురుషులు వారికిష్టమగు దుస్తులను ధరించిరి. కొందరు విలువవస్త్రము లున్నప్పటికీ విడనాడి మహాత్మునీ ప్రసాదమగు ఖద్దరు దుస్తులు ధరించి కళ్లజోడు బాగుగా మెరయునట్లు తుడిచిపెట్టుకుని పెళ్లిపందిరిలో ఆసీనులైరి. పెళ్లిపెద్దలు కొందరు జారిపోవుచున్న వస్త్రమును చక్కజేసి కొనుచూ మహా సందడిగా అటునిటు తిరుగుచుండిరి. కొడుకు నేయించి తెప్పించిన జరీగొండకాయలంచు తెల్లపట్టు పంచె కట్టుకొని అతిశోభికగా కళ్లు పెత్తనం జేస్తున్నది. మాణిక్యాంబగారు ప్రేమ పట్టుచీర గట్టుకుని కళ్యాణంబొట్టు పెట్టుకుని గౌరీతపస్సుకి కూచుంది.. పురోహితుడు సత్యనారాయణ కన్యావరణాలు చదువుతున్నాడు. వియ్యంకుడూ, ఆయన మామగారగు కసింకోట జోగారావుగారు ఇంకా వారితరఫు బంధువులు పెళ్లిపీటదగ్గరగా కూర్చున్నారు. వియ్యపురాలూ ఆమెతల్లి మొదలగు వారు స్త్రీలసభలో అగ్రస్థాన మలంకరించారు. కన్యాదాతలు పెళ్లికొడుకుతో పీటలమీద కూర్చున్నారు. ముహూర్తసమయం సమీపించినందున పెళ్లికుమార్తెను తీసుకురమ్మని అచ్యుతరామయ్యగారి పురోహితుడు తిరుపతయ్య కేకవెయ్యగా పెళ్లికుమార్తె మేనమామ గంపతో ప్రేమను ఎత్తుకువచ్చి దింపాడు. సరిగా రెండు మిది గంటలకు మంగళ ప్రదమైనట్టియూ వివాహసూచకమైనట్టియూ మంగళసూత్రమును ప్రేమమెళ్లో గట్టిగా మూడుముళ్లూ వేసి తనసహధర్మచారిణిగా స్వీకరించాడు మోహనుడు. స్థాలీపాకసమయాన్ని తన ఆశతీరా మోయలేనన్నినగ లలంకరించి భామవేషంలా తయారుచేసింది కోడలిని చిట్టెమ్మ. మనమరాలూ మనమడూ నమస్కరించరాగా పొంగిపోయి తన భూమిలోనుండి అయిదుపండలు వచ్చే భూమి రాసీ ఇచ్చింది. మాణిక్యాంబ ఇతరు లిచ్చిన కట్నాలతో కానుకలతో చింతలపూడి వారి కోడలయింది ప్రేమ.—

లగ్నంతరవాతసదస్యపుసందడియేమంవడి. బ్రాహ్మణ్య మంపందిరినిండానూవుగింజవేస్తే రాలకుండాకూచున్నారు. సదస్యమంతా అయ్యేటప్పటికి ఆలస్యమౌతుందని పెళ్లివారంతా కాస్త ఎంగిలిపడ్డారు. పెళ్లికూతురికీ పెళ్లికొడుక్కీ కాస్త ఫలహారం పెట్టి సదస్యం ప్రారంభించారు. సదస్యపుతంతు పూర్తి అయినాక పండితులు వారివారి పాండిత్య సామర్థ్యములు సభవారిఎదుట విశదీకరించారు. అప్పుడు తిరుపతిభట్లు" అయ్యా, అచ్యుతరామయ్యగారూ, తమ రీలా దయచేయండి అగ్రతాంబూలం, పండితతాంబూలాలూ తమరు దగ్గరుండి యిప్పించాలని పిలువగా ఆశీర్వచనంగానిచ్చి పిల్లలిని తేవతీస్తె వాళ్లు కాస్త ఎంగిలిపడతారు. ఇక్కడికే ప్రొద్దు పోయింది. తర్వాత మన ఫలప్రదానాలూ అగ్రతాంబూలాలూ సాయంత్రందాకా ఇవ్వవచ్చు"నన్నాడు. అచ్యుతరామయ్య చిత్తమంటూ సభాతాంబూల మివ్వడానికి పెద్ద లెవరంటే ఎవరని పురోహితులు వెతికారు. శేషావధానులుగారు పెద్దలని ఆయనకివ్వబోగా, రామసోమయాజిగారంటూ శేషావధాని వెనుకకుతగ్గాడు. అన్నివిధాలా అర్హతగలవారు మనచంద్రమౌళి శాస్త్రిగారుండగా మాకూ మాకూ ఏమిటంటూ సోమయాజి పలుకగా చంద్రమౌళిగారికి అగ్రతాంబూల మివ్వ స్థిరపర్చారు. 'మీ అందరికంటే పెద్దవాడినా. నాయందు మీకం

దరికీ అల్లా ఆసర మండబట్టి నన్ను పెద్దని చేశారంటూ శాస్త్రీగా రత్నతాంబూల మందుకుని జారిపోకుండా గట్టిగా పట్టుకుని వెనుకకు చూర్చున్నాడు. వీరేశలింగం గారికి శైవతాంబూలమూ, తిరువెంగళయ్యంగారికి వైష్ణవతాంబూలమూ, వ్యాసరాయాచారిగారికి మధ్వతాంబూలమూ ఇచ్చి ఆశీర్వచనపన్నా చదివి మంగళహారతి ఇప్పించి వధూవరులను లేవతీశారు. వేళదాటుటచే కాస్త ఎంగిలిపడి ప్రేమ బామ్మవళ్ళో కూర్చుంది. మోహనుడు తాతగారితో ఇష్టాగోష్టిమాట్లాడుతున్నాడు.

అక్కడ పందిట్లో ఇచ్చినఫలప్రదానాల్లో పండూఆకులూ వక్కలేగాని వారికంటికి కింపైన పైసా లేదు. ఇదేమాయని యొకరిమొగ మొకరు చూచుకుంటున్నారు. తక్కిన పండితోత్తములు తమ టరను ఎప్పుడువచ్చునా, ఎప్పుడు చేతినిండా దొరుకునా, ఎప్పుడు భుజములమీద దుశ్శాలువ పడునా, ఎప్పుడుకుండలములు చెవులకు వ్రేలాడదీయుదురా, ఎప్పుడు చేతులకు సింహతలాటం మురుగులు తొడుగుదురా అనెడి ఆత్రముతో వూపిరి బిగబట్టుకుని కూచున్నారు. పరదేశిబ్రాహ్మణ్యమునినదో వారికి ముందు ఉదరపూజ ప్రథమకర్తవ్యము. తదుపరి ఏమేనా చేతులో పడితే బ్రహ్మానందమే. ఇప్పటికి రెండుఝాములైంది. ఎప్పటికీ సంభావనమాట తెమలకుంది. ఎప్పుడు భోజననిండా భుజించెదమాయని పక్వాన్నముల పరిమళములు వచ్చినప్పు డల్లా గుటకలు మింగుతూ వున్నారాబడుగుబ్రాహ్మలు. 'నేనీ వూళ్ళో వుద్యోగంగా వున్నప్పుడేనా తలపెట్టావుగా నీపెళ్ళి. ఎవరేనా జబరుదస్తీ చేస్తే బంట్రోతులచేత ఆపు చేయిస్తును. ఇంతమందిజన మున్నారు. ఏలా అసగలదు. ఎలా నెగ్గుకువస్తాడా.' అని సంభావనసమయంలో వియ్యంకుడికి సాయం కేయాలని నడుంగట్టుకున్నారు అమృతరావూ, ఆయనభావమరిదీని." చిట్టిబాబూ"నువ్వు శాస్త్ర నిమ్మళించూ, మీనాన్నకి కొంచెం సాయంజేస్తానూ,మీదపడేస్తారీ ఆపాత్రపుబ్రాహ్మ"లంటూ జోగారావు వచ్చాడు. ఆమాటా నిజమే. చింతలపూడివారంటే ఆంధ్రదేశంలో ఎరుగనివారు లేరు. ఇదిగాక అమృతరావు డిస్ట్రిక్టకలెక్టరుగనుక పెద్దసంతర్పణ చేస్తాడు; తృప్తిగా భుజించవచ్చుననీ, అచ్యుతరామయ్యగారనాదినుండీ భాగ్యవంతులుగనుక కరువుదీరా సంభావ నిచ్చెదరనీ అపారంగా వచ్చిరి బ్రాహ్మణ్యం. మన అచ్యుతరామయ్యగారు మట్టుకు నదురూ, బెదురూ లేకుండా చీమ కుట్టినంత గాబరాయేనా పడక నుంచొని బ్రాహ్మణోత్తముల నొకపరి కలయచూచి, "అయ్యా, పండితోత్తములారా, బ్రాహ్మణులారా, ఇదివరలో ఎప్పుడైనా మా చింతలపూడి వారివద్ద నుంచి సంభావన పొంది సత్కరింపబడ్డవా రుంటే దయచేసి ముందుకు రాగోరెద"నని గంభీరముగా పలికెను. పలుకుటయే తడవుగా నేనంటే నేనని శాలువలవారూ, మురుగులవారూ, కుంపెలాలవారూ, ఇంకా కొందరు పండితులూ వారి అనుచరులూ ఒకరినొకరు త్రోసుకుని ముందు వరుసలో వదరుగా నిలబడి వారు వారు పొందిన బహుమాన విశేషములను ద్విగుణీకరించి వర్ణింపుచుండిరి. అచ్యుతరామయ్యగారు శాంతముగా విని "అయ్యా, బ్రాహ్మణశ్రేష్ఠులారా, మీమీయోగ్యతలనుబట్టి మీగౌరవానుగుణ్యముగా మాపూర్వీకులే మీ అందరికీ తగిన సంభావనలిచ్చి సత్కరించియున్నారు. గాన ఇప్పుడు వేరే నేనివ్వనవసరము లేద"ని మూడువాక్యములలో వారికి సంభావన మట్టుజెప్పేడు. అందరూ తెల్లపోయి ఏమనుటకూ తోచక ఒకరినొకరు చూచుకుంటూ కొంతసేపటికి సాహసించి 'అచ్యుతరామయ్యగారూ, మీతాతగారు ఇంద్రుడంతవాడు; మహాదానకర్ణుడు. ఆయన దయచేసిన దుశ్శాలువలూను,' అని యొకడూ, 'మీతండ్రి చంద్రుడంతవాడు. మీపుట్టుకకిచ్చారు నాకీకుండలాలు' లంటూ ఇంకొకడూ చెప్పి అటువంటి సంస్థానంలో పుట్టిన మీరు మాత్ర మేమి తక్కువ? తమకుతోచిన తృణమో పణమో దయచేయ,మని మనవిచేసుకున్నారు. ఆముందరివారు అచ్యుతరామయ్యగారి పూర్వీకులచే సంభావన నందినవారుగాన ఇప్పుడియ్య లేదు. మనమున్నదో ఇంతకుపూర్వము పుచ్చుకోని వారము గనుక మనలని బాగాసత్కరిస్తాడని'వుప్పొంగిరి. అందులో కొందరు'తోటి కూడా మాటామల్లే ఏమీ లేదేమిరా' 'అంటే ఆపక్కవాడు తెస్తున్నాడేమోరా

అని ఒకరితోనొక రనుకొంటూ సంభావన నందడానికి శీలుగా నుంచున్నారు వెనకనున్న వారు 'అయ్యో ఎందుకొ స్థితి ముందరివరుసకు. వెనకకు దిగడినా బాగుండేది' దని ముందరి కొచ్చినవారు చింతించుచుండిరి.

ముందుకొచ్చినవారి మనవులు చెవినిపెట్టక వెనుకపంక్తివారి నుద్దేశించి "అయ్యా, ఇప్పటికే చాలా ఆలస్యమయింది; క్షమించుడు. ఈ రెండులో ఇంతసేపుంచి మిమ్మి విసికించి నందుకు వందన సహస్రములు. మీ రర్హులుగారనియో, మరి దేకారణముచేతనో మీకు సంభావననివ్వ మావారు నిరాకరించిరి. మాపూర్వీకులచే నిరాకరింపబడ్డ వారు మాకున్నూ నిరాకరింప తగ్గవారే. కాన మావల్ల మీకేమి సంభావన ముట్ట"దంటూ కొడుకుసగ్గరికి చక్కా వెళ్లాడు అచ్యుతరామయ్య. ఇంకేముంది? పందిరంతా గొల్లుమని గందరగోళం బయలుదేరింది. "పెళ్లికొడుకు తండ్రి ఇంతబాగా సంభావనిచ్చాడు; ఇంక పెళ్లికూతురు తండ్రి చేసే సంతర్పణ ఉందిగా బోలు ఆడీవుల్లక్కా తెంపండిరా తోరణాలూ" అంటూతోరణాలపై చెయ్యివేసారా తుథార్తులగు పరదేశి బ్రాహ్మణ్యం. ఇంతసేపూ జరుగుతూవున్న సంభావనా చిత్రము చూచుచూ, చిత్ర ప్రతిమవలెనున్న అమృతరావు కో గాంకా వుగారిపా కుముతో "అయ్యలారా, తోరణములు త్రెంపకండి. నామనవి విని నేచేసెడి సంతర్పణయందు తృప్తిగా భుజించి, నేనిచ్చెడి అల్పసంభావన స్వీకరించి మీరు తృప్తులై నన్ను ధన్యుణ్ణి చేయం"డని చేతులెత్తి ప్రార్థింపగా డబ్బాశ గల పండితులు "చాల్లేనయ్యా చేశావుపెండ్లి—నీపెండ్లీనీవూనూ" అంటూ లేచిపోయారు. అన్నార్తులగు విప్రులందరూ తమాయించి "అయితే కానీ మరి" అన్నారు. తత్ క్షణం పందిరంతా బాగుచేయించి విస్తళ్లువేసి వడ్డింపించి తనకుతో చినది చెంబులలో తేగా డమృతరావు. తృప్తిగా భోంచేసి బొజ్జలు తడుముకుంటూ 'మాబాగాచేశాడురా సంతర్పణ; పాపంఅమృతరావుగా' రంటూ త్రేన్చి ఇంతకాలంనుంచి పెండ్లిండ్లకు వెళ్లుతూ వున్నాము కాని యీ చింతలపూడి వారిసంభావనంటేని చూడలేదంటూ ఎవరిదారిని వారు వెళ్లా రాబ్రాహ్మలు. అప్పటినుండీ 'చింతలపూడివారి సంభావనలాగుందే' అన్న మాట ఆంధ్రులందరికీ వాడుకపద మైంది.

విదురుఁడు ధర్మజునితో

వేమూరి సీతారామశాస్త్రి గారు

అన్నా! పట్టియమాయకుండవు గదన్నా!, నమ్ము; మాయంధరా
జన్నా గోముఖపుండరీక; మతఁడీర్ష్యాయత్తుఁడై యెద్దివా
కొన్నా మేలనియే తలంచెద; వనుంగుం దమ్ములన్నిన్ను నేఁ
బన్నం బూన్పఁగ వారణావతముఁ బంపంబూనె నూహించితే?

తెల్లనివెల్లను బాలని - నల్లనివెల్ల జలమనుచు; నమ్మెద వీ వే
కల్లయుఁ గపట మెఱుంగవు - ప్రల్లదుఁ గౌరవుని నేమఱం గాదుసుమా.

ఈయెడ మీరలున్నఁ దమ కింతయుఁ బేర్ప్రతిష్ఠ లుండవం;
చేయపకారముం జలుప నే మొకయడ్డుగ నున్నవార మం;
చాయఘురాశి, యాకితవుఁ డాపలుగాకి సుయోధనుండు మీ
కీ యనిమిత్తహాపయున మేర్పఱచెం; బరిణామ మేమొకో!

ఇందేదే నెప మొక్కఁడుండవలెఁ జు మ్మేనాఁటి కానాఁడు నా
డెందం బందినయంతమెల్లఁ దగుమాడ్కి న్నీకెఱింగింతు; నే
చందానన్ సహజన్ములన్ జనని లెస్సం గాచికొందో? మనం
బందెం గొందల; మింత యేమఱకుమన్నా! నిద్రయం దేనియున్.

నమ్మక నమ్ముచుం బరిజనవ్రజముం బ్రియసామవాక్ప్రియో
గమ్మునమాత్రఁగాక యధికంబగు త్యాగముకల్మి నెల్లెడన్
సమ్మదమందఁ జేయుచు, విషజ్వలనోరగముఖ్యహింస్ర జా
లమ్ము దెసం బ్రమాదముఁ దలంగి మెలంగఁగఁబోలు ధర్మజా!

ఎన్నఁడుగాంతువో కవల నియ్యనిలాత్మజు సవ్యసాచిఁ, గొం
తి, న్నిను వెండి; ప్రాణ మట నిక్కము మే నిట నాకుఁ; దండ్రి తాఁ
బిన్నటనాఁడ పోయినను విద్యయు బుద్ధియు నబ్బియున్నవీ
యున్నతికోర్వఁ డాయెన సె యుక్కువఁ డంధుఁడు బిడ్డప్రేరణన్.

చెప్పెనుబో! సుయోధనుఁడు సిగ్గఱి; బిడ్డలఁగన్నవాఁడె; పై
తెప్పలు నైతమున్నరయ వృద్ధుఁడె, యుద్ధమనస్కుఁడే, యెటుల్
దప్పఁదలంచె మీవలనఁ దా ధృతరాష్ట్రుఁడి కందు నెట్టులే
ముప్పుఘటిల్లునో? యుఱక పుట్టఁగ లేదు ప్రయాణ మిత్తఱిన్.

దుష్టచతుష్టయం బాకటఁ దోఁచుటఁ జేసి యిటుల్ మనంబునన్
గ్లిష్టత నందఁ గావలసెఁ; గేవలముం గనుమ్రోలనున్న నే
నష్టియుఁ గూర్ప నోడుదురు, నాయన! యింకట నీదుధర్మ మే
కష్టపరంపరల్ దలఁగఁ గావలె, సౌఖ్యముఁ గూర్పఁగావలెన్.

వెంటనె పోయిరండు, పదవిన్ శుభ మబ్బెడుఁగాక మీకు నె
ప్పంటికిఁ గృష్ణుఁడే సకలభద్రవిధాయి ధ్రువం బటేని యా
కంటకుఁడైన కౌరవుని గారడిలోఁ పడ కుండ్రుగా, కెటుం
గంటిని తెప్పవోలె మిముఁ గాతురుగావుత మెల్ల దేవతల్.

ఆంధ్ర లిపి సంస్కారము

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు

నేఁడు వాడుకలో నున్న మన తెనుఁగులిపి మనకు మిక్కిలి చిక్కులు గలిగించునదిగా నున్నది. పసిబాలురకు లిపి నేర్పుటలో క్లేశము గలదు. గ్రంథముల నచ్చొత్తించుటలో క్లేశము గలదు. టైపు రైటింగు నిర్మాణమున కసౌకర్యము గలదు. అంతేకాక వర్ణోచ్చారణ రీతికిఁగూడ విరోధము గలదు. ఇవియెల్లఁ జిన్న చిక్కులు గావు. వీనిని గొంత వివరింతును:

౧

బాలురకు నేర్పుటలో క్లేశము

అచ్చులలో హ్రస్వదీర్ఘములగు అ, ఆ,లు ఈ షద్భేదము గల సమాన లిపులై యుండఁగా, ఇ, ఈ లు పోలికయే లేనివిగా నున్నవి. అందు ఇ, చవర్ణాంత్యానునాసికమగు ఞతో పోలిక గలది. ఋ, ౠ లు బు, బూ ల పోలిక గలవై రెండుకొమ్ములు గలిగి పొందిక లేక మోటుగా నున్నవి. ఒ ఓ ఔ లు జతో పోలిక గలవి. ఇఁక హల్లులలో కవర్గమెల్లఁ బోలికయే లేని భిన్నభిన్న లిపులతో నున్నది. ఖ కు తలకట్టు లేదు. ఘ 'ఫ ఫు, ష, షు' అక్షరముల పోలిక గలది. చవర్గమున చ-ఛలు పోలిక గలిగియున్నవి. కాని జ ఝ లు భిన్నములుగానే యున్నవి. జ కు తలకట్టు లేదు. అది ఒ ఓ ఔల పోలిక గలది. ఝ ఝ, ఞ వర్ణముల పోలిక గలిగి రెండుకొమ్ములు గలిగి యసందర్భముగా నున్నది. ఞ ఇకారముతోఁ బోలిక గలది. టవర్గమున ట, ఠ లు పోలికలేనివి. డఢ లు చ ఛ ల వలెఁ బోలికగలవి. ణ తలకట్టు లేనిది; క,చవర్గముల యంత్యానునాసికములు, ఙ, ఞ లు చిహ్నము గలవైయుండఁగా ణకు అది లేదు. దీనితర్వాతి వర్గానునాసికము లగు న,మ,లకును నాచిహ్నము లేదు. తవర్గమున, త మాత్రము భిన్నమై తర్వాతి మూఁడక్షరము లగు థ ద ధలు పోలిక గలిగి యున్నవి. న సతోఁ బోలికగలది. పవర్గమున ప ఫ లు బ భ లును బోలియున్నవిగాని బకు తలకట్టు లేదు. మకు కొమ్మున్నది. ఇది వ పోలిక గలది. దీనితో భేదము గల్పించుటకు గాను వకుఁ గొమ్ము ముడ్డికింద ఈయవలసెను. ప,ష లకుఁ గూడఁ గొమ్మిచ్చుటలో నిట్టిచిక్కే కలదు. య కొమ్ము గలది. ర ఱ లు-ల ళ లు - శ ష లు-పోలిక లేనివిగా నున్నవి. స నతోఁ బోలిక గలది. హ వ తోఁ బోలిక గలది.

ఉచ్చారణమునఁ బోలిక యుండుటను బట్టి లిపిలోఁగూడ బోలికయుండఁదగిన యక్షరములు, క ఖ లు-గ ఘ లు-జ ఝ లు-టఠలు తథ-ర ఱ లు, శ ష స లు పోలికలేనివై, పూర్వోక్త విధమున నుచ్చారణమున నేమాత్రమును బోలికలేని యక్షరములు గొన్ని పోలిక

గలవై యుండుటచేతను, వరాక్షరాదులు సరియయిన నిర్మాణక్రమము లేనివిగా నుండుటచేతను, బాలురకు లిపిని నేర్పుటలో మిక్కిలి చిక్కు గలదు. చ కు ముడ్డి క్రింద ఒత్తిచ్చినచో ఛ అగునని చెప్పుటకు వీలులేదు. కఖ-టఠ-తథ-లు అట్లు లేవు గాన, సాజాత్యబోధము కుదురదు. ఇంత వరుస, వావి లేని లిపిరూపములను భిన్న భిన్నముగా నేర్చుకొన కష్టమే కాదా? మఱియు, నివిగాక, అచ్చుగుణితము వేఱుచిహ్నములతో నేర్చుకొనవలెను. హల్గుణితము వేఱుచిహ్నములతో నేర్చుకొనవలెను. ఈ గుణితములలోఁగూడఁ బెక్కు చిక్కులు గలవు. ఇవి కొంత ఉచ్చారణరీతికి విరుద్ధముగాఁగూడ నున్నవి. హల్లుపై అజ్గుణితమును జేర్చునప్పుడు తలకట్టు అకార మున్నప్పుడు మాత్రమే ఉండఁదగును. తక్కిన యచ్చులు చేరునప్పు డుండ రాదు. క,కా,కి,కీలు సరిగా నున్నవి. కాని, కుకూలు తప్పుగా నున్నవి తలకట్టు, కొమ్ము రెండును ఉండఁగూడదు. 'కృ కౄ'లకును ఇట్టిచిక్కే కలదు. ప్రైమరీ స్కూళ్ల పంతులవార్లు కొందరు, 'కృ,కు కకార అకార, ఋకారములు 'కృ' అని వర్ణక్రమము చెప్పుటను వింటిని. వారట్లు చెప్పుట వింతగాదు. వట్రువసుడి ృ, ౄ ఒత్తులవలె హల్లుగాఁ దలఁపఁబడుననియేకదా కొందఱు లాక్షణికులుగూడ అదియున్న హల్లు తక్కిన యచ్చులతో నున్న యీహల్లుతోఁ బ్రాసమునఁ జెల్లునని చెప్పిరి! కనుక, కొమ్ము, కొమ్ముదీర్ఘము—వట్రువసుడి, వట్రువసుడి దీర్ఘము, ఉన్నప్పుడు హల్లుకు తలకట్టు ఉండుట అక్రమము.

ఇక హల్గుణితములో 'వాక్స్వాతంత్ర్యము' అనుపదము వ్రాయునప్పుడు 'క్స్వా'లో కకార సకారములు హల్మాత్రములు. వకారము ఆకారముతో గూడినది. క్స్వాను విడఁదీసినచో 'క్, స్, వా' అగును. కాని మనము లిపిలో ఆకారమును కకారము మీఁదనే ఉంచుచున్నాము. సకార వకారములను క్రింద ఒత్తులనుగా ఉంచుచున్నాము. బడి పంతుళ్లును గొందఱు పండితులునుగూడ 'కాకు దీర్ఘమిస్తే కా. కాకింద సావత్తిస్తే క్సా క్సాకింద వావత్తిస్తే క్స్వా' అనియు, 'కకార ఆకార సకార వకారములు క్స్వా'అనియు వర్ణక్రమము చెప్పుచున్నారు. ఇది తప్పు గాదా! నాగరాక్షరములు ఈవిషయమున ఉచ్చారణ రీతి ననుసరించి సరిగా నున్నవి. ఆలిపిలో సంయుక్తాక్షరమునఁ గడపటి హల్లుమీఁదనే యచ్చుండును. తత్పూర్వము గల్గు హల్లులు అర్ధాక్షరచిహ్నములుగలవిగానే ఉండును. బాలురకు లిపి నేర్పుటలో నిట్టిచిక్కులు గలవు. అలవాటు పడియుంటిమి గనుక నేఁడు మనకివి యంతగాఁ జిక్కుగూర్చునవిగాఁ దోఁపక పోవచ్చునుగాని బాల్యమునఁ దొలుత నేర్చుకొను నప్పుడు మన లెల్ల రనుగూడ నీచిక్కులు బాధించియే యుండుట వాస్తవము. ఎంత యలవాటయినను ప్రౌఢులనుగూడఁ గొందఱ నీ చిక్కులు బాధించుచునే యున్నవి. తొలుత నేర్చుకొను నప్పుడు బాలురెల్లరును బాధ పడుచునే యు

న్నారు. ఈబాధ సరకుగొనరాని దనరాదు. అక్షరాలువడిగా రాకపోవుటచే బాలురెందఱో బండవాజి చదువున సన్నగిలుచున్నారు; బడి యన్న భయపడుచున్నారు. ఈ లిపిక్లేశములు వారి హృదయప్రసాదమును జెఱుచుచున్నవి. అక్రమపు క్లేశములకుఁ బాల్పఱిచి వారిని బాధింపరాదు.

౨

అచ్చులో కష్టములు

ఇప్పుడున్న లిపిరీతినిబట్టి ముద్రణమున వేలువేలు లిపిసంకేతములు ఇంచుమించుగ అయిదునూఱులు కావలసియున్నవి. వాని నీ క్రింద జూపుచున్నాఁడను:—

అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ
ౡ ౡా ఎ ఏ ఐ ఒ ఓ ఔ
ఇవి ౧౬.

క కా కి కీ కు కూ కె కే
కొ కో కౌ క్ ఇవి ౧౨.

ఇట్టివి క-మొదలు క్ష-వఱకు గల ౩౬. అక్షరములకు మొత్తము-౪౩౨.

ౚ ఛ ఎ బ శ్రీ ి ె ౖ ల్
ౠ ౨ ౖ ౕ ౕ ృ ౄ ౢ ౣ
ు ౧ ట డ ౼ ౦ ౽ ౯ ౼
ఖ ఝ హా ఎ ఱ ౦ ౠ ఞ
జ ఝ ఙ ం ఢ ణ ధ ధ ఞ అ ద
ౙ ఁ ం ఇవి-౪౯.

సంకేత బాహుళ్యముచే సాధారణముగా డెమ్మీసైజులో నాల్గుఫారములకు సరిపడు సైపును గొనవలెనన్న రూ ౪౫౦ లు విలువ యగును. ఇదే విలువకు ద్రవిడ లిపిలో ౮ డెమ్మీఫారముల సైపు వచ్చును. ఇట్లు ధర తక్కువ యగుటకుఁ గారణము అఱవలిపి సంకేతములసంఖ్య మిక్కిలి తక్కువగా నుండుటే. అందు ౨౪౬ మాత్రమే లిపిసంకేతములు. క్రొత్తగా కంపోజిటర్లు తెలుఁగచ్చుకూర్పును నేర్చుకొనుట కాఱు నెలలు పట్టును. ఒకనెలలో అఱవపు టచ్చుకూర్పు నేర్చుకోవచ్చును. ౯౦౦ గళ్లలోనుండి సంకేతముల నేర్చవలసియుండుటచే తెలుఁగు లిపిని గూర్చుటలోఁగూడఁ జాలజాగగును. గంటకు ఒకగాలీ అఱవముకూర్పఁగలుగఁగా, తెలుఁగున అరగాలిమాత్రమే కూర్పఁగల్గుదురు. ఇట్టి కారణములచే తెలుఁగుకంపోజిటర్లు విరివిగా దొరకరు. తక్కినభాషల కంపోజిటర్లకంటె వీరికి జీతము హెచ్చు. ఇదిగాక అచ్చుకూర్పులో సౌందర్యము తక్కువ. ఒత్తక్షరమున 2, 3, 4 లిపిచిహ్నములు ఒకదానిక్రిందఁ నొకటిగాఁ జేర్చవలసియుండుటచే బంతులు తీర్చినట్టు సాగవు. 'వాక్స్వాతంత్ర్యము' అను పదము అచ్చుకూర్పున అందముగా నుండదు. అక్షరము క్రింద నక్షరముఁ జేర్చవలసియుండుటచే 'ఫుల్ బాడీ, ఆఫ్ బాడీ' యను భేదములతో వేఱు తీరులయక్షరముల నెక్కువగాఁ బోఁత పోయవలెను. ౯౦౦ లిపిసంకేతములను నిర్మింపవలసియుండుటచే వ్రాఁతమోడి, పరిమాణము భిన్నభిన్నములుగా నుండునట్లు అనేక విధములగు లిపిభేదములను గల్పింప సాధ్యపడకున్నది.

ఇప్పుడు ప్రధానముగా గ్రేట్ ప్రైమరు, ఇంగ్లీషుబాడీ, అను రెండు తెలుఁగుల లిపులే గ్రంథముద్రణమున కుపయోగపడుచున్నవి. ఇంకను రెండుమూఁడు తెలుఁగులున్నను, నవి హెడ్డింగులకును, ఫుట్‌నోటులకును మాత్రమే పనికివచ్చునుగాని గ్రంథ ముద్రణమునకుఁ దగవు. మద్రాసులో అఱవమున డెమ్మీఫారము ముద్రణమునకు నాలుగురూపాయలు చార్జి చేయఁగా తెలుఁగున నదేమాదిరి ఫారమునకు ఆఱు, ఎన్మిది రూపాయలు చార్జి చేయుచున్నారు. ఇట్టి వింక నెన్నో చిక్కులు తెలుఁగు ముద్రణ విధానమునఁ గలవు. ఇంతకుముందు మొదటి ప్రకరణమునఁ జెప్పిన వ్రాఁతచిక్కులెల్ల నీముద్రణమునకును గలవు.

3

టైపురైటింగు

అచ్చునకే యిన్నిచిక్కులుండఁగా నిఁక టైపురైటింగు కుదురునా? ఇంగ్లీషున, అఱవమున ఉన్నట్లు లిపిసంకేతములు, ప్రక్క-ప్రక్కనే (ఒకదాన్నిక్రింద నొకటి యుండరాదు) యుండుట, ఆ సంకేతములుగూడ నలువదింటి కంటె మించకుండుట, ఉన్నగాని టైపురైటింగు సాధ్యము గాదు. కాన యిప్పటి లిపిరీతికి టైపురైటింగు కుదురనే కుదురదు.

౪

సంస్కార మెట్లుండవలెను?

మీఁద వివరింపఁబడిన చిక్కులెల్లఁ దొలఁగునట్లు అనఁగా బాలురకు సులభముగా నేర్వఁదగియుండునట్లు, అది విస్పష్టముగా నొక నిర్మాణవిధానముతో నుండునట్లు, ఉచ్చారణరీతికి భిన్నము గాకుండునట్లు, అచ్చులో సౌకర్య మేర్పడునట్లు, టైపురైటింగుకుఁ గుదురునట్లు సంస్కరించుట సాధ్యమేని యది యవశ్యకర్తవ్యము గాదా? తాతలు త్రవ్విన నూయిగదాయని యందుండి యుప్పనీటినే యెప్పుడును ద్రాగుచుండఁదగునా దగ్గఱనే మంచినీటిబావి త్రవ్వఁదగియుండెనేని? అదిగాక, నేటి లిపిరీతిమాత్రమే మంత నిశ్చలము! అయిదువందలయేండ్ల పూర్వమునఁ గల లిపికిని మననాఁటి లిపికిని నెంతేని భేదము గలదు. నేఁటిలిపికూడ బహుపరిణామములఁ బొందుచు వచ్చుచున్నదే.

లిపిలో నిప్పుడున్న కీళ్లను దొలఁగించుకొనుట ఆవశ్యకమే కాని, వానిఁ దొలఁగించుకొనుటకై చేయుమార్పులలో నున్న మేళ్లుగూడఁ గొన్నియుండుటయగునేని యావిధానమంగీకారార్హము గాఁగూడదు. మఱియు నా మార్పులు సులువుగా జరపఁదగినవై యుండవలెనుగాని మూలచ్ఛేదులుగాను, సర్వము తాఱుమాఱుపఱచునవిగాను, అమితవ్యయాపాదులుగాను, జనసామాన్యమునకు ఆరంభమున నేని ఉక్కిరిబిక్కిరిగా అర్థముగానివిగా నుండునవిగాను గారాదు. అట్టివానివలన అలజడి, అశాంతి, యేర్పడును. నేఁటి తెలుఁగక్షరములనే తీసివేసి వానికిబదులు ఇంగ్లీషక్షరములనో, నాగరాక్షరములనో పెట్టుదమను వారు కొందఱు గలరు. ఈసూచన లనర్థ

దాయకములు. ఆ మార్పులు సులువైనవి గావు. ముత్తెపుసరులను జాచిపట్టినట్లు తెలుఁగు వ్రాఁతబంతులు గుండ్రని వ్రాలు గలవై యందముగా నుండును. ఇది మనలిపికున్న యున్నత సుగుణము. దీనిని గోల్పోరాదు. ఇంగ్లీషు నాగరలిపుల కీయందము లేదు.

మఱియు, చేసిన సంస్కారము, ఇప్పుడున్న లిపికి అలవాటు పడియున్న వారి కెల్లరికి, క్షణములో గుర్తింపఁదగినదై, యనుకరింపఁదగినదై యుండవలెను. అది వ్రాఁతలో, అచ్చులో, టైపులో, మూఁడిటను భేదము లేక ఒకేతీరుగా నుండవలెను. వ్రాఁతలిపి వేఱు అచ్చులిపి వేఱు, టైపులిపి వేఱు అన్నట్లుండరాదు. మహారాష్ట్రి గుర్జర దేశములందు నాగరిలిపి కిట్టి చిక్కు గలదు. అందు వ్రాఁతమోడిలిపి వేఱు. అచ్చులిపి వేఱు. అట్టి విభేదము మనకుఁ గల్గరాదు.

౨

సంస్కారవిధానము

మీఁద వివరించిన దోషములెల్లఁ దొలఁగునట్లును, గుణములెల్లఁ గూడియుండునట్లును గుదిరియున్నదని నేను విశ్వసించిన సంస్కార విధానము నిక్కడ చూపుచున్నాఁడను.

అచ్చులు:

అచ్చులలో అకార మొక్కటి తక్కఁ దక్కిన యక్షరముల నెల్ల విడిచిపెట్టవలెను. అకారముమీఁదనే దీర్ఘము, గుడి మొదలగు అజ్గుణితచిహ్నములను (చిత్రము ౧ చూచునది.) చేర్చినచో అచ్చులెల్ల నేర్పడును. అకారమును మాత్ర మట్లే యుంచునది. హల్లుల మీఁద నీఅకారము '✓' తలకట్టు రూపమును బొందును. ఆకారాది స్వరములు హల్లులమీఁద నున్నప్పుడే గుణితములగును గాని అకారముమీఁద నున్నప్పుడు గావు- అచ్చులకు గుణితము లేదుగాన.

అ,ఆ,ఇ,ఈ,ఉ,ఊ,ఋ,ౠ,ఌ,ౡ,ఎ,ఏ, ఐ,ఒ,ఓ,ఔ అనువిధములఁ గల బదునాఱు లిపులకును, ఈ చిహ్నముల నుంచవలెను. (చిత్రము ౨ చూచునది.)

అచ్చుల చిహ్నములెల్ల అక్షరముల శిరస్థానమున నుండవలెను; హల్లులలో నవి తలకట్టిచ్చు చోట నుండి యుపక్రమింపఁబడును గాన. ఈకారణముచే ఉ,ఊ,ఋ,ౠ,ఌ,ౡ చిహ్నములు క్రొత్తవిగాఁ గొంతమార్పఁబడినవి. ఇట్లు మార్పఁగా-బాలురకు ఒక్క అకారము మాత్రము నేర్పి తర్వాత దీర్ఘము,గుడి మొదలగు అజ్గుణితపు చిహ్నముల నేర్పినచో నచ్చులెల్లవచ్చును.కకారాదులమీఁద నిఁక వేఱుగా అజ్గుణితమును నేర్పఁబనియుండదు. ఒక్క తలకట్టు మాత్రమే నేర్పవలసియుండును. దీర్ఘము, గుడి మొదలగు గుణితపు చిహ్నములు అచ్చులలో నేర్పుటచే నాచిహ్నములెల్ల హల్లులపై నజ్గుణితస్థానములం దుండును. కావున పదునైదు భిన్నాక్షరముల నేర్చుకొనవలసిన బాధతగ్గినది. ముద్రణమునఁ గూడ అచ్చులలో పదునైదుచిహ్నములు తగ్గిపోయినవి.

ఁ, ం, ః, అరసున్న, నిండుసున్న, విసర్గము పూర్వమువలెనే ఉండవలెను.

హల్లులు

హల్లులలో క, చ, ట, త, ప, వర్గములు సమానలిపి నిర్మాణముగలవిగా నిట్లు మారవలెను. వర్గ ప్రథమాక్షరమునకు ప్రక్కను ఒత్తిచ్చినచో ద్వితీయాక్షరమగును. వర్గ తృతీయాక్షరమునకు ప్రక్కను ఒత్తిచ్చినచో వర్గ చతుర్థాక్షర మగును. వర్గప్రథమాక్షరమునకే తలకట్టుస్థానమున నుండి కుడిప్రక్కకొక్కగీత 7 అంకెవలె సాగినచో వర్గ పంచమాక్షర మగును. అకారముతోఁగూడిన హల్లుల కెల్లఁ దలకట్టుండవలెను. తలకట్టు అక్షరమునంటియే యుండవలెను. అనఁగా, ప,స,లు తలకట్లతో నంటియుండవలెను. ఇట్లు తీర్పఁగా వర్గాక్షరము లిట్లేర్పడును. (చిత్రము 3 చూచునది.)

ఇందు బాలురకు వర్గ ప్రథమ తృతీయాక్షరములను బదింటిని మాత్రమే వ్రాయనేర్చుకొనుటలోఁ బ్రయత్నమగును. ఒత్తుగలయక్షరములను ఒత్తి పలుకవలెనన్న విషయము త్రుటిలో బాలుర హృదయమున నాటి నెలకొనును. క నేర్చినవానికి, దాని ప్రక్కనే ఒత్తుగీఁత గలయక్షరమును ఖ నుగా గుర్తించుట, ఉచ్చరించుట కడు సులభము. వర్గ ద్వితీయ చతుర్థాక్షరములెల్ల నిట్లే సులువుగా నేర్వఁదగినవగును. భిన్నభిన్న రేఖలతోఁ గ్రొత్త లిపులను దిద్దుట, యుచ్చారణమును జ్ఞప్తియం దుంచుకొనుట యను కష్టము లుండవు. తలకట్టుకుఁ గుడిప్రక్కనుండి ఇంగ్లీషు 7 అంకెవంటిగీఁత గీచిన ననునాసికాక్షరమగునని చెప్పి యుచ్చారణము నేర్పినఁ జాలును. దీనినిబట్టి యిరువదియైదు వర్గాక్షరములలోఁ బదిమాత్రమే దిద్ది నేర్పవలసినవి; తక్కినవి కడుసులభముగా జ్ఞాపకమునఁ బెట్టుకొని రెండుగీఁతల భేదముతో వ్రాయఁదగినవి యగును. వర్గాక్షరములెల్ల నొక్కనిర్మాణక్రమము గలవగును.

ఇట్లు మార్పఁగా ముద్రణమునఁ గూడ నిర్వదియైదు వర్గాక్షరములలోఁ బదునైదక్షరములు తగ్గిపోవును. వర్గ ద్వితీయ చతుర్థాక్షరముల నచ్చునఁ గూర్పవలసినప్పుడు, వర్గ ప్రథమ తృతీయాక్షరములఁగూర్చి వానిప్రక్కనంటి యొక్క నిలువుగీఁత (|) అంకెను జేర్చిన సరిపడును. వర్గపంచమాక్షరమునకు, వర్గప్రథమాక్షరము తలకట్టునొట్టునట్టి 7 అంకె వలె క్రొత్తగా నిర్మించినదానిని చేర్చినఁ జక్కఁబడును.

ఇఁక అంతస్థములు—ఊష్మలు

యకుఁగల కొమ్మును దొలఁగింపవలెను. రకే ప్రక్కను ఒత్తిచ్చినచో బండి ఱ అగును. లకు తలకట్టుండవలెను. లకే ప్రక్కను ఒత్తిచ్చినచో ళ అగును. వను, పను గాఁ జేసితిమి గాన వ స్థానమునఁ గ్రొత్త యక్షరమేదేని చేర్పవలెను. శ యథాపూర్వమే. శకు ప్రక్కను ఒత్తిచ్చినచో ష అగును. సస్థానమున న యుంచునది. హ స్థానమున నేఁటి శను ఉంచునది. హ తలకట్టు, దీర్ఘము

గలిగియున్నదిగాన దానిని దొలఁగింపఁదగును. క్షకారము కష సంయుక్తాక్షరము గాన దానికి వేఱురూప మనావశ్యకము. ఇట్లు తీర్చఁగా సంతస్థ్నములు, ఊష్మలు నిశ్లేర్పడును. (చిత్రము ౪ చూచునది.)

ఈమార్పువలన యాదిశాంతమగు పది యక్షరములలో మూఁడక్షరములు తగ్గినవి. ఒక నిర్మాణక్రమ మేర్పడినది. ఎల్లవర్ణములను ఒక్కచోనుంచి చూపుదును. (చిత్రము ౫ చూచునది.)

౩౯ గుణితము


అజ్గుణితము: అజ్గుణితచిహ్నము (చిత్రము ౧ చూచునది.) లెల్ల అచ్చులు నేర్చుకొనుటలోనే వచ్చినవిగాన బాలుర కిఁక హల్లులలోఁ దలకట్టు అకార స్థానీయ మనియును తక్కిన యచ్చులకెల్ల అకారముమీఁదఁ బెట్టిన గుర్తులే పెట్టిన సరిపడుననియుఁ జెప్పి క్షణములో అజ్గుణితమును నేర్పవచ్చును.

ముద్రణమున, తలకట్టు, దీర్ఘాది స్వర చిహ్నములు, వేఱువేఱుగా నిర్మించి (కన్నడ లిపికిఁబోలె) చేర్పవలెను. (చిత్రము ౬ చూచునది.) దీనిచే ఒక్కొక హల్లునకును అజ్గుణితముక్రింద నిప్పుడు పోయఁబడుచున్న ప్రత్యేకాక్షరములు పదేసి పదేసి తొలఁగిపోవును. దీనిచే అచ్చుపోఁతలోఁ గలయమిత భారము తప్పిపోవును.


హల్గుణితము: ఉచ్చారణరీతికి విరుద్ధము గాకుండ లిపిరీతి యుండవలెను గాన, హల్సంయుక్తాక్షరములందు కడపటి హల్లు మీఁదనే అచ్చు ఉండవలెను. కడపటి హల్లే పూర్ణాక్షరముగా నుండవలెను. తత్పూర్వపు హల్లులు తలకట్టు లేనివిగా (అనఁగా హల్మాత్రములుగా) నుండవలెను. (చిత్రము ౭ చూచునది.) ఒక యక్షరము క్రింద నొక యక్షరము నిలిపించుట యను విధానము మానవలెను. లిపులెల్లఁ బ్రక్క ప్రక్కలనే ఉండవలెను. అనఁగా నిట్లు-దివ్యధ్వని-అను పదమును, 'దివయ ధవని' అని వ్రాయవలెను. రెండిటికంటె హెచ్చుగా హల్లులు సంయుక్తములై యున్నప్పుడు మాత్రము, కడపటి హల్లుగాక తత్పూర్వపు హల్లులు, తలకట్టు లేనివిగా నుండునుగాన, ఒకదాని క్రింద నొకదానిని బెట్టవచ్చును. ఎట్లనఁగా-వాక్స్వతంత్రీ అనుపదమును - 'వాక్సవాతంత్రియ' అని వ్రాయవచ్చును. ఇట్టిమార్పువలన బాలురకు, హల్గుణితపు ఒత్తులను నేర్చుకొనవలసిన శ్రమము తొలఁగును. ఉచ్చారణరీతి ననుసరించి లిపిరీతిని నేర్చుకొనుట యగును.

ముద్రణమున నీమార్పు బహు సుఖావహము. బంతిలో నక్షరములెల్లఁ దీర్చినట్లుండును. అడుగడ్డునకు అక్షరముక్రింద నక్షరము వచ్చి బంతి వంకరవోదు. 'హాఫ్ బాడీ, ఫుల్ బాడీ' టైపుల గజిబిజి యుండదు. రెండింటికంటె నెక్కువ హల్లులు సంయుక్తమైనప్పుడు మాత్రమే తలకట్టులేని హల్లులు అక్షరము క్రింద నక్షరముగా నేర్పడును. అది యసా


ఆంధ్రలిపి సంస్కారము



చిత్రము ౧.




చిత్రము ౨.




చిత్రము ౩.




చిత్రము ౪.



చిత్రము ౧.



చిత్రము ౨.



చిత్రము ౩.

ధారణముగా నెక్కుడనో వచ్చును. కాన యంతచిక్కుండదు. కాని యిక్కడ నసౌకర్యమువలెఁ దోఁచఁదగిన విషయ మొకటి యున్నది. ఏదనఁగా - సంయుక్తాక్షరములు హల్లుక్రింద హల్లుగాఁ గాకుండఁ బ్రక్కప్రక్కగాఁ గూర్చుటచేత నిప్పటిలిపి యాక్రమించుకొను స్థలముకంటె నీమార్పు లిపి హెచ్చుస్థల మాక్రమించుకొనును గదా అనునది. ఇది యోచింపఁదగినదే:-ఒకానొక యాంగ్లాభిమాని ప్రముఖుఁడు, ఆంధ్రలిపిని దొలఁగించి తత్ స్థానమున నాంగ్లలిపిని చొప్పింతుమేని నూఱుపుట లాక్రమించుకొను గ్రంథమును ఏఁబదిపుటలలో, సమకూర్పవచ్చునని కొన్ని యేండ్లక్రిందట వాదించుట వింటిని. ఇంగ్లీషక్షరములు నిలువునిలువుగానుండు గీత లగుటచే స్వల్పస్థలమునఁ బెక్కక్షరములను గూర్పనగు నని యా లిపిజ్ఞు లనిరి. అట్లు తలఁచువారుండఁగా నే నిపుడు పేర్కొను లిపి సంస్కారము ఇప్పటి లిపికంటె హెచ్చు స్థల మాక్రమించునదిగా నుండు నేని యది ప్రాజ్ఞసమ్మతము గాకపోవచ్చును. కాని యీ సంస్కారము నిజముగా నట్లు హెచ్చుస్థల మాక్రమించుకొనదు. ఎట్లనఁగా ఇప్పటి లిపి యచ్చులో నక్షరముక్రింద నక్షరము పెట్టుట వ్రాఁతలో సరిపడుచుండుట వాస్తవమే. వ్రాఁతలో నించుకంతస్థలము హెచ్చుతగ్గు లగుటలో జిక్కుండదు. అచ్చులో స్థలము పెరుగుట మాత్రమే చిక్కు. అచ్చులో లిపి క్రింద లిపి నుంచినట్లు కన్పట్టునే కాని, వాస్తవమునకు (హాఫ్ బాడీతప్ప) ప్రక్కనే ఉండును. వానిని గూర్చుటలోఁ గొంచెమించుమించుగా విడఁబఱిచి వ్రాసిన నెంతస్థల మాక్రమించుకొనునో యంతస్థలమును ఆ 'స్పేసు' ఆక్రమించుకొనుచున్నది. బంతి వంకరవోవుచున్నది. అట్టి సంయుక్తాక్షరములుగల బంతికొఱకయి కొన్ని 'లెడ్లు' ఎక్కువ వేయవలసివచ్చుచున్నవి. కాన వీనిని గలపి కట్టుకొనినచో నంతగా నీమార్పు హెచ్చుస్థల మాక్రమించుకొనునది గాదని యేర్పడును. మఱియు, ఋ, ౠ, ఘ, ఝ, మ, య, ఱ, హ, లలో జరపఁబడిన మార్పుల వలని స్థలలాభము కొంతగలదు. కావున నిది యంత యనర్థావహముగాదని నాతలంపు. అఱవ లిపి యీవిధముననే కలదు. అందు లిపి క్రింద చేరదు. దానివలన వారి కెట్టి యసౌకర్యమును లేదు.

ఈమార్పుచే హల్లుల యొత్తులు ్క, ్ఖ, ్ఞ, ్శ మొదలగునవి అక్కరలేకపోవును. అజ్ఞఱిత చిహ్నములను వేఱుగాఁ బోఁతపోసి తలకట్టులేకుండఁ బోసిన హల్మాత్రముల మీఁదఁ జేర్చుటకు వీలుగలుగును. సంయుక్తాక్షరముదలి హల్మాత్రములు తలకట్టు లేకుండఁ బూర్వముననుండి కడపటి హల్లు అచ్చుతోఁ గూడియుండుట గుదురును.

మొత్తము లిపియెల్ల నిట్లు మార్పఁగా నచ్చుకై పోఁతపోయవలసిన రేఖాచిహ్నములు ముప్పదియైదు మాత్రమే యగును. వర్గద్వితీయ చతుర్థములకు, గ,జ,డ,లకుఁ బెట్టవలసిన యొత్తుగీత యొక్కటి, వర్గాను నాసిక

ములకుఁ బెట్టవలసిన 7వంటి గీఁత ఒక్కటిగల వు. ఈ రెంటిని జేర్చుకొనఁగా ముప్పదియే డగును. ఇప్పుడు ముద్రణమునకై యుపయోగింపఁబడుచున్న చిహ్నములు౧౦౦లలోఁ౯౩ తగ్గిపోయినవి. ముద్రణమున కీమార్పు అమితోపకారముగదా!

ఈమార్పునుబట్టి టైపుమిషనును సృష్టించుట కడుసుకరముగదా!

నాకుఁదోఁచిన మార్పును వివరించితిని. ఇందలి సాధకబాధకములను, ఆంధ్రదేశమందలి ప్రాజ్ఞులఁ బరిశీలించి వెల్లడింపఁగోరెదను.

కొన్ని చిల్లర లిపులు—

దంత్యములగు చజలకు వేఱులిపు లక్కఱలేదు. ఇప్పుడు వాని నెవ్వరును నుపయోగించుటలేదు. రేఫమునకుఁ బూర్వపులిపిలో వలపలిగిలక యను చిహ్నమును ౯, నకారమునకు ౯ అనుచిహ్నమును గలవు. ఈ లిపులభిమానింపఁ దగినవి. కాని వలపలిగిలక 'వర్గము' అను విధమున వ్రాయఁబడును. ఇది 'వర్గము.' అనువిధమున మార్చుట ఉచ్చారణానుగుణము. అప్పుడది డాపలిగిలక యగును.

వర్గానునాసికాక్షరసంకేతములు వ,హా, మార్పులు మొదలగువానిలో నేను చూపిన క్రొత్తచిహ్నములకంటె ననుకూలమయిన చిహ్నములు గోచరించె నేని తెలుపఁదగును. ఇంకను లిపి సంస్కారవిషయమును నాంధ్రదేశపుఁ బ్రాజ్ఞులెల్లరును బర్యాలోచించి చర్చించి సభలుజరపి తమకుగోచరించిన గుణదోషములను సంస్కారవిశేషములను ఆంధ్రపత్రికా భారతీపత్రికాదులందుఁ బ్రకటించినచో వానినెల్లఁ జేర్చుకొని నా యుద్దేశములకుఁ బునరాలోచనము జరపి సర్వ సమ్మతమయిన విధాన మేర్పడెనేని దానిని బ్రచారమునకుఁ దెచ్చుటకుఁ దగిన ప్రయత్నము సాగింతును.

---

*ప్రశ్నల పద్యము

కోట చెంచురామయ్య గారు

నాతి, నీహృదయేశు నామంబుఁ జెపుమన్న నంగుళితో నుదు రంటి చూపె
పల్లవాధరి, నీదు వల్లభుకుల మన్న గగనభాగం బట్టె కలియఁజూపె
కలికి, నీనాథుని కలిమిబలిమి యన్నఁ జేతుల రెంటినిఁ జేర్చి చూపె
విరిబోఁడి, నీపతి వృత్తియెద్ది యటన్నఁ గేల్మోడ్చి మాళిపైఁ గీలుకొలిపె
ధవునివర్ణ మన్నఁ దారాధిపునిఁ జూపె-జనకుఁ డెవ్వ డన్న జడముఁ జూపె
దీనిభావ మరసి తెలియుఁడీ మీరలు-విబుధవర్యులార, వేడ్కతోడ.

---

* ఇందలి ప్రశ్నలకు సరియైన ఉత్తరములను ౧౯౫౫ వ సంవత్సరం ఏప్రెల్ నెల 15వ తేదిలోపల మొట్టమొదట భారతీకార్యాలయమునకు పంపువారి పేరు మేనెల భారతిలో ప్రకటింపబడును. —సంపాదకుడు.

పల్లవవంశము-వీరకూర్చవర్మ

యన్. వెంకట రమణయ్య గారు, యం. ఏ.

౧

దర్శి శాసనము[1] ముఖ్యమైనది. అది యింతవఱకు చక్కగా గమనింప బడలేదు. ఇందుకు గారణ మది శాసనశకల మగుటయే. ఆదాతయొక్క ముత్తాతను పేర్కొని యంతటితో నిలిచిపోయినది. తునుకయైనను అది ముఖ్యమైన దే. ఈక్రిందివ్యాసమున, దానిలోని కొన్ని యంశములను బరీక్షించి, యది పూర్వపల్లవ చరిత్రములోని సంశయాస్పదము లగు కొన్ని విషయములలోని సంశయములను దొలగించగలదని చూపుచున్నాను.

శాసనము యొక్క భాష సంస్కృత మగుటచే నది చాల పురాతనమైనది కాదనుట నిశ్చయము. అది దాతయొక్క ముత్తాతయగు నొక మహారాజ శ్రీవీరకూర్చవర్మను పేర్కొనుచున్నది. ఈరాజెవ్వరైనదియు నిర్ధారణచేసిచెప్పుటకు వీలులేదు. పల్లవవంశమునా తనిస్థలమునుగూర్చి పండితులు భిన్నాభిప్రాయములను దెలియజేసి యున్నారు.

ఉరువపల్లి[2] శాసనపుదాతయగు యువమహారాజ విష్ణుగోపుని యొక్కయు, అతని యన్నయగు సింహవర్మయొక్కయు తాతయగు వీరవర్మయు, నీవీరకూర్చుడును నొక్కరే యని డాక్టరు కృష్ణస్వామి అయ్యంగారు చెప్పుచున్నారు.[3] హూసకోట కృష్ణ శాస్త్రిగారును ఒకప్పుడిట్లే యభిప్రాయపడియుండిరి[4] కాని, యిటీవల నీ యభిప్రాయమును మార్చుకొని, వాస్తవముగ వీరకూర్చుడు మిక్కిలిపురాతనుడగు పల్లవరాజని చెప్పియున్నారు[5]. "పల్లవులు" అనుగ్రంథము 22 వ పుటలో "దర్శిలోదొరకిన శాసనము వీరకూర్చుడను రాజుండె నని నిర్ధారణసేయుచున్న "దని యొప్పుకొని యున్న జి. జె. డుబ్రేగారు 'దక్కను పురాతనచరిత్ర' యం దాతని పేర్కొననుగూడ లేదు. ఈపురాతనచరిత్రమునే చదివెడివారికి, వీరకూర్చుడను రాజుండెనని తెలియుట కవకాశము లేదు.

ఈవీరకూర్చుడెవ్వడు? ఈ పేరుగల ప్రాచీన పల్లవరాజులు ఇద్దరు వాయలూరు శిలాస్తంభ శాసనమున[6] (డుబ్రే గారి పట్టికలోని ౫,౧౧ పేర్లు: పల్లవులు, పుట 20) పేర్కొనబడి యున్నారు. వెలూర్పాళియ శాసనమున[7] నతఁడు చూత పల్లవుని కుమారుడనియు స్కందశిష్యుని తండ్రి యనియు చెప్పబడి యున్నది. అతడు కాశకుడిశాసనము నందు గూడ పేర్కొనబడి యున్నాడు. అయితే,

1. E. I. Vol, I. P. 369
2. I. A. V, P.20
3. పల్లవులు
4. S. I. I. II, Part V
5. E. I. XIX
6. E. I. XIX
7. S. I. I. II, Part V
8. S. I. I. II, P. 348

యివన్నియును మిక్కిలి ప్రాచీనములుగావు. అతని బేర్కొనుశాసనములలో గడుపురాతన మైనది దర్శిశాసనము[1]. ఇది వీరకూర్చవర్మ యొక్కమునిమనుమనిచే నివ్వబడినది.వీనినన్ని టినిబట్టి విచారించగా, ఒకానొకకాలమున వీర కూర్చ లేక వీరకూర్చవర్మ యను పేరుగల పల్లవరా జొక్కడుండె నని తేలుచున్నది. అయితే పల్లవవంశజులగు నితర రాజులతో నత నికిగల సంబంధ మెట్టిదో నిర్ధారణ సేయుటకు వీలుకాదు. ఈవిషయమును గూర్చి చక్కని సాక్ష్యమేమియు దొరకకున్నది. అతఃవాయ లూరు, కాశకుడి శాసనములలో బేర్కొనబడియున్నను, వీనియందలి రాజుల పేర్ల కొండొంటితో సంబంధము లేకపోవుట చేతను, కొన్ని పేర్లు కల్పితము లగుటచేతను, పల్లవవంశవృక్షమునందు ఇతనిస్థల మిది యని నిర్ధారణచేసిచెప్పుటకు వీలులేకున్నది. వాయ లూరు శాసనములోని పల్లవరాజుల పట్టికను జూచినవారి కందఱికి అందువచ్చిన పేరు మరల వచ్చుటయేకాక నాలుగైదుపేరులు సమూహ ముగ మరలమరల వచ్చుటయు విదితమగును. ప్రాచీనపల్లవశాసనములలో గాన్పించని నామ ములు కొన్ని కాశకుడిశాసనమున గాన్పించు చున్నవి. కావున పైపట్టికలు విశ్వాసార్హములు గావు. నమ్మదగిన ఇతర శాసనముల సాక్ష్య మున్నగాని వానిలోనిపేర్లు వాస్తవచరిత్ర పురుషులపేర్లని యంగీకరింప రాదు.

వేలూరుపాళెపు తామ్రశాసనము నా లుగుతరముల రాజకుటుంబమును బేర్కొను చున్నది. వీరకూర్చ, స్కన్దశిష్య, కుమార విష్ణు, బుద్ధవర్మలు. ఇట్టి పట్టికయే వాయ లూరు శాసనమున గాన్పించు చున్నది. వీర కూర్చ, స్కన్దవర్మ, కుమారవిష్ణు, బుద్ధ వర్మలు. ఇటువంటి జాబితా చెన్దలూరుశాస నమునగూడ గాన్పించుచున్నది. స్కన్దవర్మ కుమారవిష్ణు (౧) బుద్ధవర్మ కుమారవిష్ణు వు (౨)లు. ఈశాసనముల నాధారపఱచుకొని

వీరకూర్చ
|
స్కన్దవర్మ
|
కుమార విష్ణు (౧)
|
బుద్ధవర్మ
|
కుమారవిష్ణు (౨)

లను ౫ తరములరాజులును నొకప్పుడు రాజ్య ముచేసి రని చెప్పుట యుక్తము. అయితే, వేలూర్పాళెపుశాసనమున వీరకూర్చునికుమా రుని పేరు స్కన్దవర్మ యని యుండక స్కన్ద శిష్యుఁడని యున్నది. స్కన్దశిష్యు డనుపేరు స్కన్దవర్మ యనుదాని నామాంతరమే యని యంద రొప్పుకొన్న విషయ మగుటచేతను, మాకావిషయమున ఎట్టి యూహేపణయు లేక పోవుటచేతను స్కన్దశిష్య స్కన్దవర్మ లను

1. E. I. 1, P. 369

నవి యొక్క పురుషునిపేర్లేయని యంగీకరించు చున్నాము.

౨

ఉరువపల్లి శాసనమునందు బేర్కొనబడిన యువమహారాజ విష్ణుగోప, మహారాజసింహ వర్మలయొక్క ముత్తాతయగు వీరవర్మయు, వీరకూర్చుడు నొక్కరేనని డాక్టరు యస్. కృష్ణస్వామి అయ్యంగా రభిప్రాయ పడుచున్నారని యిదివఱకే వచించియున్నాము. కొన్ని ముఖ్యము లగు కారణములబట్టి విచారింప నది కేవల మంగీకరింపదగని యభిప్రాయముగ దోచుచున్నది. ౧. పల్లవరాజుల శాసనములలో, వీరకూర్చ, వీరవర్మలపేర్లు తారుమారు లేక వెవ్వేరు పురుషుల నామములుగ వర్ణింపబడియున్నవి. వాయలూరు శాసనమున వీరకూర్చునిపేరు రెండుమార్లు(గీ. ౧౧) చెప్పబడి యున్నను, వీరవర్మ పేరు వేరుగ (౨౩) జెప్పబడి యున్నది. కాశకుడిశాసనము వీరకూర్చ వీరసింహు లను నిద్దఱు రాజులను బేర్కొనుచున్నది. వీరవర్మయనుదాని నామాంతరమే వీరసింహ యనునదియని వాదించినను వీరకూర్చ వీరవర్మలు భిన్నపురుషులే యగుచున్నారు. ౨. పలక్కడ, దశనపుర, తాంబ్రపలలోనుండి దానశాసనముల నొసంగిన పల్లవరాజు లందఱు, వీరవర్మవంశజులే. ఒంగోడు(౧), (౨)శాసనములును,ఉరువపల్లి, మంగడూరు, పీకిర, చూరశాసనములును వీరవర్మనే పేర్కొనుచున్నవిగాని వీరకూర్చుని బేర్కొనకున్నవి. వీరవర్మయొక్క వంశజులందఱును, తమవంశముయొక్క మూలపురుషునిపేరు వీరవర్మ యనుచున్నారే కాని వీరకూర్చుడని భ్రమపడియైన చెప్పియుండలేదు. ౩. ప్రాచీన పల్లవరాజుల శాసనములను పరిశీలించి చూచితిమేని, వీరకూర్చ వీరవర్మలు పల్లవచరిత్రలోని వెవ్వేరుయుగముల యందు జీవించియున్న వెవ్వేరుపురుషు లని తేలగలదు. ఆశాసనము లెవ్వియన్న,—

i. హిరహడగల్లి శాసనము.[1] దాత శివస్కందవర్మ. పల్లవుల శాసనములయందు పురాతన మైనవానియం దిది యొక్కటి. "సర్ వాల్టర్ ఎలియటుచే సంపాదిత మైన విజయబుద్ధవర్మ రాణియొక్క అక్షరములు ఈ శాసనపుటక్షరములను బోలియున్నవ"ని డాక్టరు బర్జెసుగారి యభిప్రాయము. ఈశాసనాక్షరముల పోలికగల యక్షరములు గల మయిదవోలు శాసనము[2] మిగుల ప్రాచీన మైనది.


ii. దర్శి శాసనము.[3] డాక్టరు హూల్ట్షుగా రీశాసనాక్షరములు కడుపురాతనములని చెప్పియున్నారు

iii. విజయస్కందవర్మయొక్క ఒంగోడు ౧. శాసనములోని యక్షరములు హా. కృష్ణశాస్త్రిగారి మతప్రకారము "ఉరువపల్లి, మంగదూరు,పీకిర శాసనాక్షరములను బోలియున్నవి.

1. E. I. I. P. 2
2. E. I. VI, 84
3. E. I. I, 369..

iv. ఉరువపల్లి శాసనాక్షరములు స్వచ్ఛమైన పెట్టెతలలు గలవి.* క్రీ. శ. 446-వ సంవత్సర మీఁదాన శాసనకాలమని మన మెఱిగిన విషయమే. ఈపై నాలుగుశాసనములను, దర్శిశాసనకాలమును నిర్ణయించుటకై శోధింపఁ దొడఁగితిమి. ఉరువపల్లి శాసనదాత యువమహారాజు విష్ణుగోపుఁడు. ఓంగోడు (౧) శాసనదాత యితని తండ్రియగు విజస్కందవర్మ. కావున నీ రెండుశాసనములును క్రీ. శ. ౫-వ శతాబ్దపు పూర్వార్ధమునకు జేరుచున్నవి. హిరహడగల్లి శాసనము పల్లవచరిత్రపు ప్రారంభయుగమునాఁటిది. దర్శిశాసన మెప్పటిది? ఈప్రశ్నకు, పైనాలుగుశాసనములలోని యక్షరముల నొండొంటి పోల్చితిమేని, సమాధానము రాగలదు. దర్శిశాసనమును మొదట హిరహడగల్లి శాసనముతోడను నటుపిమ్మట ఓంగోడు (౧) ఉరువపల్లి శాసనములతోను బోల్చిచూతము. దర్శిశాసనలిపి హిరహడగల్లి లిపికంటె నర్వాచీనమైనదిగను, ఓంగోడు (౧) లిపికంటె బ్రాచీనమైనదిగను, ఉరువపల్లి లిపికంటె బ్రాచీనతరమైనదిగను గన్పించుచున్నది. ఇట్లు శాసనముల యక్షరస్వరూపమును బోల్చిచూడ దర్శిశాసనము, హిరహడగల్లి ఒంగోడుశాసనముల మధ్యకాలమున వేయింపబడినట్లు తెలియుచున్నది.

ఇఁక, యీశాసనములలో మచ్చునకై కొన్ని యక్షరముల నొండొంటితో పోల్చి చూతము. ఈ క్రింద నున్న చిత్రము అక్షర



* డుబ్రాయిల్ దక్కనుపూర్వచరిత్ర, పుట ౯౩.

ములను, మార్పును సూచించును. హీరహడగల్లి శాసనములోని "క" బ్రాహ్మి శాసనములలోని 'క'వలెనే యున్నది. దర్శి శాసనములోని "క"కును దీనికిని విశేషము భేదము గాన్పింపదు; కాని యక్షరముయొక్క క్రిందినుండి యెడమవైపునకు దిరిగి యూర్ధ్వముగ బోవుగీటు పొడవుగ నున్నది. ఒంగోడు (౧)శాసనములో నీయక్షరమింతకంటె చక్కగ తీరియున్నది. ఒంగోడు (౧) శాసనము ఉరువపల్లి శాసనమువలె స్వచ్ఛమైన పెట్టె తలల యక్షరములతో వ్రాయబడిన దని యూహించుటకు కారణ మున్నది. 'క' తలపై నొక పెట్టెయున్నది. అక్షరముయొక్క క్రింది భాగము వట్రపముగాక మూలలు తీరి ద్విభుజముగమారి యున్నది. ఉరువపల్లి "క", ఒంగోడు (౧) 'క'వంటిదే; కాని తలపైని పెట్టెయు క్రింది ద్విభుజము పెద్దవి. ఒంగోడు (౨) 'క' యిప్పటి అరవ'చ' ను చాలవఱకు పోలి యున్నది.

హీరహడగల్లి 'గ' ఇప్పటి తెలుగు 'గ' ను చాలవఱకు పోలియున్నది; దానికి తలకట్టు లేదు; అక్షరము కుడివైపునకు వంగి యున్నది. ఎడమ కాలు కుడిదానికంటె కురుచ. ఎడమకాలి క్రిందిభాగము కొంచము లోపలికి వంగి గుడికట్టు బోవుచట్లున్నది. దర్శిశాసనములోని 'గ' తెలుగు ౧ ని బోలి యున్నది. అయితే గ యొక్క యెడమ కాలు క్రింద కుడివైపునకు గుడి తిరిగియున్నది. ఒంగోడు (౧) (౨) శాసనములలోని 'గ' కు గుడిలేదు. ఉరువపల్లి "గ" యం దీగుడి లేదు. దానికాళ్లు సమముగను, వి:ఃవంపుగ నొకదాని వైపు మరొకటి తిరిగియు నున్నవి. ఇంకను తలకట్టు లేకపోయినను దానిస్థలమున నొకఅడ్డగీత యున్నది. దీనికిని మన తెలుగు కన్నడపు 'గ'లకును వ్యత్యాసమువిశేషము గాన్పించదు. దర్శిశాసనపు 'గ' కాలియందలి గుడి ఈయక్షరపు పూర్వ స్వరూపమును జ్ఞప్తికి దెచ్చు చిహ్నము; నూతనమైనమార్పుగాదు. మయిదవోలు శాసనములో[1] దీని కుడికాలు యెడమదానికంటె దీర్ఘమై యెడమ వైపునకు వంగి వట్రువరేఖయై యంత్యమగు చున్నది. ఎడమ కాలు కుడిదానివైపునకువంగియున్నది. కొండమూడి శాసనమున[2] 'గ' మైదలోలు 'గ' వలె నున్నను, దర్శి 'గ'వలె దాని యెడమ కాలికొన లోపలి ప్రక్కకు తిరిగి గుడిగమారి యున్నది. రుద్రదాముని జునాగడ[3] శాసనములోని 'గ' దర్శి'గ'ను సర్వ విధములను బోలియున్నది. కావున నీగుడి క్రొత్తగ దర్శి శాసనకాలమున పుట్టినదికాదనుట స్పష్టము. పురాతనకాలమందు 'గ'కట్టి గుడి యుండెను. అది కాలక్రమమున లోపించెను; కావున నీగుడి పురాతన చిహ్నమే.

హీరహడగల్లి 'జ' యించుమించుగ ఇంగ్లీషు పెద్ద E వలె నున్నది; కాని మూలలు

1. E. I. vi. 84.
2. E. I. vi. 315.
3. E. I. viii. 36.

వ్రట్టువముగ మారినవి. జునాగడ శాసనమున అది ఇంగ్లీషు పెద్ద E వలె నున్నది. దర్శి హీరహడగల్లి "జ"లకు విశేషము భేదము లేదు. కాని, క్రిందిభుజముయొక్క కొన సూక్ష్మమగున ధోముఖ రేఖగ మార్పునందిన ట్లున్నది. ఒంగోడు (౧) 'జ' యొక్క పై భుజము వక్ర రేఖగ మారియున్నది. క్రింది భుజమున ఇప్పటిమన 'జ' వలె పొక్కిలి యేర్పడి యున్నది. ఉరువపల్లి 'జ' పై భుజమొక ఋజు రేఖ. క్రిందిభుజమున పొక్కిలిచక్కగ తీరియున్నది. ఒంగోడు (౨) 'జ' కును యిప్పటి మన 'జ'కును భేదము విశేషము గాన్పించదు.

హీరహడగల్లి శాసనపు 'ణ' మంతిమెచ్చటను గాన్పించదు. బ్రాహ్మీ, పల్లవ శాసనముల 'ణ'కును దానికిని జాలభేదము గలదు. దర్శి 'ణ'కును, అంత్యయుగపు బ్రాహ్మీ 'ణ'కును భేదములేదు. ఒంగోడు (౧) ఉరువపల్లి శాసనముల లోను దానిస్వరూప మట్లే యున్నది. ఒంగోడు (౨) శాసనమున నది చక్కగ తీరి యించుమించుగ నిప్పటి తెలుఁగు 'ణ' వలె నున్నది.

హీరహడగల్లిలోని 'త' తలకట్టు లేని యిప్పటి తెలుగు 'గ' వలె నున్నది. తలమీద కుడివైపున కొరిగిన నిలువుగీటొకటి యున్నది. ఇది, ఉషవదాతయొక్క నాసిక శాసనము[1] లోని 'త'ను బోలియున్నది. హీరహడగల్లి, దర్శి 'త'లకు సంబంధ మున్నట్లు గాన్పించదు. దర్శి 'త'కును అమరావతి ప్రాకృత శాసనములలోని 'త'కును భేదములేదు. ఒంగోడు (౧) శాసనమున నీయక్షరముయొక్క తోక వంకగీటుగ ముగియక ఋజు రేఖగ మారియున్నది. దాని శిరమున పెట్టియున్నట్లు తలచుట కవకాశము గాదు. ఉరువపల్లి 'త' ఒంగోడు (౧) 'త' వంటిదే; కాని తోక కురుచ; పెట్టె పెద్దది. ఒంగోడు (౨) శాసనములో మేకు తలకొక్కెము వలె మారియున్నది.

ప్రాచీనపల్లవ శాసనములయందు రెండు విధములగు "బ"లు గాన్పించుచున్నవి. బ్రాహ్మీ 'బ'రూపమున చతురస్రము (Square) హీరహడగల్లి 'బ' దీనివికారము. అక్షరముయొక్క క్రింది యెడమమూల, క్రిందికి వంగిన సూక్ష్మ సమరేఖయొకటికలదు. పై కుడిమూల వట్టువగ మారి యెడమవైపునకు బోయి యక్షరము యొక్క యెడమ భుజముపై తాకి వ్రాలి యున్నది. ఒంగోడు (౧), ఉరువపల్లి 'బ'లుపై దాని వికారములే. దర్శి 'బ' యించుమించుగ నిప్పటి తెలుగు 'ఐ' కారమువలె నున్నది. ఒంగోడు (౨) 'బ' దీనియొక్క వికారము. హీరహడగల్లి 'బ'కంటె దర్శి 'బ' యర్వాచీనమైన దని మనమనుకొనరాదు. ఏలన, అది విజయదేవవర్మ యొక్క కొల్లేరు ప్రాకృత శాసనమున[1] గాన్పించుచున్నది. కావున దర్శి "బ" హీరహడగల్లి 'బ' యంతటి ప్రాచీనమనుటకు సందేహము లేదు.

'ర'నుగూర్చి విశేషము చిక్కు లేదు. హీరహడగల్లి శాసనమున ఇది యింగ్లీషు J వలె నున్నది. దర్శియం దక్షర స్వరూపము

1. E. I. viii.

1. E. I. IX

కొద్దిగ మారుటచే నక్షరము కురుచగను, తోక పొడవుగను గన్పించుచున్నది. ఒంగోడు (౧) శాసనమున నది యింగ్లీషు J వలె నున్నది. కాని తలపై పెట్టెయున్నది. తోకకు వట్టువరూపముపోయి మూల లేర్పడియున్నవి. ఉరువపల్లి 'ర' ఒంగోడు (౧) 'ర' వంటిదే. పెట్టెయును, మూలలును మిక్కిలి చక్కగ తీరియున్నవి. ఒంగోడు (౨) శాసనమున నీయక్షరము రమారమి మన ప్రస్తుతపు తెలుగు 'ర'ను బోలియున్నది.

పై జేయబడిన క, గ, జ, ణ, త, బ, ర, అను నేడక్షరముల పరీక్షవల్ల హిరహడగల్లి యక్షరములకంటె దర్శి యక్షరములు తీరియున్నవనియు, దర్శికంటె ఒంగోడు(౧) ఉరువపల్లి, ఒంగోడు (౨) అక్షరములు చక్కగ తీరియున్నవనియు తెలియుచున్నది. కావున దర్శి శాసనము హిరహడగల్లి శాసనముకంటె వెనుకను, ఒంగోడు (౧) ఉరువపల్లి, (౨) శాసనముకంటె ముందరను వ్రాయింపఁబడి యుండవలయును.

వీరవర్మను చేర్కొను శాసనములలో ప్రాచీనతమమైనది ఒంగోడు (౧) శాసనము. ఇతడు క్రీ. శ. 446 వ సంవత్సరమున జీవించియున్న యువమహారాజ విష్ణుగోపుని యొక్క తాత యగుటచేత, క్రీ. శ. 385 మొదలు 410 వఱకు రాజ్యము చేసియుండెనని మన మూహింప వచ్చును. అక్షరములపోలికలను బట్టి ఒంగోడు (౧) శాసనముకంటె దర్శిశాసనము ముందటిదని తీర్మానించుకొని యున్నాము. కాబట్టి దర్శిశాసనదాతయొక్క ముత్తాతయగు వీరకూర్చవర్మయు, ఒంగోడు (౧) శాసనదాతయగు విజయస్కందవర్మ తండ్రియగు వీరవర్మయు నేకపురుషులు కాజాలరు. వాదమునకై దర్శి ఒంగోడు (౧) శాసనములు సమకాలపువని యొప్పుకొన్నను వీరకూర్చవర్మ వీరవర్మకంటె రెండు పురుషాంతరములు ముందుండి యుండవలయును. అనగా నతడు ఒంగోడు శాసనమునందు చేర్కొనబడ్డ కుమారవిష్ణుని సమకాలికుడుగ నుండవలయును. అప్పటికిని వీరకూర్చ వర్మయు వీరవర్మయు నొక్కరేయని చెప్పుటకు సాధ్యము గాదు.

దర్శిశాసనము వీరవర్మ తండ్రి యగు స్కందవర్మగాని లేక అతని సమకాలికుడగు మఱియొక పల్లవ వంశీయుడుగాని వ్రాయించి యుండవలయును. దర్శిశాసన లేశము, వీరవర్మ సంతతివారు ప్రాయికముగ శాసనముల నొసగుస్థలములయందొక్కటియగు విజయదశవపురమునందివ్వబడినదిగాని తచ్ఛాసనదాత స్కందవర్మయే యని తోచుచున్నది.

వీరవర్మ, వీరకూర్చవర్మ లొక్కరనిచెప్పుటకు వీలుకాదని నిరూపింప బడినది. కావున నీవీరకూర్చ వర్మ హిరహడగల్లి శాసనదాత యగు శివస్కందవర్మ యొక్క తండ్రిగాని మఱి యన్యుడుగాడు. పురుషాంతరమునకు ౧౨౫ సంవత్సరముల చొప్పున

గణించిన రమారమి క్రీ. శ. ౨౮౫ సంవత్సర ప్రాంతమున వీరకూర్చుడు జీవించి యుండ వచ్చునని తోచుచున్నది.

3

అయినప్పటికిని తమచే పరమ ప్రమాణములుగ నంగీకరించిన శాసనములయం దాతఁడు పేర్కొనఁబడియున్నను, దూ బ్రేగారురచించిన పల్లవవంశవృక్షమున[1] వీరకూర్చుని స్మరింప కున్నారని వచించియున్నాము. అట్లు సేయుటకు గారణ మాయన వచించి యుండలేదు. వారికిగలిగినసంకట మిదియని తోచుచున్నది. వీరకూర్చుడు ప్రాచీనపల్లవరా జని చెప్పబడియున్నను, అట్టివాక్యములు సంస్కృతశాసనములయందు మాత్రము గాన్పించుచున్నవి. ప్రాకృతశాసనములయం దాతని ప్రాడమైన గాన్పింపదు. ఇంతేకాక యతనిపేరు దర్శిశాసనలేశమున నున్నది. పల్లవ వంశవృక్షమున దీని నాధారపర్చుకొని వీరకూర్చుని నిరికించుట కవకాశము దొరకలేదు. కాబట్టి దర్శిశాసన మాతనికి కాలిబంధకమైనది. ఆ బంధకమును దొలగించుకొను నుపాయ మరసి, దానిని స్మరింపక చల్లగ జారవిడిచినాడు. మఱియు, సర్కారువారి తరఫున బనిసేయు శాసన పరిశోధకమహాశయులుచేసిన ప్రాకృతసంస్కృత శాసనముల కాలములకు దాదాపు రెండుశతాబ్దములు వెడమున్న దను నపసిద్ధాంతముగూడ నాతని బెడత్రోవకు ద్రిప్పినది.

వెంకయ్యగారు ప్రాకృత శాసనములను "క్రీ. శ. ౪ వ శతాబ్దారంభ కాలమునకు"[2] జేర్చుచున్నారు. ఇట్లనుచున్నాడు: "క్రీ. శ. ౨౩౬ వ సంవత్సరమున కడపటి యాంధ్ర రాజగు మూడవపులుమాయి రాజ్యకాలము సమాప్తినందెను. అందుచేత పల్లవులు ఆశతాబ్దాంతమున స్వతంత్రులై యుండవచ్చును.ఒక వేళ వారీకాలమునకుముందే స్వాతంత్ర్యస్థాపనమును జేసియుండినను నుండవచ్చును." "ఈ వంశపు సంస్కృతశాసనములు తరువాతి కాలపువి......సంస్కృత శాసనముల నొసగిన రాజు లెప్పుడుండిరో తెలియదు. అయితే స్థూలముగ వారు ౫, ౬ శతాబ్దముల నాటి వారని చెప్పవచ్చును."[3]

ఇది తాత్కాలికపు సిద్ధాంతముగ మొదట బరిగణింపబడినను తరువాతివారికది వేదవాక్య మాయెను. హా. కృష్ణశాస్త్రిగారు దీనిని స్థిరీకృతమగు సిద్ధాంతముగ నమ్మి తదాధారమున గొన్ని యప సిద్ధాంతములను బయలుపెట్టిరి.[4]

పై సిద్ధాంతము నంగీకరించుట వలన దూబ్రేగారు పల్లవవంశవృక్షపు బోదెను అనవసరముగ దీర్ఘీకరించవలసినవారైరి.వారుత్రొక్కిన మార్గము సమంజసముగ నుండలేదు. పల్లవ వంశవృక్షరచనను ప్రాకృత శాసనములలోని రాజులపేర్లతో నారంభించిరి. అంతవఱకు బాగుగనే యున్నది. వారికి విష్ణుగోపునిదగుల

1. Anc. Hist., Deccan, P. 70
2. Arch. Rep. 1906-7, P. 222
3. I bid. P. 223, 4
4. S. I. I. Vol, II. Part V

కట్టిరి. సముద్రగుప్తుని యలహాబాదు శిలాస్తంభశాసనములో[1] కంచి రాజగు నొక విష్ణుగోపుడు పేర్కొనబడి యుండుట వాస్తవమే. అయితే బుద్ధ్యాంకురుని యనంతర మొక విష్ణుగోపుడు రాజ్యము చేసినట్లు పల్లవశాసనముల వల్ల దెలియవచ్చుటలేదు. వాయలూరు శాసనమున[2] ప్రాచీనపల్లవ రాజులలో విష్ణుగోపుని పేరు చెప్పబడియున్నది. అయితే ప్రాకృత శాసనములలోని రాజులెవ్వ రాతనికి ముందు రాజ్యముజేసిన ట్లీశాసనము పల్కదు. స్కన్దవర్మ యను పేరుగల రాజు విష్ణుగోపుని కుమారుడనిగాని, తరువాత రాజ్యము జేసిన వాడనిగాని పల్లవశాసనములయందు దెచ్చుటను లేదు. విష్ణుగోపుని మూలమున ప్రాకృత సంస్కృతశాసనములకు దూబ్రేగారు సంబంధమును గల్పింప ప్రయత్నించిరి; ఈప్రయత్నము క్రమమైనది గాదు. ఆయన హిరహడగల్లి శాసనదాతయగు శివస్కందవర్మయు, చెన్దలూరుదానపత్రోక్తమైన రాజ వంశమునకు మూలపురుషుడైన స్కన్దవర్మయు భిన్న పురుషు లనుచున్నాడు! వాస్తవము విచారించగా వారొక్కరేనని తెలియగలదు. బ్రిటిషు మ్యూజియంశాసనములోని బుద్ధవర్మ చెన్దలూరు శాసనములోని మొదటి కుమారవిష్ణువుకు సమకాలికుడుగాని ముత్తాతగాడు. ఇది వేలూర్పాళెపు శాసనమునకు[3] సమ్మతమే. అందు కుమారవిష్ణువు పల్లవవంశస్థాపకుడగు వీరకూర్చుని మనుమడని వచింపబడియున్నది.

ఇంతవఱ కెవ్వరిచేతను గమనింపబడనిదియు, అనేకములగు ప్రమాదముల కాస్పదమైనదియు నగు నొక్కవిషయము నీసందర్భమున జెప్పవలసియున్నది. వీరకూర్చుడను పల్లవకుమారుడు. నాగరాజకుమార్తె నుద్వాహము చేసుకొనుటవల్ల పల్లవవంశమునకు రాజ్యలాభము గలిగెనను విషయమందఱు పండితులొప్పుకొన్నదే. తత్పూర్వమున పల్లవులెట్టి స్థితి యందుండిరో మన మెఱుగము. ఆంధ్రపల్లవవంశముల మధ్యమున నాగజాత్యుద్భవు లగు నాంధ్రభృత్యరాజులు దక్కను దక్షిణహిందూదేశములపై ప్రభుత్వము చేయుచుండిరి. ఈయాంధ్ర భృత్యరాజులు చూటు (చూడ)కులులు. చూటులకడ నుండియే దక్షిణరాజ్యలక్ష్మి పల్లవులను జేరెననుట యంద రంగీకరించినవిషయమే. వేలూర్పాళెపు శాసనప్రకార మిది వీరకూర్చుడు నాగకుమారిని బెండ్లాడుటవల్లనని దెలియుచున్నది. పై శాసనమున వీరకూర్చుని తండ్రిపేరు చూతపల్లవుడని చెప్పబడియున్నది. ఈచూతపల్లవుడు చరిత్రపురుషుడని యనేకగ్రంథకర్తల నమ్మకము. ఇది నిజముగాదు. చూతపల్లవుడు చరిత్రపురుషుడుగాడు; చూటుపల్లవవంశముల సంయోగమును సూచించు కల్పితమూలపురుషుడు. మన మాతని కల్పిత పురుషునిగనే గణింపవలయును. అతనిపేరుగాని, అతనివలెనే కల్పితపురుషులగు నతని పూర్వీకులపేర్లుగాని ప్రాచీనపల్లవ ప్రాకృత సంస్కృతశాసనముల

1. Fleet Gupta Inscriptions 2. Dubreuil 'The Pallavas' 3. S. I. I. Vol. II, Part V

యుండెందును గానరావు. మనము చరిత్రను కల్పనాకథలనుండి వేరుపర్చవలయును. అట్లు చేసినగాని మనకు సత్య మెరుకపడదు.

ఇక ప్రాకృత సంస్కృత శాసన యుగముల మధ్య యెడమున్న నది రెండు శతాబ్దముల దీర్ఘకాలము గాదనియు, రెండు పురుషాంతరముల హ్రస్వకాలమనియు నిరూపించెదము. ఇదివఱకే వీరకూర్చ, వీరవర్మల నైక్యమును స్థాపించుట కానిపనియని చెప్పియున్నాము. శాసనములయం దగపడు వీరకూర్చ డొక్కడే. అతడు కడు ప్రాచీనుడు. హిరహడగల్లి శాసనదాతయగు శివస్కన్దవర్మ తండ్రి. ఈమతము నంగీకరించిన, దర్శిశాసనపు దాత పైశివస్కన్దవర్మ యొక్క మనుమ డగును. అట్లగునేని సంస్కృత శాసనయుగము శివస్కన్దవర్మ యొక్క మనుమని కాలమున నారంభమగును. ఈ రెండుపురుషాంతరములను రెండుశతాబ్దముల వఱకు వ్యాపించి యుండె ననుట కేవల మసంభవము.

పైజెప్పిన విషయము శాసనసమ్మతమైనది. వాస్తవమారయ (పల్లవ) ప్రాకృత శా స న ము లు సంస్కృతయుగారంభమున లిఖింపబడినట్లు తెలియుచున్నది. ఈ ప్రాకృత శాసనములలో సంస్కృతపదములు, వాక్యములు, శ్లోకములు గన్పించుచున్నవి. క్రీ. శ. ౪-వ శతాబ్దారంభపుదని వెంకయ్యగారిచే జెప్పబడిన హిరహడగల్లి శాసనమున నొక సంపూర్ణసంస్కృతవాక్యము గలదు.

“స్వస్తి గోబ్రాహ్మణలేఖకవాచక శ్రోతృభ్య [ఇతి.”

బృహత్ఫలాయనసగోత్రజు డగు మహారాజు జయవర్మ యొక్క కొండమూడిశాసనపు లిపి శివస్కన్దవర్మ యొక్క మయిదవోలు శాసనపు లిపిని బోలియున్నది. ఈ కొండమూడిశాసనమున ‘మహేశ్వర’, ‘బృహత్ఫలాయన’ యను రెండుసంస్కృతపదములున్నవి. ఇంతేకాక ముద్రచుట్టును “బృహత్ఫలాయనసగోత్రస్య మహారాజశ్రీ జయవర్మణః” యను వాక్యము స్వచ్ఛమైన సంస్కృతభాషయం దున్నది. చారుదేవిచే నొసంగబడిన బ్రిటిష్ మ్యూజియము శాసనము[1] యొక్కలిపి హిరగడగల్లి శాసనమును బోలియున్నది. అందు సంస్కృతశాసనముల కడపట తరచుగ గాన్పించుశ్లోకములలో నివి రెండున్నవి.

బహుభిర్వసుధా దత్తా
బహుభిశ్చానుపాలితా;
యస్యయస్యయదా భూమిః
తస్యతస్యతదాఫలమ్.
స్వదత్తాం పరదత్తాంవా
యోహరేతవసుంధరామ్;
గవాం శతసహస్రస్య
హన్తుః పిబతి కిల్బిషమ్.

ఇంకొక ప్రాకృతశాసనమున గూడ నిట్టి సంస్కృతశ్లోకములు, “షష్టింవర్ష సహస్రాణి”, “బహుభిర్వసుధా దత్తా” యనునవి కన్పట్టు

1. E. I. VIII, P. 143

చున్నవి. ఈ శాసనదాత శాలంకాయనగోత్రజుడగు విజయదేవవర్మ. ఈ సందర్భమున హుల్ ట్షుగారివాక్యములు గమనింప దగినవి. "గుహాశాసనములలో బ్రతిద్విత్వమును ఏకాక్షరముతోడనే వ్రాయబడియుండగా, ఈ శాసనములోని యక్షరగుణితము, యీవిషయమున, పాలీగ్రంథములను, చారుదేవియొక్క బ్రిటిషు మ్యూజియ శాసనమును బోలి యున్నది."[1]

పల్లవ, బృహత్ఫలాయన ప్రాకృతశాసనములు, శాసనములభాష సంస్కృతముగ మార్పు జెందుచున్నకాల మప్పటివి. ప్రాకృత శాసనములలోని సంస్కృతపదవాక్య శ్లోకములు సత్వరము సమీపించుచున్న సంస్కృతయుగ సూచకములు. మొదటి రెంటియందును పదములు, వాక్యములు మాత్రమే కన్పడుచున్నవి. తక్కినవానియందు శ్లోకములుసైత మగపడుచున్నవి. ఈమార్పుక పురుషాంతరములోపల జరిగినది. సంస్కృతభాష శాసనములనుండి ప్రాకృతమును నెట్లు నెట్టివేసినదియు మఱియొక యుదాహరణమువల్ల మనకు బోధపడగలదు. ఆనందగోత్రజు డగు దామోదరశర్మ యనునత డొకశాసనము[2] నిచ్చియున్నాడు. సర్కారువారి శాసన పరిశోధనశాఖాధ్యక్షుడు పై శాసనకాలమును గూర్చి "క్రీ. శ. మూడునాల్గుశతాబ్దములనాటి ప్రాచీన పల్లవరాజుల ప్రాకృతశాసనముల కాలమునకును, దీనికాలమునకును విస్తారము దూరము లేదు."[3] అని వచించియున్నాడు. శాసనపుభాష సంస్కృతము; అయినప్పటికిని దానియందు కొంతభాగము ప్రాకృతమున వ్రాయబడి యున్నది.

"మూడు తెగల బ్రాహ్మణులు, ప్రతిగ్రహీతలు వారి గోత్రములతో గూడ చేర్కొనబడి యున్నారు: ౧౧ కొండిన్నులు (అనగా కొండిన్యగోత్రజులు), ౫ కస్సపులు (అనగా కాశ్యప గోత్రజులు);......౧ అగస్తి (అనగా అగస్త్య గోత్రోద్భవుడు.) గోత్రముల నామమువలెనే ప్రతిగ్రహీతల పేర్లుగూడ ప్రాకృత రూపమున వ్రాయబడియున్నవి. రుద్దజ్జ (రుద్రార్య), ఖందజ్జ (స్కన్దార్య), అగ్గిజ్జ (అగ్న్యార్య), సవరజ్జ (శబరార్య), భద్దజ్జ (భద్రార్య) ఇత్యాదులు."[4] ఈ శాసనమునందు శాసన భాషగ నంతరించుచున్న ప్రాకృతముయొక్క కడపటి చిహ్నములను గనుగొనుచున్నారము. రమారమి యొక్క పురుషాంతరములోపల సంస్కృతముననే శాసనములు వ్రాయు నాచార మారంభమాయెను.

ప్రాచీన కదంబ శాసనములను శోధించి చూడగా నీ విషయమే తేలుచున్నది. వీనియందు మిక్కిలి పురాతనమైనది మలవల్లి స్తంభశాసనము.[5] పూర్వము మైసూరుశాసన

1. E. I. IX, P. 57
2. Epi. Rep. 1920-21, Madras
3. Ibid.
4. Madras Epi. Rep. 1920-21.
5. E. C Vol. VIII, Shikarpur Tq. P. 264

పరిశోధనశాఖయందు బనిసేయుచున్న డాక్టరు ఎ. వెంకటసుబ్బయ్యగారు ఈ శాసనమునుజక్కగపరిశోధించి అందుపేర్కొనబడినక్కన్దవర్మకాదంబుడు గాడనియు, తత్కారణమున నాతనిపేరు కదంబరాజుల పేర్లలో నుండి తొలగించ వలయు ననియు తీర్మానించి యున్నారు.[1] ఈతని పరిశోధనవల్ల గలిగిన ఫలమేమన, మలవల్లి శాసనము వేయించిన దాతను మన మెఱుగక పోవుటయే. పైసిద్ధాంతము నాధారముచేసుకొని, ఈశాసనపు దాత మయూరవర్మయని దూబ్రే గారు వాదించుచున్నారు.[2] ఈవాదమునకు బలము నొసగు నంశములు కొన్ని కలవు. శాసనము ప్రాకృత భాషయందు విరచితమగుటచే, నది ప్రాచీనమనుట నిజము. ఇంతేకాక శాసనపులిపి యదే స్తంభముపైనుండు చూటుప్రాకృతశాసనలిపిని బోలియుండుటచేత డాక్టరు రాప్సను వంటి పరిశోధకుడు, "బనవాసిరాజ్యము చూటులకడ నుండి కదంబుల హస్తగతమాయె" నని చెప్పియున్నారు.[3] డాక్టరు రాప్సన్ చెప్పినది సరిగాదని కదంబ కకుస్థవర్మ యొక్క తలగుండ శాసనమువల్ల దెలియుచున్నది. అందు తన ముత్తాతయగు మయూరవర్మ రాజ్యమును పల్లవులకడనుండి పడసి వారికి సామంతుడాయెనని వచించియున్నాడు.[4] కాబట్టి మలవల్లి స్తంభముపై నున్న రెండు శాసనములును డాక్టరు రాప్సన్గా రను కొన్నంత సమీప కాలపువి గాదనుట నిక్కము. అది యట్లుండ నిండు.

మయూరవర్మ మలవల్లి ప్రాకృత శాసనపుదాతయనుట సరికాదు. ఈశాసనములోని ప్రాకృతశ్లోక మీ యూహతో విరోధించుచున్నది.

ఉక్తంఖండో:—

విన్నకమ్మా బమ్హదెజ్జం సేకదంబేసు బుధ్మతే;
విసత్తుచాతు వెజ్జం సిద్ధితం నిగమవిదితంచ.

దీనిమీఁది వెంకటసుబ్బయ్య గారి వ్యాఖ్యాన మీక్రిందిది:—"ఈశ్లోక మెచట నుండియో కొనివచ్చినది గాన శాసన కాలమునకు పూర్వమే వ్రాయబడియుండవలయును. కావున శాసన కాలమునకు చాలముందే కదంబులు బ్రహ్మదేయములనిచ్చి కీర్తి గడించి రనుటయు సహజము గాదు."[5]

"శాసనకాలమునకు చాలముందే కదంబులు బ్రహ్మదేయముల నిచ్చికీర్తి గడించి"నట్లయిన కదంబవంశమునకు మూలపురుషుడైన మయూరవర్మ మలవల్లి శాసనము నొసగిన దాత కాజాలడు. దానిదాత మయూర వర్మ తదనంతరము రాజ్యాధిపత్యమును వహించిన రాజులలో నొక్కరై యుండవలయును. ఈశాసనపుకడపటి రెండువాక్యములును(ఒక్కపదము

1. I. A. XLVI, P. 154
2. Anc. Hist. of the Deccan, P. 99
3. The Catalogue of Ind coins Intro. P. 54
4. E. I. VIII, P. 24.
5. I. A. XLVI, P. 154.

౩

కుంజతలమందు నొంటిగాఁ గూరుచుండి-మోహగీతంబులను బాడుముగుదవోలెఁ
దనహృదయవల్లికకు దోహదములు సేసి-ప్రకృతితరుణి పూయింపఁ బుష్పవ్రజంబు
మధురకావ్యంబు వ్రాసి పల్మారు దానిఁ-దాన తనలోనఁ జదువుసత్కవియుఁ బోలెఁ
బలుచనిమొగిళ్ల చేతఁ గప్పఁబడి రేక-పిండుఁ బైఁబైకిఁ బఱచుసూర్యుండువోలె
వనతటంబున విహరింపవచ్చు విరహిబృందములఁ బట్టి పీడింప బెట్టిదముగ
నురుల దిక్కులఁ బన్నెడుమరుఁడువోలె-జీవితరహస్య మెఱిఁగిన జీవివోలె
దుఃఖములు దాఁకిచూడని దొరయుఁబోలె-తఱుముచున్నట్టు లెవ్వరో! త్వర వహించి
పాటపయిపాట శరపరంపరగఁ దమిని-మఱచి విశ్వంబు గీతంబు మఱచి నిన్నె
మఱచి పాడుచునుందువు మరియు మరియు-నెంతపాడిన నించుకే నెలుఁగురాయ
దెట్టిపుణ్యంబు తొలిఁ జేసిపుట్టినావొ?-యంతకంతకు మధురమై యడరుఁగాని
పాడినదె పాడుచున్నను బ్రజలువిసుఁగ-కాదియందున వినినట్లె యాదరింత్రు
తనివిదీఱక నీపాట వినఁగ మరియుఁ-'గో'యనుచు నిన్నుఁ గవ్వించి కూయుచుంద్రు
నిజముగా నదృష్టంబన్న నీది గాదె?

౪

భవ్యముగ మావిఁ గూర్చుండి పాడుచుండ-నీదుగీతామృతంబు ఘనీభవించె
నేమొ! లేకున్నఁ దద్రుచి యెట్లుగలుగు-మావిపండ్లకుఁ దీవెలుం ద్రావ నేమొ!
లేనిచో నేల? పుప్పొలం దేనె లూఱు?-వాతములు మున్గెనో కానిపటిమందు
నంత చల్లఁగ వీచునే హాయిగదుర?

౫


నీదుమృదుళరవంబెల్ల నిక్కువముగ-గానమా? నూత్నదంపతుల్ కలసి చదువు
చారుశృంగారకావ్యమా? సహజమధుర-వాక్యమా? యీసకలమునా? ప్రతివచింపు
మాకు రాదేల? నీవలె మధురరుతము-నేమహాత్ముల సేవించి యీదృశమగు
హృదయసమ్మోహవిద్య నార్జించినావు?

౬

వినఁగవినఁగ భవద్గానమును నపూర్వ-భాషయందున్న ప్రకృతికావ్యంబునందుఁ
గ్రాలురసఘట్టములను బారాయణంబు-సేయుచున్నట్లు నాకుఁ దోఁచెదవు పికమ!
నీవులేకున్న ఋతువులు నిశ్చయముగఁ-బ్రియుఁడుపరదేశముననున్న ప్రియలు సుమ్ము
నీవులేకున్న దేశంబు నిశ్చయముగ-వాక్కుపడిపోయిన సమగ్రపండితుండు.

కలికాలపు కలివి

యంత్రమానవుడు



యంత్రమానవుని మెదడు, కరణేంద్రియములు.

'ఆర్. జె. వెన్స్లె' అను అమెరికా దేశీయుడీ యంత్రమానవనిర్మాణవిధానమును కనిపెట్టినవాడు. న్యూయార్కు నగరమున విలేకరుల పెద్దసభయెదుట దీనిని ప్రదర్శించినాడు. టెలిఫోనులో మనమాజ్ఞాపించిన వివిధకార్యములను తనంతట నీయంత్రమానవుడు నిర్వహించినాడు. ఈ యద్భుతయంత్ర సామర్థ్యమును ప్రేక్షకులు విశ్వసించిరి.



'సైమను' సప్తకము - నడుమనున్న వారు సైమనుగారు

ఇందున్న దొరసాని సప్తకములో నొక్కరగు 'స్ట్రాత్‌కోనా' గారి భార్య, వీరందఱి పేర్లు. సర్ జాన్ సైమను, అధ్యక్షుడు; వైకౌంట్ బర్నహామ్, మేజరు అట్లీ, కర్నల్ లేన్‌ఫాక్స్, లార్డుస్ట్రాత్‌కోనా, గౌ. కేడోగన్, హార్ట్స్‌హోరన్



౧. హెన్రీ ఫోర్డు— మోటారుకారులను కనిపెట్టిన అమెరికా కోటీశ్వరులు ౨. తామస్ ఎడిసన్— గ్రామఫోను యంత్రమును కనిపెట్టినవారు వీరిద్దఱు బాల్యమిత్రులు. కరస్పర్శను గావించుకొనుచున్నారు.

౨. ధర్మపరము శాసనములు

ఒంగోలు తాలూకా ధర్మవరమున నన్నయ భట్టారకునికి పూర్వపు తెలుగుశాసనములు రెండు కలవు. ఇవికూడ 'నెల్లూరుమండల శాసనములు' అనుగ్రంథమున రెండవసంపుటము ౯౭౭-౯౭౨ పుటలలో నీయబడినవి. బట్టరువర్తు, వేణుగోపాల శెట్టిగార్లు శాసనములు తీయునాటికి ఈశాసనశిలలలో నొకటి ధర్మవరగ్రామమునందలి మల్లికార్జునస్వామివారి ఆలయము దక్షిణపుగోడ కాన్పియు, రెండవది ఆగ్రామము తూర్పుననున్న సర్వే నెం ౩౮౧. రు పొలమునను ఉండినవి. వీటిలో మొదటిశిలాశాసనము విజయాదిత్యునినాటిది నియు, రెండవది చాళుక్యభీమమహారాజుదనియు నే నూహించుచున్నాను.

ఇవి రెండునుగూడ తెలుగుభాషకు చాల ముఖ్యమైనవి. ఎందువల్లననః విజయాదిత్యుని నాటిశాసనమంతయు 'గ్రాంథిక గద్య పద్ధతి' నుండి నాటిగద్యరచనముల ధోరణిని దెలుపుచున్నది. రెండవశిలాశాసనమున పద్యమును గద్యమునుగూడ గలవు. ఈ రెండుశాసనములును ఈవిధమున ఆంధ్రభాషాచారిత్రమునకు అత్యంతముఖ్యము లైనవయినను ఇంతవఱకు భాషాభిమానులు కాని, పండితులుకాని వీటిని వలసినంతశ్రద్ధతో పరిశీలించి, పరిశోధింపకపోవుటవిచారకరము. ఇందుకు కారణము లేకపోలేదు. నెల్లూరుమండల శాసనసంపుటములలో ఈ శాసనములు రెండును పైనుంచి క్రిందికి వ్రాయుటకు బదులుగా క్రిందినుంచి పైకి వ్రాయబడి తల్లక్రిందుగా నున్నవి. అందువలన మామూలు మాదిరిగ జదువువారికి పంక్తి పంక్తికి అందు పొందు గానరాక శాసనములు అర్థముకావు. అదియునుగాక ఆసంపుటములలో నిచ్చిన యా శాసనమూలములలో చాల యక్షరములు—ప్రతిబింబమున, స్ఫుటముగ లేక తెలియక కావచ్చును—విడిచివేయబడినవి. ఉన్న యక్షరములలో నైనను చాలతప్పులు పడినవి. ఈకారణమున ఈ రెండుశాసనములలో, పట్టుమని ఆరంభమునుండి కడవరకు ఒక్కపంక్తినైన పాఠమేర్పడుట లేదు. ఇటువంటిస్థితిలో నివి భాషాభిమానులయొక్కయు, పండితులయొక్కయు దృష్టి నాకర్షించకపోవుట వింత కాదు. వీటిలో విజయాదిత్యభూపతినాటి శాసనమునకు ప్రతిబింబమునుబట్టి దిమ్మకూడ చేయించబడి ఆగ్రంథమునందు ముద్రింపబడినను అది చాలచిన్నదిగ నుండుటచేత తాతిమీదనే అసలు చిన్నవిగ చెక్కబడ్డ అక్షరములు, అందు మరియు చిన్నవై దిమ్మనుబట్టి చదువుటకు అసలే తెలియరాకున్నవి.

ధర్మవరమునందలి యా శాసనశిలలు రెండును ఇటీవల మ్యూజియమునకు వచ్చి

యుండుటచేత మంచి ప్రతిబింబములనుదీసి చది వినచో నెల్లూరుశాసన సంపుటములలో నిచ్చిన పాఠములకంటె మేలైనట్టియు, సరియైనట్టియు పాఠములు నిచ్చుటకు వీలుండునేమోయని వాటికికూడ ప్రతిబింబములను దీసి చదివితిని. తత్ఫలితముగనే సంపూర్ణముగ గాకపోయినను చాలవరకైనను శాసనపాఠము కుదిరి, వాటి ప్రాముఖ్య మెరుకపడి వాటిని మఱల ప్రక టింపవలసిన యావశ్యకత కలిగెను. ఇంతవఱకు ఎవ్వరును గుర్తించని విజయాదిత్య భూపతి నాటి శాసనమున చక్కని అద్భుతమైన గద్య మును, భీమమహారాజు శాసనమున ఇంత వఱకు ఎవ్వరును అనుమానించనైన అను మానించని సీసపద్యమును దెలిసికొనినంతనే నాకు చాలసంతోషము కలిగినది.

కీ. శే. (శ్రీ) కొమఱ్ఱాజు వేంకటలక్ష్మణ రావు పంతులుగారి కోరికమీద గౌనర్మెంటు శాసనశాఖవారు అద్దంకి, ధర్మవరము శాసన ములు మూటికి మఱల ప్రతిబింబములను దీసి, వారి శాసననివేదికలో వాటిని పునర్విమర్శిం చిరి. ఆవిమర్శనమును బట్టిచూచినచో వారి శాసనపాఠముల గొన్ని పొరపాటులు దొర్లి యుండవచ్చునని నాకు దోచినది; ఎందువల్ల ననగా వారి విమర్శనములలో నాశాసనపాఠ ములనుబట్టి నేనర్థము చేసికొన్నదానికి భిన్న మైన యర్థము స్ఫురించుచున్నది.[1]

మూడవ విజయాదిత్యునినాటి శాసనము

ఈ శాసనము తెల్లని పాలశిల మీద మామూలుగ పైనుంచి క్రిందికిగాక తలక్రిందుగ క్రిందినుంచి పైకి చెక్కబడినది. అందువలన శాసనములోని కడపటి దగు పదునొకండవ పంక్తి రాతిమీద నెగువ మొదటి పంక్తిగ గన్పట్టును. ఈపంక్తికిపైన అనగా శిల ఎగువ భాగమున అయిదు పడగల సర్పముయొక్క

1. శాసనశాఖవారి శాసన నివేదికలో (౧౯౨౩) విజయాదిత్యునినాటి శాసనము (౯౨౨ వ సంవత్స రపు శాసనములలో ౭౮౧ వ నెంబరుది; భీమమహారాజు శాసనము ౩౯ వ నెంబరుది. శాసన శాఖాధికారులు ఈధర్మవరము శాసనములలో ఉన్నదని వ్రాసిన పండరంగనూరుకాని, పండరంగపూరు కాని ఈ శాసనములలో దేనిలోను గానరాదు. విజయాదిత్యునినాటి శాసనమున కొజయరాజు పండరంగని, అల్లుమపెద్ది పెర్గడను (ఏదో విజయమునకై) పంపినట్లు కలదని శాసనశాఖాధికారులు వ్రాసియున్నారు కాని శాసనమున నేను చదివినంతవరకు అట్టి యర్థమువచ్చు పంక్తులేవియు లేవు; పైగా అసలు పంపబడిన వాడే కొజయరాజు. అదియునుగాక శాసన మున అల్లుమపెర్గడ అనియే కలదుగాని అల్లుమ పెద్దిపెర్గడ యని లేదు. విజయాదిత్యునినాటి శాసనముచెక్క బడిన శిల చాలచెడిపోయినను చదువుటకు దెలియవచ్చు పంక్తులనుబట్టి అందు గొంత భాగమయినను పద్యమయ మని శాసన శాఖాధికారులు వ్రాసిరి కాని అందు నాకు పద్యమెక్కడను గానరాలేదు సరికదా శాసనముననే అది 'గద్యంబుల' నున్నట్లు కలదు.

ఇక రెండవ శాసనమున కొజయ, గుణక్కెనల్ల పదములుండుట వలన శాసనశాఖాధికారులు దీనిని విజ యాదిత్యునినాటిదిగ భావించిరి కాని "సర్వలోకాశ్రయ శ్రీ..............క్యభీమ మహా రాజుల విజయ రాజ్య సంవత్సరంబు"లని శాసనము మొదటిరెండుపంక్తులలోనే యుండుటచేత ఇది భీమమహారాజు శాసనమని యే నేను తలంచుచున్నాను.

పితామహో భవద్యస్య
పాండరంగః పరంతపః.[1]

ఇందువలన చాళుక్యభీమమహారాజు శాసనములలో అజ్ఞప్తిగవచ్చు కడెయరాజు పాండరంగని మనుమడని స్పష్టమగుచున్నది. మన శాసనమునందలి కడెయరాజు 'విజయాదిత్య పాదపద్మ భ్రమరాయమాను' డగుటవలన నతడు పాండరంగని తండ్రియైనట్లు నిశ్చయింపవచ్చును. పాండరంగని తండ్రియైన కడెయరాజు విజయాదిత్యుని నిమిత్తము యుద్ధరంగమున దనప్రాణములను ధారపోసెనని విజయాదిత్యుని పోణంగితామ్రశాసనమున నిట్లు కలదు:

పరచక్రేణ యుధ్యాప్తే
దత్తప్రాణస్య భూభృతే
సూనుః కడెయరాజస్య
పాండరంగో గుణాధికః
విజయాదిత్య భూపాల
పాదపద్మ శిలీముఖః.[2]

ఈకారణములచేత మనశాసనమునందలి కడెయరాజు 'విజయాదిత్య పాదపద్మ భ్రమరాయమానుడు' కావున మనశాసనము మూడవ విజయాదిత్యునినాటిదని నిశ్చయింపవచ్చును; అనగా అద్దంకి శాసనమును ఇదియు సమకాలీనములే: క్రీ. శ. ౮౪౪-౮౮౮ నాటివి.

శాసన విషయము

శాసనమున మూడవపంక్తిలోని మొదటి రెండుమూడక్షరములు పోయినందున మొదటి రెండుపంక్తులకును తరువాతి శాసనమునకును గల సంబంధము తెలియవచ్చుటలేదు. ఇంతవరకు పోకుండ నిలిచియున్న శాసనమును బట్టి చూడగా ప్రారంభమున చాలపంక్తులు పోయియుండవలెనని తోచుచున్నది.

శాసనముయొక్క ఆద్యంతములు పోయినందున శాసనవిషయము విస్పష్టముగ దెలియవచ్చుటలేదు. ఏదియో ధర్మనిర్వాహణము చేయవలసియుండగా—గుళ్లు, ప్రాకారములు మొదలైనవి నిర్మించుట, కలశమెత్తించుట- ఇటువంటి ధర్మకార్యములు కాదగునేమో— అట్టిపనికి కా?డెయగారి కొడుకు బెజెయరాజు చాల సమర్థుడని అయ్యపయ్య, [?పెద] పండరంగులు, అయ్యమప్రెగ్గడలు, ?రణము పండరంగు—వీరందరు సమ్మతించి అతనిని పంపగా అతడు వెళ్లి బెజెయేశ్వరమున 'కలశ నిర్వాహణము (లేక ?నిర్వచనము)' చేసి గుళ్లు, ప్రాకారము, మఠము మొదలైనవి నియమించెనని ఇప్పటివరకు నిలిచియున్న శాసనముయొక్క భావమని నే నూహించుచున్నాను. బెజెయరాజుయొక్క యీ ధర్మకార్యములు తెలుపుటకే యీ శాసనము పుట్టియుండవచ్చును.

శాసనమున 'కలసనివ్వ--నంబు సేసి' అని కలదు. అది 'నిర్వహానంబు సేసి' అనినైన కాదగును; లేదా, 'నిర్వచనంబు సేసి' అనినైన కాదగును. 'నిర్వచనంబు' అన్నచో 'కలశ' ఎట్లుండ

1. Ep. Ind. V. P. 132

2. M. E. R. 3 of 190-09.

వలెనో దానిని నిర్ధారణచేసి, తీర్మానము చేసి అది యర్థము చెప్పకొనదగును. మత సంప్రదాయములనుబట్టి కలశలలో భేదము లుండు నని విందును. 'నిర్వచనంబు' కాక 'నిర్వహానంబు' అన్నచో కలశ ఏర్పాటు చేసి అది యర్థము చేసికొనవలసియుండు ననుకొందును. ఆకాలమున 'కలశ'కు ప్రాముఖ్య మెక్కువగ నుండినట్లు యుద్ధమల్లుని బెజవాడ శాసనము ననుసరించికూడ దెలిసికొనవచ్చును.

శాసనమున పేర్కొనబడ్డవారు,

అయ్యపయ్యయు, [?పెద] పండరంగులును, అల్లుమ ప్రెగ్గడలును, పండరంగును బెజెయరాజును శాసనమున పేర్కొనబడిరి. వీరి కొండోరులకు గల సంబంధము శాసనమునుబట్టి తెలియవచ్చుటలేదు. బెజెయరాజు మాత్రము 'పెగ్గెడకా...గారి కొడు'కని శాసనమున గలదు. అతడు కా[?డెయ]గారి కొడుకు కాదగు నేమో. ఈకాడెయగారు ప్రెగ్గడ లనుట వలన ఈయునయు, కడెయరాజును ఒక్కరే యగుదు రేమో. అట్లయినచో నీ బెజెయరాజు పాండరంగని సోదరుడగును. విజయరాజు అను దాని ప్రాకృతరూపమే బెజెయరాజు. ఎట్లయినను పాండరంగ, విజయరాజుల సౌదర్యమును గురించి నిర్ధారణగ జెప్పలేము. అయ్యపయ్య చౌషష్టికలావిశారదు డనియు, [?పెద] పండరంగులు సకల శాస్త్రార్థపారగులనియు శాసనమున జెప్పబడి యుండుటచేత ఆనాడు పేరు గొప్పపండితులని యూహింపవలసి యున్నది. ఇటువంటి పండితులచే ధర్మనిర్వహానోద్యోగమ్మునకు నియోగింపబడిన బెజయరాజు కూడ చాల సమర్థుడై యుండవలెను. అతడు కూడ సమస్తరాజ్యభర నిరూపిత మహా మంత్రాధిపతి యనియు, మహేశ్వర పక్షపాతి యనియు దేవబ్రాహ్మణగురుభక్తిపరుడనియు, శక్తిత్రయ సంపన్నుడనియు వర్ణింపబడియున్నాడు. మూడవ విజయాదిత్యునినాటి సుప్రసిద్ధ రాజకార్యప్రవీణులలోను, ప్రధాన రాజకీయోద్యోగులలోను బెజెయరాజు ఒకడుగ నుండవలె ననుట నిశ్చయము. బెజెయరాజు గుళ్లు, ప్రాకారము,మఠమును గట్టించిన బెజెయేశ్వరము ధర్మవరమో తత్ప్రాంతగ్రామమో కాదగును. ఈ శాసనము ధర్మవరములోనే కనబడుటచేత ప్రాయికముగ నది ధర్మవరమే అయియుండవచ్చును. ఇటువంటి ధర్మకార్యములకు ప్రసిద్ధి కెక్కుట చేత ఆబెజెయేశ్వరమునకే ధర్మవరమను పేరు రూఢమయ్యె నేమో.

మూలము[1]

(౧. మూడవవిజయాదిత్యునినాటి శాసనము)

మొదటిప్రక్క

౧. ....[వి] జయాది [త్యపాదప]

౨ [ద్మ] భ్రమరాయమాన శ్రీమత్కడెయరాజు గుణగణాభరణుణ్డు [ద]న

౩. ˙కైనిఈస్వ(శ్వ)రున[కుం]గార్త్తికేయుణ్డుంబోలెచౌవష్టికల(లా)వినా(శా)రదు[ణ్డై]

౪. య్న [అ]య్యవయ్యయు సకల[శా]స్త్రార్త్థ[పా]రగులయ్న పె[?ద]

౫. పణ్డరంగులు అల్లుమపెగ్గడలుంగర[న]మ్మినపణ్డరంగును ఈధ

౬. మ్మర్నని[వ్వర్[హా*]నోద్యోగమ్మున[కు] బృహాస్పతి సమానులయ్న పెగ్గడ
కా[?డెయ]

౭. గారి [కొడు]కు [బె]జెయరాజు సమ[ర్థు]ణ్డని ఆత్మాన్మతంబునంబన్చినప్ర

౮. సా[దం]బని సమస్తరా[జ్యభ]రనిరూపిత మహామన్త్రాధిపతి [మ*]

౯. [హే]శ్వరపశుపాతి దేవబ్రాహ్మనగురు[భ]క్తిపరుణ్డు న(శ)క్తి[త్రయ]

౧౦. సంపన్నుణ్డు మయ బెజెయరాజు బెజెయేశ్వరంబుగలన(శ) నివ్వర్[?హా*]

౧౧. నంబునేసి దిన(శ)గుద్లుం బ్రాకారంబు మటంబును నెమియించి

రెండవ ప్రక్క

౧౨. ....[?బున్వా]..........వచ్చినవ(వా)రు

౧౩. ....దంబు[సల్పి]నవ(వా)రుది......[౦]బుగద్యంబుల

౧౪. నలన(?శా)స్వ(?శ్వ)తంబు............[యను]

౧౫. ఇ (ఈ) భూమిలోన

---

౧. నేనుతీసిన ప్రతిబింబము ననుసరించి.

మూలము[౧]

౨. భీమమహారాజుశాసనము

౧. స్వస్తి సమస్తలోకాశ్రయ........[శ్రీ]భీమమహారా[జుల వి*]

౨. జయరాజ్యస[ం*]వత్సరంబు...[?మే]నగునేణ్టి(ట్టి)ఉత్త[రా]యనస[ంక్రా*]

౩. [న్తి*]స్తితి ధమ్మా౯వురమ్మున......[స్వస్త్య]నేకగు[ణ]గణాలంక్రి (కృ)త [స*]

౪. [మ*]స్తమహి(హీ)మణ్డలప్రకాశితకీర్త్తి౯ (శ్రీ)మా(మ)త్పణ్ణరంగు॥ .[౩] ల.[౪] నె.[౫]

౫. స్నే[౬]లునలరామనిభుతోఒనెడతి[నబో*]యుల నడవిసా[?స్వ[౭]][।*]లోహాస[నం]

౬. బెక్కి రాహాను నొడిచిన వల్లభకొల్పిన నెల్ల నెలుంగ[।*]కన్న రాభూ[పతి]

౭. వెన్నాజిలోం జూపె సంకిలా(ల)ణ్ణను[?జే]ని [?బి*][ంక]ముడి[చో][।*] [ద]ణ్డు వైవచ్చిన [బెణ్డై]

తా.క. ౧. రాయి అరిగిపోయినప్పటికి, స్వల్పముగ పొరలు లేచిపోయినప్పటికి, గంట్లు పడినప్పటికి సుస్ఫుటముగ గాకపోయినను ఒకవిధముగానైన కనబడు అక్షరములు ఈ [ ] కుండలీకరణమున జూపబడినవి.

౨. తప్పుకాని సరియైన ఈపదములు ఈ ( ) కుండలీకరణమున జూపబడినవి

౩. మూలములో లేనివి ఈ [*] కుండలీకరణమున జూపబడినవి.

---

౧. నేను తీసిన ప్రతిబింబము ననుసరించి. ఈశాసన వివరములు రాబోవు సంచికలో ప్రకటింపబడును.

౨. 'పదినేవను' అగునేమో.

౩. ఈయక్షరమున కుత్వము కలదు: అసలు అక్షరము 'ద' అగునో యేమో. తలకట్టు స్ఫుటముగ గనబడుట లేదు.

౪. ఈవర్ణము 'మూ' వలె నున్నది. 'దూ' కూడ కావచ్చు.

౫. ఇచ్చట 'వ' వర్ణమునుబోలిన గుర్తున్నదని అనుమానము. తలకట్టు కనబడుచున్నది. అసలు అక్షరమేదో స్పష్టముగ జెప్పలేను.

౬. ఈవర్ణమును మొదట 'స్తే' గ చదువవలెనేమో అని అనుమానించితిని కాని పదునొకండవ పంక్తిలోని 'నల్లాతణ్డయ్న' లోని 'న' వత్తుకూడ ఇట్లే యుండుటచేత ఇది 'స్నే' అగుననియే నిశ్చయించితిని.

౭. ఇచ్చట రాయి పొర లేచిపోవుటచేత ఈయక్షరము 'స్వ' అగునో కాదో నిశ్చయముగ జెప్పలేను కాని పోలిక అట్లే యున్నది.

౮. [న*]చోఁలనిం జేకొనికాచె భూ[లోకం] బెఱుంగ[।*] కిరనపురము డహాల ని

౯. రుతంబు దలెనాండు[।*] నచలపురము[?సా౧౧]చ్చె నచలితుణ్డు [।*] వల్ల భు

౧౦. ణ్డు గుణకెనల్లుణ్డు [వన్ని] నం[।*]బణ్డరంగ చూరె పణ్డరంగు।[?నా౧౩బా౧౪]ర[గౌ౧౫]

౧౧. నరెయమజెవా నాన్ని నల్లాతణ్డయ్య అయ్యపరాజు తమ్ముణ్డు బెజెయ

౧౨. రాజు ఈపురము నీశానంబున గుడి నిల్పె నడియు ? సే౧౬యకున్న సే.౧౭

---

౮. ఇచట 'లా' దీర్ఘము స్పష్టముగ గనబడుచున్నది. అయితే రాయిగంట్లలో ఎడమవైపు ఏదో కొమ్ము న్నట్లు తోఁచుటచేత అది 'లో' అని నిశ్చయించితిని.

౯. 'కి' ని అంటి దిగువ భాగమున క్రిందివైపు అర్ధచంద్రాకృతిగ గీటు కనబడుటచేత దీనిని 'క్కి' గ చదివితిని. ఆయర్ధచంద్రాకృతిచిహ్నము రాలిపసలేకాని 'క' ద్విత్వము కాదన్నయెడల దీనిని 'చేకి' గాగాని 'ఛకి' గాగాని చదువవచ్చును. ఈశాసనమున గుణింతమున ఎ, ఎలకు వ్రాతలో భేదము పాటింపబడ లేదు.

౧౦. క్రింది సంయుక్తాక్షరము 'వ' వత్తు అయినచో మొదటిపంక్తిలోని 'సర్వ' లోని 'వ' వత్తువలె నుండవలెను. అట్లుండనందున దీనిని 'కొల్పున' అని చదివితిని

౧౧ 'బింకముడిచె' అనుదానిలో 'బి' తక్క మిగిలిన వర్ణము లన్నియు ఏయస్ఫుటముగనైన అరిగిపోయి యు గాన్పించుచునే యున్నవి. రాయి కురిగియు, గంట్లు పడియు, పొరలు లేచియు చెడిపోయిన చోట్లనున్న యక్షరములను శాసనశిల దగ్గర గంటలకొలది కూర్చుండి నీటితో రాతిని కడిగి కడిగి గుర్తింప గలిగితిని.

౧౨. ఈయక్షర మేదో స్ఫుటముగ తెలియుటలేదు. పవర్ణమువలె నున్నట్లు తోఁచినది. తరువాతి యక్ష రము 'చ్చె' అగుటచేత ఇది 'సా' యగునని తలచితిని.

౧౩. ఈయక్షరము నిదానించి చూడగా 'నా' పోలిక నున్నది.


౧౪. ఈయక్షరము చాల చెడిపోయినది. దీని ఎగువభాగము 'బ' పోలిక నుండుటచేత దీనిని 'బ' అని వ్రాసితిని.

౧౫. 'గ' వర్ణము స్పష్టము. గుడిభాగమున రాయిపొర లేచినది. నిదానించి చూడగా ఆభాగమున గుడి యుండు నేమో అని అనుమానము తట్టినది.

౧౬. 'స' వర్ణము స్పష్టముగ గనబడుచున్నది. ఏత్వ మున్నదా లేదా యని యనుమానము.

౧౭. ఇచ్చటినుండి మూడక్షరములు కలవు. మొదటిది 'చ' వలె నున్నది. తరువాతి రెండక్షరములు ఏవో తెలియరావు.


ధర్మవరము శాసనము



విజయాదిత్యుని నాటిది

ధర్మవరము శాసనము


రెండవప్రక్క



౧౨
౧౩
౧౪
౧౫

విజయాదిత్యునినాటిది

ధర్మవరము శాసనము



చాళుక్యభీమమహారాజుది

ఆదిమాంధ్రులు

మంగిపూడి వెంకట శర్మ గారు

ఆంధ్రజనులార, నామాట లాగ్రహింప
కాలకింపుడు మీరా కిందు మేలు కలదు
ఆదిమాంధ్రుల నికనైన నాదరించి
చేరదీయక యుండిన చేటు గలదు.

మనమతంబునందు మనినంత కాలము
గౌరవంబు లేని కారణమున
వార లన్యమతమువారల శరణంబు
జొచ్చి మనల పీడుచున్నవారు.

క్రైస్తవంబులోన గలసిపోయిరి లక్ష
లాది మంది మనబలంబు తరుగ
ఇచ్చ గలిగ నేటి కిస్లాములో గూడ
జేరిపోవ తెలుగు సీమయందు.

వంచకులు గలరు కొందరు
పంచమనాయకులలోన వారివలన నే
మించును కలహము లిచ్చట
మించుగ కనుగలిగి మీరు మెలగగవలయున్.

హిందూమహమ్మదీయుల
యం దుదయంబైన కలహ మది దుర్భర మై
ప్రమందించు చుండె దేశము
హిందూ క్రైస్తవుల కలహ మిక మన కేలా.

ఉత్తరహిందూస్థానము
మత్తతచే నాశ మయ్యె మతకలహముచే
నిత్తెలుగు సీమ నరు లా
యుత్తము పడ నేల యట్టి యాహవములకున్.

మతకలహము మన తెలుగున్
క్షితి పుట్ట దటంచు నమ్మ జెల్లునె యందం
ద తొలితల యెత్తగా లే
దె తిరిగి జని యుంప వనుట ధీలక్షణమే.

నిప్పుకొండ పగిలి నింగియు నేలయు
నేక మైనదాక లోకమునకు
నిప్పుకొండ యునికి నేరరాని విధంబె
మొదట నీసమస్య బోధపడదు.

ఆదిమాంధ్రులు దేవాలయముల కరుగ
నుత్సహించుచు నున్నవా రొకటి రెండు
చోట్ల చెప్పిరో చెప్పకో చొచ్చినారు
కాని యీకోర్కి ప్రబలంబు కాకపోదు.

మొన మొన్నను రాజోలున
నొనగూడిన యాదిమాంధ్రు లొకకొందరు చ
ర్చను నడపిరంట యిస్లా
మున కలియుగ కొలమువారి బురికొలుపంగన్.

మనకనుల యెదుటనే సై
మను కమిటీ యండ జేరి మననుండియు చీ
లినవారి జూడమే యిం
కను నేమి నిదర్శనంబు గావలె నిచటన్.

ఆదిమాంధ్రు లనగ నన్నదమ్ములె కాని
తేరవారు కారు తెలిసి చూడ
వారి హక్కు లిచ్చి వారితోడున స్వరా
జ్యము గడింపరయ్య, యాంధ్రులార!

అలభారతు లందరిలో
తెలివి గలుగువారు తెలుగుధీరు లనుచు నీ
యిల యెల్ల బొగడ వీరే
తొలుత సనాతనులపొత్తు తొలగక నిలుడీ.

నమ్మెలు కట్టింపగ య
త్నమ్ములతో నున్న వారు నాయకులే కా
లమ్మున కెది పొసగునో యే
బొమ్మన్నదొ కాలగర్భమున నెవ డెరుగుఁ.

రాగల కష్టము ముందుగ
నే గనుగొని దాని దీర్ప నేరుచు శాంతో
ద్యోగులె సుఖించుచుందురు
బాగుపడరు దూరదృష్టి బడయని మూఢుల్.

ఆంధ్ర దేశమునందలి యాదిమాంధ్ర
వర్గముల కెల్ల గలుగు లోపమ్ము లరసి
బహుళసౌకర్యములు గూర్చి భాయి యనుచు
నొండొరులు ప్రేమమెయి నొప్పుచుండరయ్య!

నేను నేను కాను

నాళము కృష్ణరావు గారు

[ఆంగ్లమున కనువాదము]

కేలఁ గోలయు నెత్తిపై మీలబుట్ట-పెట్టుకొని యేఁగె సంతకు వృద్ధురాలు;
కొంత సేపటి కామెకు కునుకు రాఁగ-ఒరిగె నాబాటదరి నున్న తరువుక్రింద.

బండఁ డొక్కఁడు ముదుసలియండఁ జేరి-నున్నఁగాఁ దలవెండ్రుక లన్ని గొఱిగి
మొగముమీఁదను దలనిండ ముగ్గు పూసి-బొగ్గుపొడితోడ నెడనెడ బొట్లు పెట్టె.

దృష్టిపిడుతను బోలి వికృతిని గొలుపు-నామెశిరమును బొడఁగని యుక్కజమున
గుంపులుగఁ గూడి జను లెల్ల గొల్లు మంచు-కడుపు చెక్కలు గా నవ్వఁ గడఁగి,రంత.

అలికిడికి నుల్కిపడి తోనె మెలఁకువ గని-తలయు మొగమును జేతులఁ దడవికొనుచు
తల్లడంబును చిడిముడి మల్లడిగొన-మదినిఁ దలపోసె నీరీతి ముదివెలంది.

అమ్మచెల్లరో! యిది యేటియబ్బురంబో?-నేను నే నగుదునో కానో? నేన నైన,
తోఁకయాడించు నాకుక్క, కాక యున్న-మొఱఁగి నామీఁది కొకపెట్ట యుఱికి కఱచు.

ఇట్లు చింతించి ముదుసలి యింటి కరిగె,-బొంయి బొం యని యాకుక్క బొబ్బరించె;
ఉలికిపడి యామె వెనుకకు నొదిఁగి యొదిఁగి-'అక్కటా! నేను నేను కా' నంచు నేడ్చె.

యశశ్శరీరు లగు దివాన్ బహదూర్

కిళాంబి రామానుజాచార్యులవారు, M. A. B. L., D. Litt.

వేంకటనాథ వేదాంతదేశికాచార్యులు గారు

" పౌరుషజ్ఞాన కీర్తులఁ బరగ నేని, వానిసంపద యొకప్రొద్దు రోయుఁ జాలు "

"One crowded hour of glorious life, Is worth an age without a name." Scott.



మహా విద్వత్కవులును, విజయనగర మహారాజా వారి యాంగ్లకళాశాలకును, (1887—1920) సంస్కృత కళాశాలకును (1900—28) గత ప్రధానాచార్యులగు (Ex-Principal) శ్రీ కిళాంబి రామానుజాచార్యులవారు ఫాల్గుణ శుద్ధ చతుర్దశీ సోమవారము నాఁడు (5 మార్చి, 1928) పగలు 12 గంటల 55 నిమిషములకు స్వర్గస్థులైరని తెల్పుట కెంతయుఁ జింతిల్లు చున్నాను. " అనాయాసేన మరణం వినా దైన్యేన జీవనం " మన్మను నూక్తికివీరులక్ష్యభూతులు; ఇట్లు 41 సంవత్సరములు విద్యాదానము చేసిన మహనీయుని మఱియొక్కని భారతదేశమునఁ గానము. శిష్యవిధానమునఁ దండశాసనులు (Iron disciplinarian). సౌజన్యమునకు వీరు పెట్టినది పేరు. వీరికి వయస్సు 75 సంవత్సరములు. ఆంధ్రులలో వీరు భీష్ముని వంటివారు. ' సుకాలమువలె ' మన పూర్వపుణ్యాతిరేకమున నిట్టి మహనీయు లుద్భవించుచుందురు. వీరు చూపిన నందుకొనిపోవు నిశితధిషణాధురంధరులు. ఆంగ్లాంధ్ర గీర్వాణసాహితీనిష్ణాతులు. అపారప్రాచ్య విజ్ఞానసంపన్నులు. " విద్యతోడుత వినయంబు గుదిరియుంట, పసిఁడికిని దావియబ్బిన భాతియగును." అను సుభాషితమునకు వీరు ప్రబల లక్ష్యము. ఆంధ్రదేశమున నున్నతపదస్థులు, విద్యావంతులు నగు వారిలో వీరితో నాచార్యం లేవాని సంబంధము లేనివా రరుదు.

" Some are born great, some achieve greatness, and upon others greatness is thrust." ఈసూక్తిలోని " Some achieve greatness " అను భాగమునకు మన ఆచార్యులవారు ప్రబల లక్ష్యము. వీరు స్వయంకృషిచేతను, దమయ ప్రతిమ ప్రతిభాపాటవము చేతనే యాదర్శ పురుషులైరి. " It is nobler to become great than to be born great." గుణ లుబ్ధయగు లక్ష్మి సుగుణరాశియగు వీరి నాశ్రయించుటలో నేమి యాశ్చర్యము గలదు! సౌజన్యకీర్తియగు లక్ష్మితోపాటు వీరిని విద్యకూడ నాశ్రయించినది.

శ్లో. యత్రాస్తి లక్ష్మీ ర్వినయో నతత్ర
అ...గతో యత్రనతత్ర లక్ష్మీః;

ఉత్థాయ తే యత్ర సత్రైవిద్యా
నైకత్ర సర్వోగుణ సన్నిపాతః.

ఈ సూక్తి వీరియందు సత్యమగుచున్నది.

శ్లో. పాండిత్యం ప్రథితాన్వవాయ జనుషః
ప్రాయః క్షమాం యోగినో
(దాక్షిణ్యం ధరణీపతేశ్చ) నియతం
దాతుః ప్రియం భాషణమ్;
విద్యాపారదృశో జనస్య వినయం
విత్తోన్నత స్యాస్పదం
సౌలభ్యం మహతశ్చ, హేమ సుమన
స్సౌరభ్య మాచక్షతే."

వేంకటాధ్వరిః ప్రద్యుమ్నానందనాటకము.

సువర్ణసుమమునకు సౌరభ్య మబ్బినరీతిఁ సైలక్షణములు శ్రీఆచార్యులవారియం దమరియున్నవి.

దుర్లభమగు సకారసప్తకముగూడ (సంప త్స్వరస్వతీసత్యం సంతానం సదనుగ్రహః, సత్తా సుకృత సంభార స్సకారా స్సప్త దుర్లభాః) వీరియం దొప్పియున్నది. వీరి పాండిత్యము సర్వంకషము. (Manysided or encyclopaedic) వీరికీర్తి దిక్చూడాలంకషము. ఈక్రింది శ్లోకముకూడ వీరియం దన్వర్థమగుచున్నది.

"శ్లో. నానామ్నాయపరిశ్రమం కలయతాం
నాస్త్యేవ శాస్త్రేషు ధీః;
సత్యోర ప్యనయో స్తయో ర్న సులభా
సాహ్యాత్మతా సాహితీ;
అప్యేతాసు సతీషు నాస్తి వినయో
నాచారభక్తిత్వమా
చాతుర్యస్య చ సాహసవతా
శ్చాలంబ్య శీలం త్వముమ్."

విశ్వగుణాదర్శము.

"శ్లో. సాధూనా ముపకర్తుం
లక్ష్మీం ద్రష్టుం విహాయసా గన్తుమ్
నకుతూహలకస్య మన
శ్చరితంచ మహాత్మనాం శ్రోతుమ్."

భట్టబాణుఁడు (హర్ష చరిత్రము, III ఉ.)

ఈమహనీయుని చరిత్రము నించుక యరయుదము. వీరిది ఆత్రేయగోత్రము. వీరి వంశమునకు మూల పురుషుఁడు "కిడాంబి ఆచ్చాన్." ఈయన, విశిష్టాద్వైతమతోద్ధారకులగు శ్రీభగవద్రామానుజాచార్యులవారి యంతరంగశిష్యుఁడు. ఈ "ఆచ్చాను"నకుఁ బ్రణతార్తిహరాచార్యులని నామాన్తరము గలదు. ఈవంశమునందే సుప్రసిద్ధప్రపన్నశిరోమణియు, కవి తార్కికసింహసర్వతంత్రస్వతంత్ర బిరుదాంచితులునగు వేదాంతదేశికులవారికి మేనమామయు, నాచార్యులునగు నాత్రేయరామానుజు (వాది హంసజలదాచార్య) లవతరించిరి. శ్లేషయమకచక్రవర్తియు, సాహితీరత్నపటలీనికషాయమాణములగు విశ్వగుణాదర్శము, లక్ష్మీసహస్రము, కరిగిరి చంపువు, ఉత్తరరామచరిత చంపువు, శ్రీనివాసవిలాస చంపువు, ప్రద్యుమ్నానందనాటకము, సుభాషితకౌస్తుభము మొదలగు కావ్యముల రచించిన వేంకటాధ్వరి మహాకవియు నీవంశోత్పన్నుఁడే. ఇట్టి విశ్రుతాభిజన ప్రతిష్ఠగల వంశమున మన యాచార్యులవారు ప్రమాదీచ సంవత్సరమున (5 మే 1853) నవతరించిరి. వీరి నివాసస్థలము మొదటఁ బశ్చిమగోదావరీ మండలమునందలి పెంటపాడను నగ్రహారము. వీరి జననీజనకులు సింగరంబా తాతాచార్యులు. అప్రతిమ ప్రతిభాభాసురులగు మన యాచార్యులవారు బాల్యముననే యాంధ్రమునను, గీర్వాణకావ్యనాటకాలంకార వ్యాకరణములయందును గూలంకషపాండిత్యము సంపాదించి, పదునాఱవయేట నష్టావధానము, శతావధానము, నేడెనిమిది భాషలలో వ్యస్తాక్షరి చేయుట మొదలగు నశ్రుతదృష్టపూర్వప్రజ్ఞాపాటవముచేఁ బండితులఁ గూడ నద్భుతమున ముంచుచు నానందమునఁ దేల్చుచుండిరి. వీరేకసంథాగ్రాహులు. విద్వాన్ అభినవపండితరాయ మాడభూషి వేంకటాచార్యులవారు ('భరతాభ్యుదయ' రచయితలు) అవధానములు చేయుదురని విని, మన రామానుజాచార్యులవారుగూడ నతిబాల్యముననే, (లక్షణజ్ఞానములేని సమయముననే) యవధానములు చేయుటకుఁ బ్రారంభించిరఁట! ఇది మనకు విరుద్ధముగఁ గనుపించినను "పోప్" (Pope) అను నాంగ్లకవి ("I lisped in

numbers for the numbers came.") వాక్యము నుదాహరించినచో దప్పక దీని నొప్పుకొందుము.

వీరి పదునాఱవయేట వీరిజనకులు స్వర్గస్థులైరి. పిమ్మట, 1873 లో, వీరు జననితో విజయనగర గమనోన్ముఖులై వచ్చుచు, మార్గమధ్యమునఁ 'గడియ' గ్రామములో నాగి, నాఁటి పిఠాపురపు రాజావారగు శ్రీరాజా రావు వేంకటగంగాధర రామారావుగారి సన్నిధిలో నవధానము చేసిరి. అప్పుడు పృచ్ఛకులు మెప్పుదిరయిన మందుగు రగుటచేఁ గాబోలు శ్రీరాజావారు వీరికి 38 రూప్యముల నొసఁగి సన్మానించిరఁట. తరువాత వీరు విజయనగరమునకుఁ గా నీయవధాన పాటవమే యభినవ భోజుఁడగు నానందగజపతిమహారాజుని కటాక్షము నాకర్షించినది. ఆవిద్యాభోజుని కటాక్షముచేతనే వీ రాంగ్లవిద్య నభ్యసించుటకు మొదలిడి, యొకసంవత్సరము లోపున (1874 లో) ప్రవేశపరీక్ష (Matriculation Examination) లో నుత్తీర్ణులైరి. తరువాతఁ జెన్నపురిలో F. A., B. A., పరీక్షలఁ గ్రమముగా విజయముం గాంచి, 1880 లో నాంగ్ల గీర్వాణములలో M. A., పరీక్షలో నుత్తమ కక్ష్యలో నుత్తీర్ణులైరి. 1883లో B. L. పరీక్షలో లబ్ధవిజయులైరి. 1884 లో మహారాజు వీరి నాంగ్లకళాశాలకు (Vice-Principal) పదవియందు నియోగించిరి. 1887 లో నపద్యశతిభవణా సంపన్నులును విద్యాసాగరులునగు ప్రిన్సిపాల్ చంద్రశేఖరశాస్త్రిగారు దివంగతులుకాఁగా నాచార్యులవా రాపదవి నలంకరించిరి. నాఁటినుండి 8-11-1920 వఱకు నింగ్లీషు కాలేజికిని, 1900 మొదలు 27, జనవరి 1928 వఱకు గీర్వాణకళాశాలకును వీరు ప్రధానాచార్యులుగాఁ బని చేసిరి. ఇంతదీర్ఘకాలము విద్యాశౌజన్యదాన మొనరించిన మహనీయుఁ డీభారతవర్షమున మఱియొకఁడు లేఁడు. 1894 మొదలు 1921 వఱకు వీరు చెన్నపుర విశ్వకళాపరిషత్తులో సభ్యులుగా (Fellow of the Madras University) నుండిరి. వీరుకొంతకాలము M. A. పరీక్షకుఁ (గీర్వాణశాఖకు) బరీక్షకులుగానుండిరి. 1911లో ఢిల్లీ దర్బారుదినమున వీరికి "రావుబహదూర్" (Rao Bahadur) బిరుదమును 1918 లో "దివాన్ బహదూర్" (Divan Bahadur) బిరుదము నొసంగఁబడినవి. ఈమహనీయునిఁ జెన్నపుర విశ్వవిద్యా పరిషత్తు తగురీతి సన్మానింపలేకపోయెను. ఆలోపముం దీర్చుటకై "యాంధ్రవిశ్వవిద్యా పరిషత్తు" నిరుడు వీరికి "సాహిత్య విద్యాప్రాజ్ఞసరస్వతి" (Doctor of Letters: D. Litt) యను బిరుదమును సమర్పించి ధన్యత నొందెను. ఈమహాశయుఁడు విద్యావ్యాసంగవ్యగ్రుఁ డగుటంజేసి యథోచితకావ్య సంతానముం బడయఁడయ్యె. నామరూపములు లేని సంస్కృతిపు వీథిబడి నీమహనీయుఁడే యుత్తమ గీర్వాణ విద్యాలయముగా నొనరించెను. 1912 లో నిడుదవోలులో జరిగిన సారస్వతమహాసభకు, 1914 లోఁ గాకినాడలో జరిగిన యాంధ్రసాహిత్య పరిషత్తు సభకు, 1915 లో బ్రహ్మపురము (Berhampore) లో జరిగిన యాంధ్రభాషాభివర్ధనీ సమాజ వార్షిక సభకు నగ్రాసనాధిపత్యము వహించి వీరొసంగిన మహోపన్యాసములు, వీరి ప్రాచ్య విజ్ఞానద్యోతకములై యొప్పుచున్నవి. వీరు చెన్నపురము నుండి విజయనగరమునకు వచ్చిన మొదటి సంవత్సరమున "తెలుగు హార్ప్" ("Telugu Harp") అను నాంగ్ల వార్తాపత్రికను స్థాపించి కొంతకాలము ప్రచురించి, పిమ్మటఁ గారణాంతరములచే నాపివేసిరి.

శ్రీ ఆచార్యులవారు రచించిన గ్రంథములు.

1. "వారన్ హేస్టింగ్సు" చరితమున కాంధ్రీకరణము. (Telugu translation of Macaulay's essay on "Warren Hastings")

2. "నిమ్నజాతియొక్క ప్రకృతస్థితి" "(The present condition of the Low Castes")

3. "మతవిద్య"("Religious Education")

4. "దేశభాషలు" ("Vernaculars")

పై మూఁడు నాంగ్ల వ్యాసములు.

5. 1907 లో శ్రీ బొబ్బిలిమహారాజావారిచే రచింపఁబడిన,

1. "రామాయణ మహాభారత విమర్శనము"

2. " హిందూ మతములు"

అను రెండు గ్రంథములకు నాచార్యుల వారాం గ్రమునఁ జక్కని యుపోద్ఘాతముల వ్రాసిరి.

6. " శ్రీ ఆనంద గజపతి మహారాజ చరితము " (1911. ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలోఁ బ్రకటితము.)

7. " బేకన్ " మహావిద్వాంసుని యుపన్యాసముల కాంధ్రీకరణము. (Telugu translation of " Bacon's Essays") ఇది యానంద దంతీంద్రుని కోరికపై రచింపఁబడినది. ఈ గ్రంథ మముద్రితము. కొన్ని యుపన్యాసములు " శ్రీరామానుజాచార్య స్మారకసంచిక"లో ముద్రింపఁబడును.

8. " కవిత్వ తత్త్వవిమర్శనము " బ్రహ్మపురాంధ్ర భాషాభి వర్ధనీ వార్షిక సభలోఁ జదువఁబడినది. ఇది ముద్రింపఁ బడినది. స్మారక సంచికలోఁ గూడఁ జేర్పఁబడును.

9. " చీపాకు నామకోద్యాన వర్ణనము " ఇది 27 శ్లోకములు గల సంస్కృత ఖండకావ్యము. ఇది వీరు చెన్నపురమునఁ బట్టపరీక్షకుఁ జదువు దినములలో రచింపఁబడెను. ఇది చెన్నపురికి దేశమును, రమణీయ రాజకీయ మందిర సంశోభితమునగు "చీపాక్"(Chepauk) అను ప్రమదవన వర్ణనము.

శ్రీ ఆచార్యులవారి యాంధ్రగీర్వాణ కవితా ప్రాశస్త్య ద్యోతకములగు కొన్ని పద్యముల నిదిగువను ట్టంకించెద.

1. సంస్కృతము:—

" కాష్ఠాభిరాక్రాంత ముదన్వతాపి
హామాతటీనాం ర్ణవ సంగవత్యా,
అనోకహాళీ విరళం తథాపి
సుచ్ఛాయ మాక్రీడ మిదం చకాస్తి.

2. రథశకట తురంగా క్రాంతయాత్రా సముద్యన్
మృగులశబలమాం సుచ్ఛన్నమార్గాన్యవనీజా,
తటనితత సుగంధా సాంద్రసా గంధికాట
ద్రుమకిరణావళీతః ప్రాంశు మాహోసమూహా.

3. సవిధనిలయ హర్మ్యా స్త్రిణఖేలా ప్రసక్తాః
బకమద కలహంసా స్పష్టవాజ్మ్యధురీశ్రీః;
దినముఖపరిఖేల ద్బాల సారంగ యూథా
తనునమిత శిరాసాకారిణీ భాతి పద్యా."

—"చీపాకునామకోద్యాన వర్ణనమ్ " 5, 6, 7 శ్లో.

4. నగా స్సుమాగ్రాః కలనిస్స్వనాః ఖగా
ధరా హరి ద్వస్త్రనిచోళితాంగీ;
లోకో౽యమానంద సముద్ర మగ్నో
వసంతమాసే పరివర్ధమానే!

II. ఆంధ్రము:—

5. "క. ఇదె వచ్చె వసంత దినం
బిదె కోయిల గూయఁ దొడఁగె నెల్లెడ కుసుమం
పదనగముల విలసిల్లెను
మదనావృతమగుచు జగము మఱచెను దనుదాన్."

6. "గీ. కవివరు కవిత్వ ముత్తరుకరణి మట్టఁ
బరిమళం బియ్యవలెఁగాని చెఱకు మాడ్కి
నోట నిడి పండ్లు కటయని నొక్కఁగాని
రస మొకింతయు రాకున్న రమ్యమగునె."

7. "ఉ. కమ్మని తావిచుట్టుఁ బర
గన్ వికసించెడి పువ్వుమాడ్కిఁ జి
త్తమ్ములరార మందగతిఁ
దాకెడు వాయువుభంగి, మాఘమా
సమ్మునఁ గంటి కింపొసఁగు
చంద్రునిరీతి, హిమానిబాధచేఁ
దిమ్మిరిగొన్న యప్డు రవి
తేజముపోలిక, హెచ్చుచీకటుల్
గ్రమ్మినచోటఁ గాంతివిస
రంబగు చంచలఁబోలిఁ, దృష్ణచేఁ
గ్రుమ్మరువేళ శీతల స
రోవరతోయము భాతి, నెండలోఁ
ద్రిమ్మరి శాంతి చెందినత
రిన్ ఘన మ్రాకులనీడపోల్కి వి
క్కమ్ముగ సత్కవిత్వ మన
ఘా! ప్రముదాప్తినిఁ జేయు నెల్లెడన్."

గ్రంథరూపమున దాల్చకపోయినను వీరి శ్లోకములు, పద్యములుఁ బరస్సహస్రములు గలవు; అందుఁ జాలభాగము గ్రంథస్థము కాకపోవుటచేఁ బ్రకృతము దుర్లభము.

"శ్లో. రూపసంపన్నమగ్రామ్యం
ప్రేమప్రాయం ప్రియంవదమ్;
కులీన మనుకూలంచ
కళత్రం కేనలభ్యతే."

ఈశ్లోకస్థ లక్షణము లన్నియు శ్రీఆచార్యుల వారి సతీమణియం దొప్పియున్నవి. అట్టి నారీరత్నమును ధర్మపత్నిగాఁ బడసిన యాచార్యులవారిదా యదృష్టము, లేక యట్టిమహనీయునిఁ బతిగాఁ బడసిన యానారీమణిదా యదృష్టము? ఉభయులు నతిమాత్రాదృష్టవంతులు. ఆహా! గర్భశోకమనిన నేమో యెఱుఁగని దంపతులు! ఏమి వీరి యదృష్టము!

గుణరూప విద్యాసంపన్నయగు ధర్మపత్ని, జనకుని మఱపించు పుత్త్రులు, సుశీలరూపవిద్యాన్వితలగు కొమార్తెలు, సున్నతపదము నలంకరించు జామాతలు, ఓహో! ఏమి యీమహనీయుని యఖండపూర్వపుణ్యపరిణామము!

మా యాంధ్రగీర్వాణ సాహిత్య పరిషత్తువారు "శ్రీరామానుజాచార్యస్మారక సంపుటము"ను ("Sri Ramanujachariar's Memorial Volume") బ్రకటింపఁగను బ్రయత్నములఁ జేయుచున్నారు. ఆసంపుటమున మాపరిషదధ్యక్షులగు శ్రీమాన్ యీయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యులవారు, శ్రీ రామానుజాచార్యచరిత్రమును విపులముగా వ్రాసి ప్రకటింపఁబూనుటచేనిట నేను విస్తరింపనైతిని. ఆంధ్రమహాశయులు చేయూత నొసఁగినచో నీసంపుటము త్వరలోఁ బ్రకటింపఁబడును.

"Self reverence, Self-Knowledge, Self-control,
These three alone lead life to Sovereign power".

—Tennyson

ఈసూక్తికి నాచార్యులవారు ప్రబలోదాహరణము. శ్రీఆచార్యులవారికి శ్రీమన్నారాయణుఁడు పునరావృత్తిరహితమగు మోక్షము ప్రసాదించుఁగాక!

విప్రయోగి విప్రలాపాలు

పండిత పురాణం సూర్యనారాయణ తీర్థులు గారు

మిత్రమా! వినుము సరాగనేత్రుఁడ నయి-దివ్యదృష్టినిసైత మైతినిజమన్న!
కనుక నే దూరమున నున్నకాంత నెదుటఁ-జూచుచున్నాను దివ్యచక్షుండఁ గానొ?
అత్తరుణివియోగములో - నిత్తెఱఁగున నేడు పొక్కుచే శరణమ్మె
నెత్తికొని పోవు చచ్చిన - మిత్తి యిఁ కెన్నఁటికో చెప్పవిదా నాకు సఖా!
మనసు నపుంసకమ్మనుచు మక్కువతోఁ బ్రియురాలి పాలికిం
జని యిటఁ దోడితెమ్మని వెసం దనుఁ బంపినఁ బోయి దానితో
డన రమియించుచున్నది కటా! ఇదో నాయెద నీరుగాఁగఁ బా
జీని నను మోసపుచ్చుటకె నిక్కముగా నటు వ్రాసె మిత్రమా!

అరమణీలలామ విరహమ్మున కంతగఁ జింత నొందఁ; బల్
దూరమునందె యుండి కడు దుఃఖిత యాటకుఁ జింత నొందఁ; శృం
గారిణి వేగ వచ్చినది గా దని కుందను; గాని దాని సం
డారిన నిండు జవ్వన మహో! వృథయాటకుఁ జింత నొందెదన్.

ఆ వెలఁదిని స్మరియించిన - జీవితమం దాన యెట్లు చిక్కెనొ చెపుమా;
ఆవెలఁది మఱచి బ్రదికిన - జీవితపున్ వ్యసన మేమి చేయు వయస్యా!

చిఱునగవుతోడఁ గించి - త్తరళము లగు కనులతోడఁ దనరుచు నా సుం
దరి నన్నుఁ జూచుచూపుల - నిరతమ్మును జూచుచుందు నిక్కముగ సఖా!

తదయోగమ్మునఁ బుట్టిన - మదనాగ్ని తదీయచింత మంటలచే న
న్ను దహించుచున్న దని యా - సదయాదాక్షిణ్యచవి వెసం బడనిమ్మా.

రంకు కన్నుల నొప్పుమరాళగమన - తనకటాక్షమ్ము చేతనే త్రాళ్ళఁ గట్టి
లాగినట్టులు నామదిన్ లాగికొనియె - నెంత మరలింత మన్న రాదేమి వింత!

సూర్యుఁడును జంద్రుఁ డున్నారు చుక్క లున్న-వగ్ని యున్నది దీపమ్ము లలరుచున్న
వెన్ని యుండిన నేమి యావన్నెలాఁడి - కన్నె లేమినిజగ మంధకార మయ్యె.


మండువేసవి మట్టమధ్యాహ్నసూర్యుఁడై కందింపుచున్నాఁడు చందమామ
దావాగ్నికీలలై దహియించెడున్ మేను మలయాచలపుమందమారుతమ్ము
సూదుల తోరణమ్మై దేహ మదరంటఁ బొడుచుచున్నది జాజిపూలమాల
ఉముకనిప్పును మించి యుడికించుచున్నది నింపైన మంచిగందంపుఁ బూఁత
చిమ్మచీకటి గాఁగఁ దోఁచెడు వెలుంగు-కటకటా! ప్రేయసీవియోగక్షణమ్ము
కల్పముగఁ దోఁచు దుర్దైవఘటనఁ జేసి-ప్రాణ మాకార! కొండంత భార మాయె.

ఆరమణి చన్నుఁగొండల-లో రకమగునగ్గి గలదు లోలత నెపుడున్
దూరముగ నుండి కాల్చును-సార మెఱిఁగి ముట్టుకొన్నఁ జల్లఁగ నుండున్.

అది తనకటాక్ష మిచ్చి నామదిఁ గొనినది-అన్న, నేఁ జిత్త మిచ్చి మారాగ్నిఁ గొంటి
నది యెటులో దానికడ వృద్ధి నందుచుండె-నటులె యిది నాకడను వృద్ధి నందుచుండె.


చాటుననె యుండి యావింత వేటకత్తె-భ్రూధనుర్వల్లరిని వక్రముగ నొనర్చి
శితకటాక్షాశుగములచేఁ జితుకఁ గొట్టెఁ-గటకటా, నాహృదయము నక్కటికయేది.

ప్రకృతిచంచలమును గుర్తుపట్టరాని-దై యొసంగెడి నా చిత్త మట్టిదాని
నెట్టు కొట్టఁగలిగనో క్కా యించువిల్తుఁ - డొక్కసారిగఁ దనదు సర్వేషు లేసి.



కీ. శే. సింహా ప్రభువు

౧౯౨౮-వ మార్చి ౫-వ తేదినాడు కీర్తిశేషు లయిరి.



కృషీవలుడు

చిత్రకారుడు: శ్రీ వై. సుబ్బారావుగారు, రాజమహేంద్రవరము, ౧౯౨౮

మరునిజయలక్ష్మి జగదలంకరణ మైన - లేఁడికన్నుల యామాయలాఁడి యికె
నెపుడు దయచేయునో కదా కృపఁ దలంచి-ప్రాణ మల్లాడుచున్న దా జాణకొఱకు.

ఖంజనమంజులమై తగు-కంజాతము నట్టె చూడఁగనె జ్ఞప్తికి వ
చ్చుం జంచలలోచనమై - రంజిల్లెడు నల్లముద్దరాలిమొగ మహా !

అద్దాని ముద్దుమొగమును - పెద్దకనుంగవయు రంకుఁవీక్షణములు నేఁ
దద్దయుఁ దలఁచుచు నెట్లో-ప్రొద్దు గడపుచుంటి నిచటఁ బాలుపుగ సఖుఁడా !

నూనముగ ననహ్యమ్మె-యైనను తద్విరహ మది రసాయనమాయెఁ
కానిమెడ యుగాభ్యధికము-లై నెగడెడి యీదినము లహో! యెటు కడచుఁ?

యోగవియోగమ్ములను వి-యోగమె మంచి దని నేను యోజింతును సం
యోగమున నది యొకర్తె వి-యోగమ్మున లోక మంతెయుం దన్మయ మౌ.

దైవవశమ్మున నే నా-దేవి నెడసి యేడ్చుచున్న దినములలోనే
రావలెనా కట్టఁడి యగు - నీవర్షాకాల మార్తి యిగురొత్తింపఁ.

ఆనారీమణి నాకు మ-హానందము విరహ మిచ్చినది గద యందుఁ
మానసము నేఁచు విరహ-మ్మానందమువలనఁ బోదు ప్రాణము సఖుఁడా !

ఆనెలంతయ నెడిచెర్వులోన నాదు-స్వాంతమును గన్ను నొకసారి పడియెఁ జమ్మ
మనసు బరు వౌటచే నందు మునిఁగిపోయెఁ - దేలికై గన్ను మీఁద నే తేలుచుండె.

అది కంటఁ బడిన మొదలుగ-మదనేషుభయమునఁబోలె మన్మానస మా
మదవతిని శరణు చొచ్చిన-యది యెంత మరల్త మన్న నది రాదాయెఁ.

కంటియెదుటినుండి కాంత తొలంగదు - రాత్రి వేగిపోదు రాదు నిద్ర
మరుఁడు కొట్టుచుండు మాడ్చెడుఁ జందురుం-డార్తుల కెదురా నపాయసమితి.

ఆకృతి గలచోట గుణాల్ - పోకగ నుండు నని కవులు బొంకిరి కాదే
నాకోమలి నామనసును - నైకొని విరహాగ్ని చేతఁ గాల్చునె చెపుమా.

అష్టమీచంద్రవిభ్రాజ దళిక దేశ - లేడికన్నుల నొప్పుపూఁబోఁడి సఖుఁడ !
అలరువిల్కాని నారాచయష్టివోలె - నామనస్సున నాటిన దేమి సేతు?

భగవత్కృపచే నా కా - మగువ దొరకెనేని దాని మాధవునట్లుల్
బిగికౌఁగిటఁ జేరుచుకొని - సొగసుగ హృదయమున నుంతుఁ జుమ్మా సఖుఁడా !

కొత్తపల్లి సూర్యారావు గారు

ఈనడుమ నొకనాఁడు ప్రపంచజ్ఞాన మను పేరఁ బంచమహాభూతములను గూర్చి విచారించి పృథివీజ్ఞానము, ఆపోజ్ఞానము, తేజోజ్ఞానము, నీరీతిగా నైదాశ్వాసములలో నొకపుస్తకము రచింపఁ దలఁచి__ఈజగంబెల్ల నేనిమిత్తమై పుట్టినది. మనుష్యాది ప్రాణులకొఱకుఁ బుట్టినదా ప్రపంచము కొఱకు మనుష్యాది ప్రాణికోటి పుట్టినదా, దానికిదియేల దీని కదియేల__ఆకాశమునను వంటి ప్రాణులకొఱకా యాకాశము కొఱకు నవనంటి ప్రాణులా__వీనికి వానికి నేమి సంబంధము__ లేలెంగుసు, పామెందుసు_అడవి ప్రాణులకొఱకా__అయినచో నందు సింహాది దుష్టమృగము లేల, దుష్టమృగముల నిమిత్తమే నామృగములో మృగములకు__సర్వసామాన్యముగా నన్నింటిలో వైరమేమి మైత్రియేమి. నక్షత్రమండలము, గ్రహమండలము నివి యెవ్వరి కొఱకు, ప్రాణులకొఱకా? యేమిలాభము. ప్రాణులు నక్షత్రాది మండలముల కొఱకా? ఉపయోగమేమి. సృష్టియెట్లు కలిగెను. నిప్పు, నీరు నెట్లు కలుగుచున్నది. ఈరీతిగాఁ బంచభూతములం గూరిచి యొకకొంత__నావెఱ్ఱి పుస్తకము వలెనే యుండునట్లు రచింప నూహించి కొందఱు మిత్రులతోఁ జెప్పితిని. వినిన వారలలోఁ గొందఱు పద్యములు వలదని, పద్యములే యుండవలయునని, వచనమే కావలయునని__అది సులభశైలి నుండవలయునని చెప్పుచు వారివారి యూహలంబట్టి వానివాని యుపపత్తులం దెల్పుచు నాప్రపంచజ్ఞానములో వలెనే వాదమునకు దిగిరి. అందుచేతఁ దీనికా ప్రాయముగఁ గొన్ని పద్యములును, మిగిలినది వచనమును గూర్ప నుద్దేశించి సృష్టికంతకును శక్తిస్వరూపిణి జగదంబయే కారణమును నిశ్చయమున,

ఉ. అంబ, నుతింప శక్యమె త్వ
దద్భుతశక్తిని బ్రహ్మ విష్ణుఁడుం
ద్ర్యంబకుఁడున్ భవచ్ఛిశువు
లట్టిరు లోకములెల్ల నీదు గ
ర్భంబున వెల్వడు సన్మునుఁ గ
రంగును నట్టివె పుట్టిగిట్టఁ జే
ష్పం బనియేమి కీటకము
వంటి ననున్ శతజన్మ దుష్టునిన్.

మ. జగదంబా, నియమింతు వీవు త్రిజగ
త్సంభార సంహారకా
ర్యగతిన్ దక్షుల వారె కర్తలని యూ
హాలేశతన్ లోకమెం
చు గురుత్వంబు నియోగు లాత్మ వశమం
చుం దెల్పఁ దద్వాక్యము
ల్సుగమార్గంబులు నీపరోక్షమున ని
ల్పున్ దాని నాజ్ఞాకృతిన్.

శా. నీదాఁకం జనఁ దెల్లవా నిజము మ
న్నింతేవు నీబిడ్డలన్
రాదారిం జననీక సందులను జే
ర్పన్వారికే లాభమో
మోదం బందఁగ లేరో యీరసమె తా
ముం జెందు మోదంబులోఁ
బాదం బర్థము తగ్గునో యధికృతు
ల్పాటించు నేర్పెట్టిదే.

ఉ. వావులు బాంధవమ్ము పర
భావము మిత్రత లేదు నీకు సం
భావన సామరస్యమును
వత్సలతాదులు నీదునైజ మీ
ప్రావకు రాఁగ నందఱును
బల్లకి యెక్కిన మోచువారలే

కీ? వగలేదటంచుఁ గిరు
రింతురు నీదు నియోగులెల్లరున్.

మ. కల డందు ర్జగదంబ నీదుసుమనః
కంజాళి కాంతుండు నీ
కలఘుత్వం బతఁడేల దేఁడు కలుగం
గానీ విరాడ్రూపుఁ డా
లలిగాకున్న నజాండమీనుడు వె చె
ల్లా నీకు నీసాటియే
కలదే యన్యము మా తరంబె తెలియన్
గర్భంబు వర్జ్యంబులన్.


శా. ఈవేవాణివి నీవె లక్ష్మివిని, నీ
వేనీవు మాయంబ నీ
వే వాణీపతివి ప్రమాపతివి వ
య్యాశుండ వీవే యనం
గైవారం బెవఁడోపుఁ జేయుటకు
లోకంబెల్ల నీరూపమే
యై విశ్వేశ్వరి వైతి నిన్గనిన వాఁ
డౌ బ్రహ్మ విద్వర్యుఁడున్.

అను పద్యములం గూర్చితిని. మా గ్రామమును చెంగుత్తి వెళ్లి తిరిగి వచ్చునపుడు

మ. ఎటుపుట్టింతువో లోక మక్కడనె త
ల్లీ నీకు మాకంతరం
బెటుమాడం బెఱిఁగోట లేదు కన నూ
హింపంగ దుస్సాధ్య మా
కిటు కొల్లం దెరచాటు చేసితివి ద
క్కన్ దాన నీమాన మ
క్కట చేనిడ్డ నెఱుంగ నేరముగుటం
గాపాడె మా మానమున్.

అను దానిని మార్గములో నూహించుకొనుచు నడచు చుండ నవు డక్కడ దారిప్రక్కను దుమ్మచెట్లమీఁద నీ క్రింది పురుగు గూఁడులు కనఁబడినవి. నా తలంపులో సృష్టిచమత్కృతి మఱెంత యచ్చెరువు పుట్టించినది.

దీనిని పట్టుపురుఁగు కుటుంబములోఁ జేర్పఁజూచితిని. వత్తగుల్ల కుటుంబములోఁ జేర్చుట యెక్కువగా నుపపత్తులు కనఁబడినవి. పట్టుపురుపునాట రాఁగానే,



దానిచిత్రము. అవతారవిశేషము నన్నుఁ జిక్కులఁ బెట్టినవి. వత్తి స్వతస్సిద్ధముగా గుల్లలోనే పుట్టి దాని లోనుండి యీవలకు వచ్చుచు ముడుఁగుచు నుండును. తాఁజేలు కుటుంబమునకు నీకుటుంబమునకు భేదము న్నది. నా గ్రంథము పూర్తిగా రచించుటయే కలిగిన రెండిట నందీ భేదము చర్చింపఁబడును. దాని నేయూహ్య సములో అనఁగాఁ బృక్షిజ్ఞానములోఁ జేర్తునో అపో జ్ఞానములోఁ జేర్తునో. మెట్ట తాఁచేర్లుగూడనున్నవి. ఇది యటుండనిండు. వత్తగుల్ల కుటుంబములోనే చేర్చి యీపురుగును గూర్చి కొంత చర్చింపవలసి యున్నది. ఈపు

రుగు నల్లచీమంత యుండును. కాలుసేతులు లేవు. పాత్రమునకు ఘృత మాధారమా ఘృతమునకుఁ బాత్ర మాధారమా యనినట్లు పురుగునకుఁగూడా గూడునకుఁ బురుగా యాధార మనుశంక పుట్టును. కొన్ని పిట్టలు మామిడిచెట్టుమీఁది యొక రెమ్మలోని యాకు నింకొక రెమ్మలోని యాకును దొప్పవలెఁ జేర్చి యంటించి యందు గ్రుడ్లు పెట్టుచుండుట గలదు. ఆపనిలో ముక్కును గాలునుపిట్ట కాధారము. పైఁగా మగపిట్టయొక్కటి సాయపడును. కత్తితోఁ గోసినఁగాని విలుగని ముండ్లు పిటిచి పదిపంద్రెండొక్కచోటికిఁ జేర్చి కాలుసేతులు లేని దెట్లు గానంటించును. దానివదుముఁ దానెట్లు కూర్చుండును? మాతిమాత్రమే మీఁదికాడుచుండును. తక్కినవి గూఁటిలో నంటుకొని యుండును. ఇంతబరు పీడ్చుకొనుచు గొమ్మనంటుకొని ప్రాఁకుచు నాహారము సంపాదించుకొనుచుఁ గాలము గడపుచుండును. ఇట్టి పురుగులు కొన్ని చచ్చినవి కనఁబడినవి. ఎవరెస్టుశిఖర ప్రయాణముచేసి విశేషములు కనిపెట్టుచున్నవారివలె నేను నీపురుగువిశేషము కనిపెట్టవలయునని కొంతసేపు చెట్టుకడఁ గూర్చుంటిని. తెల్లవాఱుసరికి పాఁగులో నొకతీఁగ మూరెఁడు సాఁగును. దగ్గఱనుండి చూచుచున్న నెదుగుట కనఁబడదు. ఈతీఁగ సాఁగుటలోని రహస్యమువలెఁ గొనలుసాఁగుచున్న నాయుత్సాహ మీచిన్నపురుగు రహస్యము కనిపెట్టలేకపోయినది. దీనినెట్లు తెలిసికొందునా యని విచారించుచుండఁగా గొల్లప్రోలు రైలుబండికై వచ్చుచు దారిలో నిట్టివిచారములోనిగిన నన్నేమటుంబములోఁ జేర్చుకొనవలెనో యని యున్మాదసహస్రములోనికి రావలసివచ్చినది.

ప్రజ్ఞాధురీణులగు పలువు రింతకుమున్న దీనిని గాంచియే యుందురుగావున నెట్లు ముండ్లు విలుచునో యెట్లు జోడించునో-ఇవి తుమ్మముం డ్లగునా కావా, కాకేని తుమ్మచెట్లమీఁది కేల రావలయును. యోజింపగోరెదను. కొందఱకుఁ జెప్పఁగా దీనితల్లి దీనినిగూర్చుండఁబెట్టి ముండ్లు చుట్టు నంటించునని చెప్పిరి. తల్లియున్నట్టిదేకదా! ఊహలను గొట్టివేయక యోజింపఁగోరెదను. ప్రపంచములో నేవస్తువుగాని నిరుపయోగముగా సృష్టింపఁబడియుండదుగదా యిదియేమి యుపయోగము. అని యూహింపఁగా, నుపయోగము లేకపోలేదురా వెఱ్ఱివాఁడా నీ విద్దానిని పెద్దచేసి పత్రికలకుఁ బంపి నీ తెలివి వెల్లడిచేయుటకుఁ బనికిరాలేదా యని లోకులనినట్లు తోఁచినది. ఇది సృష్టిలోని చిత్రమగునా కాదా. ఒక్కదొర కోఁతులభాష నేర్చికొని వానితో మాటలాడినాఁడఁట. ఒక్కదొర మిడిసెల్లులను ముప్పదెంటిని పెంచి వాని చేతులలో నిముడునట్లు తుపాకులు చేయించి పటాలము సిపాయిలచేతఁ జేయించినట్లు కవాతు చేయించినాఁడఁట. ఇవి సృష్టిచిత్రములోఁ జేరునా చేరవా. అంతెంతసృష్టిచిత్ర మున్నది. యెంతమానవుని నిపుణత యున్నది. నిపుణత యెవరిచ్చినది. సృష్టియేగదా! నాగ్రంథమే వ్రాయుటకు మొదలిడి పూర్తిచేయఁబడియెనా దానిలోఁ జూచెదరుగాక. ఉన్మాదసహస్రమువలె నదియు జనాదృతిం గాంచకపోయినఁ బోవుంగాక; ఎవరియత్నము వారు మానరాదు.

తాము తాము చేయుచున్న పనులు తమకుఁ దమకు గొప్పవివలె నగపడును. కావున స్వల్పవిషయములవలెఁ బైకిఁ గాన్పించినను సృష్టిచిత్రములను గొన్నిటిని సంపాదించి పత్రికలకు నావలెనే పంపుచుండ వలయునని లోకమును గోరుచున్నాఁడను. కొందఱకైనవి క్రొత్తగా నుండకపోవు. అందఱకును గ్రొత్తయైనవిషయ మెవ్వరును దెలుపలేరు. పదిమంది యీవిషయమై పత్రికలోఁ జర్చకు మొదలుపెట్టిరా, పత్రికాధిపతులును బ్రకటింప సాహసింతురు. మొదట నసహ్యించుకొనిన విషయము లిపు డెన్నెన్ని జనసామాన్యాదరముం గాంచి విరివిగాఁ బ్రకటింపఁబడుచున్నవో యెఱుఁగవచ్చును. అన్నిటికిని విమర్శ యుండవలయును. అన్నియుఁ బ్రపంచజ్ఞానములో నిముడునవియే.

హృదయావేదనము

జరమంచి సీతారామస్వామి గారు

(సంపుటము ౫, సంచిక ౨ తరువాయి)

ఇలపయి మేము పుట్టునరికెంతయుఁ బ్రేమను బాలమర్చిత
ల్లులకును, మమ్ముఁ బెంచుగతులుల్ స్ఫురియింపఁగఁ జేసి నిత్యముం
జలుపుదు వింతయంతయనఁ జాలనిమేలును మాకు; కాని, మే
మలసులమై నినుం దలఁపమక్కట! కర్మమదేమొ! రక్షకా!

తనువు ననుగ్రహించితివి తావక సేవకుఁగాదె? కాని, నీ
కనికర మున్నఁగాని యెటుకల్గును మాకటువంటి భాగ్యమే
ననయము దుష్పథంబుననె యంధుఁడనై చరియించుచుంటి నా
మనవిని జిత్తగించి యిఁక మక్కువతోనను భక్తుఁజేయవే.

ఏరిని వేఁడకుండ దినమేగెడుసుస్థితి లేదటంచు, నేఁ
గోరిన గ్రంథముల్ కొనుటకుందగు విత్తము లేదటంచు, సం
సారపయోధి నీదుటకుఁ జాలిన ధీరత లేదటంచు, వే
సారెడు నన్నుఁ బ్రోవఁగదె సత్ఫలదాయక! లోకనాయకా!

ఎక్కడఁజూచినన్ గపటమే యభివృద్ధిని జెందు నయ్యయో!
యొక్కఁడు లేఁడు నీతిమనుచుండెడివాఁ డొకవేళ నున్నచో
నక్కవలెన్ దరిద్రతను నుంతయు నాదరమొంద లేక; నా
కక్కజమౌను యోగ్యుఁడగు నాతనిపాట్లు దలంప నీశ్వరా!

ఏయుద్యోగమొ చేయఁబూనకయె, తానెవ్వారిఁ బ్రార్థింపకే
మాయ ల్పన్నక యీ కలిన్ నరుఁడు సంసారాంబుధిన్ దాటలేఁ
డే యారా! యిటువంటి చిక్కు-డుట నీలీలార్థమే? యైన, నీ
డేయీబాధఁ దొలంచు బాధ్యతయుఁ దండ్రీ! సర్వలోకేశ్వరా.

వచ్చు క్షణంబులోఁ దమకు వచ్చునవస్థ యెదో యెఱుంగ లే
కచ్చపుఁ జీకటిన్ మునిఁగి యారట మొందుచునుండియున్ నఁగటా!
క్రచ్చర వాయుహర్మ్యములు కట్టుచు, నిక్కుచమూల్యకాలముల్
బుచ్చెదరేల వ్యర్థముగఁ బూరుషులెందఱొ లోకనాయకా!

అనుపమ మాధురీభరితమై, పరమాద్భుత శక్తియుక్తమై,
మునిజనకీర్తనీయమయి, భూరి యశోవిభవాభిరామమై,
తన రెడు నీదునామము సదా స్మరియించుచు, నీకు నిష్టమౌ
పనులనె నిర్వహించుచును వర్తిలఁజేయవె మమ్ము రక్షకా!
పరిపూర్ణంబుగ నిన్ను నమ్ముటె సుఖోపాయంబు; నైనన్ బ్రభూ,
పురుషుం డెప్పుడుఁ జేయఁగల్గు జతనంబుల్ సర్వముంజేసి నీ
కరుణన్ గోరవలెంగదా యనుచు నేఁ గర్తవ్యముల్ సల్పుదున్;
బరమాత్మా, కృషియెల్లఁ దప్పక ఫలింపంజేయవే యీశ్వరా!

ఏగంటివారివచనము

దేవుల కెల్లను దే వగుపార్వతి దేవితల్లి మాకూ
కావునమాహేశ్వరుఁ డగు రుద్రుఁడు కన్నతండ్రి మాకూ
అరయగపూర్వాచార్యులునడపిన దదిమ్మె వంశముమాకూ
గరిమను గురు డొసగిన శివదీక్షయ కారణ మదిమాకూ
నిరతము భూతిత్రిపుండ్రము దాల్చుట నియమకంబుమాకూ
పురహరునేత్రోద్భవరుద్రాక్షలు భూషణములు మాకూ—దేవుల కెల్లను.
ప్రతిదినమును శివతత్త్వవిచారము పరమార్థము మాకూ
క్షితి శివయోగీశ్వరజనగోష్ఠియు కీర్తన మదిమాకూ
అతిశయముగ లింగార్చన సేయుట యదియె వ్రతము మాకూ
అతులితపరమషడక్షరిమంత్రము ఆత్మజపము మాకూ—దేవుల కెల్లను.
భవిజనకృతశాస్త్రజ్ఞానంబది పరిహార్యము మాకూ
ప్రవిమలషడ్విధలింగానుభవము భావార్పణ మాకూ
అవిరళలింగనివేదితద్రవ్యము అవధానము మాకూ
కువలయమున నేగంటీశ్వరుడే గురుదేవుడు మాకూ—దేవుల కెల్లను.

జానలు, పదిజానలు వుంటున్నవి. ఇదిగాక యీకోన అడివిని పాలవృక్షములు అతివిస్తారం కలవు. ఈపైని వ్రాశినవృక్షములు యొక్కడనయినా వుంటున్నవికాని యీ అడివిఅంతా పాలచెట్లు బహుమిక్కుటమై వున్నవి. ఈపాలచెట్లు మొదలు వలయంచుట్టువారుకొని యాభై జానలవలయం గలవిగాకొన్ని నలభై జానలు వలయము గలవిగా కొన్ని ముప్పయిజానలు వలయముగలవిగా కొన్ని ఉన్నవి. ఈలాగంటి వలయములున్ను అతి విస్తారమైన పొడుగున్ను కలిగిన పాలవృక్షములు అనేకముగా అక్కడవున్నవి. ఈలాగంటి వలయముగల పాలచెట్లు మొదటియందు మాను రెండునిలువులపొడుగు కలవి కొన్నిన్ని నిలిచెడున్నర పొడుగు కలవి కొన్నిన్ని ఉంటవి. ఈపాలచెట్ల మొదటిమానులు తొర్రలుగలిగి బోలుగా వుంటవి. ఈ అడివిలోవున్న పాలవృక్షములన్నింటికి మాని మొదటిలోపల తొర్ర వలయం చుట్టువారుకొని పదిహేనుజానలు కొన్నిన్ని పదిజానలు కొన్నిన్ని కలవు. ఈతొర్రలు పొడుగు నిలివెడు నిలివెడున్నర కలిగివున్నందున మనిషి కులాసాగా కూర్చుండి వుండవచ్చును. ఇదిగాక యీలాగంటి వలయముగలవిన్ని లోపల విస్తరించి తొర్రలు కలిగివున్నవిన్నీ వృక్షములను ఈ అడివికి సామీప్యమయ్ని గ్రామాదులవారు కొట్టి వరిపంటలు మొదలైన పంటలు పండేదినములయందు ఆపాలచెట్ల యొక్క మొదళ్లలో తొర్రలు వున్నందున ఘట్టిగా వుంటవి అని రేటికాలువలకేమి, చెర్వులకనములకేమి, తూములుగా వుండేటట్టు తీసుకొనివచ్చి వేస్తున్నారు. ఈలాగంటి యీపాల అడ్వియందు బహువిస్తారమయినటువంటి తేనెతుట్టెలు కలవు. ఈ తేనెతుట్టెలు విస్తరించి కావడముచేతనున్ను యీ అడివియందు కుంకుడుచెట్లు వున్నందువల్ల కాయలు విస్తరించి కాయడముచేతనున్ను యీ కోన అడివికి పడమరను అంటివున్న సొన్నాడలోండంగి వేమవరం వగయిరా గ్రామాదులలో నివాసంగా కాపరం వున్నరహితులు మొదలయినవారేమి యింకా ఇతరమైనవారేమి యీకోన అడ్విన్నిపయిన వ్రాయబడ్డ గ్రామాదులున్ను పల్కుబడిలోవుండే పిఠాపురం జమీందారుకిపద్ద యిజారాచేస్తున్నారు. యిజారా చాయడములో రెండేశీ, మూడేశీ సంవత్సరములకు యిజారాచేశీ అడివిలో అయ్యే తేనె మరిన్ని కుంకుడుకాయలు వగయిరాలను గురించి యిజారాదారుడు అడివియందు తనతాలూకు మనుష్యులను వుంచి బందోబస్తుచేసుకుని పయినివ్రాశిన తేనె కుంకుడుకాయలు యివిన్నియింకా అడివియందు పిశిణిగ పండ్లున్ను, గొల్లపండ్లున్ను పండుతవికనుక అవిన్ని తను మాత్రము ఖరీదులకు అమ్మకోవడమున్ను కద్దు. పయిని వ్రాసిన తేనె కుంకుడుకాయలు మొదలయినవి, యీఅడివి సమీపగ్రామాలకు రేమి, పిఠాపురము సామర్లకోట మొదలయిన కసుబాలకురేమి పంపించి యిజారాదారుడు అమ్మకము చేయిస్తాడు.

ఈలాగంటి యీ అడ్వియందు చిన్నిపువ్వు తేనె అనే తేనె అయ్యేక్రమం.—ఈపైన చెప్పబడ్డ కోన అడివిలో తేనెతుట్టెలు పెట్టే తేనెటీగలలో చిన్నయీగలు కలవు. ఆ యీగలుపైన వ్రాశినపాలచెట్లలోపలవుండే తొర్రలలో గూండ్లుగా వుంటున్నవిగనుక ఆగూళ్లయందు యీచిన్నయీగలు నివాసము వుండడముకద్దు. మరిన్నీ ఈ కోన అడ్వియందు చిన్నిచెట్లు అనేచెట్లు కలవు. ఆచెట్లు నిలివెడుపొడుగు వుండీవుండడముగా ఉండును. చిన్నిచెట్టు మొదలువలయము జానెడు ఉండును. ఈ చిన్నిచెట్టు ఆకు జమ్మిచెట్టు ఆకు రీతిగానే వుండును. ఈచిన్నిచెట్టుకు చిన్నవిన్ని తెల్లనివిన్ని పువ్వులు కలవు. ఇదిగాక వరిపంటలు పండేదినములయందు వరిచేలు ఈనుతూవుండే సమయమందు వరిపువ్వారు అనే పేరుగల వరిపువ్వు వుంటుంది. పయినచెప్పబడ్డ తేనెటీగలలో చిన్నయీగలు యీవరిపువ్వారున్నూ కోన అడివియందువుండే చిన్నిచెట్లపువ్వున్ను తీసుకొనిపోయి కోన అడివియందువున్న పాలచెట్ల తొర్రలలో చిన్నయీగలు వుండే గూళ్లయందు ఉంచుతవి. ఈలాగున పాలచెట్ల తొర్రలయందు వున్న గూళ్లయందు వరిపువ్వారున్ను చిన్నిచెట్లపువ్వున్ను వుంచి ఆపైని తేనెటీగలలో ఈ చిన్న తేనెటీగల పిల్లలు పెడతవి. ఇదిగాక కోన అడ్వి యిజారాచేసిన యిజారాదారుడి తాలూకు అడ్వియందు పది అయిదువంది పాకలు వేయించి కని

పెట్టివుండడముకద్దు. ఇంతేకాకుండా ఆషాఢమాసములోనున్న మార్గశిరమాసములోనున్న ఈ కోనఅడివి పలుకుబడిలో ఉంచుకొన్న పిఠాపురము జమీందారు తాలూకా మనుష్యులు ఆషాఢమాసములోనున్న, మార్గశిర మాసములోనున్న ఘాటువెళ్లి యీకోన అడివియందు వుండి యిజారాదారుడి తాలూకు అడివిపాకలు వేసుకొనివున్న మనుష్యులచేత పాలచెట్ల తొర్రలయందు యీ చిన్న తేనెటీగలు వుంచిన చిన్నిపువ్వున్ను, వరిపువ్వారున్ను యీచిన్న తేనెటీగలు పిల్లలుయెదిగి వరిపువ్వారు చిన్నిపువ్వులు తినకమునుపే చిన్న తేనెటీగలను కొట్టించి జాగ్రతచేయించి తీయిస్తున్నారు. ఈలాగున తీయించినదిన్ని తేనెటీగలలో చిన్న తేనెటీగలు పాలచెట్లయందు వుండే తొర్రలయందు పెట్టినదిన్ని చిన్నివరిపువ్వారున్ను చిన్నిచెట్లపువ్వున్ను కలిసిందిన్ని అదే చిన్నిపువ్వుతేనెవాడుక కలది. ఈచిన్నిపువ్వుతేనె అనేది యేలాగంటిదంటే: సురేకారపుపుష్పపల్కులవలెనే చిన్నచిన్నపల్కులుగా పేరుపేరున్నర తూనికగల గడ్డకట్టి తెల్లగా వుంటున్నది. ఇది అతిమధురమైన రుచి గలిగివుంటుంది. ఇది చైత్రమాసములోనేమి, వైశాఖ మాసములోనేమి, నడివేసవికాలములో మనుష్యులు రెండుమూడు డబ్బులయెత్తు పుచ్చుకుంటే దేహమునకు మిక్కిలి చలవగలిగివుంటుంది. ఈచిన్నిపువ్వుతేనె అనేది సంవత్సరానికి రెండుసార్లు అవుతుంది. మొదట ఆషాఢ మాసములో అయ్యే చిన్నిపువ్వుతేనె కొంచెము పల్చగా వుండడమున్ను రుచికరం అనగా విస్తరించి తీపికలిగివుండదు. ఇదిగాక ఆషాఢమాసములో యెన్మిది తొమ్మిది వీశెలు పర్యంతము అవుతుంది. జాగ్రత్తపెట్టితే అయ్యేస్థలములయందు ఈతేనె యెన్మిది తొమ్మిది వీశెలు అయివుంటుంది గాని లేకపోతే అయిదు ఆరు నాలుగు వీశెలు అవుతుంది. ఇంతేకాకుండా ఆషాఢమాసమునందు వరిపంటలసమయము కానందున వరిపువ్వారువుండదు గనుక కోనఅడివియందు వున్న చిన్నిచెట్లు అనే చెట్ల పువ్వులుమాత్రమే యీచిన్న తేనెటీగలు తీసుకునివచ్చి పాలతొర్రలయందు వుండే గూళ్లలో పెట్టితుట్టె చేస్తవి గనుక వరిపువ్వారు లేనందున ఆషాఢమాసములో అయ్యే తేనె గడ్డతక్కువగా కావడమున్ను వరిపువ్వారు లేనందున రుచి తక్కువగా వుండడమున్ను కలదు. మార్గశిర మాసములో అయ్యే చిన్నిపువ్వుతేనెకు యీమార్గశిర మాసమునకు లోగానే, కార్తికమాసములోనే వరిపంటలు పండేదినములు గనుకనున్ను యీకోన అడివికి సమీపముగా వున్న శాన్నాడ తొండంగివగయిరా గ్రామాదులందు విస్తరించి వరిపండుతుందిగనుక కార్తికమాసములో చేలు యీనుతూవుండే సమయమందు యీచిన్న తేనెటీగలు వరిపువ్వారు తీసుకునివెళ్లి చిన్నిచెట్లపువ్వులతోకూడా తేనెతుట్టెలు పెట్టడముచేత మార్గశిరమాసంలో దొరికే చిన్నిపువ్వుతేనె బహుబాగా వుంటుంది. విస్తరించి మాధుర్యము కలిగివుండడమే కాకుండా మార్గశిరమాసములో అయ్యే యీచిన్నిపువ్వుతేనె గడ్డ మణుగు మణుగున్నర బాగా అవుతుంది ఈలాగంటె చిన్నిపువ్వుతేనె తేనె అనేవాడికమాత్రమెకాని తేనె వలె పల్చగానున్ను యెర్రగానున్ను వుండదు. పయినిచెప్పినప్రకారం గడ్డకట్టివుంటుంది.

ఈలాగున అడివియందు ఆషాఢమాసములోనున్ను, మార్గశిరమాసములోనున్ను ఘాటువుంచి చిన్నిపువ్వుతేనే మరియెవరిస్వాధీనముకాకుండా జాగ్రత చేయించి యీ కోన అడివిపల్కుబడిలోకి వచ్చేపిఠాపురపు తాలూకా జమీందార్లయినరావువారు యీ చిన్నిపువ్వుతేనె తెప్పించుకొని యిక్కడవుండేటి యెవరెవరు దొరలకేమి యీపిఠాపురపు తాలూకా జమీందారుకి ముఖ్యముగా కావలశినటువంటి రాజబంధువులు మొదలయినవారికి యేమి తగుమాత్రము పంపించి లోతక్కువవారు ఖర్చుచేసుకుంటారు. ఈ కోన అడివికి సమీపముగానున్ను అడివికి పడమరగానున్ను వున్న శాన్నాడ తొండంగి వేమవరము వగయిరా గ్రామాదులయందు వరి మొదలయిన పంటలుపండుతుంది సరేకదా! తొండంగిలో విస్తరించి పుట్లుతరబడి నువ్వులు పండుతవి. యీతొండంగికి సమీపముగావున్న గ్రామాదులవారేమి యింకా యీతొండంగి చుట్టుపట్టు తాలూకాల గ్రామాదులవారేమి యెవరెవరు వర్తకులు యీతొండంగివచ్చి నువ్వులు కొనుక్కొని యెక్కడెక్కడ కసుబాస్థలాలకు

రవానాచేసుకోవడముకద్దు. ఈకోన అడ్వి బహుదట్టమయిన అడివి. ఈలాగంటి యీకోనఅడ్వియందు పెద్దపులి వచ్చివుండను గనుక అడ్వియందు మిక్కుటముగా అడ్విగోవులు సంచరిస్తువుంటవి. ఈఅడ్విగోవులు వున్నందువల్ల అడ్వియందు తిరిగేమనుష్యులకు యెంతమాత్రము భయము లేకుండా నిర్భయంగా రాత్రిపగళ్లు సంచరిస్తూ వుండడముకద్దు. ఇలాగంటి కోనలడివిని యిళ్లకలపనాడ కలప, అయ్యేవృక్షములు లేవు. గొప్పచెట్లుగా వుండేవి తుమ్మచెట్లు కొన్నిన్ని చింతచెట్లు వేపచెట్లున్ను కలవు. తతిమ్మా అంతా తుప్పఅడివి.

పైనవ్రాసిన చిన్నిపువ్వుతోట ఆనేది జమీందారుడు మనసువుంటె అన్యులైనవారికి యిజారాకు యివ్వడము గాని లేకుంటే అమీనాను వుంచి తామే జప్తుచేయడము గాని కలదు. అమీనాను వుంచి జాగ్రతచేయింపడమే తరుచుగాని యిజారాకు తరుచుగా ప్రతిసంవత్సరమున్ను యివ్వడము లేదు.

అశాంతి

శ్రీ వేదుల సత్యనారాయణశాస్త్రి గారు

కనికరము లేనిదుఃఖవేదనల సెగల-పొగల వెలిజిమ్ము వలపుటూర్పులభరమ్ము
మోసికొని నేను నాలోన మూల్గుకొనుచు-గాలివోలె సమస్తావకాశములను
ఎడతెరపి లేక తిరుగాడి బడలినాను.

దారుణపు జీవితంపు ఎడారిలోన-తీరని పిపాస నేదారి తెన్నులేక
నేనె నాదుఃఖబాష్ప శోణితపుర్ఘురుల-ఏవిసుగు వేసటలు లేక త్రావినాను.

కడుపు గాల్చెడుమండుటాకటను రేగి-కోర్కు లొండొంటినె గ్రసించుకొనెడుకొలది
ఒడ లెరుంగక కాలమృత్యువును నేనె-కొంచెముగ కొంచెముగ కబళించినాను.

కాని క్రమోఢైన నాయెదలోని బరువు-దీర నాబ్రదు కూపిరి తేరుకొనగ
కనికరపుమాపు చిరునవ్వు తునుకమైన-కటిక కర వయ్యె పాడులోకాన నాకు.

ఏకడల మిన్ను మనుచుక్క యేని లేని-యీనభము క్రుంగి కూలిపోయెడువిధాన
కారుమబ్బులె కాదు చీకటులె కాదు-క్రమ్ముకొన నిమ్ము కరడులు గట్ట నిమ్ము.

వలపు తీపి యెరుంగని వట్టిరాతి-గుండె లోకమ్ము నిప్పులు గురియనిమ్ము
హృదయ మున్నంతవరకు నాప్రేమకాంక్ష-బ్రతికి యున్నంతవర కేడ్చి బ్రతుకుచుండు.
ఏవెలుగు నన్ను తనదరి కీడ్చుకొనునో?-ఏతలపు దారి జూపునో!...



శ్రీమతి వసుంధరాకన్య యం.ఏ.

సుప్రసిద్ధ సంఘ సంస్కర్తలగు బ్రహ్మశ్రీ ఆదిపూడి సోమనాథరాయకవీంద్రుని పుత్రిక యగు శ్రీమతి వసుంధరాదేవి చెన్నపురి ప్రెసిడెన్సీ కాలేజియందు రసాయన శాస్త్రమును చదివి యం.ఏ. పరీక్షయందు త్తీర్ణయాయెను. ఇంగ్లండునందు చదువుటకు మద్రాసు గవర్నమెంటువారు సం॥ 300 పౌనులచొప్పున మూడు వత్సరములు విద్యార్థివేతన మిచ్చిరి. దానిని గైకొని యీయామె లండను నందలి బెడ్ఫర్డు కాలేజియందు రసాయన శాస్త్రమున బి.యస్.సి. పరీక్షకు చదువుచున్నది. ఈమె వయసు 22 వత్సరములు.



శ్రీ నాయగంకన్య, బి.ఏ., ఎల్.టి.

విమన్సు క్రిశ్చియను కళాశాలయం దుపాధ్యాయగానున్నది. ఈమె ద్రావిడ యువతి. చెన్నపురి కో-ఆపరేటివ్ అసిస్టంటు రిజిస్ట్రారగు శ్రీ సి. డి. నాయగంగారి పుత్రిక. ఈమె ౧౯౨౫ వ సంవత్సరం మార్చినెలలో తంజావూరునందు జరిగిన యువమహాసభను ప్రారంభించినది.



శ్రీమతి అహమ్మదుషా,
యం. యల్. సి.

ఈమె సంయుక్తపరగణాల శాసనసభాసభ్యురాలుగా నియమింపబడిన ప్రథమ యువతీమణి. ఈమె భర్త యూరపునకు వెళ్లుచుండగా నాయన స్థానమున నీమె నియమితయైనది.



శ్రీమతి గుడిసేవనాగమణిదేవిగారు

కళావంతుల సంఘమునకు జెందిన గుడివాడ బోర్డు బాలికా పాఠశాలా ప్రధానోపాధ్యాయులగు శ్రీ గుడిసేవ సుబ్బయ్యగారి సతీమణి. ఈమెయు స్వయముపాధ్యాయిగా నున్నది. సంఘసంస్కరణమున జాల కుతూహలముతో పనిచేయుచుండును. ఆంధ్రభాషయం దీమెకు సుపరిచయముగలదు. పత్రికలయం దీమె యప్పుడప్పుడు వ్యాసములను కొన్ని గ్రంథములను వ్రాసినది.



శ్రీమతి పి. బి. కాలేగారు
యం.యల్.సి.

ఈమె మధ్యపరగణాల శాసనసభాసభ్యురాలుగా నియమింపబడినది.

లలితభక్తుఁడు

కాశీభట్ల కృష్ణరాయశాస్త్రి గారు

తర్కము హెచ్చెఁ దప్పె మతి దైన్యము చిత్తమునందు నిల్చె నీ
యర్కసహస్రతేజ మది యల్పము నేనెఱుఁగ వృథావ్యసం
పర్కనిరర్థకామమిక పట్టి యొకింతయు వీడిపోదు నే
మార్కొనలేను నిన్ను బ్రతిమాలెదఁ గావఁగదే జగత్ప్రభూ!
కూలితి ఘోరసంసృతిని గొబ్బునఁ బ్రోవుమటన్న దీనర
వాలలితుండ వాగజము నప్పుడు గావఁదలంచి వేగమే
మేలొనఁగూర్పవచ్చితివి మే నది చెమ్మటఁ దోఁగ నట్టు లీ
బాలిశుఁ బ్రోవరావలదు బంగరుమే నది కందునేమొకో.
నీదురూపము ప్రత్యేకనీలమేఘ-సన్నిభంబుగఁ గన్పట్టఁజాలునే మొ
నాదు ప్రజలలో భూతసంతానమునను - బ్రేమపరమరూపంబు దర్శింపనిమ్ము.
శంఖచక్రహస్తముల లక్షణముగల్గి - యున్న నీరూపుపాస్యమై యుండుఁగాక
భూతజాతంబునందెల్లఁ బొలుపుమిగులు-నీయఖండరూపంబు సంధింతు నెడఁద.



సారస్వతవిశేషములు

౩. జయమంగళ

[వెనుకటి సంచిక తరువాయి_పే. ౫౦౨]

ఈ పేరుగల భిన్న భిన్న వ్యాఖ్యానములు పెక్కు లుశంకరవిరచితములుగానున్నవి. ఆభిన్న భిన్న వ్యాఖ్యానముల భిన్న భిన్న మాతృకల గద్యలయం దిట్లు "శంకర విరచితే, శంకరార్యవిరచితే, గోవిందభగవత్పాదశిష్య భగవచ్ఛంకరాచార్య విరచితే, శంకరపరివ్రాడ్విరచితే" అని వేఱువేఱువిధముల నాతని పేరు చూపట్టుచున్నది. ఈగద్యముల వలన జయమంగళవ్యాఖ్యాత యెవ్వరో సరిగా తెలియరాదు.

'భట్టికావ్య' వ్యాఖ్యాన మొకటి 'జయమంగళ' అను పేరుగలది, మల్లినాథునివ్యాఖ్యానముకంటె చాల పేలవమైనది కలదు. తద్వ్యాఖ్యాతపేరు పెక్కు మాతృకలయందుఁ దెక్కు తెఱఁగులఁ జూపట్టుచున్నది అత నికిఁ బాండిత్య మంతగా నున్నట్లు తోఁపదు. 'సాంఖ్య సప్తతి' వ్యాఖ్యానమగు 'జయమంగళ' 'గౌడపాదుల' వ్యాఖ్యానముకంటెను, 'వాచస్పతి మిశ్రుని' దానికం టెనుగూడ కేవలము నికృష్టమయినదిగా నున్నది. గద్య యందు వ్యాఖ్యాతపేరు 'శంకరాచార్యు'డని యున్నది. వాత్స్యాయనుని కామసూత్రవ్యాఖ్యాన మగు 'జయమం గళ' యొక్కకర్తృత్వము తుదకు శంకరునికే ఆరోపింప బడినది. యశోధరుఁడు కేవలము వ్రాయసముమాత్రమే యయ్యెను. ఆవ్యాఖ్యానమున వ్యాఖ్యాత పెక్కువా ఙ్మయశాఖలయందుఁ దనకుఁగల పాండిత్యాతిశయమును వెలయించియున్నాఁడు. కామందక వ్యాఖ్యానమగు జయ మంగళ చాల ఉత్కృష్టమయినది. అందు వ్యాఖ్యాత యిప్పుడు రూపుమాసిన పెక్కు అర్థశాస్త్రగ్రంథముల యందుఁ దనకుఁగల చక్కని ప్రవేశమును చూపించి నాఁడు.

'కౌటిలీయార్థశాస్త్ర' వ్యాఖ్యానమగు 'జయ మంగళ' యిప్పటికి లభించియున్న నాలుగర్థశాస్త్రవ్యా ఖ్యానములలో నుత్తమమయినది. అర్థశాస్త్ర, కామం దకవ్యాఖ్యానములయందు సామాన్య గ్రంథభాగములు గలవు. వ్యాఖ్యానింపవలసిన విషయ మొక్కటేయగు టచే నట్లుండుట వింతగా నేరదు.

డాక్టరు గణపతిశాస్త్రిగారు 'కామందక' వ్యా ఖ్యానము 'జయమంగళ' శంకరాచార్యునిదని చెప్పసం శయించి ఇప్పటివఱకు బరిశీలించిన వ్యాఖ్యానమాతృక లలో లేని శంకరవర్యుని పేరి చెప్పుచున్నారు.

ఇన్ని 'జయమంగళ'లును కేరళదేశమున వ్యాప్తి లోనున్నవి. అన్నియు నచ్చటనే లభించినవి. విమ ర్శకులకుఁగల సంశయమును దీర్చుటకై ఏకనామకములైన యీ భిన్నవ్యాఖ్యానముల కర్తలు పూజ్యపాదులగు శం కరాచార్యులు ఒక్కరే అనఁబోసండుటకై కేవలము వ్యాఖ్యాతయేకాక 'గోవిందభగవత్పాద' శిష్యులనగు శంకరాచార్యుల కొఱకు కేరళదేశ గ్రంథములఁ బరిశీలింప వలసియున్నది. అట్టివానిని గనుఁగొన యత్నింతము.

వాత్స్యాయన కామసూత్రి వ్యాఖ్యానమున

రక్తజాః కృమయ స్సూక్ష్మాః
.... యథాబలమ్.

(కామసూత్రః—౧, భా. ౨.)

అనుమదాహరణమువలన పదవశతాబ్దము వాఁడగు కౌశిక—
కునియొక్క 'వతిరహస్య' ముట్టంకింపబడినది. ఈకౌశిక—
కుఁడు 'నాగరసర్వస్వ'కారుఁడగు 'శాక్యభిక్షుని'కన్నఁదరు
వాతివాఁడని నాతలఁపు. కావున వాత్స్యాయనసూత్రవ్యా
ఖ్యయగు 'జయమంగళ'ను పదియవశతాబ్దమునకుఁ దరువాతి
దానినిగా నిశ్చయింపవచ్చును. 'పాతంజలయోగదర్శనము'
యొక్క 'వ్యాసభాష్యము'పై 'యోగభాష్యవివరణ'మను
నొక వ్యాఖ్యానము గలదు. అది గోవిందభగవత్పాదుల
శిష్యుఁడగు శంకరాచార్యులు రచియించినది. ఒకానొక
గద్యమున నావ్యాఖ్యానమునకు 'భగవత్పాదీయ'మను
పేరును జోడకట్టుచున్నది. కాన శంకరులే ఇన్ని 'జయ
మంగళ'వ్యాఖ్యానముల కర్తయగునను భ్రమ పాఠకులకు
జనియింపవచ్చును. 'భాష్యప్రదీప'మను పేర శంకరాచా
ర్యకర్తృకముగానున్న 'శాబరభాష్య'వ్యాఖ్యానమొకటి
యిటీవలనే లభించినది. ఒకానొక గద్యము దిగువపంక్తిని
బూర్తిచేయుటకుఁ గాను, వ్రాయసము 'పయ్యూరు
భగవత్పాదవిరచిత'మని వ్రాసియున్నాఁడు. ఈగ్రంథము
పదుమూఁడు పదునాలుఁగుశతాబ్దముల మధ్యకాలముననో
తరువాతనో కేరళమునఁ బ్రఖ్యాతిగాంచియుండిన
'పయ్యూరిపట్టేరి' వద్ద నుండినదిగా నుండును. కావున
'భాష్యప్రదీపము' 'పయ్యూరు' కుటుంబమునకుఁ జెందిన
శంకరాచార్య విరచితమని నిర్ణయింపవలసియుండును.
'యోగభాష్యవివరణము' ఎల్ల దర్శనములయందును వ్యా
ఖ్యాతకు గలపాండిత్యప్రకర్ష నుబ్రదర్శించుచున్నది. మఱి
యు వ్యాఖ్యాశైలిని, రచనావిధానమును బరికించినచో
'భాష్యప్రదీప' కారుని రచనము వలెనే చూపట్టు
చున్నది. దీనిని బలపఱుచుట కొక యుదాహరణము.

పయ్యూరు వంశమున, 'ఋషి'యను పేరుగలపం
డితుఁడొకఁడుండెను. అతనికి 'మీమాంసక చక్రవర్తి'
యను నామాంతరముగల 'పరమేశ్వరుఁ'డను పుత్రుఁడుం
డెను. ఆతని నామమును 'ఉద్దండుఁ' డతివినయముతోఁ
దన 'కోకిల సందేశ'(1) 'మల్లికా మారుత'(2) ముల
యందుఁ జేర్చియున్నాఁడు. ఈ పరమేశ్వరుఁడు పెక్కు
మీమాంసా గ్రంథములకు వ్యాఖ్యానములను రచియించి
యున్నాఁడు. అవి 'కాశిక' 'మండనునిస్ఫోటసిద్ధి'
'శాబరభాష్యము' 'న్యాయకణిక' తత్త్వబిందు
మొదలయినవి. మండనమిశ్రుఁడు 'స్ఫోటసిద్ధి'లో ౨౪
వ శ్లోకముక్రింద 'కుమారిలుని' 'శ్లోకవార్తికము' నుండి
కొన్ని (౪౧౨-౪౧౪) శ్లోకముల నుదాహరించినాఁడు.

వానిని వ్యాఖ్యానించుటలోఁ బరమేశ్వరుఁడు
ప్రాచీన పాఠమును బురస్కరించుకొని ప్రధానచర్చను
మార్చుచున్నాఁడు. ౪౧౩ వ శ్లోకమును గూర్చి యాతఁ
డిట్లు నుడువుచున్నాఁడు.

"తత్పూర్వం ప్రతిపాదనాదితి పాఠో రత్నాక
రకాశికయోః। నిబంధనకారేణ తు 'పూర్వం తత్ప్రతి
పాదనాదితి' పాఠోఽంగీకృతః। గవాదేః పూర్వం గకా
రాదేః ప్రతిపాదనా దిత్యర్థః వ్యాప్తిస్తు యత్పూర్వం
యత్ప్రతిపాద్యతే తత్తస్య ప్రతిపాదకమ్. యథా: ప్రదీ
పారోహణం ప్రతిపాద్యస్య ఘటస్యేతి పూర్వవ ద్దృష్ట
వ్యా. ౨౪ వ శ్లోకముయొక్క వృత్తియందు మండన
మిశ్రుఁడు 'పూర్వం తత్ప్రతిపాదనాత్' అనుపాఠ
మును బఠించినాఁడు. ఉంబేకుఁడు పైతము తన 'శ్లోక
వార్తిక' వ్యాఖ్యానమున నదేపాఠమును గైకొన్నాఁడు.
తరువాతికాలమున 'భర్తృహరికి' విరుద్ధముగ మీమాంస
కుల గౌరవమును కాపాడుటయందుఁగల కొన్ని యూప
ద్రవముల చేతఁ బాఠాంతరము గైకొనఁబడి యుండ
వచ్చును.

ఇచట పరమేశ్వరుని వ్యాఖ్యానము 'స్ఫోట
సిద్ధి' మతమును సమర్థించుటలో 'స్ఫోటసిద్ధి' యొక్క
మతమును, సమర్థించుచున్న 'యోగభాష్య వివరణ'
మతము నే మానముతో నంగీకరించుచున్నది. కాని,
శంకరుఁడు, తన 'శారీరకభాష్యము నందలి దేవాధిక
రణమునఁ దన్మతమును నిరసించుచున్నాఁడు. ఈ విష
ర్యాపాస్యము యోగవివరణమునఁ జెప్పినట్లు తన పిన
తండ్రియో లేక ఆచార్యుఁడో అగు శంకరాచార్యుని

(1) తస్మిన్మీమాంసాద్వయకులగురోః సద్మ పుణ్యం మహార్హేః.
(2) ఉక్తంచ మీమాంసక చక్రవర్తినా ఋషిపుత్ర పరమేశ్వరేణ.

యభిప్రాయములచేఁ బరమేశ్వరుఁడు ప్రేరితుఁ డయ్యె ననునమ్మకమును గట్టిపఱుచు చున్నది. మఱియు శంకరాచార్యులు పరమేశ్వరునికి, విద్యాగురువును అగుచున్నాఁడు యోగభాష్య వివరణమున (చెన్నపుర ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున నున్న మాతృక ౩౪౧వ పేజి చూచునది.) 'స్ఫోటసిద్ధి' కనుకూలముగా నున్న పాఠములతోఁ గూడిన ఆశ్లోకము లే వ్యాఖ్యాతము లయినవి. ఉదాహరణమునకై అందలి శంకరుని సూచన: 'తస్మా దయమపి శ్లోక ఏవం పఠితవ్యః— ప్రతిషేధేత యః స్ఫోటం వర్ణధీ రమనంతరమ్; దృష్టబాధో భవే త్తస్య శశిచంద్ర నిషేధవత్; వర్ణధా వర్ణధీ శేషా,తత్ జ్ఞానానంతరోద్భవాత్.' పరమేశ్వరుఁడీసూచన ననుసరించి తనస్ఫోటసిద్ధి వ్యాఖ్యానమును సాగించినాఁడు. పరమేశ్వరుఁడు వ్యాఖ్యానించిన 'వ్యాయకణిక' యం దొకగద్య మిట్లున్నది. "ఇతి శ్రీమన్మహి గౌరీసందన శ్రీమద్భవదాస పిత్రృవ్య శ్రీమచ్ఛంకరపూజ్య పాద శిష్య పరమేశ్వరకృతౌ, న్యాయకణికా స్వదితం కరణ్యాం తృతీయః శ్లోకః"

మఱియొకచోట:

"కాలప్రత్యక్షతావాద మేనం వ్యాఖ్యా దృష్టే స్ఫుటః."

భవదాసపిత్రృవ్యస్య ప్రసాదా దేవ కేవలాత్, కాయవాఙ్మనసాం సమ్యక్ ప్రహ్వీభావేన శంకరే; అన్యథా ఖ్యాతిభా వేఽపి సవ్యాఖ్యాతుం సముద్యతః"

అని యున్నది. దీనినిఁ బట్టి 'శంకరులు' పరమేశ్వరుని బంధువులలో నొకరనియు, విద్యాగురువనియు తేలు చున్నది. మఱియు 'పరమేశ్వరుని' యొనమంద్రు సోదరులలో నొకఁడగు 'వాసుదేవుఁడు' తన 'శివోదయ' మను గ్రంథమునఁ దను వంశ వర్ణనము గావించుచు, నందు శంకరుఁడు తన పిత్రృవ్యులలో నొకరని చెప్పినాఁడు. 'పయ్యూరు' కుటుంబము వారు వేదాంతశాస్త్ర ప్రవీణు లయినను మీమాంసశాస్త్ర పునరుద్ధరణమును గూడ గావించిరి. ఇంచు మించుగ భాట్టప్రాభాకర మతములకు సంబంధించిన ఎల్ల మీమాంసగ్రంథముల నీకుటుంబమువారు వ్యాఖ్యానించి యున్నారు. పరమేశ్వరుని యింకొక సోదరుఁడైన నారాయణుఁడు మండనుని భావనా వివేక విభ్రమ వివేకములకు వ్యాఖ్యవ్రాసి యున్నాఁడు.

పరమేశ్వరుఁడు తనస్ఫోటసిద్ధివ్యాఖ్యానాంతమునఁ జెప్పిన ఈక్రింది శ్లోకమునందు పయ్యూరుకుటుంబమునకు మండనమిశ్రుఁడో అతని శిష్యుఁడో మూలపురుషుఁడుగ నుండవచ్చునని సూచించుచున్నాఁడు.

'మండనాచార్యకృతయో యేవ్యాతిష్ఠంత కృత్స్నశః;
తన్వం శ్యేన మయా౽ ప్యేషా రచితారాధ్య దేవతాః.'

అతఁడు 'తత్త్వబిందువు'కును వ్యాఖ్యానము వ్రాసినాఁడు. అతని మనుమఁడో చిదానందుని 'నీతితత్త్వవిర్భావము'నకు వ్యాఖ్యానము వ్రాసినాఁడు. ఆవంశము వాఁడేయైన 'విష్ణువు' అనునాతనిదగు 'నయతత్త్వసంగ్రహము'నకాతని జ్ఞాతియగు 'నారాయణుఁడు' వ్యాఖ్యను రచించెను. అతని పిత్రృవ్యుఁడగు భవదాసుఁడు కల్పసూత్రగ్రంథములకుఁ బెక్కు వ్యాఖ్యానముల రచించినాఁడు. ఇట్లు పరిశీలింపఁగా భాష్యప్రదీప, యోగభాష్య వివరణములు రెండును వాసుదేవోక్తరీతిని 'గోవిందభగవత్పాద' శిష్యుఁడగు శంకరాచార్యకృతము లగుట నిశ్చయము. అన్ని 'జయమంగళ' నామక వ్యాఖ్యలను మనము ఈ శంకరుని రచనములుగనే ఊహించుచున్నాము.

తపస్వులా, రాజనీతిజ్ఞులా ?

శ్రీ టి. యల్. వాస్వానిగారి ఉద్దేశపూరితమగు నుపన్యాసమును 'వేదిక్ మేగజీను' ప్రకటించినది. జాతీయభాగ్యోదయ జాతీయ స్వభావములకును, బ్రహ్మచర్యమునకును పెక్కు తెఱఁగులగల సంబంధము నందు వివరించుచు వాస్వానిగా రిట్లనుడివిరి.

మనము భారతదేశ పునర్నిర్మాణము నెట్లు కావింపవచ్చును? అనుప్రశ్నము నే దేశమునందలి వివిధస్థలముల యువకులు నన్ను నడిగిరి. పెద్దలగు మనరాజనీతిజ్ఞులలో కొందఱు- ప్రభుత్వమునుండి, గ్రేటు బ్రిటను నుండి

యధికారము నాడఁజేరికికొన్నచో నూతనభారతదేశ నిర్మాణము కాగలదని తలచుకొందఱు - ఉండుట నే నెఱుఁగుదును. కాని నేనట్లు తలపను. రాయలు కమిషనుల యందును, కౌన్సిల్ల చర్చల యందును, పార్లమెంటు పత్రములయందును విశ్వాసముగల వారు కొందఱుందురు. నావిశ్వాసము మాత్రము విభిన్నమైనది. తపశ్శక్తిచేతనే, నూతనభారతదేశవినిర్మాణము కాగలదని నేను వినయముతో మనవిచేయుచున్నాను. తపస్వులే కాని రాజనీతిజ్ఞులు విముక్తమగు భారతదేశము నిర్మింపజాలరు. 'ఎల్లప్రపంచమునకు మహాత్సందేశము నొసగగల భారతదేశము - ప్రపంచోపదేశకమగు భారతదేశము - భావికాలమున మానవసేవ కుపకరింపగల భారతదేశము- నిక్కముగ విముక్తమగు భారతదేశము క్రొత్త వెలయగలుగునది బ్రహ్మచర్యముయొక్కయు, పావనతా జ్ఞానములయొక్కయు, తపశ్చర్యయొక్కయు, శక్తిచేత గాని, రాజ్యాంగసభలయందలి చర్చలచేతగాదు; పార్లమెంటుసభలయందలి వివాదములచేతగాదు,' అని నేను విన్నవించుచున్నాను. కావున నాతుది పలుకులనాలకింపుడు:—మీరు మీతపశ్శక్తిని పెంపొందింపుడు. తపస్సు సకలప్రపంచములను సృష్టించెనని మనప్రాచీనగ్రంథము లుద్ఘోషించుచున్నవి. 'తొలుదొల్త ప్రపంచమే లేదు. అప్పు డనంతశక్తియుక్తుడగు నీశ్వరుడు తపస్సు చేసినాడు. దానివలన నెల్ల ప్రపంచము లుత్పత్తిల్లినవి' అను నీవిషయము నాగ్రంథములయందు మనము చదివితిమి. ఆతపస్సే నూతనజాతినిగూడ సృజింపగలదు. యువకవతంసములగుమీరు - దేశమందలి భిన్నభిన్న ప్రదేశముల వారలగు మీరు - బ్రహ్మచర్యముయొక్కయు, తపస్సుయొక్కయు శక్తితో పెంపునొందుదురేని, నూతనభారతదేశము-విముక్తభారతదేశము-సంప్రాప్తించు దినమునకై మనము చిరకాలము వేచియుండ నక్కఱలేదని అప్పుడు నేను తలతును. తపస్సు, ఆత్మార్పణము, ధైర్యము, జితేంద్రియత, బ్రహ్మచర్యము, వీనియందే జాతీయాభివృద్ధికి మూలసూత్ర ముండునది.

'ఓ ప్రభూ! మమ్ము నుపహారముగా నంగీకరింపు' మని దైనమును ప్రార్థింప నెందఱు భారతీయయువకులు పనుకట్టియున్నారని నన్ను నేను పలుమారులు ప్రశ్నించుకొంటిని. నామాటను నమ్ముడు. మాటలచేతను, సభలచేతను, పత్రలిఖితములగు ప్రతిపాదనములచేతను, నూతన భారతదేశనిర్మాణము కాజాలదు. 'ఓప్రభూ! మమ్ము నుపహారముగ నంగీకరింపు'మను ప్రార్థనముతో, నాశాపూరిత హృదయములతో నలరారు యువబ్రహ్మచారులయు, యువతపస్వులయు సమూహములచేత నూతనభారతదేశనిర్మాణము కాగలదు.

అట్టి యువకుల నీనాడు భారతమాత యాశించుచున్నది. దారిద్ర్యపరిపీడితులయి భారతదేశవిముక్తి నాకాంక్షించుచు, వారు ఒక్కచోటనుండి యింకొకచోటికి దేశమంతట త్రిమ్మరుదురు. గ్రామగ్రామమునకు సంచరించుచు అస్పష్ట తమయాగమనమునకు వేచియున్న ప్రజాసమూహమునకు భారతమాతయొక్కయు, భారతీయ ప్రాచీనఋషిసత్తములయొక్కయు సందేశమును చాటుదురు. నిక్కముగ నట్టియువకులు ధన్యాత్ములు. ఏలయన వారినే యీశ్వరుడు భారతమాత భాగ్యోదయమునకు సాధనములనుగ స్వీకరించును. మఱియు నాధన్యులే భారతమాతృ పవిత్రాలయనిర్మాణ కుశలులగు శిల్పాచార్యులు గాగలరు.

భారతీయ రాజపుత్రికలు

'డమ్మండు హే' (అమెరికా దేశీయురాలు) అనునామె ౧౦-౩-౨౮ స్పియరులో ఇట్లు ప్రకటించినది:

'సాన్ ఫ్రాన్సిస్కో' వారసుదారురాలగు 'మిస్ నాన్సి ఆని మిల్లరు' రాజ్యచ్యుతుడగు ఇందూరు మహారాజా సర్ తుకోజీరావు హోల్కారు గారిని పెండ్లాడు కోరికతో హిందూమతమును స్వీకరింప సంసిద్ధురాలుగ నున్నది. ఇది యిట్లుండ, భారతీయసంస్థానముల రాజపుత్రికల దుఃఖమయ జీవితమును ప్రకటింప బురికొల్పుచు నాసేస్తురాండ్రగు భారతీయయువతులు వ్రాయునుత్తరములు ప్రతి తపాలలోను నాకు వచ్చుచున్నవి. "స్వేచ్ఛా

దూరలై ఏకాంతవాస శిక్ష ననుభవించుచున్న యాస్య 'మిస్ నాన్సి ఆనిమిల్లర్=

ర్ణ పంజరబద్ధలగు కైదీల" దుర్గతుల నాయుత్తరము లు విస్తరించి పేర్కొనుచున్నవి. పెక్కురు కైదీల కాస్వ

నూతన దంపతులు



శర్మిష్ఠా తుకోజీరావు హోల్కారులు



పెండ్లికి పూర్వము
అమెరికాలో

శర్మిష్ఠాదేవి



పెండ్లికి తరువాత
భారతదేశమున

ర్ణ పంజర' ప్రాప్తియు లేదని యాయుత్తరములు తెలుపుచున్నవి. హీనభాగ్యయగు నొకరాజయువతి యిట్లు వ్రాసినది:

"భారతీయరాజపుత్రులకు పట్టినగతియు వారు తమ పేరుకీర్తులను లెక్కింపకుండుటయు నాదైవమునకే యెరుక. ప్రపంచమంతయు నున్నతభావ ప్రేరితమై యున్నతస్థితిని గాంచ బ్రయత్నించుచుండ నిందరు రాజపుత్రు లేల నధోగతి పాలగుచున్నారు? వారి రాజ్యాంగవ్యవహారములయెడ నశ్రద్ధ చేయుచున్నారు. వారి ప్రజలు వారియెడ కుపితులై యున్నారు. కాని వారి కది యేమిలెక్క? మమ్ము వారు గృహోపకరణములుగ బరిగణించుచున్నారు. వీధులయందు దిరుగుచున్న బిచ్చగాండ్రస్థితికంటె నికృష్టమయిన స్థితికి మమ్ము గొని తెచ్చినారు. మేము మాయజమానుల చేతిబొమ్మలము. వారు ఇష్టమున్నమాకు బట్టలు గట్టుదురు. లేకున్న వాని నూడదీసి చించి పారవేయుదురు!! వెనుకటిరష్యయను బానిసలకంటె మేము నీచమయిన దశయందున్నాము" ఎప్పుడు ఇదే ధోరణి. కాని నాసేస్తురాండ్ర భర్తలకు, బంధువులకు నారోపించిన చెడునడతలలో నెల్ల భారతీయరాజపుత్రులకును పాలుగలదనుట కేవల మన్యాయము.

కీ. శే., రా.బ. హొసకోట కృష్ణశాస్త్రిగారు

వీరు భారతీయ శిలాశాసన కార్యాలయ ముఖ్యాధికారిగా నుండి ౧౯౨౮ వ సం. సెప్టంబరు నెల ౧౯ వ తేదినాడు ఉద్యోగమునుండి విరమించి ౧౯౩౧ వ సం. ఫిబ్రవరి ౭ వ తేదీనాడు కీర్తిశేషులైరి. వీరి నివాసస్థలము బెంగుళూరికి చేరువనున్న హొసకోట. వీరు కర్ణాటకులయినను, తెలుగు, అరవము, ఇంగ్లీషు, సంస్కృతము మొదలయిన బహుభాషలయందు మంచి పండితులు. వీరు పట్టభద్రులై నలువది రూపాయల జీతన

ముపయి ౧౮౯౧వ సంవత్సరమున చెన్నపురి శిలాశాసన కార్యాలయమున నుద్యోగములో ప్రవేశించిరి. వీరికి మొదటినుండియు శిలాశాసనములన్న నెంతయో కుతూహలము. వీరి సంస్కృతపాండిత్య మపారమయినది. తమ సామర్థ్యముచేతనే క్రమముగ నాకార్యాలయమున



కీ. శే. రా. బ. హొసకోట కృష్ణశాస్త్రిగారు

నున్నతస్థానముల బడయుచు తుదకు వీరు శిఖరము నధిరోహించిరి. వీరు పరమ సాధువులు; నిగర్వులు; దృఢశరీరులు; ధర్మపరులు. ౧౯౨౦వ సంవత్సరమునుండి వీరు 'ఎపిగ్రాఫియా ఇండికా' అను శిలాశాసన విషయిక మాసపత్రికకు సంపాదకీయకార్యమునంతయు నిర్వహించుచుండిరి. వైదేశికులగు 'థామస్ స్విన్ కోనూ'గారు పేరునకు మాత్రమే సంపాదకులుగ నుండిరి. ౧౯౧౬ మొదలు ౧౯౨౧ వరకు వీరు వ్రాసిన శిలాశాసనశాఖాకార్య నివేదికములు శాసనవిషయిక చర్చలతో చారిత్రక విజ్ఞానపరిపూరితములుగ నున్నవి. ౧౯౨౧వ సంవత్సరమున నాకార్యాలయమునకు వీరు ముఖ్యాధికారులై తోడనే రావుబహద్దూరు బిరుదమును బడసిరి. వీరు ఉదకమండలము చెంతనున్న 'ఫరన్ హిల్' అను తమ సొంతబంగళాయందే కార్యాలయమునుగూడ నుంచుకొనియుండిరి. ఉద్యోగమును మానుకొనిన పిదప వీరు బెంగుళూరునందలి స్వగృహమున నివసించుచుండిరి. అప్పుడు ప్రజోపయోగకరములగు కార్యములను మిగుల నుత్సాహముతో చేయుచుండిరి. ఉత్తరకర్ణాట దేశమునకుస్వయముగపోయి వీరు బాదామి, ఐహోళె, బిజాపురము, ధారవాడ మొదలయిన స్థలములయందలి శిలాలేఖనములు ప్రకటితములు కాకుండుటను విచారించి అచ్చటి ప్రతిగ్రామమునందలి శిలాలేఖనములను ప్రకటింప నిశ్చయించి ౧౯౨౪ జూన్ మాసమున నాకార్యమును ప్రారంభించిరి. ఆర్కియాలజీ డైరక్టరు జనరల్ వార్షికనివేదికయందు విజయనగరరాజ్యమును గూర్చి ఉత్తమములగు మూడు వ్యాసములను ప్రకటించిరి. 'దక్షిణభారతదేశ స్త్రీపురుష దేవతావిగ్రహము'లను గ్రంథమును వీరు రచియించి యందు విగ్రహనిర్మాణము, ప్రతిష్ఠావిధానము మొదలయిన విషయములను వేదములు, ఆగమములు మొదలయిన ప్రాచీనగ్రంథములనుండి యుద్ధరించిన ప్రమాణములతో చక్కగా చర్చించిరి. వీరు ఇంకను పెక్కు చిన్నచిన్న చరిత్రోపయోగములగు గ్రంథములను రచియించిరి. ఈ మహనీయుని జీవితము దేశోపకారక మైనది. వీరి కార్యమంతయు భారతదేశచరిత్ర భాండాగారమున కమూల్యరత్న సంచయమయినది. ఇట్టివారి జీవితము ధన్యము; చిరస్మరణీయము.

[జయకర్ణాటకనుండి]

అబ్దుల్ రహిమాను-
మంతాజుబేగము

ఇపు డీ యాలు మగలు అనురాగమడుగంటి వివాదము చెలరేగి కోర్టున కెక్కియున్నారు.



ఆఫ్ఘనుస్థానపు రాజదంపతులు



వారు యింగ్లండును జేరుటకు పూర్వము తీసిన ఛాయాచిత్రములు.

చిలకమర్తి లక్ష్మీనరసింహము గారి షష్టిపూర్తి

[రాజమహేంద్రవరమున ౧౯౨౮ మార్చి ౧౧-వ తేదినాడు జరిగినది]

పాండితీమండితులై విలసిల్లిన ప్రాచీన ప్రభువులు పండితమండలి నాదరించి పోషించి వాఙ్మయవృక్షమున కెంతయు దోహద మొనరించిరి. గడచిన రెండుశతాబ్దములలో నట్టి ప్రభువతంసములు లేమిచే దోహదముగాంచక యీవాఙ్మయవృక్ష మల్లే నిలిచిపోయినది. ఈదురవస్థ విదేశీయప్రభుత్వమూలక మయినది. ఇప్పుడున్న సంస్థానముల ప్రభువులయందు వాఙ్మయాభివృద్ధిని గోరువా రరుదుగనుండుటకు మిగుల చింతిల్లవలసియున్నది. ఇట్టి స్థితిని జాతీయాభివృద్ధితోపాటు భాషాభివృద్ధికిని బూనుకొనవలసినభారము కేవలము ప్రజలపైఁ బడినది. ఈకాలమున నీకార్యము ప్రజలకు విధియైనది.

౧౯ వ శతాబ్దము చివరను కీ. శే. శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారాదరణపోషణములు కఱవైనను మంచి పూనికతో వ్యయప్రయాసములకోర్చి, పండుపాఱి యున్న ఆంధ్రవాఙ్మయ వృక్షమునకు మరలఁ గొంత దోహద మొనర్చిరి. తత్ఫలితముగ నావృక్షము గద్య, నాటక, ప్రహసనాదిపుష్పములఁ బెక్కిటిని గ్రొత్తపుష్పించినది. అట్లే తరువాత శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముపంతులుగారును నావృక్షము నింకను బ్రోదిసేసి యట్టి పూవులనే పెక్కిటిని బూయించిరి. ఇవి యాపూవుల కమ్మనితావు లాంధ్ర దేశ మంతటను నిండార వ్యాపించి స్థిరముగ నెలకొనియున్నవి. విదేశీయ విద్యాప్రవాహమున మునిఁగి కొనయూపిరితో నుండిన యాంధ్రవాణిని మరల నుద్ధరించి యీ ధన్యాత్ము లిరువురు విదేశీయ విద్యావ్యామోహితమై తెన్నుగానకయున్న యాంధ్రలోకమునకు మార్గదర్శకులైరి. ఇపు డాంధ్రలోకము నకుఁ గన్నులు విడినవి; స్వీయభాషపై నభిమానము రేకెత్తుచున్నది. ఏయాంధ్రునివాణి యందును నానూతనసాహిత్య నిర్మాతలు పూయించిన పూవుల తావులే వలచుచున్నవి.

పయిఁ జేర్కొన్న యాంధ్ర సాహిత్య నిర్మాత లిరువురిలో శ్రీ వీరేశలింగము పంతులుగారి నాంధ్రలోకము సముచితరీతి నాదరించి సత్కరింపఁ జాలమికి విచారించవలసియున్నను ఇపుడు శ్రీలక్ష్మీనరసింహము పంతులుగారినైన నిట్లు సత్కరించి తనధర్మమును గుర్తించి నిర్వర్తించుకొనుట కెంతయు నానం

దింపవలసి యున్నది. ఈ షష్టిపూర్తి మహోత్సవము నిరంతరాయముగా నిర్వహింపఁ బూనుకొన్న కార్యసంఘము వారును, వదాన్యులగు భాషాభిమానులును ధన్యవాదముల కర్హులు.

ఆంధ్ర దేశమున నిట్టి సత్కారమును



బడయుదగిన మహనీయు లింకనుగలరు: శృంగార నైషధాముక్తమాల్యదాది కావ్యములకు సర్వంకష వ్యాఖ్యానములు మొదలయిన గ్రంథ రత్నములతో నాంధ్రవాణి నలంకరించిన పండితాగ్రణి బ్ర. వేదము వేంకటరాయ శాస్త్రి గారు (మహోపాధ్యాయ, కళాప్రపూర్ణ); రస సత్కావ్య నిర్మాణ ధురీణులు, శతావధాని, యాంధ్రవాణిని క్రొత్త వెలయించిన కవిపండితవతంసము బ్ర. చళ్ల పిళ్ల వేంకటశాస్త్రిగారు; చిరకాలము నవంతముగఁ బరిశోధనలు సలిపి యాంధ్ర దేశచరిత్రను రచియించి యాంధ్రుల కర్పించి వారి హృదయములఁ బ్రత్యేక జాతీయ భావములతో నించి మించిన (శ్రీ) చిలుకూరి వీరభద్రరావు గారు. కాలక్రమమున నిట్టివారెందఱో యాంధ్ర దేశమున వెలయఁగలరు. ఇట్టివారి నెల్లరను ఆంధ్రలోక మప్పుడప్పుడు గుర్తించి సత్కరించి వారియెడను దమ కృతజ్ఞతను దెలుపుచుండుట ధర్మము. మఱియు పైఁ

పేర్కొన్న మువ్వురనుగూడ శ్రీ లక్ష్మీనరసింహముగారినివలెనే సత్కరించు ప్రయత్నముల నాంధ్రలోక మచిరకాలముననే కావించునని యాశించదగును.

అట్లాంటిక్ మహాసముద్రమును దాటుటకై నిర్మింపబడిన నీటమునుగని పడవ



న్యూయార్కుకు వెళ్లుటకై 'థేమ్సు' నదియందు నిలిచియున్నది. ఇది డచ్చిపడవ. పొడవు ౨౦ అడుగులు మాత్రమే. ఇది నీటిలో మునుగకుండనుండుతీరున చేయబడినది. రోటర్ డాము (హాలెండురాజధాని) నుండి లండనుకు వచ్చినది. ఇందున్న నలుగురు సాహసికులను నావి అట్లాంటిక్ సముద్రమును నలువదిరోజులలో దాట ప్రయత్నము చేయుచున్నారు. ప్రయాణకాలమున పొట్టి తరంగముల వాయువార్తావిధానమునుగూర్చి పరిశోధనలు సలుపుదురట.

యువకుల పట్టణనివాస ఫలము

'త్రివేణి' (ఆంగ్లపత్రిక) మార్చి సంచికయందు, శ్రీ డాక్టరు బి. పట్టాభి సీతారామయ్యగారు, 'హైందవ కుటుంబము: పునఃప్రదర్శితము' అను పేరున, నొక చక్కని వ్యాసమును, ప్రకటించినారు. అందు హిందూ కుటుంబము యొక్క సత్యస్వరూపమును, ఉత్తమ ధర్మములను, గొప్పదనమును, చక్కగా వివరించినారు. విద్యాభ్యాసమను పేరనైన యువకుల చిరకాల పట్టణవాసము యొక్క దుష్ఫలముల నందిట్లు పేర్కొన్నారు.

" ఇది యిట్లుండగా ఆధునిక పరిస్థితులు హైందవ కుటుంబమునందలివారికి పరస్పరము గల యనుబంధములను ఛేదించివేయుచున్న విధమును గొంత పరికింతము. విద్యను ముగించి కళాశాలను వీడి తనయింటికి—పల్లెటూరికి—వచ్చిన యువకున కా పల్లెటూరు లాతివిలాతిగా దోచును. అచట నాతడొక వైదేశికునివలె ప్రవర్తించును. పట్టణనివాసము, పూటకూటి భోజనప్రీతి కలవాతనికి గొప్ప చెరుపును దెచ్చిపెట్టును. అనగా నాతని దన యన్నదమ్ములు, అక్కసెల్లెండ్రనుండి మైత్రము కడుదూరము చేసివేయును. పల్లెటూరి ప్రాతపద్ధతులు, వాంఛలు గల సోదరులతో నాతనికి సామరస్యము కుదురదు. పెండ్లాడిన అక్కచెల్లెండ్ర నాతడు చూచి పెక్కేండ్లయి యుండును. ఆమె పిల్లలను చూచియే యుండడు. అతనికి కళాశాలలో సెలవు దొరకక తోబుట్టువులయు వారిపిల్లలయు పెండిండ్లకును బోయి యుండడు. మేనత్తనుగాని, పినతల్లినిగాని వారిభర్తృమృతికి పిదప చూచియుండడు. వారికి—మేనమామలకు, తండ్రి సోదరులకు—ఎవరికేగాని పిల్లలెందరో, వారికి పెండిండ్లు అయినవో వారేమి చేయుచున్నారో, తెలియనే తెలియజాలడు. విద్యాభ్యాసమును ముగించి కళాశాలను వీడి యిల్లు చేరిన పిదప నాతడు మరల నీ చుట్టరికములకయి, తడవి తెలిసికొనవలెను. అయితే చిరకాలమునుండి యాతనియందు ప్రచ్ఛన్నముగ డాగియుండినయనురాగ మచిరకాలముననే మరల నుద్దీపనమును గాంచగలదు.

గణపతి విగ్రహము—కాకినాడ



పిఠాపురం మహారాజాగారి కళాశాలలో జూని యర్ బి. ఏ. తరగతియందు చదువుచున్న కె. కనకయ్య యను విద్యార్థి చేసిన సుందర మృణ్మయవిగ్రహము. విగ్రహము పొడవు అం. ౨౨. పీఠముతో కూడా అం. ౩౧. పైన సుద్దపూసి తెల్లగా చేయబడినది.

—భా. పట్టాభిరామయ్య, యం. ఏ., యల్. టి.

టాల్‌స్టాయి జీవితమున నొకదినము

'పిస్టర్ లాయడ్' పత్రికయందు స్టెఫాన్ జ్వాగ్ గారు టాల్‌స్టాయి జీవితమం దొకదిన మును వర్ణించి వ్రాసియుండిరి. అందిట్లుకలదు:

మరల నొకసారి యావృద్ధుడు నిద్రపోవుటకు ముందు ఖాళీగానున్న తన చదువుకొను గదియం దిటున టు పచారు చేయును. తన్ను గూర్చి తుది తీర్మానము నతడు చేసుకొను వరకు, కడచిన యిరువదినాలుగు గంటలలోని ప్రతిగంటకాలమును పూర్తివివరములతో గట్టిగా పోల్చి చూచుకొనువరకు నతడు నిద్రింపడు. అతని దినచర్యపుస్తకము (డయిరీ) బల్లపై తెరచి యున్నది. అందలి తెల్లని పత్రము మనోక్షేత్రము వలె నతనిపైపు చూచుచున్నట్లున్నది. అతడా దిన మున ప్రతిక్షణమును తిరుగ వేసుకొని దానిని విమ ర్శించును. ఒక నికృష్టమగు చిన్న నాణెముకంటె నెక్కువయిచ్చి సాయము చేయక తాను విడిచి పెట్టిన పేదరాలినిగూర్చి యాతడు తలపోయును. బిచ్చగాండ్రయెడల తాను తాలిమిలేక ప్రవర్తించిన సంగతి నతడు జ్ఞప్తికి దెచ్చుకొనును. భార్యయెడల తనకున్న కఠినభావముల నతడు జ్ఞప్తికి దెచ్చుకొనును. తనయాదర్శాను గుణ్యప్రవర్తనమునకైన యీ భంగ పాటుల నాత డింతయైన విడువక తన పుస్తకమున వ్రాసిపెట్టుకొని దినచర్య వృత్తాంతము నిట్లు ముగిం చును. "ఇంకను లోపభూయిష్ఠమే, తిరుగ విక లాత్ముడనే, వలసినంత మేలు కావింపలేదు. విశాల మగు మానవప్రపంచమునకు బదులు నా పరిసరముల నుండు వారిని ప్రేమించుటయను కష్టతరమైన పనిని చేయుట కింకను నేను నేర్చుకొనలేదని మరల నొక్క నిదర్శనమును జూపితిని. దేవా, నాకు తోడ్పడుము; చేయూత నొసగుము." అంత మరల నతడు మరునాటి తేదీని, 'సజీవుడనై యుందు నేని' యను నభిప్రాయమును సూచించు మూడు మర్మ సంకేతాక్షరములను పుస్తకమున నెక్కించును.

ఇప్పు డతనికార్యము పూర్తియైనది. ఇంకొక దినము తుదివరకు జీవించివాడతడు. నమ్రుడై యాతడు తన పడకగదిలోనికి వెళ్లి బరువైన జోళ్లను విడిచి, దుస్తులు మార్చుకొని, శయ్యపై పరుండి మరల మృత్యు వును గూర్చి యాలోచించును. ఆరెక్కలుగల యాలో చనలు! అవి యింకను అతని మెదడులో మిడిసి మిడిసి యెగురు చున్నవి. కాని చీకట్లు క్రమ్ముచున్న యడవుల లోని సీతాకోక చిలుకలవలె నవికొంచెము కొంచెముగా తొలగిపోవును. అతని హృదయకవాటము చెంత కునుకు పాటు తారాడును.

అదిరేమి! అతడు తటాలున మేల్కొను చున్నాడు. అది యడుగుల చప్పుడు కాదా? ఔను

ప్రక్కగదిలో దొంగతనముగా మెల్లగా నడచిన యొక్క యడుగు. అతడు శయ్యనుండి తేలికగాను, చప్పుడుకలుగ కుండగను దిగ్గనలేచి బీగము చెవివేసెడు రంధ్రమున తన ప్రకాశవంతములగు కండ్లు నానించి చూచును. ఔను, ఒక దీపము. ఎవరో యొకదీపమును తీసికొని లోపలికి వచ్చి యతని మేజాసొరుగును గాలించి వెదకుచు, నతని దినచర్య పుస్తకము పుటలను తాకుచు నతనియాత్మ రహస్యముల లోనికి తొంగి చూచుచున్నారు. ఆమె యతనిభార్య, సోఫియా ఆంద్రీవ్నా; తీరని జిజ్ఞాస! అతని యాత్మ గాంభీర్యము లోనికి, నతని హృదయపు గాఢ శుచిత్వము లోనికి చొచ్చి చూడవలెనను నాతురత యన్ని వైపుల పరివేష్టించి యున్నది. అతని చేతులు కోపముచే గడగడ వణకుచున్నవి. తటాలున తలుపు తెరచి, భార్యను బాగుగ చీవాట్లు పెట్టవలెనని యతడప్రయత్నముగ ప్రేరితుడై తలుపు తెరచుటకు గడియపై చేయివైచును. కాని చివరకు నతడు శాంతు డగును. 'బహుశః యిది కూడ నాకొక పరీక్షయే కాబోలును' అను కొని తిరుగ నతడు మెల్లగ పడకకు చేరును. కాని నిదురించుటకు కాదు. లెవ్ నికోలెవిచ్ టాల్‌స్టాయి తన కాలపు వారిలోన మిక్కిలి గొప్పవాడును మిక్కిలి ప్రజ్ఞానిధియు నగువాడు, తనయింటనే వంచితుడై, సంశయముచే పీడింప బడుచు, అనిర్వచనీయమైన యేకాంతమున మునిగి, యటపడి యున్నాడు."

సర్ అణ్ణామలై శెట్టిగారు

వీరిదివరకు మీనాక్షికళాశాల కొఱకు పదునైదు లక్షలు ధనము నొసంగియున్నారు. ఇపుడు మీనాక్షి విశ్వవిద్యాలయ మనుపేర నొక విశ్వవిద్యాలయమును చిదంబరమున నెల కొల్పుటకై ఇరువదిలక్షలు ధనము నిచ్చుటకు సంసిద్ధులై యున్నారు. భారత దేశమున నింత యౌదార్యముతో సారస్వతాభివృద్ధికి మహోపకారమును గావింపదొరకొన్నవా రెవ్వరు



సర్ అణ్ణామలై శెట్టిగారు

నింతవఱకు కాన్పింపరు. ఇందువలన తమిళవాణి నలుమొగముల పెంపొందుట కెంతయు నవకాశము కలిగినది. ఇట్టి వదాన్యుల నాంధ్రదేశమున జేర్చుకొనుభాగ్యము గల్గునేని యాంధ్రవాణి బహుముఖముల పరిపుష్టి నొందగలదు ఆంధ్రదేశమునందలి శ్రీమంతులు సైతము శ్రీ అణ్ణామలై శెట్టిగారి ననుసరించి యాంధ్రవాణిని పెంపొందింతురుగాక!

గుమ్మడిదుఱ్ఱు-నాగార్జునకొండ బౌద్ధస్తూపములు

[క్రీ. శ. రెండు మూడు శతాబ్దముల నాటివి.]

"పురాతన వస్తుపరిశోధనశాఖవారు కృష్ణాజిల్లా లోని గుమ్మడిదుఱ్ఱువద్ద బౌద్ధస్తూపశిల్పములను, గుంటూరు

జిల్లాలోని నాగార్జునకొండవద్ద బౌద్ధస్తూపములు, విహారములు త్రవ్వించి వెలువరించినారు. గుమ్మడిదుఱ్ఱు వద్ద వెలువడిన శిల్పములు ఇప్పటికి దొరకిన ఉత్తమప్రాచీన బౌద్ధస్తూపచిత్రములతో నెంతయు దులదూగగలవి. ఇందలి శిల్పవిధానము భారతీయ శిల్పవిధానములయందు ఉత్తమమనబడి కేవల మొక్క అమరావతి యందే కాన్పించుచున్న యద్భుతశిల్పచిత్రములను బోలియున్నవి. ఇక్కడ విశాలమైన పీఠభూమిని త్రవ్వగా ఒక పెద్ద స్తూపము, రెండు చిన్న స్తూపములు, బౌద్ధవిహారములను, తత్సంబంధములయిన యితరభవనములయు శిథిలనిర్మాణములు, మఱియు నితర నిర్మాణములును బయలుపడినవి. పెద్దస్తూపమున పీఠముమాత్రమే నిలిచియున్నది. ఆపీఠముపై అమరావతి, జగ్గయ్యపేటలయందుండు స్తూపములయందువలెనే ఉపస్తూపచిత్రములు బూడిదరంగుగల చలువరాతిపలకలపై చెక్కబడియున్నవి. అట్టిరాతిపలకలక్కడ ౩౮ చిక్కినవి. ప్రతిదానిపైనను స్తూపచిత్రములే చెక్కబడి యున్నవి. స్తూపస్థానము (Drum) పై బుద్ధుని జీవిత మందలి పట్టులను, జాతక కథలను వివరించు ఉపస్తూపచిత్రములయందు చెక్కిన స్తూపములన్నియు పెద్దస్తూపమువలెనేయుండి దానికి అలంకారముగ నున్నవి. ఇవియేకాక క్రీ. శ. రెండు మూడు శతాబ్దులనాటి బ్రాహ్మిలిపి ప్రాకృతశాసనములుమూడు, ఆంధ్రరాజుల సత్తునాణెములు, శిథిలమైన రొుక వెండిడబ్బి, ఒక అందమైన బంగారుదంపు ఒకకుండలో నుండినవి. ఈకుండ ప్రధానస్తూపమధ్యమున దొరకినది.

ఈస్తూపము పెక్కుసంవత్సరములయేండ్లుపయోగమున నుండెనని మధ్యయుగపు నాగరలిపిలోనున్న బౌద్ధ లేఖనములు గల ౧౨౪ ముద్రికలు తెలుపుచున్నవి.

నాగార్జునకొండ ఇప్పటికి త్రవ్వినదానిని బట్టి 76 అడుగులవ్యాసము(Diameter)గలస్తూపము యొక్కయునికి తెలియవచ్చినది. నడిమికట్టడము చుట్టు నిలిచియున్న మూడుగోడలు, నాలుగుద్వారముల కాధారముగానుండు అయిదు స్తంభములు మాత్రము గలవు. ఈ స్తంభములలో కొన్నిటిపై చరిత్ర కత్యంతము నుపకరించు బ్రాహ్మిలిపి దీర్ఘశాసనములు గలవు. ఇదివఱ కంతగా చరిత్ర కెక్కని యిక్ష్వాకువంశపురాజుల నవి పేర్కొనుచున్నవి: వారు కృష్ణానది దిగువప్రాంతముల యాంధ్రదేశమును క్రీ. శ. రెండు మూడు శతాబ్దములయందు బరిపాలించినవారుగా నుండవలెను. టాలెమి తనభూగోళమున 'బనవాసి' యని పేర్కొన్న 'వనవాస'దేశ మీశాసనములయం దుదాహృతమైనది. మఱియు నీస్తూపమునకు మహాచైత్యమను పేరనియు, నిందు బుద్ధునియస్థికలు ప్రతిష్ఠింపబడి యున్నవనియు నీశాసనములు తెలుపుచున్నవి: స్తూపమునంతయు త్రవ్వితీసినచో నవి బయలుపడగలదు.

[సశేషము]

ఈవిషయమును ప్రాచీనవస్తుపరిశోధకశాఖాధికారియగు సర్ జాన్ మార్షల్ దొరగారు టైమ్సుఆఫ్ఇండియాపత్రికలో (౧౯౩౮ మార్చినెల ౨౬-వ తేదినాటిది) సచిత్రముగా ప్రకటించియున్నారు. అందుగలచిత్రము లీసంచికయందు జేర్పబడినవి. అవి ప్రాచీనశిల్పకళాకౌశల్యమును వేనోళ్ల జాటుచున్నవి. ఈ యమూల్యశిల్ప సంచయమును వెలువరించిన ప్రాచీనవస్తుపరిశోధకశాఖవా రాంధ్రులకృతజ్ఞత కెంతయు బాత్రులుకాదగుదురు. కాని యీ వస్తుసంచయము నాంధ్రులయందుబడికి దూరముచేసి చెన్నపురమునకు, కలకత్తాకు కొనిపోవు ప్రయత్నములు చేయుచున్నారని వార్తలు తెలుపుచున్నవి ఇది మిక్కిలి విచారమును గలిగించుచున్నది. ప్రభువులు దేశముపై నభిమానము గలిగియుండవలెను. దేశప్రాచీనచరిత్రను, గౌరవమును, దేశీయులకు దెలియజేసి వారియభివృద్ధిని కాంక్షించుచుండవలెను. ప్రభువులును దేశీయులైననే యట్టి సౌకర్యములు ప్రజలకు లభింపగలవు. విదేశప్రభుత్వముక్రింద సర్వస్వాతంత్రములు కోలు

పోయిన భారతీయు లట్టిభాగ్యమును బడయ జాలమి వింతగాదు.

ఆంధ్రదేశమున దొరకి, ఆంధ్రదేశప్రాచీనచరిత్రకు మిగుల నుపకరించు నీయనర్ఘశిల్పసంచయము నాంధ్రదేశముననే యుంచుట న్యాయ్యము. ఇదివఱకు వెలువడిన గోలీస్తూపచిత్రములను ప్రభుత్వమువారు చెన్నపురి మ్యూజియమునకు చేర్చినారు. భట్టిప్రోలువద్ద దొఱకినవానిని విదేశములకు జేర్చినారు. అపు డూరకుండబట్టియే యిపుడాంధ్రదేశము వీనిని సైతము గోలుపోవుటకు మార్గమేర్పడె నని తలపవలసియున్నది.

ఆంధ్రవిశ్వవిద్యాలయమునకై పోరాడి ఏదో యొకమూల తమపేర ప్రత్యేకవిశ్వవిద్యాలయమును బడసినఆంధ్రులు, ప్రత్యేకాంధ్రరాష్ట్రమునకై బహుముఖముల ప్రయత్నములు గావించుచున్న యాంధ్రులు, తమదేశప్రశస్తిని చాటుచున్న యీ యమూల్యశిల్పచిత్రసంచయము తమకు దూరమైపోవుటను సైచియుండజనదు.

భారతదేశము తనపూర్వప్రశస్తిని చాటు అమూల్యములగు శిల్పచిత్రములను, గ్రంథములను, ఇతరవస్తువులను పెక్కిటి నిదివఱకే కోలుపోయినది. అవి విదేశములపాలయినవి. విదేశీయు లవి 'తమపరిశోధనఫలితము' లని విఱ్ఱవీగుచున్నారు. భారతీయులు చేయునదిలేక గ్రుక్కిళ్లు మ్రింగుచు నూరకున్నారు.

ఆంధ్రులు గుమ్మిడిదుఱ్ఱు, నాగార్జునకొండలవద్ద దొఱకిన యీ శిల్పచిత్రములవిషయమున నిపుడు వెంటనే జాగ్రతపడవలెను. ప్రభుత్వప్రయత్నములు కొనసాగకుండ నా యమూల్యసంచయ మాంధ్రదేశమధ్యస్థమగు బెజవాడపురమునందలి మ్యూజియమున జేరులాగున జూడవలెను. చేయిదాటినచో లాభము లేదు. బెజవాడ అవిచారమూలకముగా అనంతపురమును జేరనున్న విశ్వవిద్యాలయ ప్రధానకార్యాలయమునకు సముచితమైన నగరము; భావిప్రత్యేకాంధ్రరాష్ట్రమునకు రాజధాని కాదగిననగరము. కావున నచ్చటికే యీచిత్రములును చేరవలయును. దీనికై యాంధ్రులు సత్వరము సర్వవిధముల ప్రయత్నించి తమకు ప్రాపింపనున్న అనర్థమును దొలగించుకొనవలెను.

పొగాకు అలవాటువలని దోషములు

తలనొప్పి, వికారము, కండరముల దౌర్బల్యము నాడి శీఘ్రముగ కొట్టుకొనుట, కండ్లు,తల తిరుగుట, దృష్టి మాంద్యము గల్గుచుండును.

పొగాకును ఏ రూపముగ వాడినను ప్రమాదకరమే. శరీరమును పుండుగ జేయును. అయిదు లేక ఆరు ధాన్యపుగింజల ఎత్తు పొగాకును మ్రింగిన వమనము వచ్చును. విడవకుండ చుట్టలను త్రాగినచో నోరు పుండగుట, గొంతుకలో మంటపుట్టుట, కంఠద్వారములో పుండుగా నుండుట, ఉదయపుపూట దగ్గు, నాలిక పూయుట, గొంతుక బొంగుపోవుట, రొమ్ముపడిసెము ప్రాప్తమగును. ముఖ్యముగ సిగరట్లను పీల్చువారికీ అవస్థ ఏర్పడును.

పొగాకునుగాని చుట్టలనుగాని గొట్టములో పెట్టి సంవత్సరములకొలది కాల్చువారి నాలికమీదనొక కండ బయలు జేరును. దీనినే కంతియనెదరు.

5.   4-   17   ౬౫3

పొగాకువత్తుసలలో ప్రాణములచే చావు తక్కువట. పొగాకు పొగ క్రిమిసంహారక మనెదరు. అయితే కొద్దిగ వాడినపుడే ఈగుణము గలుగును.

నొప్పిని పోగొట్టుటకు, ఉపశమనమును గలుగ జేయుటకును ప్రజలు చుట్టలను త్రాగెదరు. మొదట ఉత్సాహముగ నున్నను పిదప మందగించును. చుట్టలను త్రాగుటచే ఆకలిపోవును. కడుపులో పేగులు పుండ్లగును. చుట్టకాల్చుచున్నంతవరకు నీరు నోటియందు స్రవించును. చుట్టగాల్చినపిదప నోరెండిపోవును. కండ్లు జబ్బుజేసి దృష్టిచెడును.

చుట్టలను గాల్చుటచే కడుపులో వ్రణమేర్పడును. దానినే 'డ్యూడినలు అల్స'రందురు.

పొగాకును వాడుటచే నాడి నిమిషమునకు ౧ నుండి 10 సార్లు మామూలుకంటె ఎక్కువగా కొట్టుకొనును. విస్తారముసిగరెట్లను త్రాగుటచే హృదయము సరిగా ఆడదు. హృద్రోగ మేర్పడును.

క్రొత్తగా కాల్చువారుగాని, విస్తారముగ గాల్చువారుగాని తరుచు రక్తభారము నాడియందు ఏర్పడుటచే బాధపడి పోటుకోర్వలేక చనిపోవుచున్నారు.

ఎంతమితముగా గాల్చు వ్యక్తియొక్క హృదయమయినను జబ్బుగ నేయుండును. అమితముగ చుట్టలను గాల్చిన రక్తనాళములు చెడును. విస్తారము గాల్చువారి హృదయముచెడి చనిపోయెదరు.

విస్తారముగ చుట్టలను గాల్చువారికి నిదురయు పట్టదు.

టూటన్ ఖమను సమాధిచిత్రములు మరికొన్ని

౧. టూటన్ఖమను సమాధియందలి హృదయము రక్షింపబడిన స్థలముపై నీనిర్మాణము గలదు. టూటన్ఖమను మూడువేలయేండ్లకు పూర్వ ముండిన గ్రీకురాజు ఇందలి శిల్పనిర్మాణకౌశల్య మిప్పటికిని కనుగొనిన శిల్పనిర్మాణములయందుకంటె నత్యుత్కృష్టముగా నున్నది. చుట్టు సర్పఫణములు చెక్కబడిన పైమూత క్రొత్తగా నాలుగుజతలు కాన్పించినవి. బహిరావరణము యొక్క మునుభాగఫలక మొకపైపునకు జరగిపోవును. అప్పుడు టూటనుఖమును శిలామయ శవపేటికయొక్క బంగారు నమూనాలు నాల్గిటిలో రెండుమాత్రము కాన్పించును, మానవుల కిప్పటివఱకు నుపలబ్ధమయిన ప్రాచీన స్వర్ణకారకౌశల్యమును మించున ట్లివి చేయబడి యున్నవి. ఇందు కాన్పించుచున్న చిత్రమయలేఖనములు చక్రవర్తుల స్వభావమును వెల్లడించునవట.

౨. చక్రవర్తి హృదయ మున్న పేటిక స్వర్ణవితానముకలది. నలువైపుల నాల్గు గ్రీకుదేవతలు సంరక్షణార్థము చెక్కబడి యున్నారు.

3. మృతచక్రవర్తి సంరక్షణార్థమై యుంచిన శ్వానముఖము, మానవాకారము గల గ్రీకుదేవత. ఇప్పట మేకతోలు కప్పుకొన్న నక్కవలె నిర్మింపబడియున్నది. ఇది హృదయమున్న సమాధి యెదుట నున్నది.

౪. సమాధ్యాలయాంతర్భాగము; ఆచ్ఛాదన వస్త్రరహితము.

౫. టూటనుఖమను సమాధిపై నుంచినయోడలు దీనిపై వారతు మరణయాత్ర గావించినది.



గ్రంథములు

సాహిత్యమీమాంస

ఇది శ్రీపాద కామేశ్వరరావుగారిచే తెలిగింపబడి అభినవాంధ్రగ్రంథమాలవారిచే ప్రచురించబడిన యుత్తమవిమర్శగ్రంథము. సంస్కృత కావ్యములందును నాటకములయందును వ్యక్తమగు ఆర్య ధర్మములను గ్రంథకర్త చక్కగా వర్ణించినారు. రామునివంటి ధర్మవీరులును, సీతవంటి పతివ్రతలును అగు స్త్రీపురుషుల పాత్రలనుసృష్టించి వారిచరిత్రలను మిక్కిలి హృద్యముగా వర్ణించి, నవరసములను పోషించుచు, ధర్మానురక్తిని లోకమునందు వెదచల్లుచున్న ఆర్య సాహిత్యమునందలి లక్షణములను వివరించినారు.

సమస్తలోకవ్యాపారము లందును అలౌకికమగు ధర్మమును వీక్షించి దానిని వెల్లడించుటయే మనశాస్త్రములు, కావ్యములు, నాటకములు మొదలగు వానియుద్దేశము. ఇట్టి యుద్దేశమును మరిచి లేక వేరుపరచి ఆర్యసారస్వతమును విమర్శించుట మిక్కిలి అయుక్తము. ఆంగ్లసాహిత్యమునకు ధర్మదృష్టి ప్రధానముకాదు. వారి సంఘమునందు కాన్పించు లక్షణములే వారిసాహిత్యమునందును కాన్పించును. గొప్పశక్తి, లౌకిక ఆనందము, అసంపూర్ణమైన నైతికాదర్శము, యివియే వారివాఙ్మయమునెడల ఆకర్షణకు కారణములు.

అనుదినమును ఆంగ్లేయసాహిత్యము యొక్క సంపర్కము హెచ్చుచున్న యీకాలమున, సహజస్వరూపమునందు భిన్నములగు రెండింటిని పోల్చి చూచుట అత్యవసరము. ఆంగ్లేయ వాఙ్మయమును శ్రద్ధతో చదివి, దానియందు శిక్షితులైన పాఠకులు తగినజ్ఞానమును విమర్శనాశక్తియు లేకుండనే తమప్రాచీనగ్రంథములను నిరసించుటయు, స్వాభిమానము చేతను తమ వాఙ్మయమును పొగడుచు, నితరగ్రంథములను దూషించుటయు నైరెండు దోషములను మనము చూచుచునే యున్నాము. అట్లుకాక, సహేతుకముగాను, శాస్త్రబద్ధముగాను విమర్శించుటలో గ్రంథకర్త అవలంబించిన పద్ధతి అనుసరణీయము, వర్ణనీయము.

ఆర్యసాహిత్యమునకును ఆంగ్లేయ సాహిత్యమునకును విశేషమగు తారతమ్యముకలదు. భిన్నసంఘములందుదయించి భిన్నధర్మములను ప్రకటించుచు దైవికముగా కలిసి సంయోగసంఘర్షణలకు కారణభూతమగుచున్న యీరెండింటికిని అన్వయము సాధించుట కష్టసాధ్యము. కాలము గడచి, పరస్పరసంబంధము క్రమపద్ధతిని హెచ్చిన కొలదియు, కలయిక సాధ్యముకాగలదు. కాని అట్టి కలయికవలన లోకమునకును హిందూజాతికిని మేలు కలుగవలెననిన, మన యుత్తమగ్రంథములందలి భావమును నిత్యమును స్మరించుచు అనుభూతము చేసికొనుచుండుటయే కర్తవ్యము. వాల్మీకిరామాయణము; కాళిదాసు, భవభూతి, నాటకములు, వ్యాసుని పురాణములు వీనివిలువ యొకకాలము, నొకయుగము నాటిదికాదు. వానియందు చిత్రింపబడిన యాదర్శములు, కీర్తింపబడిన ధర్మములు సహృదయులగు మానవుల మానసములందు నిత్యమును రాజ్యము చేయుచునే యుండును.

గ్రంథముయొక్క శైలి సరళముగా నున్నది.

[అ. రా.]

వినాయక సావర్కారు జీవితము

ఈగ్రంథము ముదిగంటి జగ్గన్నశాస్త్రిగారిచేరచియింపబడినది. ఫెదరువైటుకాగితములతో క్రౌనుసైజున 119 పుటలను గలిగియున్నది. వెల రు 0-12-0 లు. వలయువారు 'ముదిగంటి జగ్గన్నశాస్త్రి, రాజమహేంద్రవరము' అని వ్రాసి తెప్పించుకొనవచ్చును.

గ్రంథకర్తగారు పీఠికలో శ్రీసావర్కారుగారిని గూర్చి వ్రాసిన "జగమెరుగని బ్రాహ్మణునకు జంధ్యేల" యనుమాట సార్థకమే. సావర్కారుగారి కీర్తి దేశదేశములను వ్యాపించినది. వారికీర్తికి వారురచియించిన "భారతీయ స్వాతంత్ర్య యుద్ధము (Indian War of Independence) అను పుస్తకము శాశ్వతమగు సాక్ష్యము. 1857 సం॥ నాటి "సిపాయీల తిరుగుబాటు" (Sepoy Mutiny) తిరుగుబాటు కాదనియు, బ్రిటిషు ప్రభుత్వపు దురాచరణములచే భారతీయుల మనసుల రగుల్కొన్న స్వాతంత్ర్యేచ్ఛా విజృంభణము నకుఫలితముగ బ్రవర్తిల్లిన స్వాతంత్ర్యయుద్ధమనియు వారు నిదర్శన పూర్వకముగ నామహాగ్రంథమునజాటిరి. ఈగ్రంథము దేశమునం దెచ్చటను వ్యాప్తిలో లేకుండు నట్లు ప్రభుత్వమువారు కట్టుబాటులను గావించియుండిరి. నేడు సాధారణముగ నెందును మనకది లభింపదు. దాని ప్రతియొకటి దక్షిణ అమెరికాలో రు 150-0-0 లకు విక్రయింపబడెనన్న, నాగ్రంథము గడించిన కీర్తియెంతయో చదువరు లూహించుకొందురుగాక.

భారతదేశము దాస్యమున మునిగియున్న యీ కాలమున నీరసమైయున్న భారతీయుల యాత్మశక్తిని బ్రజ్వలింపజేసి వారిస్వార్థత్యాగ పరాయణతను పెంపొందించి, స్వాతంత్ర్యోద్యమోన్ముఖులను గావింపదగు ప్రచారము నిరంతరముగ జరుగవలసిన యావశ్యకత యెంతేనిగలదు. అట్టిప్రచారములో మహోన్నతములగు వాశయములకై తమ జీవిత సర్వమును నిష్కలంకమగు భక్తితో నర్పించుకొన్న మహనీయుల జీవితచరిత్రములను, దేశమందంతటను, మూలమూలల, పల్లెపల్లెల, వ్యాపింపజేయుట యొక్క ప్రధాన కార్యక్రమము.

వినాయక దామోదర సావర్కారుగారివంటి వారీ ప్రపంచమున నెందరో యుండరు. వారి దేశభక్తి చేరి చూడరాని వెలుగుల నెగజిమ్ముచుండును. వారి స్వార్థత్యాగ మప్రతిమానము. వారి ధైర్యసాహసము లమేయబలసంపన్నములు. వారివాదనపటుత్వము సుతీక్ష్ణము, అద్భుతము.

పీఠికలో గ్రంథకర్తగారు "మేమిందు చారిత్రాత్మక విషయములను మాత్రమే స్థాలీపులకన్యాయముగ క్రోడీకరించి సంగ్రహముగా జర్చించితిమి. ఇందు సావర్కారు తన వదినెగారికి విషమస్థితులలో వ్రాసిన రెండు ఉత్తరములను, భారతదేశమునకు ఖయిదీగా 1910 సం॥న తీసికొని రాబడునాడు స్నేహితులకు వ్రాసిన యుత్తరమును, 1921 సం॥లో మృత్యుదేవతతో పోరాడుచు నామె నాహ్వానించిన యాహ్వానము మొదలగునవి చేర్పబడెను. ఇతరవిషయములు 1918లో ప్రకటింపబడిన రౌలటుకమిటీవారిరిపోర్టు బరేంద్రకుమారఘోషు (అరవిందఘోషు సోదరుడు) వ్రాసిన "నాప్రవాసకథనము" "బారిస్టరు సావర్కారుజీవితము" "వందేమాతప్రతిధ్వని" మొదలగు వాటినుండి సేకరింపబడెను" అని వ్రాసియున్నారు.

ఇట్టి చరిత్రాత్మకమైన యీగ్రంథమును బఠించి యాంధ్రులు భారతీయుల కెల్లరకు నిరంతరస్మరణీయులగు శ్రీవినాయక దామోదర సావర్కారుగారి జీవితౌన్నత్యమును గ్రహింతురుగాక.

గ్రంథముయొక్క శైలి మొదటినుండి తుదివరకు నెల్లరకు దెలియునట్లు తేటతెల్లములగు మాటలతో నొప్పియున్నది. గ్రంథకర్తగారు శ్రీసావర్కారుగారి జీవితములోని వివరములను సంపూర్ణముగ దెలియజేయు గ్రంథమునుగూడ రచించి యాంధ్రలోకమున కొసంగుదురుగాక.

—ప్ర. రం.

మునిమాపు

ఈపుస్తకము ఫెదరువైటు కాగితములపై క్రౌనుసైజున ముద్రింపబడియున్నది. పుటలసంఖ్య యెందును గానరాకుండుటచే నెన్ని పుటలో లెక్కయిడ జాలము.

గ్రంథకర్తగారు సహదేవ సూర్యప్రకాశరావుగారు. గ్రంథకర్తగారు రచియించిన "భావగీతముల" సంకలీకరణమే యీ గ్రంథరూపము దాల్చినది. ఈపుస్తకమునకు మొదట "శ్రీకృష్ణశాస్త్రి" గారు,

"ఈమునిమాపులో నేమో విషాదమో
సందేహమో నన్ను జ్వాలయై దహియించు
వెలుగులో చీకట్లో వీని కౌగిళ్ళలో
కనలుచేనల్ల నల్లని వేడిరక్తాలు."

అను నొక పద్యముతో గ్రంథమును ప్రశంసించియున్నారు. ఇది గ్రంథమునకు "పీఠిక"యో "తొలిపలు"కో వ్రాయు నాచారమున నూతనపద్ధతి కాబోలు.

తరువాత గ్రంథకర్తగారు

"బ్రతుకు బ్రతుకెల్ల శిథిలమై పడబగలియు
వీథివీథుల దిరుగాడు బిచ్చగాడ
నీమృదుపదాంకితమ్ముగా చేసెదను దుర్
లలితహృదయ ప్రసూన దళమ్మె కాక"

యని యీ గ్రంథమును వాస్తవిక కంకితముగ నొసర్చినారు.

గ్రంథకర్తగారికి కవికుండవలసిన ప్రశంసనీయమగు భావనాపటుత్వము కలదు. మొత్తముపై శైలిలో మంచి మార్దవమున్నది. ఈ గీతములలోని సరసతను శైలియొక్క మృదులత్వమును జూపుటకై కొన్నియుదాహరణము లిచ్చుచున్నాము.

"మధుసుధాజ్యోతిరానంద మగ్నమైన
బ్రతుకు మలినదుఃఖాశ్రుకర్దమమొనర్చి
భావనాచాలితోత్తుంగభంగవీథి
పర్వులెత్తగా జేసి యున్మత్తురీతి."
("ప్రణయాంకము" నుండి)

"ఆమెకంటి క్రొన్నిటి ముత్యాలతళుకు
జిలుగు వెలుగులో నిలువెల్ల పులకరింప
ప్రతిఫలించిన ప్రణయ ప్రపంచమెల్ల
గాంచినాడను వలపూర కరవుదీర"
("ఆమె"నుండి)

"జీవితామృతమెల్ల వర్షించినైచి
వేదనౌడెడు విషాదపయోదమట్లు
నాసమస్తమ్ము నీకర్పణమ్మొనర్చి
ఊర్పు చిరుగాలికే తూలుచుంటి సకియ"
("వియోగవీథి"నుండి)

"మృత్యుదేవతా, ఉన్మత్తనృత్యమూర్తి,
ప్రళయకాల నీలాభ్రగర్జాకరాళ
గానరావాన లోకాలు కనలిపోవ
కుటిల నిబిడాంధ మొగజమ్ము కొనుచువచ్చి
నవ్యగాఢ పరీరంభణమ్ము నంగి
వేదదీర్చి నీహృదయాన జేర్చికొనుము."
("ఆహ్వానము"నుండి)

దీనిలోని "ప్రళయకాల......" అను పెద్దసమాసమునకు తుదిని "గానరావమున" అనుదానికి "గానరావాన" యనియు "లోకములు" అనుటకు "లోకాలు" అనియు ప్రయోగింపబడినది. ఇట్టి ప్రయోగములు వ్యాకరణదూష్యములు కాకపోయినను, పదముల సాధుత్వమునకు కొంతవరకు భంగముగలిగించుచున్నవేమోయని మాయభిప్రాయము. గ్రంథమున నిట్టి ప్రయోగములు చాలగలవు ఇవి యొకప్పుడు సరసములుగ నుండును. మరియొకప్పుడు విరసములే యగును. ముఖ్యముగ దీర్ఘములగు సమాసములతుదిని ఇట్టిప్రయోగములు వెగటుగ నుండునని మాయభిప్రాయము.

మొత్తముపై గ్రంథము అచ్చువెుదల్గాని, కవి భావచిత్రణమునకు సంపూర్ణమగు నూతనత్వము దాల్చియున్నది. వెల రు 1-0-0

"సహదేవ సూర్యప్రకాశరావుగారు, రాజమహేంద్రవరము" అని వ్రాసిన గ్రంథమును బడయవచ్చును.

—ప్ర. రం.

అపరాధిని

ఇది శ్రీయుత వేదుల సత్యనారాయణశాస్త్రిగారిచే వంగభాషనుండి యనువదింపబడి యాంధ్రప్రచారిణీగ్రంథమాలవారిచే ప్రచురింపబడిన డెమ్మిసైజు 282 పుటలుగల నవల. గ్రంథకర్తగారు మూలగ్రంథమును స్వయముగ ననుసరింపక మరియొకరిచే నాంధ్రభాషలో నీకథ విని దీనిరచించినట్లు కృతిసమర్పణముచే తెలియు

చున్నది. ఇందు రతీకాంతుని చిన్నతనపు దుడుకుచేతల ను దయామతితో కప్పిపుచ్చి పరయూబాల వాని దుండ గముల వృద్ధియగుటకు కారణమగుచున్నది. పసితనమున బాలు రొనరించు దుష్టకార్యముల సహించుట పెద్దల యపరాధమని నుపకీ నవలవలన నొక నీతి యేర్పడుచు న్నది. స్త్రీలకుఁ గల సహజకరుణా స్వభావము చక్కగ వర్ణింపబడినది. గ్రంథశైలి సరళముగ నున్నది. ఇది పఠనీయ గ్రంథములయం దొకటి కాని ఇందొకటి రెండు విరుద్ధములున్నవి. పుట 3 "పల్లెటూరియందు......కంట గింపుగ నుండెడిది." ఈ వాక్యములచే శ్యామబాబునకు పల్లెటూరియం దేహ్యభావమున్నటులుస్పష్టమగుచుండగా అదేపుటలో "దసరా సెలవులకు—పల్లెటూరికిపోయి రెండుమూడు నెలల గడిపి వచ్చుచుండును" అని యున్నది. 3–వ పుటలో రాధాగోవిందమిత్రునకు......తన కొడుకు వకీలు కావలయునని,...మనుమరాండ్రను జూచి...ఆ కోరికలు తీరుటచే ప్రశాంత మనస్కుడై మరణించి నాడు" అని యుండుటచే అప్పటికే శ్యామబాబు సంతానవంతుడు కావలెనుగదా? కాని 6వ పుటలో "రేబదిరేండ్ల యీడున......ఆడుపిల్ల కలిగె" అని యున్నది. ఈయన్యోన్య విరుద్ధము లెట్లు పొసగును?

—కో. నా.

వీరగాంధర్వము

ఇది శ్రీయుత బూచూరు రామానుజాలు రెడ్డిగా రిచే రచియింపబడిన చరిత్రాత్మక నవల. క్రౌను సైజున 65 పుటల గ్రంథము ఆంధ్రభోజుఁడగు శ్రీకృష్ణదేవరా యని విజయములం దొకటి యగు రాయచూరు ముట్టడిని ప్రధానముగఁ జెట్టుకొని కేవల కల్పితకథచే శృంగారవీర రసముల నొకించుక చవిఁజూపిరి. శైలిసులభముగనున్నది. పాఠశాలబాలురకు పఠనీయార్హముగనున్నది. కో. నా.

ఆంధ్ర వీరులు

ఇది ఆంధ్ర మహాపురుషుల పవిత్రజీవితముల కీర్తించు వచనకావ్యము. దీనిని రచియించినది ఆంధ్ర సారస్వత నిష్ణాతులగు శేషాద్రి రమణకవులు. బెజవాడ వెంకటరాం అండుకో వారు ప్రచురించిరి. ఈగ్రంథము నందలి పీఠికను పరిశీలించితి మేని దీనిని రచించుటలో కవులకు నాలుగు ముఖ్యోద్దేశ్యములు గలవని సువ్యక్త మగును, అవి యేమన.

1. ఆంధ్రుల హృదయమున నాంధ్ర ప్రతిభ మద్యోతకము చేయుట.

2. ఆంధ్రుల వికాసము, రాజ్యవిస్తృతి, పతన మును, ఆంధ్రమహా పురుషుల జీవిత చరిత్రరూపముగ ప్రవర్తించుట.

3. 'విస్తృతమగు నాంధ్రదేశమునం దుద్భవిం చిన మహనీయుల త్యాగదీక్ష, శౌర్యము ప్రపంచ మందలి యేజాతీయ నాయకునకుఁ దీసిపోనదని' చెప్పుట.

4. ఆంధ్రులందుఁ బ్రసిద్ధులైన పురుషుల జీవిత ములు కథలుగ వ్రాసి బాలురకు విద్యార్థిదశలోనే మా తృదేశాభిమానము గలిగించుట.

ఈనాలుగు ఉద్దేశ్యములు ఎల్లగ్రంథమున సిద్ధి నొందినవో యొక్కింత పరామర్శింతము

ఇవి జాతీయ పునరుద్ధారణ దీక్షాదినములు.

'ఉ. జాగిన దేశగౌరవము దక్కసదిద్ది మహాంధ్రమండలి భారము శ్లాఘనీయముగఁ జాలఁ జేసినహావరాష్ట్రముల్

కూరిమి నాసఁజేయ, తెలుగుం బుడమిం గయిసేయ'

నేడొక విపుల ప్రయత్నము జరుగుచున్నది. ఈయుద్య మమునకు ప్రాణమనోయుట గ్రంథకర్తలకు విధియని ఆంధ్రమహా సభాధ్యక్షునకు ఉయ్యూరు జమీందారుని ఆజ్ఞప్తికావునసే దేశారాధకులగు శేషాద్రిరమణకవులు 'ఆంధ్రుల హృదయమున ఆంధ్రప్రతిభ మద్యోతకము' చేయుట యొక ఆదర్శముగ నిడుకొనినారు. జాతీయపు నరుద్ధారణ సోపానములలో ప్రాక్తనవైభవ పునశ్చర ణము మొదటిది. రక్తతర్పణము లందిన చాణుక్యుని రాజ నీతి నైదుష్యము కృష్ణాప్రసవంతి విజయగీతములు వినిపిం పగా శాతవాహన రాష్ట్రమును ఆలించి పాలించిన గౌతమి పుత్రుని ప్రతిభ ఆంధ్రశౌర్యమునకు మూర్తియై కళింగము మొదలు కన్యాకుమారివఱకుగల దేశమును ఏలిన కులోత్తుంగచోడదేవుని ప్రజ్ఞ; నూనూగుమీసాల మాత్నయౌవనమున సుఖములఁ దిగనాడి రణభూమి

తనకు మరణశయ్యగా స్వీకరించిన బాలచంద్రుని అప్రతీపమగు ప్రతాపమును; 'ఇదంక్షాత్ర మిదం బ్రాహ్మ్య' మను ధర్మస్ఫూర్తికి తార్కాణమైన ఖడ్గతిక్కని అన్వక పరాక్రమమును, రుద్రప్రతాపమున కాకతీయాంధ్రసామ్రాజ్యమునకు నియంతయైన ప్రతాపరుద్రుని ప్రతిభాప్రాగల్భ్యములును బలగర్వాలను పరరాజులకు అనాశ్వాసంబుచేసి అవార్యమగు వీర్యమును, తిరుతీయములుగల తెనుగుభాషను భూషించి పోషించి అస్తోకంబగు వివేకమును వెల్లడించిన కృష్ణదేవరాయల ప్రజ్ఞాపాండిత్యములును; మృత్యుముఖమున నిష్కృతినొందిన రామరాజు తంత్రజ్ఞత; ధర్మసంస్థాపనార్థము ఆత్మార్పణము గావించిన యాసహారుని స్వార్థరాహిత్యము; గోలుకొండరాజ్యమును ఏకహేలగా పాలించిన మంత్రి మాణిక్యులు అక్కన్న మాదన్నల శేముషీ దురంధరత్వమును తేలికయైన శైలిలో కీర్తింపబడియుండుటచే ఈగ్రంథము ఆంధ్రుల హృదయమున ఆంధ్రప్రతిభనుద్యోతకము చేయుట నిశ్చయము.

ఇక రెండవయాదర్శముసంగతి ఒకయుగమందలి మహాపురుషుల జీవితమే ఆయుగపు చరిత్రయగును. కావుననే ఆంధ్రరాజ్య వికాసమును, విస్తృతిని, పతనమును ఆయాయుగములందుండిన ఆంధ్రమహాపురుషుల జీవితరూపమున శేషాద్రిరమణకవులు ప్రదర్శించిరి. ఆంధ్రజాతీయతయు, రాజ్యమును గౌతమీపుత్రునికాలమున వికసించి యశోత్తుంగప్రతాపరుద్ర కృష్ణదేవరాయలకాలమున మహోత్తరమగు నభ్యున్నతిని, వెలుగొల్పు విస్తృతిని అంది రామరాజుకాలమున ఎట్లు క్రుంగుడుపోయినవో పేఠగ్రంథపాఠకులకు సువ్యక్తమగును. విశేషమేమన: మహాపురుషుల జీవితముల మూలకముగ దేశచరిత్రమును బోధించుపద్ధతి ఉత్కృష్టమైనది. ఆంధ్రవీరులందు అవలంబింపబడిన పద్ధతి అట్టిదే.

విస్తృతమగు నాంధ్రదేశమునం దుద్భవించిన మహావీరుల త్యాగదీక్ష, కౌశలము ప్రపంచమందలి ఏనాయకునకుఁ దీసిపోవదని చెప్పుట శేషాద్రిరమణ కవులకు ఈగ్రంథమును రచించుటలోగల మూడవ ఉద్దేశ్యము. ఆంధ్రవీరులను తుదిదాక చదివినవారలకు మనలోకూడ మహాసామ్రాజ్యము నేలినవారు, విశాలరాజ్యక్లేశములలెక్కింపక వివేకముతో మంత్రాంగము నెఱపినవారు, కుమారవీరులు, మహాసామ్రాజ్య సంస్థాపనాచార్యులు, ఆత్మార్పణము చేయగల త్యాగదీక్షితులు ఉన్నారని స్పష్టపడి తీరును.

ఇక నాలుగవ ఆదర్శ విషయము. ఇది మిక్కిలి ముఖ్యమైనది. బాల్యమే దేశాభిమానమును విత్తుటకు మంచికార్తి. చాణుక్యునివంటి రాజ్యాంగధురంధరుని, గౌతమీపుత్రునివంటి చక్రవర్తిని, యశోత్తుంగచోడునివంటివిజేతను, బాలచంద్రునివంటి కుమారవీరుని, ఖడ్గతిక్కనవంటి యసహాయశూరుని, ప్రతాపరుద్రునివంటి రుద్రప్రతాపుని, కృష్ణరాయలవంటి ప్రభువతంసమును, రామరాజువంటి తంత్రజ్ఞుని, యాసహారునివంటి స్వార్థత్యాగుని, అక్కన్నమాదన్నలవంటి మంత్రి మాణిక్యులను ప్రసవించిన ఆంధ్రభూమియే తనకును మాతృభూమి అని తెలిసికొని ఏఆంధ్రబాలుడు ఆపోనిగర్వము, తృప్తిలేని అభిమానము నొందకుండును. చిన్నటనాటనే దేశాభిమాన పూరితుడైనవాడు పెద్దకాలమున దేశారాధకుడగు వాడై జన్మభూమికి పేరు పెంపులు నెలయింపకుండునా?

ఇట్టి యున్నతమైన ఆదర్శములతో గ్రంథమును రచియించిన శేషాద్రిరమణకవులు స్తుతిపాత్రులు. ఒకటి రెండు దోసగు లీగ్రంథమున దొరలినవి. దీపకర్ణికథ గౌతమి పుత్రుడు దేవాంశసంభూతు డనుటకు నిదర్శనముగా ఉదాహరింపబడినది. కాని ఆకథకును గౌతమి పుత్రునకును ఏమియు సంబంధము లేదు. అది గౌతమి పుత్రుని వంశమునకు మూలపురుషుడగు శాతవాహనునకు సంబంధించినది. ఖగరాటవంశమును నహపానుని వంశమును చేఅని కవులు భావించినట్లు కనబడుచున్నది. కాని నహపానుడు ఖగరాటవంశీయుడని చరిత్రవిదుల నిశ్చయము. ఇట్టి సవరింపదగిన మతికొన్ని చిన్నప్రమాదములను విస్మరించితిమేని ఈగ్రంథము ఆంధ్రబాలుర అవశ్యముగా పఠింపవలసిన గ్రంథములలో నొకటి అని నానిశ్చితాభిప్రాయము.

ఆంధ్రవీరులు చదివిన దరిమిలాను ఆంధ్రవీరారాధనము (బెజవాడ మారుతీరాం అండుకోవారు ప్రచురించిన) అను నొక గ్రంథమును చూచితిని. ఆంధ్రవీరులందు ఎవరి చరిత్రలై తే కీర్తింపబడినవో ఆవీరులచరిత్రలే యాంధ్రవీరారాధనములో కూడ కీర్తింపబడినవి. మొగమోటము లేకుండ వ్రాయవలసినచో ఈ రెండు గ్రంథములును ఒకదానికొకటి నకలుగా నున్నవనక తప్పదు. బెజవాడలో వెలువడిన ఈ గ్రంథములలో ఏది ముందు పుట్టినదో రాజమండ్రిలోనున్న నేను చెప్పజాలను. ఒకరు వ్రాసిన వ్రాతలే తిరిగి వ్రాసి గ్రంథకర్తలును, ఒకరు ప్రచురించినదానినే తిరిగి ప్రచురించి ప్రకటనకర్తలును సారస్వతాభివృద్ధిని అరికట్టుచున్నారు. ఇట్టి అరిష్టమును వదల్చుకొన మనము ప్రయత్నింపవలసియున్నది.

ఆంధ్ర శేషగిరిరావు, బి. యె.

కథావళి

ఇది సరస్వతీగ్రంథమాల ౧౬ వ పుష్పము. శ్రీపాదూరు రామచంద్రరావు బి. ఏ., బి. ఎల్ గారిచే వ్రాయబడినది. శ్రీకాకరపర్తి సత్యనారాయణగారిచే సంపాదితము. పశ్చిమగోదావరీమండలమునందలి తణుకుతా॥ కాకరపఱ్ఱు అగ్రహారము ఈ గ్రంథమాల జన్మస్థానము. డెమ్మీ 1/8 ఆకృతి ౧౩౪ పుటలు వెల ౦-౧౦-౦.

ఇందు ౮ కథలుగలవు. 'జీర్ణవస్త్రములు' అను కథలో వ్యావహారికభాష వినియోగింపబడినది. కడమ కథలు గ్రాంథికభాషలో నున్నవి. కథకుడన్నట్లు ఇది ప్రథమప్రయత్నము. శైలిసరళము. కానిసంవిధానచాతుర్యము చాలదు. విషయమును బ్రసాదింపగలంత భాషయు జాలదు. వ్యాకరణదోషములు పెక్కులు గ్రాంథికభాషారచనలో నగపడుచున్నవి. కథలన్నిట వ్యావహారికభాషయే వినియోగించియుండినయెడల అనువుగ నుండుననుకొందుము. వాక్యరచనానైపుణియు, సన్నివేశనిర్మాణకౌశలము, పాత్రపోషణాప్రజ్ఞయు నీకథలలో గనబడవు. ఈకథలు "భారతి" ముఖమునకొన్ని కాంచినవియు. ఈకథకునకు ఉత్సాహమునకుదగిన సంస్కృతి యలవడవలెను. 'హారిత'

రాధామాధవము

గ్రంథకర్త అట్లూరి వేంకటసీతమ్మగారు, అలగలారు, ముద్రాపకులు, ప్రకాశకులు; కింగ్ అండ్ కంపెనీ బెజవాడ.

ఇదియొక సాంఘికనవల. క్రౌను 1/16 సైజు, 318 పేజీలు, వెల రు 1-4-0.

దేశిరాజు పెదబాపయ్యగారి జీవనస్మృతి

కర్త: కామరాజు హనుమంతరావుగారు, బ్రాహ్మధర్మప్రచారకులు, రాజమహేంద్రవరము.

క్రౌను 234 పుటలు వెల రు 1-0-0.

సుప్రసిద్ధబ్రాహ్మధర్మదీక్షావలంబియు, సంఘసంస్కర్తయు, పరమభక్తుడును, శాంతస్వభావుడును, సాధుపుంగవుడును, విశుద్ధచరిత్రుడునగు కీ. శే. దేశిరాజు బాపయ్యగారి పేరెరుగని సంస్కారాభిలాషులుండరు. వీరు బాపట్ల వాస్తవ్యులు. జననము వృష సం॥ ఆశ్వయుజశుద్ధషష్ఠి; మరణము ప్లవంగ సం॥ ఫాల్గుణశుద్ధ సప్తమి. వీరి దైహికజీవనపరిమితి 27 యేండ్లేయైనను ధర్మజీవనపరు లందరి హృదయములందును వీరాదర్శపురుషులుగ నెన్నటికిని జీవించియుండగలరు. నమ్మినదానిని, ధర్మమని విశ్వసించినదానిని యాచరించి, బ్రాహ్మసమాజమున చేరుటవలన సంఘమునుండి బహిష్కరింపబడి, పెండ్లియాడి ప్రేమించిన భార్య తనవద్దకు పంపబడకపోవుటచే సంసారసుఖము ననుభవింపక, యౌవనమునను యారోగ్యము చెడుటవలన చాలబాధపడి యంతయు నీశ్వరార్పణముజేసి, యాతని యిచ్ఛయే నెరవేరుగాకయని యాప్రకారము జీవితయాత్ర గడపిన ధీరుడును, వీరుడునైన బాపయ్యగారినిగురించిన చరిత్ర, యాతని మరణానంతర మిరువది యేండ్లయినను ఆత్మబంధువుడును, బాల్యస్నేహితుడును, సహాధర్ముడును, బ్రహ్మధర్మప్రచారకులునగు హనుమంతరావుగారు వ్రాయుట యెంతయు సమంజసముగ నున్నది. బాపయ్యగారు 'మానసోపాసనయందు నిష్ఠాగరిష్ఠులై యజ్ఞోపవీతమును త్యజించి మానసరాముచే నారాధించుచుండెడివారు. సర్వసౌభ్రాత్రమును సాధించుటకయి

వర్ణభేదములను త్యజించెను. దేశభక్తిని నిర్మలముగనుంచుటకు విదేశవస్త్రములను విసర్జించెను. ప్రకృతి సౌందర్యము బాపయ్యగారి పవిత్రప్రవర్తనయందు చూడగలిగియుంటిమని చెప్పుటలో యెంతమాత్రమును అతిశయోక్తి లేదు. వీరు బి.ఏ., యల్.టి ప్యాసయి కొన్నిమాసములు రాజమండ్రి కాలేజిలో ఆంగ్లేయతత్వశాస్త్రమును బోధించుచుండిరి కాని వీరికిక్కడ అగౌరవము కలుగుటచే ఆయుద్యోగమునకు రాజీనామా యిచ్చిరి.' పిమ్మట ధర్మప్రచారము చేయుటయందే కాలముగడపిరి. వీరి జీవితప్రభావమువలనను, సహవాసమువలనను, ఉపన్యాసములు, వ్రాతలు చదువుటవలనను ఆంధ్రదేశమున ననేకమంది ధర్మజీవనమున ప్రవేశించిరని నిస్సందేహముగ ననవచ్చును.

ఈగ్రంథము ప్రతియాంధ్రుడును చదివి, వారి జీవితమువలనను, అందందు చేర్చి ముద్రింపబడిన వారి ప్రసంగములు, వ్యాసములువలనను చాలలాభము పొందగలరని నమ్ముచున్నను. ఈపుస్తకము మొదట చేర్చిన బాపయ్యగారి ఛాయాచిత్రమును, తుదిని చేర్చబడిన వీరి సమాధి చిత్రమును వీరి మరణము చెన్నపురియందైనను, రాజమహేంద్రవరమున వీరి జ్ఞాపకార్థమును, గౌరవార్థమును వీరేశలింగంపంతులుగారు వీరి యస్తికలను భూస్థాపితముజేసి యచట సమాధి గట్టించిరి. పుస్తకప్రాశస్త్యమును పెంపొందించుచున్నవి. బాపయ్యగారు, శ్రీకోపల్లె హనుమంతరావు, దిగుమర్తి హనుమంతరావుగార్ల వంటి యాంధ్రదేశపు మణి. జ.బ.

రూపవతి

(గ్రంథకర్త్రి): శ్రీమతి అట్లూరి వేంకట సీతమ్మ గారు, అంగలూరు.

ఇదియొక చరిత్రాత్మకనవల. క్రౌను 1/16 సైజు, 212 పేజీలుగలది. వెల రు 1-0-0.

విషమరహస్యము

గ్రంథకర్త: వారణాసి భానుమూర్తిగారు. ప్రకాశకులు: భాగవతుల నరసింహశర్మగారు, ప్రొప్రైటర్ 'వేగుజుక్క' గ్రంథమాల, పూడిపెద్దివారి వీథి, బరంపురం (గంజాం)

ఇదియొక అపరాధపరిశోధక నవల. వంగభాష నుండి యనువదింపబడినది. కథాసంవిధాన నైపుణ్యము మనోజ్ఞముగ నున్నది. ధారాళమగు శైలిచే పాఠకులకు పఠనీయముగ నున్నది. వేగుజుక్క గ్రంథమాల 26 వ కుసుమము. డెమ్మీ 1/8 సైజు 226 పుటలుగలది.

వెల 1-0-0.

నీతిపదవి-భాగము 1

కర్త: శ్రీ గొల్లపూడి శ్రీరామశాస్త్రులుగారు. ఇది విద్యావినోదినీ గ్రంథమాల 7 వ కుసుమము. క్రౌను 1/16 సైజు 80 పుటలు గలది. వెల రు 0-8-0.

నీతిపదవి-భాగము 2

గ్రంథకర్త: శ్రీ గొల్లపూడి శ్రీరామశాస్త్రులుగారు ఇది విద్యావినోదినీగ్రంథమాల 8 వ కుసుమము. క్రౌను 1/16 సైజు 162 పుటలుగలది. వెల రు 0-14-0. పైరెండు గ్రంథములు దొరకుచోటు:- మేనేజరు విద్యావినోదినీ గ్రంథమాల, చిత్తూరు.

శ్రీమదాంధ్రకార్తిక మాహాత్మ్యము

పురాణము. గ్రంథకర్త: బ్రహ్మశ్రీ అనిపెద్ది జగన్నాథశాస్త్రిగారు, కొవ్వూరు బోర్డు హైస్కూలునందాంధ్రపండితులు. డెమ్మీ 1/8 సైజు 170 పుటలుగలది. వెల రు 1-0-0.

మానవుల పూర్వావస్థ-త్రిమూర్తులు పుట్టిన విధము

గ్రంథకర్త ప్రకాశకులు; దేటుకూరు సీతారామయ్యగారు, దేటుకూరు, గుంటూరుపోస్టు. క్రౌను1/16 సైజు; 19 పుటల చిన్నిపుస్తకము. వెల 0-4-0.

శ్రీసూర్యసిద్ధాంత సంసిద్ధ విభవ, శుక్ల, ప్రమోదూత, ప్రజోత్పత్తి సంవత్సరముల పంచాంగమ్

పిన్నంరాజు వెంకటసుబ్రహ్మణ్యశర్మ సిద్ధాంతి గారు గుణించినది.

డెమ్మీ 1/8 సైజు 148 పుటలుగల వర్ష చతుష్ట యపంచాంగ మిది. ముందు గాయత్రీ త్రివర్ణ చిత్రపట ము చేర్చబడియున్నది. వెల రు 0-12-0 వలయువారు "క. మార్కండేయ శర్మగారు, ఎడిటరు స్వధర్మప్రకాశిని 82 పూనమల్లి హైరోడ్డు, బృందావనం, కీలుపాకు, మదరాసు" అని వ్రాయవలయును.

రానున్న మూడు సంవత్సరముల వివరములను ఇపుడే తెలిసికొనగల సౌకర్య మీ పంచాంగమున గలదు.

దాశరథివిలాసము

గ్రంథకర్త గొట్టిపల్లి లచ్చయకవి. శ్రీచెలి కాని సూర్యారావుగారిచే ప్రకటింపబడినది. డెమ్మీ 1/8 సైజు 866 పుటలుగల ప్రబంధ రాజమిది. వెల రు 2-8-0. చక్కని సంపుటము. వలయువారు "శ్రీరామ విలాస ప్రింటింగ్ వర్క్సు, చిత్రాడ, పిఠాపురము" (తూర్పుగోదావరి) లేక "మేనేజరు, ఆంధ్రసాహిత్యపరిషత్తు" కాకినాడ యని వ్రాయవలయును.

ప త్రి క లు

కుమారబోధిని

ప్రకాశకులు:— శ్రీ సి. కుమారస్వామి నాయుడుఅండ్ సన్స్ మద్రాసు. సంపాదకులు: హరిసుబ్బారావుగారు. వివరములు: క్రౌనుక్వార్టో 24 పుటలు. ఇదియొక సచిత్ర విద్యావిషయిక మాసపత్రిక. విద్యార్థి లాభులగు బాలబాలికలకును, స్త్రీలకును ఉపయోగించు సర్వతోముఖజ్ఞానసంబంధములగు వ్యాసములు కథలు, పద్యములు, పాటలు నిందు ప్రచురింపబడును. ప్రతిసంచి కయు ప్రార్థనపద్యములతో నారంభమగుట ప్రశంసనీయము.

సంపుటము 2, 11-12 సంచికలును, సంపుటము 3, 1 వ సంచికయును—ఫిబ్రవరి, మార్చి, ఏప్రిలు నెలలవి—మాకందినవి.   జే. బ్ర.

గృహలక్ష్మి

ఇదియొక నూతన సచిత్రమాసపత్రిక. మొదటి సంచిక మార్చినెలలో వెలువడినది. డాక్టరు కె. యన్. కేసరిగారిచే స్థాపింపబడి చెన్నపురి, ఎగ్మూరులోనున్న 'లోధ్ర ప్రెస్సున' ముద్రింపబడుచున్నది.

"ఇందు ముఖ్యముగ నారీమతల్లుల యారోగ్యముల పెంపొందించువిషయములు చర్చింపబడును. జీవితయాత్రయందు స్త్రీపురుషులు సమాన వ్యక్తులని నిరూపించుటయే మాయాశయము. శరీరమనోబలముల యందు స్త్రీలు పురుషులకంటె తక్కువవారు కారని నిరూపించుటయే మాసంకల్పము......ఎల్లతరగుల స్త్రీ యుద్యమమునకు తోడ్పడుటయే మా పత్రికయొక్క ముఖ్యోద్దేశము. ఇది యశాస్త్రీయముగాదు; విజాతీయమునుగాదు......" అని స్వవిషయమందు సంపాదకులు వ్రాసిరి. దీన నీపత్రికోద్దేశము స్పష్టమగుచున్నది. మహావాది వెంకటరత్నముగారి "ద్రౌపది గుణశీలములు" మైద వోలు పద్మావతిగారు వ్రాసిన "డాక్టరు బెసంటు" అను వ్యాసములు స్త్రీగౌరవమును చాటునవియై యున్నవి. 'వస్త్రాభరణముల నాగరికత'యను మైదవోలు వెంకయ్య పంతులుగారి వ్యాసము నాగరికతా చరిత్రను తెలియపరచుచు నాలోచనను పురికొల్పునది. 'సువాసన తలనూనెలు' 'దనుబాలు' 'శిశుపోషణ' 'స్త్రీసాముద్రికము' 'సౌందర్యపోషణము' శిశురోగము లంఅను వ్యాసములును స్త్రీల కుపయుక్తములు. శ్రీమతి కవుతా లక్ష్మీదేవిగారు వ్రాసిన 'దయార్ద్రహృదయ' యను నొక కథ యున్నది. వైద్యసంబంధ వ్యాసము లును కొన్ని గలవు. 'వివిధవిషయములు' 'ఆలోచన' యను శీర్షికల క్రింద స్త్రీలయున్నతికి సంబంధించినకొన్ని విశేషములును, సంఘసంస్కారము మొదలగువానిపై నభిప్రాయములును గలవు. 'నవవర్షము' అను చక్కని త్రివర్ణ చిత్రమును, డాక్టరు బెసంటు, శ్రీఆదిపూడి వసుంధరాదేవిగార్ల ఛాయాపటములు, నితరచిత్రము లును గలవు. సం॥ చందా రూ. 4. విడిసంచిక 6 అ.

రెండవసంచికయు వెలువడినది.

గతసంచికా శేషములగు 'వస్త్రాభరణములు, నాగరికత', మైదవోలు వెంగళార్యపంతులుగారు వ్రాసినదియు; మహావాది వెంకటరత్నము గారు వ్రాసిన 'ద్రౌపది గుణశీలములు'; 'స్త్రీసాముద్రికము'ను గలవు. 'హిందూసంఘమునందు స్త్రీస్థానము' 'తురుష్కదేశము స్త్రీయుద్యమము', 'శ్రీ. శే. పార్వతమ్మగారు' (వి. యస్. శర్మగారు వ్రాసినది,) 'భార్య' 'న్యూజీలండు ద్వీపమున తల్లులు-పిల్లల యారోగ్యవృద్ధికరసంఘము' మొదలగు వ్యాసములు స్త్రీలోకమున కుపయోగములు.

'గాఢశీలత' 'ఆహారము' 'సౌందర్యపోషణ-శిరోజములు-సౌందర్యము: శరీరమర్దనము' అను వ్యాసములు ఆరోగ్యము-వైద్యమునకు సంబంధించినవి.

క. యశోదాదేవిగారి 'నాకుక్కపిల్ల' రామచంద్రుని వెంకటప్పగారి 'వీరమాత' మైదవోలు పద్మావతిగారి 'పద్మిని' యనమండ్రకామాక్షమ్మగారి 'సంభాషణ'యును కథలు.

స్త్రీలయభివృద్ధినిగూర్చి 'వార్తలు' గలవు. 'ఆలోచన'యందు సంపాదకీయములగు రాజకీయ సంఘసంస్కారాది విషయములపై నభిప్రాయములు గలవు.

మొత్తము క్రౌను 80 పుటలు. 'తుపాను' అను చక్కని త్రివర్ణ చిత్రము మొకటి చేర్పబడియున్నది. శ్రీ. శే. పార్వతమ్మగారి సంబంధములగునవి 3 ఛాయాచిత్రములును, అజంతాభిత్తరువును, 3 హైందవనారీమణుల చిత్రములును, 2 ఇతర చిత్రములును గలవు.

జ. బ్ర.

వటపత్రశాయి కృష్ణుడు

సుబ్రహ్మణ్య భాగవతులుగారు

కరారవిందేన పదారవిందం ముఖారవిందే వినివేశయంతమ్;
వటస్య పత్రస్య పుటే శయానం బాలం ముకుందం మనసా స్మరామి.

సనకసనందనాదు లనిశంబును నా పదపంకజంబునన్
ఘన మకరందమున్ గొనుచు గాంచరు తృప్తి నదెట్టు లుండునో
యనుచు కరాంబుజంబున ముఖాంబుజమందు పదాంబుజంబు నై
కొను వటపత్రశాయిని ముకుందుని బాలుని సంస్మరించెదన్.

సాభిప్రాయ విశేషములు

సర్ జాన్ సైమనుగారు, సహచరులు రెండు నెలలు విశాలమైన భరతఖండము నందు పంచారముచేసి స్వస్థలమునకు వెడలిరి. సర్వము నుగ్రహింపగలిగిరి. సామాన్యముగ జేసెడి 3 వారముల సంచారము కన్నను కన్నులకు గంతలనుగట్టుకొనిచేసిన 8 వారముల సంచార మధిక ప్రయోజనకరము గదా! మద్రాసుకు దక్షిణ ప్రాంతమును ఉత్తర ప్రాంతమును పరీక్షించిరి.ఒకప్రాంతమునందు బ్రాహ్మణబ్రాహ్మణేతర విభేదములు, రెండవ ప్రాంతమునందు హిందూమహమ్మదీయ విభేదములు సైమను సప్తకమునకునో రెత్తుటకును,తిరుగుటకునుఅవకాశములను గలుగజేసినవి. కమిషనుగనుగొనదలచినది భారతీయుల విభేదములనుగాని వారి సంయోగముగాదు. చెన్నపురియందుబహిష్కారావసరములకై బ్రాహ్మణబ్రాహ్మణేతర విభేదములు తాత్కాలికముగ నంతరించినను నిరంకుశ ప్రభుత్వ మవలంబించిన మిత్రభేద తంత్రము పండినది. సైమను కమిషను బహిష్కరణము నామోదించిన మద్రాసు శాసన సభ మంత్రివర్గమును పోషించుట వింతల యందు వింతగ నున్నది. సైమను సప్తకమును బహిష్కరించుటకు కాంగ్రెసు స్వతంత్ర జస్టిసు పక్షము లంగీకరించినవి. బహిష్కరణ ప్రస్తావమున కనుకూలముగ 68 మందిసభ్యులు సమ్మతుల నొసంగిరి. ముత్తయ్య మొదలి, సేతురత్నయ్యరు, కృష్ణనాయరు, రాజా రామారాయణంగారులు, రంగనాథం మొదలి, ఆరోగ్యస్వామిగార్లతో పాటు బహిష్కరణమున కనుకూలముగను సమ్మతుల నొసంగిరి. గోష్నప్రభువు రంగనాథముగారిని ఆరోగ్యస్వామిగారిని నిర్బంధముగనుపంపివేసి ముత్తయ్య మొదలిగారిని, సేతురత్నయ్యరుగారిని మంత్రులుగను నియమించిరి.

ఆరోగ్యస్వామి, రంగనాథము గారులు యథోచిత సహకార సిద్ధాంతమునునమ్మిన స్వతంత్ర పక్ష సభ్యులు. సేతురత్నయ్యరు ముత్తయ్య మొదలి గారులు సహకారమును నిరాకరించిన కాంగ్రెసు పక్ష సభ్యులు. కాంగ్రెసు ప్రతిజ్ఞను భంగపరచిన స్వధర్మ విఘాతకులను లాలించి సత్కరించుట నిరంకుశ ప్రభుత్వమునకు పరిపాటియైన మాయ తంత్రము. ఆ తంత్రమునందు చిక్కుకొనుటయును, దేశద్రోహమునకు గడంగుటయును స్వదేశీయుల భ్రష్టత్వమునకు నిదర్శనముగ నున్నది. నిరంకుశవర్గము దేశాభిమానులను లాలించియును, సత్కరించియును నిర్బంధించియును స్వధర్మ పరాఙ్ముఖులను జేయుగల విధమును

మద్రాసుప్రభుత్వ వ్యవహారములు విస్పష్టము చేయుచున్నవి. నిరంకుశప్రభుత్వము చెప్పెడి మాటలకును, చేసెడిపనులకును సంబంధము గనుపడదు. మంత్రులు బాధ్యతగల ప్రజాప్రతినిధులు. మంత్రులు స్వధర్మమును నిర్వహించుటకు స్వపక్షవిశ్వాసమును, ప్రజా ప్రతినిధుల విశ్వాసమును గావలసియున్నవి. శాసనసభలయందు బలపోషణములులేని స్వతంత్రపక్షము మంత్రిత్వమును స్వీకరించినది. ఆ మంత్రులు నిలుచుటకు జస్టిసుపక్ష పోషణముగాని కాంగ్రెసుపక్ష పోషణము గాని యవసరమైనది. ఆరంభమునందు కాంగ్రెసుపక్ష పోషణము మంత్రులను రక్షించినది. ఇపుడు జస్టిసుపక్ష పోషణము గాపాడుచున్నది.

ద్వంద్వప్రభుత్వమును నాశనముచేయుటకు ప్రతిజ్ఞను బూనిన రెండుపక్షములును ద్వంద్వప్రభుత్వమునుపోషించిధర్మమార్గమునువిడనాడినవి. రాజా రామారాయణంగారు కాంగ్రెసుపక్షమవలంబించినయనుచితమార్గము నవలంబించుటవలనను వారియాచరణము ధర్మయుక్తముగా జాలదు. జస్టిసుపక్షముద్యోగాధికార లాభమునకు దేశము నధోగతిపాలు చేసినది. రాజా రామారాయణంగారు స్వపక్షలాభమునకును, బ్రాహ్మణేతర పక్ష లాభమునకును బ్రాహ్మ మంత్రుల నాడించుటవలనను జస్టిసుపక్షమునకును, దేశమునకును నపారమైన నష్టము సంప్రాప్తము గాగలదు. లాభము గలుగబోదు. ఉద్యోగములకై దేశ ద్రోహము చేసెడివారి వలనను దేశమునకు గాని, పక్షములకుగాని, ధర్మమునకుగాని ప్రయోజనము గలుగజాలదు. దేశమంతయును సైమను కమిషను బహిష్కారధ్వనులతో మారుమ్రోగు చున్నపుడు, సైమను కమిషను బహిష్కారమును చెన్నరాష్ట్రసభ యామోదించినపుడు దానికి విఘాతమును గలుగజేయుట. ఆత్మనాశనమునకు సాధనముగాని యాత్మోద్ధరణమునకు సాధనము గాదు. దేశమంతయును నిరంకుశాధికారాయత్తమై క్షీణించుచున్నపుడు జస్టిసుపక్షమును క్షీణించునుగాని బలియజాలదు.

జస్టిసుపక్షలక్ష్యము బ్రాహ్మణప్రతిషేధముతో సంతృప్తిని బొందుటవలనను బ్రాహ్మణేతరులవికాసము గలుగజాలదు. బ్రాహ్మణుల యుద్యోగములు బ్రాహ్మణసంఘవికాసమునకు వినియోగపడియుండలేదు. సర్ రామస్వామయ్యరుగారి న్యాయాంగాధికారము బ్రాహ్మణుల యభ్యుదయమునకు వినియోగపడ లేదు. కృష్ణనాయరుగారి న్యాయాంగాధికారమును బ్రాహ్మణేతర సంఘము నుద్ధరింప జాలదు. ఉద్యోగాధికారాపేక్ష దేశ వినాశనమునకు దోడ్పడుచున్న విధమున కంతర్విభేదములె పరమప్రమాణములుగ నున్నవి. పక్షముల యధర్మాచరణమును వ్యక్తుల యధర్మాచరణమును మీరిపోయిన విధమును సుబ్బరాయనుగారి మంత్రివర్గము విశదము చేయుచున్నది.

* * * *

సుబ్బరాయనుగారి మంత్రివర్గము

సుబ్బరాయనుగారిమంత్రివర్గము పరమాసహ్యమును గలుగజేసినది. సుబ్బరాయను

గారు స్వప్రయోజనార్థము మంత్రిపదవిని పట్టుకొని వ్రేలాడుట నీతిబాహ్యముగ నున్నది. స్వపక్షసభ్యులు కొందరు వేరుపడి విశ్వాసరాహిత్యమును వ్యక్తముచేసిరి. శాసన సభలోని ప్రజాప్రతినిధులు సైమనుకమిషను బహిష్కరణమును నిర్ధారణచేసిరి. సుబ్బరాయను గారు శాసనసభాభిప్రాయమును న్యాయముగ నిరసించిరి. సభాభిప్రాయమును శిరసావహించిన ఆరోగ్యస్వామి, రంగనాథముగార్లను నిర్లక్ష్యముచేసి నిరంకుశవర్గమున కభయము నొసంగి మహాపరాధ మొనరించిరి. నిరంకుశాధికారులు గోరునటులు సైమను వర్గముతో గలిసి పని చేయుట కంగీకరించి మిత్రద్రోహము, దేశద్రోహము, ధర్మద్రోహము చేసి రాజ్యాంగ జీవనమును కళంకపూరితము చేసిరి. ధనాధికార పిశాచముల ప్రభావమును సుబ్బరాయనుగారి యుద్యోగకాంక్ష విశదము చేసినది.

సేతురత్నయ్యరుగారుకాంగ్రెసుపక్షమున జయమొంది స్వతంత్ర పక్షమునను జేరిరి. సైమనుబహిష్కరణమునకు సమ్మతి నొసంగి మంత్రిపదవిని స్వీకరించి సైమను కమిషనుకు తోడ్పడుట కంగీకరించిరి. మిరాశీదారైన సేతురత్నయ్యరుగారి కధికారపిశాచము పట్టినది. స్వాగతములు, విందులు, సెలూనులు, బుజ్జగింపులు, తెల్లదొరల ప్రసన్న వదనములు, అయ్యరుగారికి చిత్తవికారమును గలుగజేసినవి.

ముత్తయ్య మొదల్యారుగారి చరిత్రము మంత్రిపదవి చరిత్రమె. జస్టిసు పక్షమునందు ప్రయోజనము గలుగక కాంగ్రెసు పక్షమునందు జేరిరి. కాంగ్రెసుపక్షమునందు వినాయకులై మంత్రిపదవిని గడించిరి. కాంగ్రెసుపక్షప్రతిజ్ఞ సైమను వర్గ బహిష్కరణము దేశప్రయోజనములు ధనాధికారముల సమక్షమునను నిరర్థకము లైనవి. మంత్రిపదవుల విషయమై రాజ్యాంగ పరిజ్ఞానమును, ధర్మ నిర్వహణమును ననవసరమైనది. రాజా రామారాయణం గారి ప్రాపకము, నిరంకుశవర్గప్రాపకము మంత్రుల నేర్పాటు చేయుటకును తొలగించుటకును నేర్పడినవి శాసనసభాధికారము శూన్యముగ నున్నది. సిద్ధాంతమునం దేర్పడిన ద్వంద్వ ప్రభుత్వమైనను ఆచరణమునందు శూన్యముగ నున్నది. అధికారుల ప్రాపకము, నియోజితుల ప్రాపకము మంత్రివర్గమును పోషించుచున్నవి. శాసనసభాపోషణము పేరునకుమాత్రము గలదు.

*   *   *   *

అధికారవర్గము

నిరంకుశాధికారదుర్గము నిర్భేద్యముగ నున్నది. విన్నన్న చెప్పినది వేదమను రీతి నధికారుల యాటపాటలు చెల్లుచున్నవి. మోయరుగారు నియోజితసభ్య లధికారగీతమున కనురూపముగ నాడవలయు నని సిద్ధాంతము చేసినారు. నిరంకుశవర్గపోషణ ముగల యే ముగ్గురో మంత్రులై బొమ్మలవలె నాడగలరు. అధికారుల కిది పరమానందమును గలుగజేయుచున్నది. పాపము నోరులేని ప్రజల నధికారవర్గ మీవిధముగనె రక్షించుచున్నది.

అధికసంఖ్యాకులైన బ్రాహ్మణేతరులకును నీ రక్షణమె ప్రశంసాపాత్రముగనున్నది. గోపైను ప్రభువును కార్యనిర్వాహకసభ్యలును చూపిన యధర్మము నిరంకుశవర్గస్వభావమును విశదము చేయుచున్నది. అధికారహృదయమును పీడించుచున్న పిశాచప్రభావమును వేంకట్రామ శాస్త్రిగారి యుదంతము వేయినోళ్లను చాటుచున్నది.

వేంకట్రామ శాస్త్రిగారిని న్యాయాంగ సభ్యునిగ నియమించివారిని సంప్రతించకనువారి ముఖ్యాధికారములను తీసివేయుట తెల్ల దొరల దురభిమానమును విశదము చేయుచున్నది. దాసోహమ్మను వారల కభయము నొసంగుటయును, స్వతంత్రులను నిరాకరించుటయును నిరంకుశప్రభుత్వమునకు పరిపాటియైన మహాతంత్రముగ నున్నది. అధికారులు యోచించి యోచించి సౌమ్యస్వభావముగల వేంకట్రామ శాస్త్రిగారిని నియమించిరి. పర తంత్రులకు ముఖ్యముగ భారతీయులకు పరిపాటి యైన ఉద్యోగభిక్షతో వారిని వంచనచేయను సంకల్పించిరి. ఈసంకల్పమునకు భారతీయ సోదరులెందరు మంత్రాంగము చేసిరో భగవంతునకెరుక. ఆత్మగౌరవములేని యాచకులు నిస్సారపువస్తువులకు కుక్కలవలె తోకలాడించుచు నానందించెడి విధమును భర్తృహరి చేసినగంభీరవర్ణనము ప్రస్తుతపరిస్థితులకు దగియున్నది. ఉద్యోగాధికారములకై ఆత్మగౌరవమునువిడిచి మందహాసము చేయుచు, వంగి సలాములు చేయుచు తెల్లనల్లదొరల వెంటబడుట భారతీయుల పతితస్థితిని వేయినోళ్లను చాటుచున్నది. వెంకట్రామశాస్త్రిగారీమహాసమ్మోహమును విడిచి వారి యుద్యోగమునకు రాజీనామా నిచ్చి వారి యాత్మగౌరవమును భారత జాతీయాత్మ గౌరవమును ముఖ్యముగ బ్రాహ్మణుల యాత్మగౌరవమును కాపాడి ప్రజలకృతజ్ఞతకు బాత్రులైరి. వెంకట్రామశాస్త్రిగారిత్యాగము షేక్స్పియరు మహాకవి ఓథెల్లోముఖమున

"నాయొక్క ధనము నపహరించిన వాడు చెత్త నపహరించుచున్నాడు. నాయొక్క గౌరవము నపహరించినవాడు నా సర్వస్వము నపహరించుచున్నాడు"

అని తెలిపినభావమును సంస్మరింపజేయుచున్నది. వెంకట్రామశాస్త్రిగారు 6000 రూప్యముల జీతమును పోగొట్టుకొనినను నిత్యమైన కీర్తినిగడించి స్వాతంత్ర్యసంపాదనకు మార్గదర్శకులుగ నున్నారు. ఆత్మగౌరవముగల భారతీయులెవరును వారు విడిచిపెట్టిన నిస్సారమైన యుద్యోగమును గైకొనజాలరు. కాని ఉద్యోగ వ్యామోహము, బ్రాహ్మణ ప్రతిఘటనము వందలమందికాశను గల్పించినవి రాజారామారాయణంగారు లబ్ధావకాశమును బిగియించి కృష్ణనాయరుగారికిన్యాయాంగాధికారమును సమకూర్చి బ్రాహ్మణేతరుల మన్ననలకుపాత్రులైనను, ఆత్మగౌరవమును జాతీయగౌరవమును మలినముచేసిరి జలప్లావనశాఖను, రక్షణశాఖను(Irrigation and Police Departments) తిరిగి సంక్రమింప జేకొని నైనను కృష్ణనాయరుగారి కుద్యోగమునిప్పించుట న్యాయముగ నుండెడిది. గోతిదగ్గర నక్కలవలెను ఉద్యోగశవములకై నిరీక్షించెడి దేశమునందిది యసంభ

వము గదా! పతితులైన భారతీయులు పాతకు లగుట సహజమైనను న్యాయప్రవర్తకులైన యధికారులు పాతకులగుట యనుచితముగనున్నది. చెన్నరాష్ట్రమునందధికారు లవలంబించిన మాయాతంత్రము బ్రిటీషు ప్రభుత్వమునకు సహజమైన రాజ్యనీతిని, వారి బలాబలములను విశదము చేయుచున్నది.

గోషెను ప్రభువును, వారి మంత్రులును నవలంబించిన రాజ్యతంత్ర మధికారవర్గమునకు సహజమైన ధర్మ విపర్యాసమును భారతీయులకు సహజమైన దుర్బలత్వమును విశదము చేయుచున్నది. చెన్నరాష్ట్రమునందు గోషెనుప్రభు వవలంబించిన తంత్రము సకలవిధములను న్యాయవిరుద్ధముగ నున్నది. శాసనసభ సైమనుకమిషను బహిష్కరణమును నిర్ణయించినది. ఆ నిర్ణయమును పోషించిన సభ్యులను మంత్రులనుగను, కార్యనిర్వాహక సభ్యులనుగను నియమించి సభావ్యవహారములను నడిపించుట న్యాయవిరుద్ధమని రాజ్యాంగధర్మము వ్యక్తము చేయుచున్నది. గోషెనుప్రభువునకును వారి యనుచరులకును ధర్మాధర్మములతో ప్రమేయము లేదు. సైమనుకమిషను బహిష్కరణమును భేదించుటయును, నిరంకుశాధికార ప్రాబల్యమును స్థాపించుటయును వారిసంకల్పము. మంత్రులును గోషెనుప్రభువును కన్నులు మూసుకొని వారిసంకల్పము సఫలమైనదని యానందించినను లోకమును దైవమును ధర్మమును వంచింపజాలరు. ప్రజాభిప్రాయమును, నాయకుల యభిప్రాయమును బహిష్కరణమున కనుకూల మని ప్రాజ్ఞు లంగీకరించుచున్నారు. ఆంగ్లాభిమానపూరితము లైన పయొనీయరు పత్రికయును నితర పత్రికలును బహిష్కరణప్రాబల్యము నంగీకరించుచున్నవి. ఫెన్నరుబ్రాక్వేగా రీవిషయమును విస్పష్టము చేసిరి. సర్ జాన్ సైమనుగారి ప్రగల్భవాక్యము లందును సంశయభావములు వ్యక్తమగుచున్నవి. సర్వత్ర తెలిసిన సత్యమును మరుగుపరచుటకు గోషెనుప్రభు వవలంబించిన కుతంత్రము రాజ్యాంగధర్మమును, నీతిమార్గమును ధ్వంసము చేసినది. శాసనసభను విచ్ఛిన్నము చేసి క్రొత్తశాసనసభను సమావేశము చేయుట న్యాయసమ్మతమై యుండియుండును. గోషెను ప్రభు వవలంబించిన కుతంత్రమును పోషించిన మంత్రులు సభ్యులు నాయకులు దేశద్రోహపాతకమునకు ఒడికట్టుకొని నిరంకుశాధికార వర్గమున కభయము నొసంగిరి. ఇకనైనను భగవంతు డీమహానుభావులకు జ్ఞానోదయమును గలుగజేయుగాత!

సంయుక్తరాష్ట్రములందు మధ్యరాష్ట్రములందు మంత్రులును, గవర్నరును నవలంబించిన మార్గమును చెన్నరాష్ట్ర మవలంబించుట ధర్మమై యున్నది. చెన్నరాష్ట్రము భరతవర్షమునందు మాలిన్యస్థలమని బెజంటమ్మగారు తెలిపిన భావము సత్యముగ నున్నది. మద్యపాననిషేధవిషయమునను, విద్యావిషయమునను మంత్రివర్గ మవలంబించినదుస్తంత్రము వారిపతితస్థితిని దెలుపుచున్నది. సైమను కమి

పనుబహిష్కారము నామోదించిన శాసనసభ శిక్షించుపను ఖర్చుల నామోదించుట హేయముగ నున్నది. భారతీయుల పరాధీనతయె పరమానర్థములకును గారణంబుగ నున్నది. ప్రజల నిస్సహాయస్థితియె నాయకుల యవినయమునకును నిరంకుశాధికారుల నిర్భయత్వమునకును గారణముగ నున్నది. ఈ పరమార్థమును గ్రహించి ప్రజలు స్వీయశక్తిని గ్రహించి నాయకులకును, అధికారులకును జ్ఞానోదయమును గలుగ జేయుటకు పాటుపడవలసి యుందురు.

*　　*　　*　　*

స్వామ్రాజ్యశాసనసభ

సామ్రాజ్యశాసనసభయందు నాయకులు చూపిన ధైర్యస్థైర్యములు ప్రజాభిప్రాయమును విస్పష్టము చేయుచున్నవి. నాయకులుమోపిన నేరారోపణములకు నిరంకుశ వర్గమున క్రాగ్రహముగలిగినను నిరుత్తరస్థితి గలిగినది. శాసన సభ నిరాకరించిన సొమ్మును రాజప్రతినిధి ధ్రువపత్రముఖముగను సమర్థింప గలిగెను. శాసనసభ నిరాకరించిన సైనిక వ్యయమును, రైలువ్యయమును రాజప్రతినిధి సమర్థించెను. నెహ్రూగారునిర్భయముగ అధికారుల నిరాదరణమునకు పరివర్తనము ఫలమని విశదము చేసెను. అధికారవర్గము పటేలుగారికిని అనధికారుల సభ్యులకును జూపిన యగౌరవము నిరంకుశాధికారుల నిర్లక్ష్య స్వభావమును విశదము చేయుచున్నది నిరంకుశాధికారమును ప్రతిఘటించుటకు శక్తిలేనినాయకు లేమిచేయ గలరు? హిందూ మహమ్మదీయ విభేదములు ప్రజాశక్తిని స్తంభింప జేసినవి. దేశమునందు ప్రజాశక్తిని విజృంభింపజేయుటకు నాయకులు కార్యవిధానము నేర్పాటుచేయదలచుట శుభ సూచకముగ నున్నది.

వంగదేశ మ వ లం బిం చు చు న్న విదేశవస్త్ర బహిష్కరణము ప్రజాశక్తిని విజృంభింపజేయుటకుపరమసాధనముగనున్నది. ఆంగ్లేయ వస్త్రవ్యాపారమును స్తంభింపజేయుటకు దేశమంతయును నేకముఖమున పనిజేసిన ప్రజాశక్తి విజృంభించుట కవకాశము లేర్పడ గలవు. గాంధిమహాత్మునకును బట్టలయంత్రాలయముల యజమానులకును జరిగిన సంప్రతింపులు విఫలములగుటయందు విచిత్రముగను పడదు. దేశహితార్థము సర్వత్యాగము చేసిన గాంధిమహాత్ముడు పరమ విశ్వాసమును బూని యంత్రాలయాధికారులు వారి లాభములను దేశహితమునకుతగ్గించుకొనవచ్చునని నమ్ముట సహజము. ధనస్వామ్ము లిట్టిపని బుద్ధిపూర్వకముగ నెప్పటికిని జేయజాలరు. విదేశయంత్రాలయములపోటీలకు తాళజాలకను, గత్యంతరము లేకను నష్టమును ననుభవింప గలరు.

దేశమున కాత్మవిశ్వాసబలము జనసామాన్యమువలన గలుగగలదుగాని విద్యావంతుల మూలముననుు, ధనవంతుల మూలమునను గలుగజాలదు. అసహాయోద్యమానుభవ మీ సత్యమును వెల్లడిచేసినది. సహాయ నిరాకరణోద్యమము క్షీణించుచున్నందులకు చింతిలు వారు గలరు. దాని నుద్ధరించుటకు గాంధి

మహాత్మునితో గలిసిపనిచేయువారుమాత్రము స్వల్పముగ నున్నారు. నాయకు లందరును శాసనసభలను నిరసించుచున్నారు. కాని నిర్మాణకార్యవిధానమునందు బుద్ధిని లగ్నము చేయజాలకున్నారు. ఖద్దరుఉద్యమము విదేశ వస్త్ర బహిష్కరణము పరస్పర సంబంధమును గలిగియున్నవి. నాయకు లీ యుద్యమములను సఫలముచేయుటకు పాటుపడిన దేశదైన్యమును తొలగించుటకు మార్గ మేర్పడ గలదు. ఆంధ్ర రాష్ట్రకాంగ్రెసు సంఘాధ్యక్షులు ప్రకాశము పంతులుగారు నాయకులలక్ష్యము శాసనసభల నుండి క్రియారంగమునకు మారవలసినయవసరమును వారి యనుభవానంతరము విశదము చేసియున్నారు. దేశహితైక పరాయణులు- ముఖ్యముగ నాంధ్రులు- వ్యవసాయ పరాయణులై స్వధర్మ నిర్వహణమును జేయవలసి యుందురు.

* * * *

ఆంధ్రరాష్ట్రము

ఆంధ్రరాష్ట్రస్థితి సకలవిధములను దుర్భరముగ నున్నది. ఆంధ్రోద్యమాంగము లన్నియును కృశించి బలహీనముగ నున్నవి. ఆంధ్ర విశ్వవిద్యాలయము మూడేండ్లకు పూర్వము స్థాపితమైనను పోషణములేకపుట్టినరీతినె నిలిచియున్నది. స్థలాభిమానము పెచ్చుపెరిగి విశ్వవిద్యాలయ ప్రయోజనమును నిరర్థకము చేసినది. స్థలాభిమానము ఆంధ్రప్రయోజనమును, విద్యాప్రయోజనమును సంకుచితము చేసినది. అనంతపురము, బెజవాడ, రాజమహేంద్రవరము, విశాఖపట్టణము ప్రధాన కేంద్రస్థాన గౌరవమును బడయుట కెత్తులను పై యెత్తులను పన్నినవి. బెజవాడయందుగల కార్యస్థానమును మార్చుటకు చేసినతంత్రము లంతఃకలహములకు గారణంబులైనవి. ఉపసంఘము తెలిపిన నిర్ణయములు నిర్ణయములుగ నున్నవి. ఎప్పటికప్పుడు శాసనసభయందు ఉపసంఘ నిర్ణయములను పరిష్కరించుటకు స్థలాభిమానులు వెనుకంజవేయుచు నిజప్రయోజనమును స్తంభింపజేయుచున్నారు. సెప్టెంబరు సమావేశము వరకును విషయనిర్ధారణమును విరమించుట "ఆలస్య మమృతం విషం" అను నార్యోక్తిని సంస్మరింప జేయుచున్నది. కాలయాపనమునను, ధనాగమనము లేకను విశ్వవిద్యాలయ ప్రయోజనము దూరస్థమగుచు సంశయములకు గారణంబగుచున్నది. "క్షణశః కణశశ్చైవ విద్యామర్థంచ సాధయేత్" అను నార్యోక్తి వ్యక్తులకువలెను, సంస్థలకును నన్వయించుచున్నది గుంటూరు,కృష్ణాజిల్లాబోర్డులు మొదటవాగ్దానముచేసిన విరాళములనునిలుపుదలచేసినవి. ప్రభుత్వము కార్యస్థానము నిర్ణయము గానంతవరకును ద్రవ్యము నొసంగుటకు నిరాకరించినది. విద్యాభివృద్ధి కాంధ్రదేశమునకు వినియోగ పడవలసిన ద్రవ్యమునైనను వినియోగించుట కధికారులు నిరాకరించుచున్నారు. ఈవిషమస్థితికి ప్రభుత్వ నిరాదరణమువలె ఆంధ్రనాయకుల యంతఃకలహములును గారణంబులుగ నున్నవి. అనవసరముగ శ్రీపిఠాపురం మహారాజుగా రపఖ్యాతి

పాలై ఉపాధ్యక్షపదవిని వదులుకొనుట సంతాపకరము. ఆపదవికి జయపూరు మహారాజు గారు నియమింపబడుట యుక్తముగ నున్నది. మహారాజుగా రాంధ్రత్వాభిమానమును బూనుదురుగాక! శ్రీయుత రామలింగారెడ్డి గారిని, సుబ్రహ్మణ్యంచెట్టిగారిని తిరిగి యెన్నుకొని సినేటు స్వధర్మనిర్వహణమును జేయుట సంతృప్తికరముగ నున్నది

ఆంధ్రరాష్ట్రనిర్మాణ ప్రయత్నములును ఆంధ్రవిశ్వవిద్యాలయ నిర్మాణమువలెనే ప్రభుత్వాదరణమును బడయకున్నది. చెన్నరాష్ట్రశాసనసభ చేసిన ఆంధ్రరాష్ట్రతీర్మానమును ప్రభుత్వము బుట్టదాఖలుచేసినది. ఆవిషయమై ప్రభుత్వ మేవిధమైన ప్రయత్నములను జేయుట లేదని ప్రభుత్వసభ్యు లొప్పుకొనిరి. అధికారుల చిత్తవృత్తిని మరల్చుట కెవరికిని సాధ్యము గాదు. ఆంధ్రు లాంధ్రరాష్ట్రవిషయమై ప్రబలమైన యాందోళనమును జేయవలసిన యవసరమును దేశపరిస్థితులు విశదము చేయుచున్నవి. ఆంధ్రోద్యమాశయములను సఫలము చేయుటకున్నతాధికారములం దాంధ్రులకు స్థానము లేకున్నది. మంత్రులును కార్యనిర్వాహకసభ్యులును ఆంధ్రేతరులుగ నున్నారు. మోచర్ల రామచంద్రరావుగారు వయోవృద్ధులని పనికి రానపుడు వయోవృద్ధులైనకృష్ణనాయరుగా రెటులు పనికి వచ్చిరో తెలియకున్నది. ప్రభుత్వమునందువలెనే ప్రజలయందును ఆంధ్ర నాయకులకు పలుకుబడిలేని విధమును కాంగ్రెసుసంఘముల స్థితిగతులు విశదము చేయుచున్నవి.

గాంధిమహాత్ము డాంధ్రుల యంతర్విభేదముల విషయమై తెలిపిన సంతాపము పరమ విచారమును గలుగ జేయుచున్నది. సహాయనిరాకరణోద్యమ మచ్చదశయందున్న సమయమునను ఆంధ్రుల ప్రతిభయును నుచ్చదశ నధిష్ఠించి గాంధిమహాత్ముని యాశీర్వాదమును బడసినది. సహాయనిరాకరణోద్యమమునీచదశయందున్నపు డాంధ్రుల ప్రతిభయును నీచదశను బొందినది. దేశమునం దంతటను నాయకులు బయలుదేరిరి. ఒకరిమాట యొకరికి సరిపడకున్నది. కాంగ్రెసు సంఘములు లేవు. సంఘములందు సభ్యులు లేరు. ప్రజలకు వారి కర్తవ్యము గోచరము గాకున్నది. అన్నిసంఘములందును నుద్యోగాధికారాభిలాష తీవ్రరూపమును దాల్చుచు కలహ కారణములను బెంచుచున్నది. కాంగ్రెసుముగిసిమూడుమాసములైనను కాంగ్రెసుపని జరుగకున్నది. నిర్మాణకార్యవిధానమును బ్రిటీషువస్తు బహిష్కరణమును జరుపుటకు ప్రయత్నములు జరుగుట లేదు. కాంగ్రెసువ్యవహారముల కన్నను తంతుకారవ్యవహారములు కొంత సంతృప్తికరముగ నున్నవి. గాంధి మహాత్ముని కార్యనిర్వహణ దీక్షయె దీనికి గారణమై యున్నది.

ఆంధ్రరాష్ట్రమునందు తంతుకార సంఘవ్యవహారములు తమిళనాడునందువలె సంతృప్తికరముగ గనుపడవు. ముఖ్యకారణములు ధనాభావమును,సంయోగాభావమును నని గ్రహింప

దగియున్నవి. గాంధిమహాత్ముని ఆంధ్ర దేశసంచారము నానాటికి వెనుక బడుచున్నది. మహాత్ముని సంచారములేక ద్రవ్యము సమకూడుట దుర్లభముగ నున్నది. తంతుకార సంఘము నకు బాకీపడియున్న బాకీలను చెల్లించుటకు ప్రజానాయకు లలసత్వమును జూపుచున్నారు. తంతుకారసంఘప్రచారకులును పరస్పరవిశ్వాసము లేకను ఖద్దరు ప్రచారమును చేయజాలకున్నారు. ఈవిభేదములకు కల్తీఖద్దరు తోడ్పడి ఖద్దరుప్రచారమును స్తంభింప జేయుచున్నది. ద్రవ్యాభావము, సంయోగాభావము, కల్తి ఖద్దరు ఖద్దరు ప్రచారమున కాటంకములుగ నేర్పడినవి.

ఇట్టి సంకులస్థితి యందు రాజ్యాంగములందును, ఖద్దరురంగమునందును నితర పనులందును ప్రజలు పూనికనుబూని చేయవలసిన కార్యము సంశయాస్పదముగనున్నది. దేశము నావరించిన విశేలావస్థ సర్వత్ర ప్రత్యక్ష మగుచున్నది. దేశావృతమైన మాంద్యమును పోగొట్టుటకు ప్రజానాయకులు కార్యశూరులు గావలసిన యవసరమును దేశము సహస్రముఖముల చాటుచున్నను చిరకాలాభ్యస్తమైన వాగాడంబరమె ప్రజానాయకుల దృష్టి నాకర్షించుచున్నది. వర్తమానమాంద్య దశ యందు ప్రజానాయకులు వారి లక్ష్యమును బ్రిటీషువస్త్ర బహిష్కరణముమీదను, ఖద్దరు ఉద్యమముమీదను లగ్నముచేయుట కార్య సిద్ధికి సాధనముగనున్నది. ఆంధ్రమహాజను లీ పరమార్థమును గ్రహించి స్వయంసహాయ వ్రతపరాయణులై కార్యరూపమున సంకల్పసిద్ధిని బడయుటకు భగవదనుగ్రహమునకు బాత్రులగుదురు గాత!

Edited and Published by K. NAGESWARA RAO, at the Andhra Patrika Press, No.7, Thumbu Chetty Street, G.T, Madras.